www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
విజయవాడ సిటీ
సంపుటి: 58
సంచిక: 283
పేజీలు: 18 + 20 + 32
పేజీల ఆదివారం అనుబంధం
వెల: రూ. 6.00
ఆదివారం | 28-1-2018
శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 8.28 తదుపరి ద్వాదశి తె. 5.18; నక్షత్రం: మృగశిర రా. 1.42 తదుపరి ఆరుద్ర; వర్జ్యం: ఉ. 9.08-10.34; దుర్ముహూర్తం: సా. 4.35-5.20; అమృతఘడియలు: సా. 5.47-7.13; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.05
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



ఐపీఎల్ @ 34000 కోట్లు



వేలంలో మళ్లీ స్టోక్స్ హవా
12.5 కోట్లతో అగ్రస్థానం
11 కోట్లు పలికిన మనీష్ పాండే, రాహుల్
16

ఆఖరి పంచ్ మనదే
63 రన్స్‌తో భారత్ విజయం
డేంజర్ పిచ్‌పై షమికి 5 వికెట్లు
17



కంటే కూతుర్నీ కనాలి

ఆడపిల్లా కావాలి!
79 శాతం మహిళలు, 78 శాతం పురుషుల మనోగతం
గ్రామీణంలో ఆసక్తికర పరివర్తన
నిరక్షరాస్యుల్లోనూ ఆలోచన
అన్ని మతాలు, వర్గాల్లో మార్పు
జాతీయ కుటుంబ సర్వేలో వెల్లడి
18



అనంత హరిత గీత
అలుగులు పారే చెరువులు, నీళ్లు చిమ్మే బోర్లు, ఆకు పచ్చ కోక కట్టిన పొలాలు, పొలం పనుల్లో జనాలు... అవును! అనంతపురం జిల్లా కొత్త గీతిక వినిపిస్తోంది!
2


రాముడు పుట్టిన ఏడాది
విళంబి శ్రీరామనవమి ఎంతో ప్రత్యేకం
1958 తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు
కళ్యాణం తిలకిస్తే విశేష ఫలం: పండితులు
5



సండే స్పెషల్

ఫేస్‌బుక్ హీరో.. కనిపిస్తే జీరో
Hero
Zero

మాయమవుతున్న మాటల మాధుర్యం



"ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా మనుషుల మధ్య మాటలు లేకుండా పోయే రోజు తప్పక వస్తుంది. మాటలు లేని ఇడియట్స్‌తో ఈ ప్రపంచం నిండిపోతుంది!"
- వందేళ్ల క్రితం ఐన్‌స్టీన్



"మనల్ని సోషల్ మీడియా కలుపుతోంది. కేవలం కలుపుతోంది. అంతేకానీ, అనుసంధానించడం లేదు. మనం సందేశాలను, అభిప్రాయాలను షేర్ చేసుకుంటున్నాం. స్వయంగా రాయడంలేదు, చెప్పుకోవడమూ లేదు. ఇక్కడ షేరింగ్ తప్ప, కేరింగ్ లేదు. ఈ 'షేరింగ్'లో అందరూ ఉన్నా... ఆత్మీయత లేదు!"
- దావోస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

వాట్సాప్ గ్రూప్‌లో యమా యాక్టివ్
మనిషి ఎదురుపడితే మౌన మునులే
వేడుకల్లోనూ పైపైనే పలకరింపులు
యువతలో 'సోషల్ స్కిల్స్' మాయం

ఇంజనీరింగ్ చదివే ఓ కుర్రాడు వాట్సాప్‌లో బంధువుల గ్రూప్‌లో యమా యాక్టివ్. ఇటీవల ఆ బంధువులంతా ఓ ఫంక్షన్‌లో కలిశారు. అదే మనుషులు

మిగతా 2వ పేజీలో...

ఎందుకీ అక్కసు?

అభివృద్ధి చేస్తుంటే అడ్డంకులా?

ఎంత కష్టపడుతున్నా బురద చల్లడమా?
వీళ్లతో పోరాడాలా... సమస్యలపైనా?
పట్టిసీమ లేకుంటే ఏమిటి పరిస్థితి?
కృష్ణా డెల్టాకు, సీమకు నీళ్లొచ్చేవా?
గోదావరి-పెన్నానూ అనుసంధానిస్తాం
'సీమ'కు నీళ్లు ఇస్తాం, పరిశ్రమలు తెస్తాం
విభజన వేళ గతుకుల రోడ్డులా రాష్ట్రం
ఇప్పటికి 370 కోట్ల డాలర్ల పెట్టుబడులు
చెయ్యి బాధిస్తున్నా దావోస్‌కు వెళ్లా
మూడు రోజులు ఒట్టి పెరుగు, మాత్రలే
అయినా... అన్ని సమావేశాల్లో పాల్గొన్నా
రాష్ట్రానికి కీలక సంస్థలు, పలు ఒప్పందాలు
పరిశీలనలో అమరావతి ఎయిర్‌వేస్: సీఎం



సివిల్ సర్వీసెస్ టోర్నీని ప్రారంభించి బ్యాట్ పట్టిన బాబు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రం కోసం ఎంత కష్టపడుతున్నా ఏదో ఒక బురద చల్లి ఆనందించేందుకు ప్రయత్నిస్తున్నారు. వాళ్లతో పోరాడాలా? రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలా అనేది అర్థం కావడంలేదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆక్రోశం వ్యక్తం చేశారు. దావోస్ పర్యటన ముగించుకుని

మిగతా 11వ పేజీలో...

మిత్ర ధర్మం పాటిస్తున్నాం!
కుదరకుంటే దణ్ణం పెట్టి తప్పుకొంటామే తప్ప రచ్చ చేయం: బాబు

అమరావతిలో ఒలింపిక్స్‌కు కృషి!

21 నుంచి టెట్
రోజుకు రెండు సెషన్లలో నిర్వహణ
10 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్.. మార్చి 16న ఫలితాలు
విద్యార్థుల వినతి మేరకే షెడ్యూల్ సవరణ : మంత్రి గంటా
3



కాబూల్‌లో 'అంబులెన్స్' బాంబు

95 మంది మృతి
158 మందికి గాయాలు.. సంజీవనిలో బాంబులు కూర్చి పేల్చివేత
ఎమర్జెన్సీ కేసంటూ మారణహోమం.. భారత ఎంబసీ దగ్గర్లోనే!
18



అనంతపురంలో అభిమానుల మధ్య జనసేన అధిపతి పవన్‌కల్యాణ్

రైతు కన్నీరు తుడిచేవారికే
2019లో మద్దతు
ప్రజా రాజకీయమే తెలుసు.. ఓట్ల రాజకీయాలు తెలియవు
'అనంత'ను దత్తత తీసుకున్నా.. అందుకే జిల్లాపై నాకు శ్రద్ధ
2019లో యువత సత్తా చాటుతాం
హామీలపై నేతలను నిలదీయాలి.. అనంతలో పవన్
15

30న 2 నిమిషాలు మౌనం
18



అప్పుడు పుణ్యాత్ములే మిగులుతారు



కల్కి అవతారం రాలేదుగానీ.. మనకు వ్యాస వాక్కు ప్రమాణం. ఆ అవతారం ఎప్పుడు ఎక్కడ వస్తుందో వ్యాస భగవానుడే చెప్పాడు. స్వాహాకారం, వషట్కారం వినపడవు. యజ్ఞయాగాది క్రతువులు ఉండవు. గోవులు విశేషంగా వధింపబడి.. జనాలు గోమాంసాన్ని తినడం ప్రబలమవుతుంది. వివాహ వ్యవస్థ నిలబడదు. తల్లిదండ్రులను చూసే బిడ్డలు ఉండరు. భార్యను భర్త చూడడు. భర్తను గౌరవించే భార్య లోకంలో ఉండదు. పురుషుల ఆయుర్దాయం 18 సంవత్సరాలకే పూర్తవుతుంది. ఆ సమయంలో.. శంబళ అనే గ్రామంలో విష్ణుయశుడు అనే బ్రాహ్మణునికి కల్కి అన్న పేరుతో శ్రీమహావిష్ణువు 10వ అవతారంగా పుడతారు. అదీ కలియుగం చివరలో.. కృతయుగం ప్రారంభంలో వస్తారు. ఆయన అవతరించారనడానికి గుర్తు.. పాపులందరికీ భగంధర వ్యాధి వస్తుంది. అనగా ఆసనం వద్ద పుళ్లు పడి, నెత్తురు విపరీతంగా కారిపోయి తమంత తామే పిట్టల వలె రాలిపోతారు. వ్యాధులు ప్రబలుతాయి. పరమపుణ్యాత్ములు మాత్రమే మిగులుతారు. కల్కి శ్వేతాశ్వం ఎక్కి కాషాయపతాకం పట్టుకుని తిరుగుతాడు. అధర్మంతో రాజ్యాలను ఆక్రమించిన వాళ్లను, అధికారానికి తగిన అర్హత లేకపోయినా సింహాసనం మీద కూర్చుని పరిపాలన చేసే ప్రభువులందరినీ దునుమాడతాడు. కలియుగం పూర్తయి కృతయుగం ప్రారంభమయిందనడానికి జలప్రళయం సంభవించి నీళ్లు వచ్చి భూమండలాన్ని కప్పివేస్తాయి. కలియుగం చివరలో వచ్చే గొప్పదైన కల్కి అవతారాన్ని స్మరించినా, నమస్కరించినా పాపబుద్ధి పోతుంది.

Paramjyothi
పరంజ్యోతి

- చాగంటి కోటేశ్వరరావు శర్మ

ఫేస్‌బుక్ హీరో.. కనిపిస్తే జీరో

(మొదటిపేజీ తరువాయి...)

ఎదురుపడితే ఏం మాట్లాడాలో అతనికి తోచలేదు. హలో.. అనడం తప్ప ఒక్క మాటా పెగల లేదు. వాళ్లతో కళ్లలో కళ్లుపెట్టి చూస్తూ, వాళ్ల మాటలను ఓపిగ్గా విని, బదులిచ్చే ఓపిక లేక... ఆ అసౌకర్యం నుంచి తప్పించుకునేందుకు స్మార్ట్‌ఫోన్‌కు కళ్లు, వేళ్లు అప్పగించేశాడు. ఇది... ఎంతోమంది పరిస్థితి!

వందేళ్ల కిందట ఐన్‌స్టీన్ చెప్పింది... ఇప్పుడు ప్రధాని మోదీ చెబుతోన్నదీ ఒక్కటే! “మాటల్లేవ్... మాట్లాడుకోవడాల్లేవ్! ఏదైనా స్మార్ట్ ఫోన్‌తోనే! ఇలా వచ్చింది అలా షేర్ చేసేయడమే!” పది మంది కలిస్తే... ‘హాయ్’ చెప్పుకోవడంతో సరి! ఆ తర్వాత... ఎవరి ఫోన్‌లో వాళ్లు తల దూర్చడమే! ఎవరికి వారు స్మార్ట్ ఫోన్‌తో బిజీ. చివరకు డైనింగ్ టేబుల్ వద్ద భార్యాభర్తలు, పిల్లల మధ్య కూడా సామాజిక మాధ్యమం చొరబడిపోయింది. 13 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న యువతలో 90 శాతం మంది ఏదో ఒక సామాజిక మాధ్యమాన్ని ఉపయోగిస్తున్నారని ఇటీవల ఒక సంస్థ జరిపిన సర్వేలో వెల్లడైంది. 75 శాతం మంది యువతకు ఏదో ఒక సామాజిక సైట్‌లో సభ్యత్వం ఉంది. 51 శాతం మంది యువత రోజూ ఏదో ఒక సమయంలో సోషల్ నెట్‌వర్క్ సైట్‌ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది. అదే సమయంలో వాట్సాప్, ఫేస్‌బుక్‌లో జోక్స్, కామెంట్స్‌తో ఇరగదీసే వాళ్లు... అదే మనిషి ఎదురుపడితే ఏం మాట్లాడాలో తెలియక గందరగోళపడిపోతున్నారు.



బంధాలు సడలుతున్నాయ్!

నిన్నమొన్నటి వరకు ఏ ఇద్దరు స్నేహితులు, బంధువులు కలిసినా ప్రేమగా మాట్లాకునేవారు. వారి పలకరింపుల్లో గాఢత ఉండేది. వేడుకల్లో, పార్టీల్లో ఏ నలుగురు కలిసినా సరదా కబుర్లతో సందడి నెలకొనేది. ఇప్పుడు అందంతా లేదా? అంటే ఉంది. కానీ... ‘అంత’ లేదు! మాటల తుళ్లింత కాసేపే! కాస్త గ్యాప్ దొరికితే చాలు... ఆ ఖాళీని స్మార్ట్‌ఫోన్ ఆక్రమిస్తుంది. వేడుకలు, ఇతరత్రా కార్యకలాపాల్లో గమనిస్తే... చాలా మంది పరిస్థితి ఇదే.



మాటే మంత్రము...

సంభాషణలో అద్భుతమైన కెమిస్ట్రీ ఉంటుంది. మధుర సంభాషణ ఓ ఆల్కెమీ. హావభావాలు, భావప్రకటనలతో సాగే సంభాషణ మనుషుల మధ్య వారధి అవుతుంది. సాంఘిక జీవన మాధుర్యాన్ని పెంపొందిస్తున్నది సంభాషణలే. సామాజిక మాధ్యమాలు పెరిగిపోవడంతో అంతంత మాత్రంగా ఉన్న ఆ మాటలు ఇప్పుడు పూర్తిగా మాయమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

సామాజిక నైపుణ్యాలకు ఎసరు

సోషల్ సైట్లను తరచూ ఉపయోగించడం వల్ల మాట్లాడటం, పరస్పరం గౌరవించుకోవడం వంటి సామాజిక నైపుణ్యాలను కోల్పోతున్నారని న్యూయార్క్‌కు చెందిన క్లినికల్ సైకాలజిస్ట్ క్రిస్టీన్ పేర్కొన్నారు. దీనివల్ల భావోద్వేగాలు కూడా తగ్గిపోతున్నాయి. ఎవరితో, ఏ సందర్భంలో ఎలా ప్రవర్తించాలో చాలా మంది పిల్లలకు తెలియకుండా పోతోందని క్రిస్టీన్ తెలిపారు. ఒక్కో దేశంలో ఒక్కో సంస్కృతి ఉంటుంది. మాట్లాడే శైలి, యాసతో ఇద్దరి మధ్య గాఢత పెరుగుతుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ సంస్కృతిలో దేశాల మధ్య హద్దులు చెరిగిపోతున్నాయి. సాంస్కృతిక హద్దులు కూడా చెరిగిపోవడంతో... నిజ జీవితంలో ఎవరితో అయినా మాట్లాడాల్సి వస్తే ఉక్కిరిబిక్కిరైపోతున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నా ముఖాముఖి సంభాషణ చేయాలనుకునే సరికి నోరు పెగలడం లేదని కామన్‌సెన్స్ డాట్ ఓఆర్జీ జరిపిన సర్వేలో 34 శాతం మంది యువత అంగీకరించింది.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ

మీకు తెలుసా?

- “అదృష్టం అనేది బంధాల్ని ఎంపిక చేయవచ్చు! కానీ... స్నేహితులను మాత్రం మీరే ఎంపిక చేసుకోవాలి’ అని కన్ఫ్యూసియస్ ఎప్పుడో చెప్పారు. కానీ... ఫేస్‌బుక్ వచ్చాక ‘ఫ్రెండ్’ పదానికి అర్థం మారిపోయింది. ‘స్నేహం’ అనేది ఒక వాగ్దానం. ఆ వాగ్దానం అందించే స్నేహితులు రియల్ లైఫ్‌లోనే కనిపిస్తారు.
- “ఫ్రెండ్ పక్కనే ఉండాలి. మన ఫీలింగ్స్, కష్టాలు అన్నీ షేర్ చేసుకోగలగాలి. కానీ... సోషల్ మీడియా ఫ్రెండ్స్‌తో ఇది సాధ్యం కాదు”... హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలకు చెందిన వితిక మాట ఇది!
- సోషల్ మీడియా మనం వాస్తవాన్ని గ్రహించే కోణాన్ని సమూలంగా మారుస్తుంది. ఒక వ్యక్తితో ముఖాముఖి మాట్లాడినప్పుడు ఎలాంటి భావాలను పొందగలమో అదే వ్యక్తిని స్క్రీన్ వెనుక చూసినప్పుడు ఆ భావన సమూలంగా మారిపోవచ్చునని సోషల్ మీడియా నిపుణులు చెబుతున్నారు.
- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ చెప్పినట్టు మంచి స్నేహితుడిని పొందాలంటే మనం కూడా మంచి స్నేహితునిలా ఉండాలనేది సోషల్ మీడియాకు వర్తించదేమో... అని మాస్‌కామ్ విద్యార్థిని ప్రసూన అభిప్రాయ పడ్డారు.

ఏం చేయాలి ?

1. ప్రతి వాట్సాప్ మెసేజ్‌కి కంగారు పడిపోకండి. రోజులో నిర్ణీత సమయంలో మాత్రమే మెసేజ్‌లు ఓపెన్ చేయండి.
2. కుటుంబ సభ్యులతో భోజనం చేసేటప్పుడు స్మార్‌ఫోన్ పక్కన పెట్టండి.
3. నిద్రపోయేటప్పుడు సోషల్ మీడియాకు సాధ్యమైనంత దూరంగా ఉండండి.
4. మీ ఉద్యోగానికి, వ్యక్తిగత జీవితానికి సంబంధించినంత వరకే సోషల్ నెట్‌వర్క్‌లను పరిమితం చేసుకుంటే మంచిది. అనవసర గ్రూపుల నుంచి బయటపడండి.
5. గంటలకు గంటలు సోషల్ మీడియాలో టైమ్ వేస్ట్ చేయకుండా మీలోని టాలెంట్‌ని నిద్రలేపండి. సంగీతం, నృత్యం, పెయింటింగ్, సాహిత్యం వంటి హాబీలకు సమయం కేటాయించండి.
6. తిన్నా పడుకున్నా ఫ్రెండ్స్‌కి అప్‌డేట్ చేయడం ఆపి.. మీ జీవిత భాగస్వామితో కాసేపు ప్రేమతో మాట్లాడండి. తల్లిదండ్రులు, పిల్లలు ఇలా మిమ్మల్ని ప్రేమించే వారికి సమయం ఇవ్వండి.

భిన్న వాదనలు...

“ప్రపంచంలో ఏదో ఒక మూల ఉండే వ్యక్తితో మనసువిప్పి మాట్లాడుతున్న వారు తమ పక్కన ఉండే వ్యక్తిని ఏలియన్‌లా చూస్తున్నారు. తమదైన ప్రపంచం సృష్టించుకుని అందులోనే మునిగిపోతున్నారు” అని సైకాలజిస్టు రిచా అభిప్రాయపడ్డారు. కానీ... ఈ వాదనను యువతరం కొట్టిపారేస్తోంది. సోషల్ మీడియాను ఎంతవరకూ వాడుకోవాలో తమకు తెలుసంటుంది. వీరి వాదనను ఉపాధ్యాయులు సైతం సమర్థిస్తున్నారు. విల్లామేరీ కళాశాల జర్నలిజం విభాగపు ప్రొఫెసర్ బ్లెస్సీ మాట్లాడుతూ... “సోషల్ మీడియా వల్ల ఉపయోగాలున్నాయి. నష్టాలూ ఉన్నాయి. నేటి తరానికి వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసు. కాలేజీకి రాకున్నా సమాచారం స్టూడెంట్స్‌కు తెలుస్తుంది. అది అడ్వాంటేజ్ అయితే, అది దొరుకుతుంది కాబట్టి అంటూ లేజీగా మారే అవకాశాలున్నాయి. ఇది అవరోధం. కొంత కాలం తరువాత ఈ సోషల్ మీడియా పట్ల అభిరుచి పోతుంది కాబట్టి దీనివల్ల బంధాలు తెగిపోతాయనే వాదనతో నేను ఏకీభవించను” అని తెలిపారు.

గుడ్‌మార్నింగ్ గొడవ!

‘ప్రపంచంలో ఉన్న అందరికి వాట్సాప్‌లో గుడ్‌మార్నింగ్ చెబుతావు! బెడ్ కాఫీ నుంచి రాత్రి భోజనం దాకా సకల సేవలు చేసే నాకు గుడ్‌మార్నింగ్ చెప్పవా’ అంటూ ఆయనగారిపైన ఆవిడ పప్పుగుత్తి ప్రయోగించిన కార్టూన్ ఇటీవల తెగ నవ్వు తెప్పించింది. ఇది అక్షరాలా నిజం. కోట్లమంది భారతీయులు ‘గుడ్ మార్నింగ్’ మెసేజ్‌తో తమ రోజును మొదలుపెడుతున్నారు. గూగుల్‌లో గుడ్ మార్నింగ్ మెసేజ్‌లు సెర్చ్ చేసే భారతీయుల సంఖ్య గత ఐదేళ్లలో పది రెట్లు పెరిగిందని ‘వాల్ స్ట్రీట్ జర్నల్’ వెల్లడించింది. మన దేశంలో వాట్సాప్‌కు 20 కోట్ల మంది ఖాతాదారులున్నారు. ఇలా ప్రతి ఒక్కరూ ఇంకొకరికి గుడ్‌మార్నింగ్ ఫొటోలు పెడుతుండటంతో... స్మార్ట్‌ఫోన్లలో డేటా కూడా అయిపోతోందట! దీంతో వాట్సాప్ సంస్థ ఒకేసారి అందరికీ ‘గుడ్‌మార్నింగ్’ చెప్పేలా ‘స్టేటస్ మెసేజ్’ను ప్రవేశపెట్టింది.

రబీలో జోరుగా సాగుతున్న వ్యవసాయ పనులు

అనంత హరిత గీత



- దశాబ్దాల కరువుకు సవాల్
- హంద్రీ నీవాలో కృష్ణమ్మ గలగలలు
- పట్టిసీమ నీటితో చెరువులకు ప్రాణం
- వేలసంఖ్యలో బోర్లు పునరుజ్జీవం
- పదేళ్ల తర్వాత భైరవానితిప్పకు నీళ్లు
- భారీగా పెరిగిన భూగర్భ జలాలు
- రెండో పంటకూ సిద్ధమైన రైతులు
- ముమ్మరంగా పనులు.. తగ్గిన వలసలు

‘ఏంటి... అనంతపురంలో పోస్టింగా!? ఎందుకైనా మంచిది... పది బస్తాల బియ్యం ఇక్కడి నుంచే తీసుకెళ్లు!’... ఓ సరదా వ్యాఖ్య!

‘సినిమాలో ఎడారి సీన్ ఉందా? రాజస్థాన్ దాకా వెళ్లేంత బడ్జెట్ లేదా? అయితే... అనంతపురం వెళ్లండి’... సీరియస్ సంభాషణ!

(అనంతపురం - ఆంధ్రజ్యోతి బృందం)

అనంతపురం జిల్లా పరిస్థితికి అద్దం పట్టే మాటలివి! అతిశయోక్తి ఉండొచ్చు కానీ... ‘కరువుకు కేరాఫ్ అనంత’ అనే మాట ఎప్పటి నుంచో స్థిరపడిపోయింది! ఇప్పుడు అదే జిల్లాలో పరిస్థితి మారుతోంది! రబీలో రెండోపంట వరి పండుతోంది. పైరు పచ్చల దృశ్యం కనువిందు చేస్తోంది. పదేళ్లుగా నెర్రెలిచ్చిన చెరువుల్లో నీరు చేరింది. ‘మృత సమానం’గా మారిన కాలువల్లో నీరు ప్రవహిస్తోంది. ఎండిపోయి వెక్కిరించిన బోర్లలో జలధార కురుస్తోంది. అవును! ఇది... నిన్నటి అనంతపురం కాదు! జలసిరి తొణికిసలాడుతున్న కొత్త ‘అనంతపురం’! పట్టిసీమ జలాలు అందించిన ఫలాలు... ఎగువన భారీ వర్షాలతో పారిన చిత్రావతి... దశాబ్దం తర్వాత నీరు చేరిన భైరవానితిప్ప... నీరు పారుతున్న హంద్రీ నీవా కాలువ... రీచార్జి అయిన వేలాది బోర్లు! వీటన్నింటి ఫలితంగా జిల్లాలోని 60 శాతానికిపైగా వ్యవసాయ భూములకు ‘నీరు’ చేరువైంది. కనీవినీ ఎరుగని విధంగా... జనవరిలోనూ చెరువులు అలుగులు పారుతున్నాయి.

పట్టిసీమ తెచ్చిన సిరులు

అనంతపురం జిల్లా కరువులో మూడొంతులు ధర్మవరం డివిజనే మోస్తోంది. 1000 అడుగుల లోతున బోర్లు వేసినా నీటిజాడ కనిపించని నేల ఇది. బోర్లమీదబోర్లు వేసి రైతులు అప్పులపాలయ్యేవారు. ఇక ఊళ్లో బతకలేక వలస బాట పట్టేవారు. ఈ స్థితిని.. ‘హంద్రీ నీవా సుజల స్రవంతి’ మార్చేసింది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించడంతో ఆమేరకు కృష్ణా జలాలు హంద్రీ నీవా ద్వారా సీమకు అందుబాటులోకి వచ్చాయి. ఈ నీటితో డివిజన్‌లోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి, ధర్మవరం, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో సుమారు 26 చెరువులను నింపారు. ఐదో విడత జన్మభూమిలో భాగంగా ఇక్కడికొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. బుక్కపట్నం చెరువు చూసి, ‘ఇది చెరువా.. సముద్రమా’ అని ఆశ్చర్యపోయారు. నిండు కుండల్లా ఉన్న బుక్కపట్నం, ధర్మవరం చెరువులకు ముఖ్యమంత్రి స్వయంగా జలహారతి ఇచ్చారు. ఈ డివిజన్‌లో 10 వేల బోర్లు రీచార్జ్ అయ్యాయి. అటు చెరువుల కింద, ఇటు రీచార్జి అయిన బోర్ల కింద ఇప్పుడు పచ్చటి పంటలు పండుతున్నాయి. అంతంతమాత్రంగా అందే బోరు నీటితో చెన్నేకొత్తపల్లి, కొత్తచెరువు, ధర్మవరం, కనగానపల్లి, రామగిరి మండలాల రైతులు ఒక పంట పండించేవారు. ఇప్పుడు రెండో పంటకూ సిద్ధమయ్యారు.



నీటితో కళకళలాడుతున్న బుక్కపట్నం చెరువు



భైరవానితిప్ప డ్యామ్‌కు చేరిన నీరు

కలిసొచ్చిన వర్షాలు...

ఆ ఊరిపేరు కలుగోడు. రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట మండలంలోని ఈ గ్రామం పదేళ్ల క్రితం దాకా పచ్చగానే ఉంది. ఊళ్లోని 300 పైగా బోర్లతో సాగుకు చింత ఉండేదికాదు. కానీ... కర్ణాటకలో కట్టిన వరుస ప్రాజెక్టులతో కిందికి నీరు రావడం ఆగిపోయింది. 2006లో తొలిసారి, ఆ తరువాత వెంటవెంటనే కరువు కాటేసింది. ఈ ప్రాంతం కోసం నిర్మించిన భైరవానితిప్ప డ్యామ్... వారిని ఆదుకోలేకపోయింది. 300 నుంచి 500 అడుగుల వరకు బోర్లు వేసి నీటి కోసం వెతుకులాడుకునే పరిస్థితి! ఇలాంటి తరుణంలో.. ఈసారి కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలతో భైరవానితిప్ప డ్యామ్ తొలిసారి నిండింది. ఈ డ్యామ్‌కు 1.5 టీఎంసీల నీరు చేరింది. దీంతో ఈ జలాశయం కింద ఉన్న చెరువులు, బోర్లు తిరిగి ప్రాణం పోసుకొన్నాయి. ఆ చెరువుల కింది పొలాలు పచ్చబట్టాయి. గుమ్మఘట్టతోపాటు, బ్రహ్మసముద్రం మండలంలోనూ చాలా గ్రామాల దాహార్తి తీరింది. ఈ మండలాల్లో 20 వేల మంది గత ఐదేళ్లుగా ఇటు హైదరాబాద్‌కో, అటు బెంగళూరుకో వలసపోతున్నారు. తిప్పలో నీరు చేరిన కారణంగా, పరిస్థితి మారింది. గ్రామాల్లో వలసలు ఆగిపోయాయి.

ఊళ్లోనే పని చేసుకుంటా!

ఎనిమిదేళ్ల క్రితం బెంగళూరుకు వలస వెళ్లా. భైరవానితిప్ప నిండిందని తెలిసి వచ్చేశాను. నాకున్న రెండు ఎకరాల పొలంలో వరి వేశాను. ఇకముందు ఎక్కడకూ వెళ్లను. మా ఊళ్లోనే ఉండి పొలం పనులు చేసుకుంటాను.

- పూలకుంట శ్రీరాములు, గుమ్మఘట్ట మండలం, కలుగోడు గ్రామం రైతు

మా భూములకు రేటు పెరిగింది

భైరవానితిప్ప ఆయకట్టు కింద ఉన్న పొలాలు మావి. ఈ డ్యామ్‌కు నీరు లేనిరోజుల్లో ఎకరా రూ. రెండు లక్షలకూ కొనే వారు లేరు. అలాంటిది ఇప్పుడు రూ. 4 లక్షలన్నా, కొనడానికి బయ్యర్లు క్యూ కడుతున్నారు.

- గుండూరావు, గుమ్మఘట్ట మండలం



దశాబ్దాల కాలం అనంతరం కాలువలో జలకాలాట

లోకం తీరు



ఈ సీజన్‌కు బాల్‌ను కూడా డబ్బుల మూటలాగ తయారుచేశారు బ్రదర్!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	13.8	30.5
గుంటూరు	17.0	32.5
విశాఖపట్నం	17.8	29.2
కర్నూలు	19.0	32.2
విజయవాడ	19.4	30.3

ఉత్తర తెలంగాణ, ఉత్తరకోస్తాల్లో చలి గాలులు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మధ్య భారతంలో నెలకొన్న చలి వాతావరణం ప్రభావంతో ఉత్తర తెలంగాణలో పలుచోట్ల తీవ్ర చలిగాలులు వీచాయి. ఉత్తర కోస్తాలో కూడా చలి వాతావరణం కొనసాగింది. రానున్న 24 గంటల్లో ఉత్తర తెలంగాణలో చలిగాలులు వీస్తాయని, తెలంగాణ, ఉత్తర కోస్తాల్లో చలి ప్రభావం కొంచెం పెరుగుతుందని వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. అయితే సముద్రం మీదుగా గాలులు వీస్తుండడంతో కోస్తాలో మిగిలినచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదయ్యే అవకాశముందని తెలిపారు. రానున్న 24 గంటల్లో రెండు రాష్ట్రాల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొన్నారు. శనివారం విశాఖ ఏజెన్సీలోని లంబసింగిలో 4, చింతపల్లిలో 4, తెలంగాణలోని ఆదిలాబాద్‌లో 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

31న శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ఈనెల 31న ఉదయం 11నుంచి రాత్రి 9.30గంటల వరకు శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నట్లు టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు తెలిపారు. ఆ రోజున సాయంత్రం 5.18 నుంచి రాత్రి 8.41గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుందని, ఆ తర్వాత ఆలయాన్ని శుద్ధిచేసి రాత్రి 9.30నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు. గ్రహణ సమయంలో అన్నప్రసాదాలు, లడ్డూ తయారీ ఉండదని, క్యూకాంప్లెక్స్‌లోకి కూడా భక్తులను అనుమతించబోమని జేఈవో పేర్కొన్నారు.



ప్రజాస్వామ్యంలో మీడియా కీలకం

ప్రజాస్వామ్యం నాలుగు స్తంభాల్లో మీడియానే కీలకం. జుడీషియరీ కూడా దాని చెంతకే వెళ్లాలి. పత్రికలను ఇంటింటికీ చేర్చడంలో విక్రేతలది ప్రముఖపాత్ర. పత్రికారంగంలో వాణిజ్య ప్రకటనల సప్లిమెంట్లు పెరుగుతున్నందున.. ఆ అదనపు ఆదాయంలో వారికీ వాటా ఉండాలి.


- శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే



చట్టంతో సామాజిక రుగ్మతలు పోవు

సామాజిక రుగ్మతలన్నింటికీ చట్టం ఎంత మాత్రం పరిష్కారం కాదు. చట్టం చేసినంత మాత్రాన ట్రిపుల్ తలాక్ నిలిచిపోతుందా? మహిళలకు బాసటగా చట్టాలెన్నో ఉన్నా.. వరకట్నం హత్యలు, మహిళలపై నేరాలకు ఫుల్‌స్టాప్ పడలేదు. కట్నం సమస్యలు ప్రతి రోజూ 22 మంది మహిళలను బలి తీసుకుంటున్నాయి. నిర్భయ చట్టం చేసిన తరువాత అత్యాచారం కేసులు భారీసంఖ్యలో పెరిగాయి.


- ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ



కొవ్వుతో రొమ్ము కేన్సర్ ముప్పు

న్యూయార్క్, జనవరి 27: రుతుక్రమం నిలిచిపోయిన మహిళల్లో కొవ్వు చేరితే రొమ్ము కేన్సర్ ముప్పు తప్పదని అమెరికాకు చెందిన పరిశోధకులు చెబుతున్నారు. బీఎంఐ సాధారణంగా ఉన్నా శరీరంలో కొవ్వు పేరుకుపోతే హానికరమేనని తమ పరిశోధన ద్వారా తేలిందని వారు చెప్పారు. ఈమేరకు 3460 మందిపై అధ్యయనం చేశామన్నారు. బీఎంఐ ద్వారా కొవ్వు శాతాన్ని కచ్చితంగా తెలుసుకోలేమని, అందుకే కొవ్వు శాతానికి బీఎంఐని కొలమానంగా చూడలేమని అన్నారు. కాగా.. చేపల్లో సమృద్ధిగా ఉండే ఒమేగా-3 ఎస్ కొవ్వు ఆమ్లాలతో కేన్సర్‌ను నియంత్రించవచ్చని కెనడాకు చెందిన పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా రొమ్ము కేన్సర్ నియంత్రణలో ఒమేగా-3ఎస్ కొవ్వు ఆమ్లాలు సమర్థవంతంగా పనిచేస్తాయని తమ పరిశోధన ద్వారా తేలిందన్నారు.

తళుక్కు చమక్కులే..!







పొద్దు చుట్టూ తిరిగే పొద్దుతిరుగుడు పువ్వులాగా ఉంటాయి సినిమా జీవితాలు. ఇక్కడ సక్సెస్‌లే వ్యక్తుల కేరాఫ్ అడ్రస్‌కు సిసలైన చిరునామాలు. కాకపోతే ఆబాలగోపాలాన్ని ఆకట్టుకునే హీరోయిన్లు మాత్రం కొంచెం స్పెషల్. సక్సెస్ మంత్రాన్ని పెద్దగా పఠించకపోయినా అడపాదడపా అవకాశాలను అందిపుచ్చుకుంటుంటారు. ఈ నూతన సంవత్సరంలో సరికొత్తగా విడుదలైన చిత్రాల్లోని నాయికలు ఇప్పుడేం చేస్తున్నారు? సక్సెస్ ఛరిష్మా వారి మీద ఎలా ఉంది?.. హేవ్ ఎ లుక్..

కొత్త సంవత్సరం మొదలై ఇప్పటికే 28 రోజులయ్యాయి. పెద్ద పండుగ రోజూ, అంతకు ముందూ.. వెనుకా కూడా కొన్ని చిత్రాలు విడుదలయ్యాయి. పుష్కరకాలంగా సినీ ప్రియులకు పరిచయమైన నటీమణులతో పాటు కొత్తవారూ వెండితెరమీద సందడి చేశారు. అనుష్క, నయనతార, హరిప్రియ, కీర్తి సురేశ్, అను ఇమ్మాన్యుయేల్, నటాషా దోషి.. కొత్త ఏడాది ఇప్పటిదాకా సిల్వర్‌స్క్రీన్‌మీద సందడి చేసిన నాయికలు.

అంతకుమించి!

అనుష్కది తెలుగునాట ఇప్పుడు స్పెషల్ స్టేటస్. హీరోయిన్ల స్థాయిని దాటి హీరోలకు ధీటుగా ఆమె నటించిన చిత్రాలకు క్రేజ్ వచ్చింది. తాజాగా ఆమె నటించిన 'భాగమతి' తెలుగుతో పాటు పొరుగు భాషల్లోనూ విడుదలైంది. 'బాహుబలి'లో దేవసేనగా ఒక రకమైన హుందాతత్వాన్ని ప్రదర్శించిన ఆమె మరో సారి 'అరుంధతి'ని తలపించేలా 'భాగమతి'లో నటించింది. ఈ తాజా చిత్రంలో సందర్భానుసారంగా అనుష్క నటించిన తీరుకు విమర్శకులు సైతం ముగ్ధులయ్యారు. దాంతో ప్రస్తుతం ఆ సక్సెస్‌ను ఆస్వాదిస్తున్నారు అనుష్క. త్వరలోనే ఆమె గౌతమ్‌మీనన్ సినిమా సెట్స్‌కు చేరుకోనున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

అనుష్కకు ధీటుగా దక్షిణాదిన ఎదుగుతోన్న మరో నాయిక నయనతార. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా, వైవిధ్యమైన సబ్జెక్ట్‌లను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. నందమూరి బాలకృష్ణతో ఆమె నటించిన 'సింహా', 'శ్రీరామరాజ్యం' హిట్ చిత్రాలే. ఈ ఏడాది హ్యాట్రిక్ చిత్రంగా 'జై సింహా' చేరింది. మొరటోడికి ప్రేయసిగా, కవలపిల్లల తల్లిగా 'జైసింహా'లో నయన్‌ని చూసిన వారు మరోసారి ఫిదా అయ్యారు. ఆ విషయం నయన్ వరకూ చేరింది. ఇప్పుడు ఆమె రెట్టించిన ఉత్సాహంతో తెలుగులో 'సైరా', తమిళంలో మరికొన్ని చిత్రాలతో ముందుకు సాగుతున్నారు.

ఒక మెట్టు ఎదిగి..

గత ఏడాది 'నేను శైలజ' చిత్రంతో తెలుగువారిక మనసులకు దగ్గరైన కీర్తిసురేశ్‌కి ఈ ఏడాది ప్రమోషన్ వచ్చింది. పవన్‌కల్యాణ్ సరసన 'అజ్ఞాతవాసి'లో నటించింది. తండ్రి కోటీశ్వరుడైనా ఏమాత్రం అహంకారం లేని అమ్మాయిగా ఈ చిత్రంలో కనిపించింది. మరోవైపు ఆమె నటించిన 'గ్యాంగ్' కూడా తెలుగులో విడుదలైంది. తమిళ హీరో సూర్య సరసన ఆమె నటించిన తొలి చిత్రం 'గ్యాంగ్'. ఇందులో రమ్యకృష్ణ కీలక పాత్ర పోషించారు. 'నేను చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగిన రమ్యకృష్ణగారితో కొన్ని సన్నివేశాలు చేయడాన్ని థ్రిల్‌గా ఫీలయ్యాను" అని ఆ మధ్య కీర్తి సురేశ్ వెల్లడించారు. గత జనవరిలో ఒక చిత్రం, ఈ ఏడాది రెండు చిత్రాలు.. వరుస పెంచుకుంటూ పోతున్నారు కీర్తి. ఆమె నటిస్తోన్న 'మహానటి' మీద రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయన్నది వాస్తవం. కీర్తిలాగానే మరో మెట్టు ఎదిగిన నాయిక అను ఇమ్మాన్యుయేల్. గతేడాది రాజ్‌తరుణ్, నాని సరసన నటించిన ఆమె పవన్‌కల్యాణ్ సరసన నటించిన 'అజ్ఞాతవాసి' పెద్ద పండుగకి సందడి చేసింది. కన్నకూతురులాగా చూసుకునే బాస్ దగ్గర పనిచేసే ఎమోషనల్ పీఏగా ఆమె మెప్పించింది. అల్లు అర్జున్, నాగచైతన్య చిత్రాలతో ఈ ఏడాది అను డైరీ ఫుల్. తాజాగా ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమా కోసం కూడా ఈమెనే సంప్రదించినట్లు సమాచారం.

మరింత స్పెషల్..

కన్నడ హుడుగి హరిప్రియకు, మలబారు బ్యూటీ నటాషా దోషికి ఈ ఏడాది చాలా స్పెషల్. 'జై సింహా'లో వీరిద్దరివీ ప్రేక్షకాదరణ పొందిన పాత్రలే. అమ్ముకుట్టి పాటతో నటాషా దుమ్మురేపితే హీరోను పిచ్చిగా ప్రేమించే పాత్రలో నటించి ప్రేక్షకులకు కన్నీరు తెప్పించారు హరిప్రియ. సో ఈ ఏడాది నటాషాకు ఎంట్రీ, ఇప్పటికే కొన్ని తెలుగు సినిమాలు చేసిన హరిప్రియకు రీ ఎంట్రీ అన్నమాట.

అనుష్క టు నటాషా.. ఈ ఏడాది ఇప్పటిదాకా సందడి చేసిన నాయికలు అందరూ దక్షిణాదివారే. అనుష్క, హరిప్రియ కన్నడ హుడుగిలు. నయనతార, కీర్తి సురేశ్ మలయాళ భామలు. అను ఇమ్మాన్యుయేల్, నటాషా దోషి విదేశాల్లో స్థిరపడ్డప్పటికీ మలయాళ భామలే. సో ఈ ఏడాది ప్రారంభంలో తెలుగుమీద సందడి చేసిన నాయికలు అందరూ దక్షిణాదివారే కావడం గమనార్హం.

● ఆలపాటి మధు



ఇంటెలిజెంట్‌లో లావణ్య త్రిపాఠి

ఆయన .. ఇద్దరు హీరోయిన్లు!

ఫ్లాష్‌బ్యాక్

ఓ హీరో.. ఇద్దరు హీరోయిన్లు ఫార్ములాను బాగా పాపులర్ చేసిన కథానాయకుడు శోభన్‌బాబు. కెరీర్ బిగినింగ్‌లో తప్ప తర్వాత ఆయన నటించిన ప్రతి చిత్రంలోనూ ఇద్దరు హీరోయిన్లు ఉండేవారు. ఇటు ఇంట్లో ఇల్లాలినీ,అ టు బయట ప్రియురాలునీ మెయింటైన్ చేస్తూ, ఒకరి విషయం మరొకరికి తెలియకుండా తెలివిగా మేనేజ్ చేస్తూ, ఆ విషయం ఎక్కడ బయటపడుతుందోనని మానసికంగా నలిగిపోయే పాత్రలు ఎన్నో పోషించారాయన. ఆసక్తికరమైన విషయమేమిటంటే శోభన్‌బాబు ఇటువంటి పాత్రలు చేస్తున్నా మహిళల్లో ఆయనకు ఫాలోయింగ్ తగ్గకపోవడం. 'అయ్యో



'భార్యాభర్తలు' చిత్రంలో సుహాసిని, శోభన్‌బాబు, రాధ

పాపం..' అని మహిళా ప్రేక్షకులు ఆయన పరిస్థితి చూసి జాలిపడ్డారే తప్ప ఆగ్రహించలేదు. అభిమానించడం మానలేదు. ఆ పాత్రల ప్రభావం తన నిజజీవితం మీద అంటకుండా శోభన్‌బాబు జాగ్రత్త పడ్డారు కనుకే 'సోగ్గాడు'గా ఆయన అభిమానుల గుండెల్లో మిగిలిపోయారు. శోభన్‌బాబు ఫార్ములాను ఇప్పటికీ తెలుగు చిత్రపరిశ్రమ ఫాలో అవుతూ ఉంది. అప్పట్లో జగపతిబాబు వంటి హీరోలు తెలివిగా ఈ ఫార్ములాను ఫాలో అయి, మహిళాప్రేక్షకులకు దగ్గరయ్యారు.

డైలీ సుడోకు - 89

	3	4						7
	7		9					
1					7			
	4	6	2					5
7	9		6		8		3	1
8					4	6	2	
			4					3
					2		7	
5						8	1	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 88 సమాధానం

గాడ్... సెక్స్ అండ్ ఫైట్!

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తీసిన శృంగార చిత్రమ్ 'గాడ్... సెక్స్ అండ్ ట్రూత్' (జీఎస్‌టీ)! మియా మాల్కోవా నటించిన ఈ చిత్ర ట్రైలర్, పోస్టర్లను ఇంటర్నెట్‌లో విడుదల కాగానే మహిళా సంఘాలు వర్మ మీద విరుచుకుపడ్డాయి. చిత్రంగా కొంతమంది మహిళల నుంచి వర్మకు మద్దతు లభించింది. ఇటువంటి చిత్రం తీయడం సమంజసమా? లేదా? అనే చర్చల్లో, మాటల గొడవల్లో నిన్న మొన్నటి వరకూ మునిగితేలిన వర్మ, ఇప్పుడు కాపీరైట్ గొడవల్లో ఫైట్ చేస్తున్నారు. "నా కథను చోరీ చేసి 'జీఎస్‌టీ' తీశార"ని వర్మ 'సర్కార్-3'కి రచయితగా పని చేసిన పి. జయకుమార్ ఆరోపిస్తున్నారు. "జయకుమారే మా ఆఫీసులోంచి కథను చోరీ చేసుండొచ్చు" అని వర్మ అతడి ఆరోపణలను తిప్పి కొట్టారు. దీనికి బదులుగా వర్మను జయకుమార్ హోమోసెక్సువల్‌గా అభివర్ణించారు. 'జీఎస్‌టీ' చిత్రం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల స్థాయిని తగ్గించిందా? లేదా? అనేది పక్కన పెడితే... వర్మ స్వయంగా స్పందించడంతో 'గాడ్... సెక్స్ అండ్ కాపీరైట్ ఫైట్' ఆయన స్థాయిని ఎక్కడికి తీసుకువెళ్తుందనే చర్చ మొదలైంది. అసలు, ఈ ఫైట్ ఎక్కడ మొదలైంది? ఇప్పుడు ఎక్కడ ఉంది?



రామ్‌గోపాల్ వర్మ

✦ 'జీఎస్‌టీ' ట్రైలర్ విడుదలకు కొన్ని గంటల ముందు జయకుమార్ స్క్రిప్ట్‌ను ట్వీట్ చేశారు. అమెజాన్‌లోనూ అప్‌లోడ్ చేశారు. తన కథతో 'జీఎస్‌టీ' తీసి, తనకు క్రెడిట్స్ ఇవ్వకుండా మోసం చేశాడని ఆరోపించారు. వర్మను కాపీక్యాట్‌గా అభివర్ణించారు.

✦ తొలుత జయకుమార్ ఆరోపణలపై వర్మ నుంచి ఎటువంటి స్పందనా లేదు. లైట్ తీసుకున్నారు. 'జీఎస్‌టీ' విడుదలకు ఒక్క రోజు ముందు ఆరోపణలను ఖండించడంతో పాటు 'సర్కార్-3' సమయంలో ఇరువురికీ మధ్య జరిగిన కొన్ని వాట్సాప్ సంభాషణలను ట్వీట్ చేశారు.



జయకుమార్

✦ "పలువురు అసిస్టెంట్ రైటర్స్‌తో నేనెప్పుడూ వర్క్ చేస్తుంటా. వాళ్లతో నా ఐడియాలను చెబుతుంటా. వాళ్ల కాంట్రిబ్యూషన్‌ని బట్టి క్రెడిట్స్ ఇవ్వాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకుంటా. అటువంటి వ్యక్తుల్లో జయకుమార్ ఒకడు. అయితే... మా ఆఫీసులో దొంగతనం చేస్తూ పలుసార్లు పట్టుబడడంతో పది నెలల క్రితం అతణ్ణి ఉద్యోగంలోంచి తీసేసాం. ఒక్కసారిగా అతను 'జీఎస్‌టీ' కథ నాదేనంటూ వార్తల్లోకి వచ్చాడు. మూడు నాలుగు నెలల క్రితమే 'జీఎస్‌టీ' కాన్సెప్ట్ అనుకుని, దానిపై వర్క్ చేయడం స్టార్ట్ చేశాం. బహుశా... ఈ కథను అతను దొంగిలించడం లేదా హ్యాక్ చేయడం లేదా మరొకటో చేసుండొచ్చు. నేరప్రవృత్తి కల అటువంటి వ్యక్తులకు ప్రాముఖ్యత ఇవ్వకూడదని ఇన్ని రోజులూ మౌనంగా ఉన్నా" అని వర్మ తెలిపారు. జయకుమార్‌పై సైబర్ క్రైమ్‌లో రిపోర్ట్ చేశానన్నారు.

✦ మరోపక్క వర్మ స్పందించడానికి ఒక్కరోజు ముందు హైదరాబాద్ జిల్లా కోర్టులో ఆయనపై ఐదు లక్షలకు సివిల్‌సూట్ దాఖలు చేశారు జయకుమార్. "2015లో 'జీఎస్‌టీ' కాన్సెప్ట్‌ను వర్మతో డిస్కస్ చేశా. వర్మ సూచనల మేరకు కథలో మార్పులు చేశా. 2016 జూన్‌లో డైలాగ్ వెర్షన్‌తో సహా కథను ఆయనకు మెయిల్ చేశా. తర్వాత దీని గురించి నాతో ఏం మాట్లాడలేదు. జనవరి 16న విడుదలైన ట్రైలర్ చూసి షాక్ అయ్యాను. అందుకే, కేసు వేశా" అని జయకుమార్ తెలిపారు. రామ్‌గోపాల్ వర్మ, ఆర్ కంపెనీ, మియా మాల్కోవా, విమియో ఎంటర్‌ప్రైజెస్ ('జీఎస్‌టీ'ని ఇంటర్నెట్‌లో విడుదల చేసిన సంస్థ), యూట్యూబ్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు.



మియా మాల్కోవా

టీవీ దృశ్యం

కరణ్ షోలో కంగన!



స్టార్‌ప్లస్ ప్రసారం చేస్తున్న 'ఇండియాస్ నెక్స్ట్ సూపర్‌స్టార్స్' సంబంధించిన ప్రోమో ఇటీవల టెలికాస్ట్ అయింది. ఏ బ్యాక్‌గ్రౌండ్ లేని వాళ్లను ఇండస్ట్రీకి పరిచయం చేయాలన్నది షో ఉద్దేశం. బాలీవుడ్ దర్శక-నిర్మాతలు కరణ్‌జోహార్, రోహిత్‌శెట్టి ఈ షోకు వ్యాఖ్యాతలు. ప్రతి వారం ఓ బాలీవుడ్ ప్రముఖుడిని అతిథిగా ఆహ్వానించడం ఆనవాయితీ. ఈ సారి కూడా ఎవరిని ఆహ్వానిస్తారా! అని బుల్లితెర ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూశారు. కంగనా రనౌత్‌ను గెస్ట్‌గా ఆహ్వానించేసరికి బుల్లితెర ప్రేక్షకులకే కాకుండా బాలీవుడ్‌కూ షాక్ తగిలినంత పనైంది. అయితే ఏంటంటారా? కొన్ని రోజులు వెనక్కి వెళ్లాల్సిందే. 'కాఫీ విత్ కరణ్' షో గురించి తెలిసే ఉంటుంది. అందులో చాలా మంది బాలీవుడ్ ప్రముఖులు అతిథులుగా పాల్గొని ఎన్నో జ్ఞాపకాలను పంచుకున్నారు. అప్పట్లో హిట్ టాక్ సొంతం చేసుకుంది. కరణ్‌జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించి ఈ షోలో కంగనా రనౌత్ కూడా పాల్గొన్నారు. అయితే ఆ తర్వాత సీన్ మారిపోయింది. ఆమె మాట్లాడిన ఒక్క మాట, చేసిన ఆరోపణ వివాదానికి దారి తీసింది అదే 'నెపోటిజమ్' (ప్రముఖులకు అందలం). ఈ విషయంలో కంగన ఏకంగా కరణ్ మీద ఫైర్ అయ్యారు. బాలీవుడ్‌లో స్టార్ వారసులకు రెడ్ కార్పెట్ వేసి మరీ సినిమా అవకాశాల కల్పిస్తున్నారనీ దీని వల్ల సినీ నేపథ్యం లేని వాళ్లు అన్యాయమైపోతున్నారనీ ఆరోపించారు. షో అయ్యాక, కూడా ఈ గొడవ ఆగలేదు. తర్వాత ఈ ఇద్దరూ స్పందించకపోయినా బాలీవుడ్‌లో ఇది పెద్ద చర్చకే దారి తీసింది. కరణ్, కంగనాల మధ్య చెడిందనీ, ఇక మాట్లాడుకోరనీ ఎంతో మంది జోస్యం చెప్పేశారు. అయితే చాలా కాలం తర్వాత 'ఇండియాస్ నెక్స్ట్ సూపర్‌స్టార్స్'లో కంగన ప్రత్యక్షం కావడంతో వీరిద్దరి మధ్య గొడవ సమసిపోయినట్లేనని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ఏది ఏమైనా ఆమె 'నెపోటిజమ్' అభియోగమే కరణ్ ఈ షో ప్రారంభించడానికి కారణమన్నది మరో టాక్!

స్టుపిడ్ కాదు క్రేజీ షో!

చేతికి స్మార్ట్‌ఫోన్ ఇచ్చి.. అందులో డేటా ప్యాక్‌తో ఫుల్‌గా రీచార్జ్ చేయిస్తే 'ఇంకేం బిందాస్' అని మనకో ఫీలింగ్. ప్రతి వస్తువూ ఇంటి వరకూ, ఆహారం... నోటి వరకూ వస్తుంటే కష్టపడే ఛాన్సే లేదు. కానీ ఒకే ఒక్క స్మార్ట్‌ఫోన్‌తో ఏ అరేబియా ఎడారిలోనో, మనుషులు అసలు మచ్చుకైనా కనబడని అంటార్కిటికా ఖండంలోని మారుమూల ప్రదేశంలోకి తీసుకెళ్లి పడేస్తే ! అదే 'స్టుపిడ్ మ్యాన్ స్మార్ట్ ఫోన్' అనే ఓ టీవీ షో కాన్సెప్ట్ . స్మార్ట్‌ఫోన్ లేకుండా ఒక మనిషిని ఊహించడం సాధ్యమేనా? ఏమో చెప్పలేం. ఆ ఐడియాతోనే ఈ షోను డిజైన్ చేసింది బీబీసీ ఛానెల్. రెండేళ్ల నుంచి ప్రసారమవుతున్న ఆ కాన్సెప్ట్‌ను ఇప్పుడు అదే పేరుతో నిర్మించి భారత్‌లో 'ఊట్' అనే వెబ్‌సైట్ ప్రసారం చేస్తోంది. "1990 దశకాల నాటి ఓ టీవీ షో చూస్తుంటే, ఇప్పుడు మనిషి జీవితంలోకి స్మార్ట్‌ఫోన్ ఎంతలా చొరబడిపోయిందో ఆ తేడా స్పష్టంగా కనిపించింది. అప్పుడే మాకీ ఐడియా తట్టింది" అని బ్రిటీష్ షో నిర్మాత చెప్పారు. స్మార్ట్‌ఫోన్‌లో ఎలాంటి యాప్‌నైనా ఉపయోగించుకొని పనులు చక్కబెట్టుకోవాలి. బ్రష్ నుంచి తినే పిజ్జా వరకూ అన్నీ ఫోన్ ఉపయోగించి సమకూర్చుకోవాలి. కానీ సిగ్నల్ ఉందా లేదా? అన్నది రూపకర్తలకు అనవసరం. ఎలాగైనా సరే ఆ ప్రదేశంలో కొన్నిరోజుల పాటు ఉండాలి. అదే షరతు. విచిత్రంగా ఉంది కదూ! ఈ సాహసయాత్రతో కావాల్సినంత కిక్ ఇవ్వడానికి ప్రముఖ రచయిత రస్సెల్ కేన్ సిద్ధంగా ఉన్నారు. ఈ రియాలిటీ షో చిత్రీకరణ ఇటీవల కోస్టారికా దేశంలోని ఓ ఎడారి ప్రాంతంలో చిత్రీకరించారు. పాపం! షూటింగ్ సమయంలో ఆహారం, నీళ్లు దొరక్క ఛానెల్ సిబ్బంది కూడా నానా కష్టాలు పడ్డారట! ఏది ఏమైనా చూసేవాళ్లకు బోల్డంత వినోదం ఇవ్వాలన్నది తమ లక్ష్యం అంటున్నారు ఛానెల్ నిర్వాహకులు.



రస్సెల్ కేన్

బసంతి టాంగా నడిపితే!

నలభై మూడేళ్ల క్రితం వచ్చిన 'షోలే'లోని ప్రతి పాత్ర సినీ అభిమానులకు గుర్తుండిపోతుంది. ఇక అలనాటి బాలీవుడ్ డ్రీమ్‌గర్ల్ హేమమాలిని పోషించిన 'బసంతి' పాత్ర కూడా అంతే. ఆమె కెరీర్‌ను మలుపుతిప్పిన ఇలాంటి పాత్రను మళ్లీ హేమమాలిని పోషిస్తే ఎలా ఉంటుంది? అయితే ఏదో సినిమాలో కాదు. టీవీలో కాసేపు నిజంగానే ఆమె టాంగా నడిపారు. ఇటీవలే 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్' అనే రియాలిటీ షోలో గెస్ట్ జడ్జిగా ఆమె పాల్గొన్నారు. ఆమె ఎంట్రీని టాంగాతో ప్లాన్ చేశారు షో నిర్వాహకులు. అన్నట్లు దీనికి న్యాయనిర్ణేతగా బాలీవుడ్ సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి వ్యవహరిస్తున్నారు. హేమమాలినీని ఆహ్వానించే ఈ ఘట్టం ఆలోచన కూడా ఆయనదేనట! ఈ ఎపిసోడ్ ఆదివారం జీటీవీలో ప్రసారం కానుంది.





నేడు పల్స్ పోలియో

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం జరగనుంది. ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. మొత్తం 37,538 పోలియో బూత్‌ల ద్వారా 50,90,132 మంది 5 ఏళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు వేయనున్నారు. దీనికిగాను 65 లక్షల డోస్‌ల మందును సిద్ధం చేశారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లోనూ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం ఆరోగ్యశాఖ 3,754 మంది సూపర్‌వైజర్లను, 1,50,140 మంది వ్యాక్సినేటర్లను నియమించింది. అదేవిధంగా 1,331 మొబైల్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇవేకాకుండా 1,17,86,284 ఇళ్లల్లో ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,085 వాహనాలను కూడా ఆరోగ్యశాఖ సిద్ధం చేసింది.

నేడు 'సూర్య ఆరాధన'

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఆరాధనతో రాష్ట్రానికి, ప్రజలకు మంచి జరుగుతోందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... ఆదివారం 'సూర్య ఆరాధన' కార్యక్రమాన్ని చేపట్టింది. మతాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రథ సప్తమి తర్వాత వచ్చే ఆదివారం చాలా మంచిదంటారని, అందుకే ఉదయం 7 గంటలకు విజయవాడ మునిసిపల్ గ్రౌండ్‌లో ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వర్తించే 'సూర్య ఆరాధన'లో తాను కూడా పాల్గొంటున్నానని చెప్పారు. సూర్యుడు జస్టిస్ చక్రవర్తిలాంటి వాడని సీఎం అభివర్ణించారు. బీద, ధనిక తారతమ్యాలు లేకుండా అందరికీ వెలుగులు ఇస్తాడని అన్నారు. అలుపెరుగకుండా ప్రపంచమంతా క్రమశిక్షణతో వెలుగులు పంచే బాధ్యతను నిర్వర్తించే సూర్యునికి రోజూ నమస్కారం చేస్తే చాలా మంచిదని, డి-విటమిన్ వస్తుందని అన్నారు. 'శ్రీ సూర్యదేవ శుభ వందనం' అనే గీతాన్ని, యోగా గురువు మాధవరావు రాసిన 'చంద్రయోగం' పుస్తకాన్ని ఈ సందర్భంగా సీఎం ఆవిష్కరించారు.

అమెరికాకు లోకేశ్.. పెట్టుబడులే లక్ష్యం

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనకు వెళ్లారు. దావోస్‌లో పర్యటన ముగించుకున్న ఆయన అటు నుంచి అటే అమెరికా పర్యటనకు బయల్దేరారు. గత నెలలో అమెరికా వెళ్లి గూగుల్ ఎక్స్, జోహో తదితర కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని వచ్చిన ఆయన.. మరోమారు పెట్టుబడుల కోసం ఆ దేశానికి వెళ్లారు. ఆయన ఈ పర్యటనలో భాగంగా 40 బడా కంపెనీల సీఈవోలతో భేటీ కానున్నారు. అదే సమయంలో పలు చిన్న కంపెనీల ప్రతినిధులతోనూ సమావేశాలు జరపనున్నారు. డల్లాస్, లాస్‌ఏంజెల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటిల్, అట్లాంటా, న్యూయార్క్, బోస్టన్ నగరాల్లో పర్యటించి పలు సంస్థల ప్రతినిధులను కలవనున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోనే లోకేశ్ మూడురోజుల పాటు ఉంటారు. ఆయా నగరాల్లో ఓ పక్క కంపెనీల సీఈవోలతో భేటీలు జరుపుతూనే మరోవైపు ప్రవాస తెలుగు పారిశ్రామికవేత్తలతోనూ లోకేశ్ సమావేశాలు నిర్వహిస్తారు.

రాజన్న రాజ్యం తెస్తా: జగన్


పాదయాత్రలో జగన్

గూడూరు, జనవరి 27: రాజన్న రాజ్యంతో పేదలకు మేలు జరుగుతుందని, రాష్ట్రంలో మళ్లీ రాజన్న రాజ్యం తెస్తానని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరు జిల్లా గూడూరు మండలం కాండ్ర గ్రామానికి జగన్ పాదయాత్ర చేరుకుంది. నాయకులు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ప్రజలనుద్దేశించి జగన్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరిగేలా పాలన చేస్తానన్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ, పలకరిస్తూ ముందుకు సాగారు.

ఏపీ ఆలయాల్లో ఉత్తరాది మోడల్!: మంత్రి

గుడివాడ, జనవరి 27: రాష్ట్రంలోని దేవాలయాల పరిరక్షణ, ప్రాశస్త్యం కాపాడేందుకు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు దేవాదాయశాఖకు అనుసంధానంగా ఒక స్వతంత్ర సంస్థ కావాలని మంత్రి పైడికొండల మాణిక్యాలరావు పేర్కొన్నారు. శనివారం కృష్ణాజిల్లా గుడివాడలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాది రాష్ట్రాల్లో దేవాదాయశాఖ, ధార్మిక సంస్థల ఆధీనంలో హిందూ ఆలయాలు నడుస్తున్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉండటంతో భక్తులకు అసౌకర్యం కలుగుతోందని మంత్రి పేర్కొన్నారు. ఈ దిశగా దేవాదాయశాఖలో సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని, అందుకే అటానమస్ బాడీ ఏర్పాటును తాను ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. దీనికి ప్రజల మద్దతు కావాలన్నారు. ఐఏఎస్‌లు, న్యాయకోవిదులు తదితర మేధావులతో స్వతంత్ర సంస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుందని మాణిక్యాలరావు సూచించారు.

తిరుమలలో బెల్లం కొరత


అన్నదాన భవనంలో వడ్డించిన చక్కెర పొంగలి

తిరుమల, జనవరి 27: టీటీడీ అధికారుల నిర్లక్ష్యంతో తిరుమలలో బెల్లం కొరత ఏర్పడింది. ప్రసాదాలకు బెల్లం లేకపోవడంతో తులాభారానికి వినియోగించే బెల్లంను వాడుతున్నారు. అన్నప్రసాద భవనంలో బెల్లం పొంగలికి బదులు చక్కెర పొంగలి వడ్డిస్తున్నారు. వాస్తవానికి ప్రసాదాల తయారీలో బెల్లంను ఎక్కువగా వాడతారు. 10 రోజుల నుంచి తిరుమలకు బెల్లం సరఫరా కావడం లేదు. తిరుపతి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 25 వేల కిలోల బెల్లం నిల్వలున్నా ల్యాబ్ క్వాలిటీ రిపోర్టు అందకపోవడంతో తిరుమలకు పంపలేదు. మూడు రోజులుగా బెల్లం కొరత తీవ్రం కావడంతో పోటు సిబ్బందీ సతమతం అవుతున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు స్వామి ప్రసాదంగా బెల్లం పొంగలి తప్పనిసరిగా వడ్డిస్తారు. దీనికి ప్రతిరోజు 650 కిలోల బెల్లం అవసరం. బెల్లం లేక చక్కెర పొంగలి వడ్డిస్తున్నారు. కాగా, బెల్లం కొరత మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో టీటీడీ అధికారుల్లో చలనం వచ్చింది. హడావుడిగా శనివారం సాయంత్రం 2 వేల కిలోల బెల్లంను తిరుమలకు పంపారు.

'పద్మ' అవార్డుల్లో అన్యాయం: ఎమ్మెల్సీ గాలి

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన 'పద్మ' అవార్డుల్లో, శకటాల ప్రదర్శనల్లో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని టీడీపీ ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఆరోపించారు. 'భారతరత్న' ప్రకటనలోనూ మనకు అన్యాయమే జరిగిందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచిన దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకు, తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ప్రకటించకపోవడాన్ని విమర్శించారు. "సీఎంగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా పనిచేసిన నీలం సంజీవరెడ్డికి ఈ అవార్డు రాలేదు. తమిళనాడులో అన్నాదురై, ఎంజీఆర్‌కు భారతరత్న ఇచ్చిన కేంద్రం, తెలుగు రాష్ట్రాలకు చెందిన విఖ్యాత నటులు ఎస్వీ రంగారావు, సావిత్రితో పాటు దర్శకులు దాసరి నారాయణరావుకు మాత్రం అవార్డు ప్రకటించలేదు"అని ఆవేదన వ్యక్తం చేశారు.

సీమలో హైకోర్టుకు లాయర్ల డిమాండ్!

కడప(లీగల్), జనవరి 27: రాయలసీమలోనే హైకోర్టు ఏర్పాటు చేయాలని సీమ, నెల్లూరు బార్ అసోసియేషన్స్, హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కడప బార్ అసోసియేషన్ భవన్‌లో శనివారం జరిగిన సదస్సులో కడప, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల న్యాయవాదులు పాల్గొన్నారు. హైకోర్టు ఏర్పాటు భిక్ష కాదని.. సీమ హక్కని నాయకులు పేర్కొన్నారు. ఆమరణ దీక్షలతో ఉద్యమ సెగలను ఢిల్లీని తాకేటట్లు చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు, విపక్షనేత జగన్, పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి, సీపీఐ కార్యదర్శి రామకృష్ణలు సీమకు చెందిన వారే అయినా.. ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం దారుణమని మండిపడ్డారు.

ఎందుకీ అక్కసు?

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన ఆయన... శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. పలు అంశాలపై భావోద్వేగంతో స్పందించారు. రాష్ట్రంలో సమస్యలు పరిష్కారం కాకూడదని, అరాచకం పెరిగిపోవాలని .. ప్రజల మధ్య చిచ్చు రేపాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని మండిపడ్డారు. లులూ సంస్థ విశాఖలో కార్యకలాపాలను స్థాపించేందుకు ముందుకు వస్తుంటే.. కొందరు ఎలా వస్తుందో చూస్తామంటూ హెచ్చరికలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ సంస్థ కొచ్చిన్‌లో నిర్వహిస్తోన్న కార్యకలాపాలు చూసి రాష్ట్రానికి పిలిచాం. వారు కోరినచోట భూములు ఇస్తే ఇప్పుడు అడ్డుకుంటామంటూ హెచ్చరికలు చేయమేమిటి? అభివృద్ధి చేయాలంటూనే ఇలా అడ్డగింతలేమిటి?" అని నిలదీశారు. తనకు ప్రజలపై నమ్మకం ఉందని... ఎవరు పనిచేస్తున్నారో... ఎవరు మాటలు చెబుతున్నారో వారు గ్రహించగలరని అన్నారు. "విభజన సమయానికి రాష్ట్రంలో సరైన మౌలిక సదుపాయాలు లేవు. రాష్ట్రం గతుకుల రోడ్డులా ఉంది. గన్నవరం విమానాశ్రయం రేకుల షెడ్డులా ఉండేది. అయినా.. మూడున్నరేళ్లలో 370 కోట్ల డాలర్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. అనంతపురం జిల్లాకు కియ కార్ల కంపెనీ వచ్చింది. రాయలసీమకు నీళ్లు, పరిశ్రమలు వస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో తెలుస్తుంది." అని వివరించారు. రాష్ట్రం కోసం తాను ఏ కష్టాన్ని లెక్క పెట్టడం లేదని ఆయన పేర్కొన్నారు. ఆయా అంశాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే...

'దావోస్'తో వచ్చిందిదీ..

ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పటి నుంచి దావోస్‌కు వెళ్తున్నాను. ఇప్పటికి 14సార్లు ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్నాను. ప్రపంచ వ్యాప్తంగా ఏం జరుగుతుందో, టెక్నాలజీ ఎలా అభివృద్ధి చెందుతోందో ఈ సదస్సు వల్ల తెలుస్తుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా ప్రపంచం భారత్ గురించి, అందునా .. ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడుకునేలా చేశాం. దావోస్ పర్యటనలో భాగంగా జ్యూరిక్‌తో సిస్టర్ స్టేట్ ఒప్పందం చేసుకున్నాం. మెడ్ టెక్‌తో ఒప్పందం కుదిరింది. విశాఖలో 1000 నుంచి 2000 ఎకరాల్లో మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం. దావోస్‌లో మెడ్‌సిటీకి సంబంధించి 150 సంస్థలతో ఒప్పందం జరుగుతుందని భావించినా... 50 సంస్థలతో ఒప్పందం జరిగింది. అలీబాబా క్లౌడ్ డేటా సెంటర్ ఏపీలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దేశంలో మొదటి కేంద్రాన్ని ముంబైలో ఏర్పాటు చేస్తోంది. రెండోది... ఏపీలో వస్తుంది. బ్లాక్ చెయిన్, హైబ్రీడ్ క్లౌడ్ హబ్, ఫిన్‌టెక్ వంటి పాలసీలు తీసుకురావడం వల్ల పలు ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో తమ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. దావోస్‌లో హిటాచీతోనూ ఒప్పందం చేసుకున్నాం. ఇప్పటికే మనం రియల్ టైమ్ గవర్నెన్స్‌ను అత్యుత్తమంగా నిర్వహిస్తున్నాం. హిటాచీ కూడా ఇందులో భాగస్వామ్యం అయ్యేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అలాగే... హెచ్‌పీ 3-డి ప్రింటింగ్ ప్లాంట్ కూడా స్థాపించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎయిర్ బస్ కూడా టాటాతో కలసి రవాణా విమాన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్ రహేజాలో 1,35,000 మందికి ఉద్యోగాలను కల్పించారు. ఇప్పుడు... ఏపీలోనూ మైండ్ స్పేస్ కేంద్రాల ఏర్పాటుకు రహేజా సంసిద్ధత వ్యక్తం చేసింది. శాప్ గ్లోబల్ హెడ్‌తో సంప్రదింపులు జరిపాం. కాంప్రహెన్సివ్ ఫైనాన్స్‌ను అమలు చేసేందుకు శాప్ అంగీకరించింది. సౌదీ ఆరమ్‌కో కాకినాడలో లేదా కృష్ణపట్నంలో రిఫైనరీని ఏర్పాటు చేస్తామని తెలిపింది. కరువును నియంత్రించేలా రూపొందించిన విధానాలను రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని యూపీఎల్ సంస్థను కోరాం. వేదాంత గ్రూప్ రాష్ట్రంలో 20 లక్షల అమెరికన్ డాలర్ల మేర పెట్టుబడులు పెడుతుంది. దావోస్‌లోనూ ఏపీయే ప్రపంచాన్ని ఆకర్షించింది. అక్కడ ఏర్పాటు చేసిన వాహనాలతో పాటు .. తెలుగు వంటకాలు అందరిని ఆకట్టుకున్నాయి.



పట్టిసీమే లేకుంటే...

"నిన్న కూడా ఒకాయన పట్టిసీమలో 400 కోట్ల అవినీతి జరిగిందని అన్నారు. ఆ ప్రాజెక్టు మొదలు పెట్టిన రోజు నుంచి ఇవే ఆరోపణలు. వారికి భయపడి ఊరుకొంటే ఇవాళ విజయవాడకు తాగడానికి నీళ్లు దొరికేవి కావు. ఎగువ నుంచి కృష్ణా జలాలు రాకున్నా... పట్టిసీమ ద్వారా నీళ్లిస్తున్నాం. మంచి పంట పండిందని రైతులు ఆనందంగా చెబుతున్నారు. ఈ ఏడాది వందకు పైగా టీఎంసీల నీటిని తెచ్చాం. వచ్చే ఏడాది 160 టీఎంసీల నీటిని తెస్తాం. రాయలసీమలో బాగా ఇబ్బంది పడుతున్న మడకశిర, హిందూపూరం, మదనపల్లి, కుప్పం వంటి ప్రాంతాలకు కూడా నీరిస్తాం. నీళ్లు ఇస్తుంటే అభినందించాలి. కానీ, ఎందుకింత అక్కసు? గోదావరి - పెన్నా నదులను అనుసంధానిస్తాం.

2027 నాటికి సంపూర్ణ సేంద్రియం

ఇప్పటికే రాష్ట్రంలో సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాం. 2027 నాటికి రాష్ట్రం సంపూర్ణంగా సేంద్రీయ వ్యవసాయంగా మారుతుంది.

ఆశించినంత ఆదాయం లేదు

జీఎస్టీ వల్ల పన్ను ఆదాయం తగ్గింది. కానీ... కేంద్రానికి ఐటీ ఆదాయం పెరిగింది. రెండు వేల నోటు రద్దు అవుతుందనే ప్రచారం వల్ల కూడా డబ్బులు దాచుకోకుండా ఐటీ చెల్లించి తెలుపు చేసుకుంటున్నట్లు అనిపిస్తోంది. జీఎస్టీ పెరిగితేనే రాష్ట్రానికి లాభం ఉంటుంది.

ఆవిష్కరణ కేంద్రంగా...

ఇన్నోవేషన్స్ అమలులో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తాం. శ్రీకాకుళం నుంచి కర్నూలు దాకా రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం. ప్రపంచమంతా ఏకథాన్ నిర్వహిస్తాం. సాంకేతిక నైపుణ్యం వినియోగం, కొత్త ఆవిష్కరణలు, సంప్రదాయ సేంద్రీయ ఎరువుల విధానం .. తదితరాలతో ఏపీని వృద్ధి బాటలోకి తీసుకువెళతాం, సంప్రదాయ, సాంకేతికత మేళవింపుతో.. ప్రపంచంలోని టాప్-5 రాష్ట్రాల్లో ఏపీని ఒకటిగా నిలపడమే నా లక్ష్యం.

అమరావతి డిజైన్లు మారవు...

నార్మన్ ఫోస్టర్ రూపొందించిన అమరావతి నగర డిజైన్లు వాస్తుకూ, గాలి దిశకూ అనుకూలంగానే ఉన్నాయి. ఈ డిజైన్లను మార్చేందుకు వీల్లేదు.



రాష్ట్రం కోసమే తాపత్రయం

పది రోజులుగా కుడి చెయ్యి విపరీతంగా నొస్తోంది. ప్రతి సమావేశంలో నేను నోట్స్ రాసుకొంటాను. అది కూడా కుదరడం లేదు. ఇంత నొప్పితో దావోస్ పర్యటనకు వెళ్లాలా అనిపించింది. కానీ... నలుగురిని కలిస్తే రాష్ట్రానికి ఏదో ఒకటి తేగలమన్న నమ్మకంతో బయలుదేరి వెళ్లాను! అక్కడకు వెళ్లిన తర్వాత ఏదో తేడా చేసి విరేచనాలు పట్టుకున్నాయి. మూడు రోజులు ఒట్టి పెరుగు, మాత్రలతో సరిపెట్టుకొన్నాను. అయినా ఒక్క మీటింగ్ రద్దు చేసుకోలేదు. రాష్ట్రం బాగుపడాలన్నదే నా తాపత్రయం!

ఫోన్ చేస్తే చాలు

ఇంట్లో కూర్చొని ఒక ఫోన్ కాల్ చేస్తే .. కరెంటు సరఫరా, నీటి రాక, రేషను కార్డు, భూమి సమస్యలు, స్కాలర్‌షిప్‌లు వంటి పలు సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం. దీనికి .. ప్రభుత్వం అలేఖ్యా తరహాలో ఒక యాప్‌ను తీసుకువస్తుంది. ఈ యాప్‌లో తమ సమస్యలు చెబితే .. వెంటనే సంబంధిత శాఖకు సమాచారం చేరుతుంది. సమస్య పరిష్కారమయ్యే దాకా ఆ యాప్ వాకబు చేస్తూనే ఉంటుంది. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలన్నింటినీ రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీ)కి అనుసంధానం చేస్తాం. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరును ఆర్‌టీజీ పరిధిలోకి తెచ్చాం. ఈ ఏడాది మార్చి నెల నుంచి ప్రభుత్వ కార్యాలయాలన్నీ కాగిత రహిత కార్యాలయాలుగా మారుస్తాం!

అమరావతి ఎయిర్ వేస్

గన్నవరం విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఇప్పటికే ఒక టెర్మినల్‌ను నిర్మించాం. మరో టెర్మినల్, రన్‌వే నిర్మాణం కోసం భూమిని కేటాయించాం. ఈ రన్‌వే పూర్తయితే ఎలాంటి విమానమైనా వచ్చేందుకు వీలుంటుంది. విశాఖలోనూ ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. భాగస్వామ్య సంస్థలు ముందుకు వస్తే... ప్రత్యేకంగా అమరావతి ఎయిర్‌వేస్ ఏర్పాటు గురించి పరిశీలిస్తాం.

అక్రమాస్తులు స్వాధీనం...

కొందరు అక్రమాలు చేసి అన్యాయంగా సంపాదించిన సొమ్ముతో బంగారు మంచాలు చేయించుకుంటారు. అక్రమంగా సంపాదించేవారెవరైనా సంతోషంగా ఉండలేరు. బంగారు మంచాలపైనా సుఖంగా పడుకోలేరు. ప్రభుత్వ ఉద్యోగులూ కోట్లకు కోట్ల ఆస్తులు సంపాదించారు. ఈ ఆస్తులన్నీ ప్రజలవే! బిహార్, ఒడిసా తరహాలో.. అక్రమాస్తులు రాష్ట్రానికే చెందేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నాం



అందరితో ఆనందం

పూర్వం కుటుంబ సభ్యులంతా కలసి ఒకే ఇంట్లో ఉండేవారు. పండుగలు, శుభకార్యాలూ కలసి సంతోషంగా చేసుకునేవారు. ఆ సందడే వేరు. కుటుంబ సభ్యుల బంధాలూ బంధుత్వాలతో ఇల్లు కళకళలాడమే కాదు.. మానవత్వమూ ఉండేది. రోజంతా కష్టపడి రాత్రికి ఇంటికివెళ్లి కుటుంబ సభ్యులతో కలసి భోంచేస్తూ అరగంట గడిపితే ఎంత ఆనందమో! కుటుంబ వ్యవస్థలోనే ఆనందం ఉంది. ఈ ఆత్మీయానురాగాలు, మమకారం కలకాలం ఉండాలన్న అభిప్రాయంతోనే పాఠశాలల్లో అమ్మకు వందనం కార్యక్రమాన్ని చేపట్టాం. గతంలో అమ్మకు నమస్కరించే ఆచారం తెలుగిళ్లలో ఉండేది. ఈ సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించేందుకే అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించాం. గతంలో ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారు సొంత గ్రామాలకు రావాల్సిన సమయం వచ్చేసింది.

ప్రకృతికి ప్రణామం

మన సంప్రదాయాలనూ, సంస్కృతిని మరచిపోతున్నాం. ప్రకృతిని ఆరాధించి, సంరక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. హరిత వనాలను పెంచాలి. రాష్ట్రంలో ఒకప్పుడు మైనస్‌గా ఉన్న అడవుల పెంపకం, చెట్ల పెంపకం ఇప్పుడు వృద్ధిలోకి వచ్చింది. దీనిని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో సంప్రదాయ విధానాలను గౌరవించేలా చాలా కార్యక్రమాలను చేపడుతున్నాం. ఏరువాక, జల సిరికి హారతి, వనం మనం వంటి కార్యక్రమాలు చేపట్టాం. నాగదేవత మా ఇలవేల్పు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఊరికి పోయినప్పుడు పుట్టకు భువనేశ్వరి పూజలు చేస్తుంటే మేమంతా భక్తితో నమస్కారాలు చేశాం. అది చూసిన ఊరిలో ఒక పెద్దాయన... పాత రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నాడు. ప్రకృతిని ఆరాధించడం మన సంప్రదాయంలో ఒకటి. దానిని కాపాడుకోవాలి.

చర్చలు మంచివేగా...

చదువుకున్న వాళ్లు ఐదుగురు పిల్లలను కనాలని.. నిరక్షరాస్యులు పిల్లలను కనవద్దని ఓ చైనా ఆర్థిక వేత్త సూత్రీకరించారు. చదువుకున్నవాళ్లయితే సంపాదిస్తారని, పిల్లలను ఉన్నత విద్య అందించి, ప్రయోజకులను చేస్తారని... నిరక్షరాస్యులకు అది సాధ్యం కాదని ఆయన ఇలా చెప్పారు. దీనిపై చాలా అభ్యంతరాలు వచ్చాయి. ఇది చైనాలో చర్చకు దారితీసి... దేశాభివృద్ధికి దోహదపడింది.

మిత్ర ధర్మం పాటిస్తున్నాం!

- బీజేపీ నేతల విషయం ఆ పార్టీ అధిష్ఠానమే చూడాలి
- కేసుల నుంచి విముక్తి కోసమే జగన్ పొత్తు మాటలు : చంద్రబాబు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మేం మిత్ర ధర్మం పాటిస్తున్నాం. కలిసి ఉన్నప్పుడు కొన్ని విషయాలు బయట మాట్లాడలేం. బీజేపీ నాయకుల మాటలపై ఆ పార్టీ నాయకత్వం ఆలోచించుకోవాలి' అని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. శనివారం సచివాలయంలో ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీపై బీజేపీ నేతలు విష్ణు కుమార్ రాజు, సోము వీర్రాజు విమర్శల ప్రస్తావన వచ్చింది. సీఎం స్పందిస్తూ.. 'బీజేపీ నాయకులు మాట్లాడిన విషయాల గురించి వాళ్ల పార్టీ నాయకత్వం ఆలోచించుకోవాలి. నేను మాత్రం మా పార్టీ నాయకులను బయట మాట్లాడవద్దని గట్టిగా చెబుతున్నాను. తాడేపల్లిగూడెం టీడీపీ నేత ఒకరు నిన్న నాకు ఎయిర్‌పోర్టులో కనిపిస్తే బీజేపీ నేతల గురించి వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు చాలా గట్టిగా కోప్పడ్డాను.' అన్నారు. రెండు పార్టీలు కలిసి నడిచే విషయంలో మరీ కుదరకపోతే ఆ మాట చెప్పి దణ్ణం పెడతామే తప్ప బయట రచ్చ చేయడం తమ పద్ధతి కాదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీతో కలుస్తామని వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించినప్పుడు ఆయన తేలిగ్గా కొట్టివేశారు. 'ఆయన ఇలా మాట్లాడటం ఇది మొదటిసారా? చాలాసార్లు మాట్లాడారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇచ్చినప్పుడు హోదా గురించి ఎందుకు అడగలేదు? తమ ఎంపీలతో రాజీనామా చేయిస్తానన్నారు. ఎందుకు చేయించలేదు? ఆయనకు తన కేసుల నుంచి విముక్తి కావాలి. అసలు విషయం అది' అని చంద్రబాబు అన్నారు.

అవినీతి సొమ్ము సర్కారు ఖాతాలోకి!

అవినీతి ద్వారా సంపాదించిన అక్రమ ఆస్తులు రాష్ట్రంలో ప్రజలకు చెందాలన్నదే తమ కోరికని, బిహార్, ఒడిసాలో ఆ పని కొంతవరకు చేయగలిగారని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలోనూ అదే చేయాలన్నది తమ ప్రయత్నమని అన్నారు. 'అవినీతితో సంపాదించిన సొమ్ము ప్రభుత్వానికి వెళ్తుందంటే కొంత వరకైనా తగ్గుతారు. ఒక ఏడాది జైల్లో ఉండి వచ్చినా తమ ఆస్తులు తమకు ఉంటాయంటే ఎవరికీ భయం ఉండదు. ఆ ధీమా పోవాలి. ఆ ఆస్తులు ప్రభుత్వానికి రావడం కోసం ఎర్ర చందనం స్మగ్లర్ల విషయంలో ఒక చట్టం తెచ్చాం. అధికారుల అక్రమార్జనను కూడా ప్రభుత్వపరం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. భయంతో మాత్రమే అవినీతి తగ్గుతుంది' అని సీఎం వ్యాఖ్యానించారు. రైల్వే జోన్, ప్రత్యేక హోదా కోసం కొన్ని జిల్లాల్లో జరుగుతున్న ఉద్యమాలను ప్రస్తావించినప్పుడు చిత్తశుద్ధితో ఎవరు చేసినా మద్దతు ఇస్తామని, రాజకీయ ప్రయోజనాల కోసం చేసేవారి గురించి ప్రజలు ఆలోచిస్తారని సీఎం పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం విభజన సమయంలో మన పట్ల అనైతికంగా వ్యవహరించింది. తీరని అన్యాయం చేసింది. దానికి ఫలితం అనుభవించింది. మన కష్టంతో రాష్ట్రంలో అభివృద్ధి రేటు పెంచాం. అభివృద్ధి రేటు బాగుంది కాబట్టి సాయం ఇవ్వలేమని అంటే ఎలా? ఇప్పటికి దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి ఆదాయంలో మనమే వెనుకబడి ఉన్నాం. అది మన తప్పు కాదు. విభజన వల్ల జరిగిన అన్యాయం. దక్షిణాదిలో మిగిలిన రాష్ట్రాలతో సమానంగా నిలబడే వరకూ మనకు సాయం ఇస్తే తర్వాత మన కాళ్లపై మనం నిలబడి ముందుకు వెళ్తాం. ప్రధానికి ఇవన్నీ వివరించి చెప్పాను. ఆయన కూడా తాను అర్థం చేసుకొన్నానని.. అన్నీ పరిశీలిస్తామని అన్నారు. మన ప్రయత్న లోపం ఎక్కడా లేదు' అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రానికి విడిగా గవర్నర్ కావాలని బీజేపీ నేతలు చేసిన డిమాండ్‌ను ప్రస్తావించినప్పుడు కొన్ని వ్యవస్థల గురించి బయట మాట్లాడకూడదని, సంయమనం పాటించాలని బదులిచ్చారు.

వాణీ జయరాంకు ఎంఎస్ పురస్కారం

చెన్నై, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నేత్ర చికిత్స పరిశోధన సంస్థ శంకర నేత్రాలయ యేటా అందజేసే ప్రతిష్ఠాత్మక ఎంఎస్ సుబ్బులక్ష్మి పురస్కారాన్ని ఈ ఏడాది సుప్రసిద్ధ గాయని వాణీ జయరాం అందుకున్నారు. చెన్నైలో శనివారం జరిగిన శంకర నేత్రాలయ 39వ వార్షికోత్సవంలో ఎల్‌అండ్‌టీ సంస్థ చైర్మన్ నాయక్ చేతుల మీదుగా ఆమెకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. దివంగత ఎంఎస్ సుబ్బులక్ష్మితో ఆమెకున్న అనుబంధం, కర్ణాటక సంగీతంలో కచేరీలు, సినీ రంగానికి చేసిన విశిష్ట సేవల నేపథ్యంలో ఈ పురస్కారానికి వాణీ జయరాం సంపూర్ణ అర్హురాలని అవార్డు కమిటీ ప్రకటించింది. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బద్రీనాథ్ అధ్యక్షతన ఇతర రంగాలకు చెందిన పలువురు ప్రముఖుల్ని కూడా సత్కరించారు. ఆ సందర్భంగా వాణీ జయరాం మాట్లాడుతూ ఎంఎస్ సుబ్బులక్ష్మి పురస్కారం అందుకోవడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఆమెతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. దశాబ్దాలుగా తన పాటను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. మలయాళ చిత్రం 'పులి మురుగన్'లో తాను పాడిన టైటిల్ సాంగ్ ఆస్కార్ నామినేషన్ పొందడం మరింత సంతోషంగా ఉందన్నారు. అయితే తనకు పూజలు చేయడమే తప్ప, లాబీయింగ్ చేయడం తెలియదని, అందువల్లే ఆస్కార్ అవార్డు దక్కలేదని వ్యాఖ్యానించారు.


ఎంఎస్ సుబ్బులక్ష్మి పురస్కారాన్ని అందుకుంటున్న వాణీ జయరాం

సన్యాసిని.. నాకెందుకు 'పద్మశ్రీ'!

- అవార్డును తిరస్కరించిన సిద్ధేశ్వరస్వామి
- తప్పుగా భావించొద్దంటూ ప్రధానికి లేఖ



బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాన్ని కర్ణాటక రాష్ట్రం విజయపుర జిల్లా జ్ఞానయోగాశ్రమ ముఖ్యులు సిద్ధేశ్వరస్వామి తిరస్కరించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. తనను సంప్రదించకుండానే పురస్కారానికి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో విభిన్న రంగాల్లో రాణించిన అసాధారణ వ్యక్తులను పద్మశ్రీ బిరుదుతో సత్కరించాలని... తానొక సన్యాసినని, ఆధ్యాత్మిక జీవితం గడిపే తనకు ఎటువంటి పురస్కారాలు స్వీకరించాలనే కోరిక లేదని ఆ లేఖలో పేర్కొన్నారు. అవార్డును తిరస్కరించడాన్ని తప్పుగా భావించొద్దని కోరారు. కలబుర్గిలో ప్రవచనాలు చేస్తూ అక్కడే సేద తీరుతున్న సిద్ధేశ్వరస్వామి.. లేఖను ప్రధానమంత్రికి అందేలా చూడాలని రాజ్యసభ సభ్యుడు బసవరాజపాటిల్ సేడంకు సూచించారు. గతంలోనూ పలు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లను ప్రకటించగా ఆయన సున్నితంగా తిరస్కరించారు.

ఎఫ్‌డిఐ పరిమితి పెంచండి : ఐడియా

న్యూఢిల్లీ: తమ సంస్థలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డిఐ) పరిమితిని 100 శాతానికి పెంచాలని ఐడియా సెల్యులార్ కేంద్రాన్ని కోరింది. ఇందుకోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్(డిఐపిపి)కు దరఖాస్తు చేసుకున్నట్లు ఇన్వెస్టర్ల ప్రజెంటేషన్‌లో సంస్థ వెల్లడించింది. డిసెంబర్ 2017 నాటికి ఐడియాలో విదేశీ ఇన్వెస్టర్ల వాటా 27 శాతంగా నమోదైంది. ప్రస్తుతం టెలికాం కంపెనీల్లోకి 100 శాతం ఎఫ్‌డిఐలకు అనుమతి ఉంది. అందులో 49 శాతం వరకు నేరుగా ఇన్వెస్ట్ చేయవచ్చు. అంతకు మించిన పెట్టుబడులకు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అవసరం. ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ఐడియా సెల్యులార్.. బ్రిటన్ టెలికాం దిగ్గజం వొడాఫోన్‌లో విలీనం కానుంది. టెలికం రంగ నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఐడియా, వొడాఫోన్‌లు సంయుక్తంగా 40 కోట్ల మంది మొబైల్ కస్టమర్లను కలిగి ఉన్నాయి.

మరిన్ని సరుకులు, సర్వీసులపై
తగ్గనున్న జిఎస్‌టి

- ఆటుపోట్ల నుంచి వ్యవస్థ గాడిన పడింది
- సులభతర వ్యాపార ర్యాంకింగూ పెరగాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ : మరిన్ని వస్తువులపై జిఎస్‌టి రేట్లు మారే అవకాశం కనిపిస్తోంది. 'అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం' సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సూచనప్రాయంగా ఈ విషయం వెల్లడించారు. మిగతా దేశాలతో పోలిస్తే మన దేశంలో స్వల్పకాలంలోనే జిఎస్‌టి వ్యవస్థ గాడిన పడిందన్నారు. దీంతో పన్నుల వసూళ్లను మరింత విస్తృతం చేయడంతోపాటు భవిష్యత్‌లో పన్ను రేట్లను మరింత హేతుబద్ధం చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. జిఎస్‌టి దేశ పరోక్ష పన్నుల వ్యవస్థని సమూలంగా మార్చేసిందని జైట్లీ చెప్పారు. గత ఏడాది నవంబరులో జరిగిన సమావేశంలో జిఎస్‌టి మండలి 178 వస్తువులపై జిఎస్‌టిని అత్యధిక రేటైన 28 శాతం నుంచి 18 శాతానికి కుదించింది. మరో 13 వస్తువులను 18 శాతం నుంచి 12 శాతానికి, ఎనిమిది వస్తువులను 12 శాతం నుంచి ఐదు శాతానికి, ఆరు వస్తువులను 18 శాతం నుంచి ఐదు శాతానికి కుదించింది.

ఇవిగాక ఐదు శాతం రేటులో ఉన్న ఆరు వస్తువులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తివేసింది. అయినా పేద, మధ్య తరగతి విస్తృతంగా వినియోగించే మరిన్ని వస్తువులపై జిఎస్‌టి భారం తగ్గించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో జైట్లీ నేరుగా పన్ను రేట్లు తగ్గిస్తామని చెప్పకుండా, హేతుబద్ధం చేస్తామని చెప్పడం విశేషం. గత ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో నీరసించిన జిఎస్‌టి వసూళ్లు డిసెంబరులో కొద్దిగా పుంజుకున్నాయి. దీంతో జిఎస్‌టి వసూళ్లపై ఆర్థిక మంత్రిలో నమ్మకం పెరిగిందని భావిస్తున్నారు. దీనికి తోడు మరో ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ఈలోపే ఆమ్ ఆద్మీకి మరింత చేరువయ్యేందుకు మోదీ సర్కార్ జిఎస్‌టి మండలి ద్వారా జిఎస్‌టి రేట్లు మరింత కుదించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ర్యాంకింగ్ పెరిగే అవకాశం

ప్రపంచ బ్యాంకు ఏటా ప్రకటించే సులభతర వ్యాపార విధానాల(ఇఒబి) ర్యాంకింగ్‌లో మన దేశ ర్యాంకింగ్ మరింత పెంచేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలు కలిసికట్టుగా కృషి చేయాలని జైట్లీ కోరారు. 'గత ఏడాది ఈ ర్యాంకింగ్‌లో మన దేశం ఒక్కసారిగా 130వ స్థానం నుంచి 100వ స్థానానికి ఎదిగింది. కలిసికట్టుగా ప్రయత్నిస్తే టాప్-50 ర్యాంకింగ్‌లో మన దేశానికి చోటు దక్కుతుంది' అన్నారు. ఈ విషయంలో పన్ను వసూళ్ల అధికారులు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. సులభతర వ్యాపార విధానాల్లో తప్ప, అంతర్జాతీయ వాణిజ్యంలో మనకు ఎలాంటి ప్రత్యేక సౌలభ్యాలు లేవనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇఒబి విషయంలో భారత్ మూడేళ్లలోనే 142వ స్థానం నుంచి 100వ స్థానానికి చేరిందన్నారు. 'మనం మొదటి 50 ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించాలని ప్రధాని ఇప్పటికే లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే 142వ స్థానం నుంచి 100వ స్థానానికి వచ్చాం. యాభైలోపు ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించడం కొద్దిగా సవాలే' అని జైట్లీ చెప్పారు.



ఆసియాలో అతి పెద్ద
డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్

- కర్ణాటకలో నిర్మించిన మేఘా ఇంజనీరింగ్
- ప్రాజెక్ట్ వ్యయం రూ.381 కోట్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్).. ఆసియాలోనే అతిపెద్ద బిందు సేద్య (డ్రిప్ ఇరిగేషన్) ప్రాజెక్టును కర్ణాటకలో ఏర్పాటు చేసింది. కర్ణాటక భాగల్‌కోట్ జిల్లా రామ్‌తాల్ మరోళా వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టును ఆదివారం నాడు ఆ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి ఎంబి పాటిల్ ప్రారంభించనున్నారు. రూ.381.05 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా 12,300 ఎకరాలకు నీటి సదుపాయం లభించనుంది. ఈ ప్రాజెక్ట్‌కు ఇజ్రాయెల్ సంస్థ నెటాఫిమ్ సాంకేతిక సహాయాన్ని అందించింది. డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 2,150 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంఇఐఎల్ వెల్లడించింది. ఈ ప్రాజెక్ట్ నిర్వహణ భాధ్యతలను ఐదేళ్ల పాటు చేపట్టనున్నట్లు తెలిపింది. ఐదేళ్ల అనంతరం ఈ ప్రాజెక్టును రైతులకు అప్పగించనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 6000 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని పేర్కొంది.

భారత్‌కు పొంచి ఉన్న చమురు ముప్పు
బిట్ కాయిన్ గాలి బుడగే: రాజన్



దావోస్: పెరుగుతున్న ముడి చమురు ధరలపై ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం భారత ఆర్థిక వృద్ధికి ఇది చిల్లు పెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సదస్సుకు హాజరైన రాజన్ ఈ విషయం చెప్పారు. గత రెండేళ్లలో చమురు ధర తగ్గడం భారత ఆర్థిక వ్యవస్థకు కలిసొచ్చిందన్నారు. 2014లో ఒక దశలో పీపా 30 డాలర్లకు పడిపోయిన ముడి చమురు ధర ప్రస్తుతం 65 నుంచి 70 డాలర్ల మధ్య పలుకుతోంది. దీంతో ముడి చమురు దిగుమతులు కోసం మరిన్ని నిధులు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. అయితే జిడిపి వృద్ధి రేటుపై దీని ప్రభావం ఎంత శాతం ఉంటుందనే విషయం వేచి చూడాలన్నారు. ఈ సంవత్సరం భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొనే పెద్ద సవాల్ కూడా చమురు ధరల పెరుగుదలేనని రాజన్ స్పష్టం చేశారు. ప్రధాన నగరాల్లో లీటర్ పెట్రోల్ ధర ఇప్పటికే రూ.77కు చేరిన నేపథ్యంలో రాజన్ ఈ హెచ్చరిక చేయడం విశేషం.

బిట్‌కాయిన్స్‌తో ప్రమాదమే: బిట్‌కాయిన్స్ వంటి క్రిప్టోకరెన్సీతో ప్రమాదమేనని రాజన్ అన్నారు. ఇటీవల కొంత మంది వేలం వెర్రిగా వీటిల్లో పెట్టుబడి పెట్టడాన్ని తప్పుబట్టారు. ఎలాంటి చట్టబద్ధత లేని వీటిల్లో పెట్టుబడి పెట్టడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. బిట్స్‌కాయిన్స్ బలుపును ఎప్పుడైనా పేలిపోయే గాలి బుడగతో పోల్చారు. భారత్‌లో వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నాయనే విమర్శలను రాజన్ తోసిపుచ్చారు. ద్రవ్యోల్బణాన్ని తీసివేస్తే వాస్తవ వడ్డీ రేట్లు తక్కువగానే ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుత విధానపరమైన ఆరు శాతం వడ్డీ రేటు నుంచి ద్రవ్యోల్బణం ఐదు శాతాన్ని తీసివేస్తే వాస్తవ వడ్డీ రేటు ఒక శాతం మాత్రమేనని చెప్పారు.

ఆహా... హైదరాబాద్ బిర్యానీ

- 6 హైదరాబాదీ హోటళ్లకు అంతర్జాతీయ గుర్తింపు
- వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ అనగానే ఘుమఘుమలాడే బిర్యానీ గుర్తుకొస్తుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారేకాకుండా విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వారు కూడా ఈ బిర్యానీ రుచి ఆస్వాదించకుండా ఉండలేరు. ఇప్పుడీ బిర్యానీకి అంతర్జాతీయంగా మరింత గుర్తింపు లభించింది. న్యూయార్క్ కేంద్రంగా వెలువడుతున్న వాల్‌స్ట్రీట్ జర్నల్ హైదరాబాద్ బిర్యానీపై ఒక కథనం వెలువరించింది. దేశంలో బిర్యానీ తయారీకి అత్యుత్తమంగా ఉన్న హోటళ్లలో హైదరాబాద్‌కు చెందిన ఆరు హోటళ్లు ఉన్నట్టు అందులో పేర్కొంది. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్, ప్యారడైజ్, ది స్పైసీ వెన్యూ, షాబాద్, కేఫ్ బహార్, షా గౌస్ హోటళ్లు బిర్యానీ రుచులకు అడ్డాగా మారినట్టు తెలిపింది. ఈ హోటళ్ల మూలంగా హైదరాబాద్ బిర్యానీకి అంతర్జాతీయంగా మరింత గుర్తింపు లభించిందని తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్ (టిఎస్‌హెచ్‌ఎ) ప్రెసిడెంట్ ఎస్ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ హోటళ్ల ప్రతినిధులను సత్కరించే నిమిత్తం శనివారంనాడిక్కడ ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం హోటల్ పరిశ్రమకు ఎంతగానో సహకరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు చొరవతో జిఎస్‌టి భారం తగ్గిందని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో రానున్న కాలంలో హోటల్ పరిశ్రమ మరింత ముందుకు వెళ్లనుందన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని బిర్యానీ రుచి ఎక్కడా ఉండదని, ఇలాంటి బిర్యానీని తయారు చేసే హోటళ్ల సంఖ్య మరింతగా పెరగాలన్నారు. సమావేశంలో టిఎస్‌హెచ్ఎ సెక్రటరీ బి జగదీష్ రావు, గ్రేటర్ హైదరాబాద్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె అశోక్ రెడ్డి, వివిధ హోటళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి. వేదికపై మంత్రి చందూలాల్

ప్యారడైజ్ భారీ విస్తరణ

- 2019నాటికి 50కి చేరనున్న రెస్టారెంట్ల సంఖ్య

బిర్యానీకి ప్రపంచవ్యాప్తంగా పేరున్న 'ప్యారడైజ్ భారీ స్థాయిలో విస్తరించే సన్నాహాల్లో ఉంది. ప్రస్తుతం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్‌లో 27 రెస్టారెంట్లను ప్యారడైజ్ నడుపుతోంది. వీటిలో 14 రెస్టారెంట్లు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. విస్తరణలో భాగంగా ఈ ఆరు నగరాల్లోనే రెస్టారెంట్ల సంఖ్యను 50కి పెంచుకునే సన్నాహాల్లో ఉన్నట్టు ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ గౌతమ్ గుప్తా 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో అన్నారు. 2019 మార్చినాటికి ఈ మైలురాయిని చేరుకుంటామని చెప్పారు. రెస్టారెంట్ విస్తీర్ణాన్ని బట్టి 50 లక్షల రూపాయల నుంచి 3 కోట్ల రూపాయల వరకు పెట్టుబడి అవసరం ఉంటుందని తెలిపారు. గత ఏడాదిలో ప్యారడైజ్ 225 కోట్ల రూపాయల టర్నోవర్‌ను నమోదు చేసిందన్నారు. విస్తరణ పూర్తయితే ఈ టర్నోవర్ రెండింతలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు.



అవార్డు స్వీకరిస్తున్న దేవీ ఫిషరీస్ ఎండి యార్లగడ్డ సూర్యారావు

దేవీ ఫిషరీస్‌కు రెండు జాతీయ అవార్డులు

కాకినాడ : గత ఆర్థిక సంవత్సరం (2016-17) మత్స్య ఎగుమతుల రంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన స్థానిక దేవీ ఫిషరీస్ లిమిటెడ్‌కు మత్స్య ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎంపెడా) నుంచి రెండు అవార్డులు లభించాయి. గోవాలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ సీఫుడ్స్ ఫెయిర్‌లో శనివారం జరిగిన వేడుకలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ సూర్యారావు కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు నుంచి ఈ అవార్డులు అందుకున్నారు. విలువ, పరిమాణ పరంగా రొయ్యల ఎగుమతుల్లో కంపెనీ సాధించిన పురోగతికి గుర్తింపుగా కంపెనీకి ఈ అవార్డులు లభించాయి. దేవీ ఫిషరీస్ గడిచిన ఏడాది రూ.1,100 కోట్ల టర్నోవర్ సాధించింది. కాకినాడలో రెండు, విశాఖలో ఒక యూనిట్‌తో ప్రత్యక్షంగా 7,000 మంది, పరోక్షంగా మరో 3,000 మంది ఈ కంపెనీపై ఆధారపడి ఉన్నారు. కొత్తగా జగ్గంపేటలో అతిపెద్ద ఆక్వా పరిశ్రమను నెలకొల్పారు. సీడ్, ఫీడ్ రంగాలకు కూడా దేవీ ఫిషరీస్ తన కార్యకలాపాలను విస్తరించింది. 2015లో కంపెనీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఓవరాల్ బెస్ట్ ఎక్స్‌పోర్ట్స్ అవార్డు అందుకుంది. 2012-13లోనూ శీతలీకరించిన రొయ్యల ఎగుమతిలోనూ జాతీయ స్థాయిలో అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందుకుంది.

దిగుమతులపై గట్టి నిఘా

- కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్ జైన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉగ్రవాదులు, నేరగాళ్లు దేశంలోకి నిషేధిత వస్తువుల్ని రవాణా చేస్తున్నారని కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్ జైన్ తెలిపారు. శనివారం ఎఫ్‌టాప్సీలో 'సెక్యూరిటీస్ ఆఫ్ ది బిజినెస్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే స్మగుల్డ్ గూడ్స్‌ను దేశంలోకి రాకుండా తాము విజయవంతంగా పట్టుకుంటున్నామన్నారు. అలాగే వివిధ దేశాల నుంచి దిగుమతి అవుతున్న అన్ని వస్తువులపై నిఘాను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. హైదరాబాద్ కస్టమ్స్ రానున్న రోజుల్లో మరింత సమర్ధవంతంగా పనిచేస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు 116 కేసుల్లో 6.25 కోట్ల విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకుని పదమూడు మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. బంగారం అక్రమ రవాణాను అరికట్టేందుకు త్వరలో ఎయిర్ కార్గోలో 24 క్యారెట్ మిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జైన్ తెలిపారు. వచ్చే మూడు నెలల్లో సేవోత్తమ్ అనే పథకాన్ని ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు.

కాగా దిగుమతులు, ఎగుమతులకు హైదరాబాద్ అనుకూలమైన ప్రాంతమని, కార్గో విమానాల ద్వారా సరుకు రవాణాతో కస్టమ్స్ డ్యూటీ అధిక మొత్తంలో వస్తోందని కస్టమ్స్ చీఫ్ కమిషనర్ బెంకీ బెహారీ అగర్వాల్ తెలిపారు. హైదరాబాద్ కస్టమ్స్ తన టార్గెట్లను పూర్తి చేస్తోందని, ఐజిఎస్‌టి కోసం ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తామని అగర్వాల్ వివరించారు.

నగదు బదిలీతో
రూ.65,000 కోట్లు ఆదా

- 4.1 కోట్ల మందికి ప్రయోజనం
- నీతి ఆయోగ్ సిఇఒ అమితాబ్ కాంత్



న్యూఢిల్లీ: నగదు బదిలీ పథకం (డిబిటి) ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నిధులు ఆదా చేస్తోంది. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా ప్రభుత్వానికి రూ.65,000 కోట్లు ఆదా అయ్యాయి. శనివారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో నీతి ఆయోగ్ సిఇఒ అమితాబ్ కాంత్ ఈ విషయం చెప్పారు. 'అన్ని ప్రభుత్వ పథకాలను డిబిటితో అనుసంధానం చేయాలి. లేకపోతే అవినీతిని నిర్మూలించలేం' అన్నారు. ప్రస్తుతం డిబిటి ద్వారా 4.1 కోట్ల మందికి లబ్ధి చేకూరేలా దాదాపు 300 పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

1200 చట్టాల రద్దు

సులభతర వ్యాపారానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అమితాబ్‌కాంత్ చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే కాలం చెల్లిన దాదాపు 12,00 చట్టాలను రద్దద చేసినట్టు తెలిపారు. వ్యాపార విధానాలను మరింత సులభతరం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వ దరఖాస్తు ఫారాలను ఒక పేజీకి కుదిస్తున్నట్టు వెల్లడించారు. నిబంధనలు రెండు పేజీలు, ఏ చట్టం మూడు పేజీలకు మించకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,590	31,100	31,520	31,050	30,680
క్రితం ముగింపు	31,670	31,400	31,520	---	30,680
22 క్యారెట్లు	29,250	28,850	28,990	28,820	29,220
క్రితం ముగింపు	29,320	29,150	28,990	---	29,220
వెండి (కిలో)	41,000	41,200	41,000	40,700	43,100
క్రితం ముగింపు	41,100	41,500	41,000	---	43,100

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	77.00	విజయవాడ	84.00
కరీంనగర్	79.00	గుంటూరు	84.00
వరంగల్	77.00	ఒంగోలు	86.00
మహబూబ్‌నగర్	77.00	చిత్తూరు	68.00
కర్నూలు	77.00	నెల్లూరు	78.00
విశాఖపట్నం	78.00	అనంతపురం	70.00
గోదావరి	83.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.40 నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	380.00	చిత్తూరు	383.00
వరంగల్	382.00	చెన్నై	390.00
విజయవాడ	380.00	నమక్కల్	375.00
గోదావరి	380.00	బెంగళూరు	390.00
విశాఖపట్నం	402.00	ముంబై	425.00

ఆటో ఎక్స్‌పోలో ఎలక్ట్రిక్ వాహనాలదే హవా

వచ్చే నెలలో జరిగే ఆటో ఎక్స్‌పో 2018 కోసం వాహన సంస్థలు తమ లేటెస్ట్ మోడళ్లను సిద్ధం చేస్తున్నాయి. ఈసారి షోలో పర్యావరణహిత, భవిష్యత్ తరం వాహనాలే ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

భారత్‌లో అతిపెద్ద వాహన ఎగ్జిబిషన్ మరో పది రోజుల్లో ప్రారంభం కానుంది. గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్ వేదికగా వచ్చేనెల 9 నుంచి 14 వరకు ఆటో ఎక్స్‌పో 2018ను నిర్వహించనున్నారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటో మొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) ఆధ్వర్యంలో జరగనున్న 14వ ఎడిషన్ ఎక్స్‌పోలో 20కి పైగా కార్, బైక్ తయారీ సంస్థలు తమ మోడళ్లను ప్రదర్శించనున్నాయి. ఈ ఎగ్జిబిషన్ వేదికగా రెండు డజన్లకు పైగా కొత్త వాహనాలు మార్కెట్లోకి విడుదల కానున్నాయి. దాదాపు వంద కొత్త మోడళ్లను ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది ఆటో షోలో వాహన సంస్థలు ఎలక్ట్రిక్, హైబ్రిడ్, ఫ్యూచర్ వెహికిల్స్‌తో సందర్శకులను ఆకట్టుకోనున్నట్లు సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణు మాథుర్ తెలిపారు. కాలుష్య నియంత్రణలో భాగంగా దేశంలో 2030కల్లా అన్ని ఎలక్ట్రిక్ కార్లే తిరగాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఆటో సంస్థలు కూడా పర్యావరణహిత మోడళ్లపై ప్రధానంగా దృష్టి సారించాయి.

18 మోడళ్లను ప్రదర్శించనున్న మారుతి

దేశంలో అతిపెద్ద కార్ల విక్రయదారైన మారుతి సుజుకీ.. ఈసారి ఆటో ఎక్స్‌పోలో ఏకంగా 18 కొత్త మోడళ్లను ప్రదర్శించనుంది. మారుతి ప్రస్థానంలో తొలి కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ వెహికిల్ 'కాన్సెప్ట్ ఇ-సర్వైవర్'ను ఈ షోలో ఆవిష్కరించబోతోంది. ఈ కారు 2020కల్లా అందుబాటులోకి రావచ్చు. మారుతి సుజుకీ మాతృ సంస్థ సుజుకీ మోటార్స్.. టయోటాతో కలిసి ఈ కారును డెవలప్ చేసింది. అలాగే, రెనో క్విడ్‌కు పోటీగా 'కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్'ను లాంచ్ చేసేందుకు సంస్థ సిద్ధమౌతున్నట్లు సమాచారం. ఈ వేదికపైనే సరికొత్త స్విఫ్ట్‌ను విడుదల చేయనున్న మారుతి..



టూ వీలర్లదీ గ్రీన్ రూటే..

ఈ సారి ఆటో ఎక్స్‌పోలో పాల్గొనబోతున్న ద్విచక్ర వాహన సంస్థల్లో హీరో మోటోకార్ప్, హోండా, టీవీఎస్, యమహా, సుజుకీ మోటార్ సైకిల్స్ ఉన్నాయి. ఈ కంపెనీలు సైతం షోలో సరికొత్త ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వెహికిల్స్‌ను ప్రదర్శించేందుకు రెడీ అవుతున్నాయి. సుజుకీ మోటార్ సైకిల్ ఏకంగా 17 మోడళ్లను ఆవిష్కరించనుంది.

సరికొత్త వ్యాగన్ ఆర్, సియాజ్, ఎర్టిగా మోడళ్లను కూడా ప్రదర్శనకు ఉంచనుంది. భవిష్యత్ తరం హైబ్రిడ్ వెహికిల్‌ను సైతం ఆవిష్కరించనుంది.

మిగతా సంస్థలవీ ఎలక్ట్రిక్ మోడళ్లే..

ఈ ఏడాది షోలో రెనో ఇండియా కూడా పూర్తి ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రదర్శించనుంది. 2022కల్లా ఈ కారును దేశీయ మార్కెట్లో ప్రవేశపెట్టాలని సంస్థ భావిస్తోంది. దేశంలో రెండో అతిపెద్ద కార్ల విక్రయదారైన హ్యుందాయ్ మోటార్ ఇండియా కూడా ఈసారి షోలో పలు ఎలక్ట్రిక్ వాహనాలను ఆవిష్కరించనుంది. అంతర్జాతీయ లగ్జరీ కార్ల సంస్థ కియా మోటార్స్ ఈసారి భారత మార్కెట్‌కు తన హైబ్రిడ్, ఎలక్ట్రిక్ మోడళ్లన్నింటినీ పరిచయం చేయాలని అనుకుంటోంది. దేశీయ ఆటో సంస్థ టాటా మోటార్స్ కూడా ప్రస్తుత మోడళ్లలో ఎలక్ట్రిక్ వెర్షన్లను ఈ వేదికపై ఆవిష్కరించనుంది.

ఎక్స్‌పోకు దూరంగా పలు కంపెనీలు

చాలా ఆటో కంపెనీలు ఈ ఏడాది ఆటో ఎక్స్‌పోకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి. అందులో ఆడీ, డాట్సన్, ఫియట్, ఫోర్డ్, జీప్, జాగ్వార్ ల్యాండ్‌రోవర్, నిస్సాన్, ఫోక్స్‌వ్యాగన్ ప్రముఖ కార్ బ్రాండ్‌లు కూడా ఉన్నాయి. టూవీలర్ల విషయానికొస్తే.. దేశీయ కంపెనీలైన రాయల్ ఎన్‌ఫీల్డ్, బజాజ్ ఆటోతోపాటు ఇంటర్నేషనల్ బ్రాండ్‌లైన ట్రయంఫ్, హార్లీడేవిడ్‌సన్‌లు కూడా ఈసారి ఎక్స్‌పోలో పాల్గొనడం లేదని తెలిపాయి. ఈ ఎగ్జిబిషన్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేయాలంటే కోట్లలో అద్దె కట్టాల్సి రావడం ఇందుకు కారణమని తెలుస్తోంది. భారీ స్టాల్ కావలంటే 30 కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుందని సమాచారం.

ప్రధాన ఆకర్షణగా నిలువనున్న టాప్ 10 కార్లు ఇవే..

- కియా సొరెంటో ఎస్‌యువి
- మారుతి సుజుకీ స్విఫ్ట్
- మారుతి సుజుకీ కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్
- హ్యుండయ్ సాంట్రో
- హ్యుండయ్ ఐ20 ఫేస్‌లిఫ్ట్
- టాటా హెచ్5 ఎస్‌యువి
- టాటా ఎక్స్ 451 ప్రీమియం హ్యాచ్‌బ్యాక్
- టయోటా వియోస్ సెడాన్
- మెర్సిడెజ్ బెంజ్ ఇక్యు కాన్సెప్ట్
- రెనో జో ఇవి

టాప్ 5 ఎలక్ట్రిక్, హైబ్రిడ్ స్కూటర్లివే..

- హీరో డ్యుయెట్ ఇ
- హీరో లీప్
- హోండా పిసిఎక్స్ 150
- టివిఎస్ జుపిటర్ ఎలక్ట్రిక్
- ఎథెర్ ఎస్ 340

ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలపై సూచనలు

ఈ ఎక్స్‌పో సందర్భంగా హైబ్రిడ్, ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలపై ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ వేర్వేరుగా నివేదికలు విడుదల చేయనున్నట్లు సియామ్ ప్రతినిధి సుగాతో సేన్ తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రానికి డిసెంబర్ 2017లోనే శ్వేతపత్రం సమర్పించినట్లు ఆయన చెప్పారు.



శ్రీ పర్వతనేని మ్యారేజ్‌బ్యూరో

కమ్మవారికి మాత్రమే (హైదరాబాద్ -విజయవాడ)

రాజశేఖర్: 8143436464, Hyd: 8143438383, VJA:8143436363, 8143536363, email : spmbhyd@gmail.com, Whats App No.: 8143438383

వరుడు కావలెను

★ కమ్మ (Doctor): 26/5'7" V.Fair, MBBS, Citizen of USA-Doctor, 10Cr. ★ 25/ 5'3" V.Fair, Step-2 Clear - Doctor 5 Cr. ★ 26/ 5'4", Step-1 Clear, MBBS, 10 Cr. Ph: 8143436363

★ కమ్మ (Doctor): 26/5'6" Beautiful, MD (Radiology) 100 Cr. ★ 25/ 5'8" V.Fair, MD (Paediatrics) 50 Cr. ★ 26/5'7", Beautiful, MBBS, 40 Cr. Ph: 8143438383

★ కమ్మ (Business): 26/ 5'5" V.Fair, BE (Bits), Business, 70 Cr. ★ 22/ 5'7" V.Fair, BE, Business, Hyd, 50 Cr. ★ 25/ 5'3", BBA, BUSINESS, Hyd, 30Cr. Ph: 8143484484

★ కమ్మ (USA): 26/ 5'7" BE (IIT), M.Tech (IIT), $90K, 8 Cr. ★ 27/5'6" V.Fair, MS, $ 90K, 7Cr. ★ 28/ 5'3", MS, $90K, Intel, 25Cr. Ph: 8143484484

★ కమ్మ (USA): 27/ 5'7" V.Fair, MBA (USA) Microsoft, 15 Cr. ★ 26/ 5'4" Beautiful, M.S. $ 70K, 7Cr. ★ 26/ 5'3", MS, $95K NCR, 8Cr. Ph: 8143436363

★ కమ్మ (USA): 27/ 5'7" Beautiful, MS, $95K, 5Cr ★ 25/ 5'5" V. Fair, MS, $ 60K 12Cr. ★ 25/ 5'3", MS, $70K, 3Cr. Ph: 8143438383

★ కమ్మ (USA): 24/ 5'4" BE, (IIIT), 18LPA, B'lore, 4Cr ★ 25/ 5'6" V. Fair, BE, MBA, 10LPA, Hyd, 10Cr. ★ 27/ 5'5", BE, MBA, 9LPA, Hyd, 3Cr. Ph: 8143438383

★ కమ్మ (INDIA): 22/ 5'3" BE (IIT) 8LPA, Hyd, 10Cr. ★ 24/ 5'4" BE, MBA, 3LPA, 10Cr. ★ 27/ 5'6", V.Fair, BE, MBA, 7LPA 25Cr. Ph: 8143438383

★ కమ్మ (INDIA): 25/ 5'8" BE(IIIT) MBA (IIT) 13LPA, 15Cr. ★ 26/ 5'7" V.Fair, BE (IIT), Amazon 16LPA, 5Cr. ★ 26/ 5'6", V.Fair, BE, MS, 50K, 10Cr. Ph: 8143536363

★ కమ్మ (INDIA): 23/ 5'3" V.Fair, MS (IIIT), 5LPA, 25Cr ★ 26/ 5'5" BE (Bits), 11LPA, B'lore, 5Cr. ★ 27/ 5'4", BE, MBA, Hyd, 15Cr. Ph: 8143436363

★ కమ్మ (Divorce): 28/ 5'5"/V.Fair/ Doctor, MS(MCH) 15Cr. ★ 30/5'3" V.Fair/MS Microsoft, Hyd, 5L PA, 10 Cr. ★ 24/5'4"/V.Fair/MS Business 50 Cr, Hyd, Ph: 8143438383.

వధువు కావలెను

★ కమ్మ(Doctor): ★ 26y 6'2" V.Fair MS(GS) 40 Cr. ★ 27 5'10" V.Fair MS(GM) 25 Cr. / ★ 29 5'11" MD(GM) 5 Cr. Ph:8143438383

★ కమ్మ (Business): 26/ 5'8", BE, Business, 50 Cr. Hyd ★ 28/ 5'7", MBA, Business, 25 Cr. Hyd ★ 29/ 6', MS, Business, 50Cr. Hyd, Ph : 8143438383

★ కమ్మ (USA) : 27/ 5'11", BE (IIT), M.Tech (IIT), $120K, 15 Cr. ★ 30/6'1", BE (IIT), MBA (CFA), $160K, 20 Cr. ★ 28/ 5'11", BE (IIT), MS, $100K, 5 Cr. Ph : 8143436363

★ కమ్మ (USA): 26/6'2", BE (Bits) MS, $100K, 40 Cr. ★ 26/6'0", MS, $100K, Intel, 30 Cr ★ 29/6'1", BE (IIT) MBA, (US) $80K 25 Cr. Ph: 8143438383

★ కమ్మ (USA) : 27/ 5'10", MS, $100K 50 Cr. ★26/5'11", BE (Bits), MS, $105K, 50Cr. ★ 29/5'11", MS, Paypal, $200K 25Cr. Ph : 8143484484

★ కమ్మ (USA): 27/ 6', MBA (USA), $100K, 30 Cr. ★ 28/ 5'10", BE, $160K, Green Card, 4 Cr. ★ 27/ 6'1" MS, $90K, CISCO, 10 Cr. Ph : 8143536363

★ కమ్మ(USA): ★ 25y 6'0" MBA (USA) $ 150K 30 Cr. ★ 26 5'10" MS $ 80k 25 Cr. ★ 27 5'11" MS $ 90k 15 Cr. ★ Ph:8143438383

★ కమ్మ(USA): ★ 25y 6'0" MS BS (Perdue) $ 80K Catter Pillar / US CITIZEN 5 Cr. ★ 26 5'7" MS $ 90K 10 Cr. ★ 27 5'8" MS(CS) $ 120K 30 Cr. ★ Ph: 8143436464

★ కమ్మ (INDIA): ★ 27y 5'10" BE(IIT), MBA (IIM) 1.5 Cr. PA 15 Cr. ★ 26 6'2" MS(USA) 23L PA Hyd. 5 Cr. ★ 27 6'0" BE, MS (USA) 10L PA 15 Cr. Ph:8143438383

★ కమ్మ (INDIA): ★ 28y 5'7" BE M.Tech (IIT) IRS 5cr. ★ 29 6'0" M.Com/CA 2LPM / C.Govt. 5 Cr. ★ 27 5'9" BE, MS A.E.E. 9LPA /4 Cr. Ph:8143438383

★ కమ్మ (INDIA): ★ 27y 5'8" BE(Bits) MBA (MD) 13 LPA 10 Cr ★ 26y 6'2" BE, MBA 70K 5Cr ★ 24 5'11" BE, 7.5 LPA HYD 5 Cr. Ph:8143438484

స్నేహ మ్యారేజ్ బ్యూరో

(కమ్మవారికి మాత్రమే)



గత 20 సంవత్సరముల నుండి దేశ విదేశాలలో ఉన్న వేలాది కమ్మ జంటలను కలిపిన అత్యుత్తమ కమ్మ వివాహ వేదిక www.snehamarriage.com.
H.O: D.No.11-160, గద్దం రత్తయ్యబిల్డి, Near Time ఫర్నిచర్, ఆటోనగర్, VJA-7: 92461 82689, 92465 12689.
B.O: పద్మావతి ప్లాజా, 3rd floor, Shop No. 424, Kphb Main Road, కూకట్‌పల్లి, Hyd: 040-48540511, 9951032647, Rjy : 99121 04761, Vsp : 92985 55658, Khm : 98480 79629, 83745 39819 (whatsapp)

వరుడు కావలెను

కమ్మ 26, 5.8, MD(GM), 25Cr ★ 26, 5.5, MS(OBG), [illegible], 20Cr ★ 27, 5.7, MD ([illegible]), 10Cr ★ 27, 5.4, MD(Gyn), 15Cr ★ 30, 5.9, MD(GM), 30Cr ★ 92985 55658

కమ్మ 26, 5.8, MD ([illegible]), 4Cr ★ 26, 5.10, MD ([illegible]) 2Cr ★ 27, 5.4, MD ([illegible]), 10Cr ★ 28, 5.2, MS(GS), 5Cr ★ 29, 5.4, PG ([illegible]), 15Cr ★ 99121 04761

కమ్మ 25, 5.8, MS, $90K, 50Cr ★ 27, 5.7, MS, $85K, 25Cr ★ 28, 5.8, MS, $120K, 70Cr ★ 29, 5.6, MS, $60K, 10Cr ★ 31, 5.6, MS, $110K, 6Cr ★ 98480 79629

కమ్మ 23, 5.2, MS, $65K, 4Cr ★ 25, 5.6, MS, $107K, 6Cr ★ 27, 5.7, MS, $95K, 5Cr ★ 27, 5.8, MS, $90K, 8Cr ★ 28, 5.7, MS, $120K, 8Cr ★ 92901 97179

కమ్మ 24, 5.5, CA(CS), 10Cr ★ 24, 5.6, CA, 5Cr ★ 25, 5.6, CA, 2Cr ★ 26, 5.3, IIT ([illegible]), 8L/A, 10Cr ★ 27, 5.4, IIT, 15L/A, 6Cr ★ 33, 5.6, CA(CS), 10L/A, 2Cr ★ 92985 55658

కమ్మ 25, 5.6, BE(MBA), 6L/A, 10Cr ★ 26, 5.5, BE(MBA), 21L/A, 8Cr ★ 27, 5.5, BE(MBA), 24L/A, 2Cr ★ 31, 5.8, BE(MBA), 27L/A, 50Cr ★ 32, 5.8, BE(MBA), 36L/A, 80Cr ★ 99121 04761

కమ్మ 25, 5.6, MBA, 7L/A, 5Cr ★ 26, 5.3, MBA, 9L/A, 4Cr ★ 27, 5.3, MBA, 8L/A, 1Cr ★ 27, 5.2, MBA, 5L/A, 6Cr ★ 28, 5.4, MBA, 15L/A, 1Cr ★ 98480 79629

కమ్మ 25, 5.7, M.Arch, 10Cr ★ 26, 5.1, M.Arch, 10Cr ★ 30, 5.4, B.Arch, 15Cr ★ 29, 5.4, BE ([illegible]), 20L/A, 50Cr ★ 33, 5.7, B.Arch, 15L/A, 20Cr ★ 92901 97179

కమ్మ 22, 5.7, BDS, 20Cr ★ 23, 5.5, BDS, 10Cr ★ 27, 5.3, MDS, 40Cr ★ 27, 5.5, M.Pharm, 20Cr ★ 28, 5.5, M.Sc ([illegible]), 15Cr ★ 92985 55658

కమ్మ 22, 5.5, BE, 8L/A, 10Cr ★ 24, 5.2, BE, 5L/A, 3Cr ★ 26, 5.4, BE, 7L/A, 5Cr ★ 27, 5.7, BE, 8L/A, 7Cr ★ 30, 5.4, BE, 10L/A, 2Cr ★ 92901 97179

కమ్మ(డైవర్స్):27, 5.3, BE, 9L/A, 1Cr ★ 28, 5.7, MBA, 9L/A, 25Cr ★ 28, 5.5, MS, $90K, 10Cr ★ 29, 5.4, MS, $115K, 10Cr ★ 31, 5.7, MS, $150K, 5Cr ★ 98480 79629

వధువు కావలెను

కమ్మ 31, 5.11, DM ([illegible]), 50Cr ★ 31, 5.10, MS(GS), 60Cr ★ 30, 5.10, DM ([illegible]), 50Cr ★ 30, 5.10, MS ([illegible]), 10L/A, 15Cr ★ 29, 5.7, MCH ([illegible]), 10Cr ★ 98480 79629

కమ్మ 29, 5.11, MD(GM), 5Cr ★ 29, 5.8, MD ([illegible]), 50Cr ★ 26, 6, MS(GS), 10Cr ★ 28, 5.11, MS(EM), 10L/A, 25Cr ★ 30, 5.8, MS ([illegible]), 12L/A, 10Cr ★ 92901 97179

కమ్మ 26, 6, MS, $90K, 15Cr ★ 28, 5.8, VIT(MS), $125K, 30Cr ★ 29, 5.7, MS, $100K, 5Cr ★ 31, 5.11, MS, $130K, 5Cr ★ 32, 5.11, MS, $120K, 10Cr ★ 92985 55658

కమ్మ 26, 5.8, MS, $120K, 5Cr ★ 26, 6, MS, $110K, 2Cr ★ 27, 5.11, MS, $75K, 10Cr ★ 28, 5.9, MS, $100K, 8Cr ★ 29, 5.8, MS, Bits(MS), $100K, 2Cr ★ 99121 04761

కమ్మ 30, 6, IIT(IIM), 70L/A, 10Cr ★ 28, 5.11, IIT ([illegible]), Ph.D, 1Cr ★ 29, 5.9, IIT ([illegible]), 17L/A, 3Cr ★ 29, 6, IIT ([illegible]), Ph.D, 8Cr ★ 31, 5.9, IIM, 42L/A, 3Cr ★ 98480 79629

కమ్మ 26, 5.10, M.Arch, 1.5Cr/A, 50Cr ★ 27, 6.1, ACM, 25L/A, 50Cr ★ 28, 5.5, MS, 20L/A, 40Cr ★ 30, 5.11, ISB, 1Cr/A, 15Cr ★ 31, 5.8, MS, 25L/A, 40Cr ★ 92901 97179

కమ్మ 25, 6, M.Tech, 12L/A, 25Cr ★ 26, 5.10, Degree (Govt), 4L/A, 4Cr ★ 26, 5.11, M.Tech (NIT), 10L/A, 2Cr ★ 29, 5.11, CA, 12L/A, 10Cr ★ 29, 5.7, M.Tech, 8L/A, 8Cr ★ 92985 55658

కమ్మ (USA): 28, 5.10, BE, $110K, 4Cr ★ 31, 6.2, BE, $85K, 3Cr ★ 32, 5.11, BE, $130K, 4Cr ★ 33, 5.9, BE, $145K, 4Cr ★ 33, 5.11, BE, $90K, 2Cr ★ 99121 04761

కమ్మ 26, 5.11, BE, 24L/A, 15Cr ★ 29, 5.9, MBA, 24L/A, 25Cr ★ 29, 5.9, MBA, 12L/A, 15Cr ★ 30, 6, BE, 20L/A, 15Cr ★ 31, 6, MBA, 13L/A, 8Cr ★ 98480 79629

కమ్మ 23, 6, BE, 24L/A, 8Cr ★ 26, 6, BE, 24L/A, 4Cr ★ 28, 6, BE, 25L/A, 8Cr ★ 28, 5.11, BE, 9L/A (C.Govt), 2Cr ★ 29, 5.11, BE, 12L/A, 2Cr ★ 92901 97179

కమ్మ(డైవర్స్): 31, 5.9, MD ([illegible]), 5Cr ★ 33, 5.7, MS, $75K, 40Cr ★ 34, 5.7, MD ([illegible]), 12L/A, 40Cr ★ 35, 6.2, MD ([illegible]), $10L/A, 60Cr ★ 36, 5.11, [illegible], 30Cr ★ 92985 55658

కాకతీయ మ్యారేజెస్

kaakateeya.com

గత 36 సంవత్సరాలుగా 5 రాష్ట్రాలలో 25 బ్రాంచీలలో కమ్మ కులాల వారికి వేలాది సంబంధాలు కుదిర్చిన అగ్రగామి సంస్థ కాకతీయ.కామ్.
H.O : 101, 102, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్చి వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్-73.
www.kaakateeya.com / 9390999 999

వరుడు కావలెను

★ KAMMA 25/5.5/BE/MS/SWE/ AMAZON/$ 180K-PA, 26/5.2/BE/ MBA/ SWE/HCL/15 LA-PA, 27/5.5/MBBS/ MD (Pediatrics) 8008567898

★ KAPU 27/5.3/BE/MS/SWE/ IBM/ $ 90K-PA, 26/5.6/BE/MBA/ HR/ BAJAJ/ 20 LA-PA, 26/5.4/ MBBS/ MS/(GYNIC) 9177897788

★ REDDY 25/5.4/BE/MS/SWE/JP MORGAN/ $ 96 K-PA, 24/5.4/ BE/ ME/ SWE / CISCO / 15LA-PA, 26/5.2/ MBBS/MD (SURGEON) 9948297222

★ BALIJA 27/5.5/BE/ MS/SWE/ MNC/$ 130 K-PA, 27/5.5/BE/SWE/ INFOTECH/10 LA-PA, 25/5.5/ MBBS/ MD (GENERAL) 9848494422

★ CAST NO BAR 25/5.4/BE/ MS/SWE/ QUALCOMM/$ 110 K-PA, 27/5.3/ BE/ MBA (IIM)/ MNC/12 LA-PA, 28/5.4/ MBBS/MD (Pediatrics) -USA 7337320044

★ KAPU (DIVORCED) 29/5.2/BE/ MS/ SWE/MNC/$ 130K-PA, 33/5.7/ BE/ MBA/HR/MNC/ 9 LA-PA, 31/ 5.2/ MBBS/MD (Radiology) 9848123222

★ MALA 26/5.3/BE/MS/SWE/LG/ $ 80 K-PA, 26/5.3/BE/SWE/GLOBAL/6 LA-PA, 28/5.2/MBBS/ MS (Opthamology)/ RAILWAYS 7680839333

★ YADAVA 26/5.5/BE/MS/INTEL/ $ 90 K-PA, 26/5.4/BE/SWE/ ACCENTURE/ 5 LA -PA, 24/5.4/ BDS/MDS 7093200777

★ REDDY (DIVORCED) 33/5.2/BE/ MS/ SWE/ CTS/$ 90 K-PA, 27/5.4/ SWE/ SIEMENS/ 9 LA-PA, 33/5.2/ MBBS-MD9GYNIC)/GOVT/12 LAK 9177684466

★ VYSYA 25/5.3/BE/MS/ SWE/ PEARSON/ $ 80K-PA, 25/5.6/BE/ SWE/ DELOITTE/ 9 LA-PA, 29/5.5/ MBBS/MD 9848535378

★ 27/5.2/BE/MS/SWE/GOOGLE/ $ 190K PA, 25/5.2/BE/ ME/SWE/ INNOMIND/ 12 LA-PA, 27/5.6/ MBBS/ MD (Pathology) 7674878080

AJH-413095

వధువు కావలెను

★ KAMMA 27 / 5.9 / BE / MS / SWE / MNC / &100K / 25cr 29 / 6 / BE/MS/ SWE/ HCL/ 15lakhs p.a / 20cr 28/6/ BE/ME/SWE/ MD (Radiology) / Very well settled 7675818080

★ REDDY 29/5.9/BE/ME/SWE/ AMAZON/$130K/25cr, 27 / 5.9 / BE / ME/ SWE/12lakhs PA / 30cr, 28/6/ MBBS/ MS(Orthopedics)/50cr 9848334348

★ KAPU 28/5.11/BE/MS/ SWE/ $150K, 25/5.11/BE/ME/SWE/ BEL/ 70k/10cr, 26s / 5.7/ MBBS/MD (Oncology) 7674868080

★ BALIJA 28/5.7/BE/MS/SWE/ $108K, 26/5.6/BE/ME/SWE/ MNC/ 19 lakhs-p.a, 29/5.7/MBBS/ MS (ENT) / 10 LA-PA 7680876600

★ GOWDA 29/5.7/BE/MS /SWE/ $90K, 27/5.10/BE / SWE/TECH MAHINDRA/ 90K, 29 / 5.8 / MBBS/ MD(Radiology) 9392009391

★ BRAHMIN 30/5.7/BE/MS/SWE/ $100K, 29 / 5.7 / BE / SWE / Cognizent / 50K, 31 / 5.6/ MBBS/MD (Forensic Medicine)

★ NAIBRAHMIN 30/5.7/BE/MS/ SWE/$200K, 29/5.7/BE/ SWEMNC/16 LAKS PA. 30/5.11/ BE/ SWE/ CAPGEMINI/90k

★ MUDIRAJ 28 / 5.9 / BE / SWE / $100K, 27 / 5.6 / BE / SWE / 90K, 30 / 5.8 / MBBS / MD (Psychiatrist)

★ DEVANGA 27 / 5.8 / BE / MS / SWE/ $80K, 27/6/ BE/SWE/ Verizon / 85K, 29/5.11/BE/SWE/ INFOSYS/60k

★ MADIGA 29/5.11/BE/ME(IIT)/ SWE/ MNC/12lakhs p.a, 29/5.10/ M Pharmacy/ Central Govt Employee / 40K, 30 / 5.8 / MBBS/ MD (Radiology)

★ INTERCASTE 26/5.8/be/ms/swe/ $90K, 29/5.7/BE/SWE/75K, 30/5.6/ MBBS/ MS (Urology)/ DNB (General Surgery) 9848031931

AJH-413095

అన్నపూర్ణ మ్యారేజెస్

● అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధములు కుదర్చబడును ●

Doctors,NRI,Software,Business,Govt.&Pvt.Jobs,క్లాస్ మరియు మిడిల్ క్లాస్ వారు సంబంధములకై సంప్రదించండి. ఫ్రీగా లాగిన్ అవ్వండి.
www.annapurnamarriages.com
గుంటూరు హెడ్ ఆఫీస్ - 9397979718,
విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ - 83673 44466, ఒంగోలు బ్రాంచ్ ఆఫీస్ - 93937 63666,
తెనాలి బ్రాంచ్ ఆఫీస్ - 99851 44113, నెల్లూరు బ్రాంచ్ ఆఫీస్-93979 79740
ఫొటో ఎందుకు ? - పెళ్ళి చేసుకోవాలి అనుకునేవారికి ఫొటో తప్పనిసరి
ఆధార్ ఎందుకు ? - మీ Age & address Identification కోసం
ఫోన్ వెరిఫికేషన్ ? - మీకు పెళ్ళి సంబంధములు తెలియజేయటం కోసం
పూర్తి వివరములు మరియు ఇవి మూడు ఇచ్చినవారికి మాత్రమే అన్నపూర్ణ మ్యారేజెస్ వారు పెళ్ళి సంబంధములు చూడబడును.

వరుడు కావలెను

★ కమ్మ-(28639); A-24; 5'1"; MBA; ఆస్థి- 8 Crores; ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979710

★ కమ్మ-(18522); A-28; 5'3"; B.Tech; SWE at USA; ఆదాయం- 42 La/Pa; ఆస్థి- 2 Crores; ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వరుడు కావలెను. 9397979710

★ కమ్మ-(26451); A-26; 5'4"; M.Tech; SWE;ఆదాయం-6La/Pa; వున్న సాంప్రదాయమైన అందమైన వధువుకు M.Tech చదివి SWE జాబ్ చేసే వరుడు కావలెను. 9397979710

★ కాపు -(29064); A-21; 5'4"; B.Pharmacy; ఆస్థి- 40 Lakhs వున్న సాంప్రదాయమైన అందమైన వధువుకు M.Pharmacy /MBBS / MDS చదివిన Doctor/ Govt. జాబ్ చేస్తున్న వరుడు కావలెను. 9397979710

★ రెడ్డి -(26901); A-35; 5'4"; B.Tech; SWE; ఆదాయం- 8La/Pa వున్న సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వరుడు కావలెను. 9397979710

★ కమ్మ -(27961); A-20; 5'6"; BPT; చదివిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech/ M.Tech చదివి Pvt.Job / Govt.Job జాబ్ చేసే వరుడు కావలెను. 9397979710

★ హిందు మాదిగ - (26449); A-35; 5'3"; MD/MS (Medical); Doctor at USA; ఆదాయం- 55La/Pa వున్న సాంప్రదాయమైన అందమైన వధువుకు హిందువులలో కుల పట్టింపు లేని MD/MS(engg) చదివి USA లో జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979710

★ పద్మశాలి-డైవర్స్- (07841); A-39; 5'3"; LLB; Govt. Employee; ఆదాయం- 6La/Pa వున్న సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech/ M.Tech/ LLB చదివి Govt. Job/ Business చేస్తున్న వరుడు కావలెను. 9397979710

★ ముస్లిం-(28813); A-29; 5'4"; B.Ed; చదివిన సాంప్రదాయమైన అందమైన వధువుకు Any Degree చదివి Govt. Job/ Pvt. Job చేస్తున్న వరుడు కావలెను. 9397979710

వధువు కావలెను

★ కమ్మ-(19003); A-27, 5'8", B.Com; Pvt. Job; ఆదాయం- 2.40La/Pa; ఆస్థి- 50 Lakhs ప్రాపర్టీ ఉన్న వరుడుకి డిగ్రీ చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055566

★ కమ్మ-(28811); A-30, 5'9", B.Tech; Pvt. Job at Dubai; ఆదాయం-23La/Pa; వున్న వరుడుకు B.Tech చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055566

★ రెడ్డి-(28821); A-33, 5'6"; B.Tech; SWE; ఆదాయం- 24La/Pa; వున్న వెల్‌సెటిల్డ్ వరుడుకు B.Tech చదివిన SWE జాబ్ చేస్తున్న సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055566

★ రెడ్డి-(28898); A-22; 5'10"; B.Com; Govt.Job; ఆదాయం- 4.2 La/Pa, ఆస్థి- 7Acres Land & house; ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. 8367055566

★ కాపు-డైవర్స్-(28929);A-45; 5'3"; B.Com; Pvt.Job; ఆదాయం-3.6 La/Pa, ఆస్థి- 2.25 Crores; ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. 8367055566

★ నాయక్ లంబడి-(19414); A-27; 5'10"; MBA; Pvt.Job; ఆదాయం- 5.60 La/Pa; ఆస్థి- 1 House; ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. 8367055566

★ కొప్పుల వెలమ - Converted (27735); A-30; 5'5"; ITI; Pvt.Job; ఆదాయం- 2 La/Pa; ఆస్థి- 1Site & house; ప్రాపర్టీ కలిగిన వరుడుకు Converted లో కుల పట్టింపు లేని వధువు కావలెను. 8367055566

★ శెట్టి బలిజ - (27922); A-29; 5'7"; M.S (Eng); SWE at USA; ఆదాయం- 36 La/Pa, ఆస్థి- 5 Crores ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Tech చదివి SWE జాబ్ చేసే అందమైన వధువు కావలెను. 8367055566

★ హిందు మాదిగ - (28781); A-30; 5'10"; B.Tech; Business; ఆదాయం- 9.6 La/Pa, ఆస్థి- 2Sites ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055566

వధువు కావలెను



★ బ్రాహ్మణ 48/5'5"/ప్రైవేట్ బిజినెస్ చేస్తున్న వరునికి కుల పట్టింపు లేని మొదటి లేదా రెండవ పెళ్ళి వధువు కావలెను. సం.ప్ర. సెల్: 80080 96156
AJM - 428597

★ శ్రీ సత్యసాయి తలంబ్రాలు అన్ని కులములకు - ST/39/Govt ఉద్యోగికి Govt వధువు కావలెను. డైరెక్టు, సం.ప్ర. సెల్ : 95502 61327, 91549 69331, 94905 70029
AJR-433163

★ బ్రాహ్మణ/ 45/ వయస్సు పై బడి వున్న స్త్రీ/ విడో/ డైవర్సీ/ ఆరోగ్యం సరిలేనివారికి తోడుగా ఉంటాను. శాండిల్య, ఫోన్: 8500023750
AJG-448522

★ రెడ్డి/ 29/ సాంప్రదాయ వరుడికి వధువు కావలెను. 1వ, 2వ, డైవర్సీ విడో అయినా సరే మనీ సపోర్ట్ ఇచ్చు వారు కావలెను. ఇల్లరికం OK డైరెక్ట్: 9642549489
AJK-449307

★ మాల/37/6'/Fair/ 2nd Marriage Separated / కుల పట్టింపులేదు/ Govt job వరుడికి వధువు కావలెను. సెల్ & వాట్సప్ : 7729063035
AJY_447020


★ Caste No Bar. Brahmin 38 Yrs, Height 5'3" MCA, PGDCA 60,000 P/M. Required Any Degree or P.G. Bride Ph: 99590039565 Direct.
AJH-51911

★ బలిజ/కాపు/60/5'3"/రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి/ స్వంత ఇల్లు/నకు F.C కులమునకు చెందిన పిల్లలు / బాధ్యతలు లేని 40 సం.లు పైబడిన విడో/డైవర్సీ వధువు కావలెను. డైరెక్టుగా సం.ప్ర.: 9490175125
AJR-432840

★ 42/BE, OC సొంత ఫ్యాక్టరీ, 40 కోట్ల ఆస్తి కల్గిన (వెరీవెరీ రిచ్), ఒంటరిగా ఉన్న వరుడికి అందమైన వధువు కావలెను. కుల, కట్న వయసు అభ్యంతరం లేదు. Direct Cont.: 82773 33854
AJQ-559179



వరుడు కావలెను



★ యాదవ/విడో/38/5'4"/Govt. నర్స్ సొంత ఇల్లు & రెంట్స్ 30 ఎ. ల్యాండ్ కల్గిన వధువుకు కోసం కుల ఆస్తితో చదువుతో సంబంధం లేని వరుడు కావలెను. ఫోన్: 9502993350
AJH-039

★ రెడ్డి/విడో/42/5'3"/10th/రాజమండ్రిలో పొలాలు, తోటలు, Hydలో సొంత బిజినెస్, ఎవరూ లేని వధువుకి బిజినెస్ చూసుకునే వరుడు కావలెను. (అర్జెంట్). ఫోన్: 9849435205, 9177300345
AJH-16165

★ యాదవ / 38y / 5'6"/ Never Married Fair MBA తెలంగాణా ఆస్ట్రేలియా P.R. చదువుకున్న సాంప్రదాయ కుటుంబం గల వరుడు కావలెను. డైరెక్ట్. ఫోన్: 9010842522
AJH-16411

★ చౌదరి/48/విడో/5'4"/Govt. Job/Vrs/పొలాలు, తోటలు Own House Own బిజినెస్ 3L PM. 15 కోట్ల ప్రాపర్టీ ఉన్న ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8187873088
AJH-63

★ యాదవ/ 48/5'4"/PG/ Govt. Job/Vrs. లారీ ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ 3L PM. 15 కోట్ల ప్రాపర్టీ ఉన్న అందమైన వధువుకు FC/BC సహజీవనం వరుడు కావలెను. ఫోన్: 7396408887
AJH-63

★ రాజులమ్మాయి/48/5'4"/MBA/ఫ్యాషన్ డిజైనర్/ Own బిజినెస్, Own House/2L PM. 10 కోట్ల ప్రాపర్టీ ఉన్న ఈ మధ్యనే ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8187874909
AJH-63

★ కుల పట్టింపు లేదు/48/5'4"/ PG / Govt. Job /VRS/ సొంత ఇల్లు బిజినెస్ /1L PM. 12 కోట్ల ప్రాపర్టీ ఉన్న యాక్సిడెంట్‌లో పూర్తి ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9121954252
AJH-63

★ రెడ్డి/33/5'5"/డైవర్స్/Fair/ సొంత లేడీస్ టైలర్ షాప్ (30,000PM) / 2 Cr. ప్రాపర్టీ గల అందమైన వధువుకు కులపట్టింపులు లేని వరుడు కావలెను. పేరెంట్స్ Villageలో ఉంటారు. Hydలో సొంత ఇల్లు. ఫోన్:8790527332
AJH-411619

★ గౌడ /29 / 5'5"/ లేట్ మ్యారేజ్ / Fair / సొంత క్యాటరింగ్ & బిజినెస్ / 4 Cr. ప్రాపర్టీ. తండ్రి లేని వధువుకు లేని వరుడు కావలెను. ఫోన్:9666442604
AJH-411619

★ కాపు/29/5'4"/డైవర్స్/Fair/సొంత గిఫ్ట్ & స్టేషనరీ షాప్ (per month 50,000)/ 5 Cr. ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్:8686683575 AJH-411619

★ కమ్మ/34/5'4"/విడో/రియల్ ఎస్టేట్ & సొంత లైబ్రరి, 3 Cr. ప్రాపర్టీ. ఏ బాదరా బందీలేని అందమైన వధువుకు కులపట్టింపులు లేని వరుడు కావలెను. ఫోన్: 7997913167
AJH-411619

★ రెడ్డి/ విడో/ 44/ Degree/ ఫైనాన్స్ బిజినెస్ / Hydలో ఇల్లు. Rents 3 LPM బాగా ఆస్తి కలిగిన వధువుకి వరుడు కావలెను. నో బ్రోకర్స్. ఫోన్: 9985035976 / 9703247793
AJH-427121

★ పద్మశాలి/విడో/39/BA/ఓన్ స్టీల్ ఐరన్ ఫ్యాక్టరీ/ 2 LPM/7 కోట్లు ఆస్తి కలిగిన వధువుకి బిజినెస్ చూసుకునే వరుడు కావలెను. నో బ్రోకర్స్. ఫోన్: 9703238657 / 8142079654
AJH-427121

★ కుల పట్టింపు లేదు/విడో/46/ Govt. Employee Hydలో కంపెనీ 16 కోట్ల ప్రాపర్టీ గల పెళ్ళయిన 6 నెలలకు భర్తను కోల్పోయిన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8125106273
AJH-039

★ కుల పట్టింపు లేదు/చౌదరి/ 34y /విడో / M.Sc, B.Ed. గవర్నమెంట్ లెక్చరర్. విజయవాడలో బిజినెస్ 5L P/M 7 కోట్ల ప్రాపర్టీ గల ఒక పాప ఉన్న వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9705019602
AJH-039

★ కుల పట్టింపు లేదు/27Y/5'6"/ డిగ్రీ, వెల్ సెటిల్డ్, సొంత ఇల్లు, భూమి కలిగిన అందమైన వదువుకు మధ్య తరగతి వరుడు కావలెను. సెల్: 8712001170
AJA- 444463

★ రెడ్డి/విడో/25/B.Tech/25 కోట్లు ప్రోపర్టీ కల్గి ఏక్సిడెంట్‌లో పేరెంట్స్ మరియు భర్తను కోల్పోయిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఆస్థి, కుల ప్రసక్తి లేదు) Contact Whatsapp 8121016556
AJV_440518

★ హిందూ మాల/23/B.Tech, SWE, Infosys (Hyd) జాబ్ జీతం : 60వేలు గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ /డాక్టర్ జాబ్ / ఇతర స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న హిందూ లేక క్రిస్టియన్ వరుడు కావలెను. డైరెక్ట్ : 9121191105.
AJG-448523

★ కుల ప్రసక్తి లేదు/చౌదరి/విడో/34/5'4"/ ఇంటర్, ఫుల్ ఫెయిర్, Hydలో సొంత అపార్ట్‌మెంట్, 26 కోట్ల ఆస్థి గల వధువుకి వరుడు కావలెను. Whats App No. 9493765534
AJG-442

★ కుల, ఆస్థి పట్టింపు లేదు/చౌదరి/25/డిగ్రీ /5'4", Hydలో సొంత బిజినెస్, ఒక కుమార్తె, 20 కోట్ల ఆస్థి గల వధువుకు వరుడు కావలెను. వరుడు కావలెను. Whats App 8341705251
AJG-444

★ కుల, ఆస్థి పట్టింపు లేదు/ చౌదరి/ 28/1st మ్యారేజ్, MBA, 5'5", Hydలో సొంత ఇల్లు, ఒక కుమార్తె, 16కోట్ల ఆస్థి గల అందమైన వధువుకు వరుడు కావలెను. వరుడు కావలెను. Whats App No. 9705830930
AJG-443

★ చౌదరీస్/30 Years 16 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వదువుకి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. Whatsapp Number : 8099807572 AJW-445907

★ చౌదరి /లేట్ మ్యారేజ్ /29y / 5'3"/గైనకాలజిస్ట్/6 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ఫోన్:7287896285
AJH-039

★ బలిజ నాయుడు / డైవర్సీ /41y / 5'5"/B.Com/స్వీట్ షాప్ & షుగర్ ఫ్యాక్టరీ/ 4L P/M / 10 కోట్లు ప్రాపర్టీ తల్లి తండ్రిని కోల్పోయిన పిల్లలు లేని వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 8340826530
AJH-039

★ కమ్మ/విడో/55/5'4"/హెల్త్ డిపార్ట్‌మెంట్ (సూరింటెండెంట్) (VRS)/2 LP/M Hydలో, సొంత ఇల్లు/ 12 కోట్లు ప్రాపర్టీ, 10 ఎ॥ పొలం. వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్:7893895763
AJH-039

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు/37y /విడో/ ఫెయిర్ / 5'5"/ Own హాస్టల్స్, రెంట్స్, 8 Cr. ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్:7893575126
AJH-039

★ కాపు /విడో/30y /5'5"/ ఆటోమొబైల్స్, 7 Cr. ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 9121598208
AJH-039

★ చౌదరి / విడో / 32y /5'4"/ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్, 18 Cr. కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ఫోన్:9515060514
AJH-039

★ కులపట్టింపు లేదు (2వ పెళ్ళి)/45/5'4"/ ఇంటర్ /Govt. కాలేజీలో అటెండర్ / 25 వేలు P/M / స్వంత ఇల్లు గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8790045436 / 8978894173
AJH-039

★ కులపట్టింపు లేదు(2వ పెళ్ళి) / 50y /5'3"/ 10th క్లాస్ / క్యాటరింగ్ బిజినెస్ / 30 వేలు pm / ఓన్ హౌస్ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8978894043 / 8978894173
AJH-039

★ లేట్ మ్యారేజ్/40y /5'4"/ డిగ్రీ/ ఓన్ బిజినెస్ / 50 వేలు pm / 2 Cr. ప్రాపర్టీగల అందమైన వధువుకు కులంతో సంబంధం లేని వరుడు కావలెను. ఫోన్:7032764715 AJH-039

★ కమ్మ /41y/ విడో/5'5"/ District Audit Job / 2L PM / 15 Acres Lands, Own House / 15 Cr. ప్రాపర్టీగల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ఫోన్:7680061835
AJH-039

★ కాపు/ లేట్ మ్యారేజ్/45/5'4"/MBA/SWE కం॥ HR/ 50,000/- P/M/Hydలో Own House (Rents) వెల్ సెటిల్డ్ వధువుకు కుల, ధనిక, పేద తేడా లేని FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912753645
AJH-039

★ కమ్మ/విడో/48/5'4"/BA/రాజమండ్రి/ పొలాలు తోటలు / School అడ్మినిస్ట్రేటర్ 1L P/M / వెల్ సెటిల్డ్ పిల్లలు లేని అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:9948070006
AJH-039

★ రెడ్డి / డైవర్సీ/ 42/ 5'4"/ డిగ్రీ/C. Govt. Job/ 50,000/- P/M / Hydలో Own House (Rents) వెల్ సెటిల్డ్ ఏ బాదరా బందీలేని వధువుకు వరుడు కావలెను ఫోన్: 9912916046
AJH-039

★ కమ్మ /విడో/44/ 5'3"/ విజయవాడ / Own House (Rents) / 50,000/- P/M / 1 పాప వెల్ సెటిల్డ్ /ప్రస్తుతం Hydలో ITకం.లో CEO Job/50,000/- P/M వధువుకు 2వ వరుడు కావలెను. ఫోన్: 9912038880
AJH-039

★ కమ్మ/విడో/58/5'4"/CNB/M.Com/Govt. Job / VRS (పెన్షన్) & రెంట్స్. తల్లి తరపు ఆస్తి 10 ఎకరములు, 2ఇళ్లు/1L/PM, వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8686310368
AJH-039

★ యాదవ/ విడో/ 50/ 5'4"/ B.Sc / Nurse / రెంట్స్ / 60K PM/ నెల్లూరు దగ్గర పొలాలు & తోటలు కల వెల్ సెటిల్డ్ పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. ఫోన్:9705349133
AJH-039

★ BC/విడో / 48y / 5'4"/ ఇంటర్ / ఫ్యామిలీ పెన్షనర్/ House Wife / సొంత బిజినెస్ కల సాంప్రదాయ కుటుంబ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:8465058052
AJH-039

★ వాల్మీకి/బోయ/52/5'3"/డిగ్రీ/B.A., B.Ed./ Govt. టీచర్ రెంట్స్ / 1 పాప సెటిల్డ్ / సెక్యూర్డ్ ప్రాపర్టీ కల వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:7893379440
AJH-039

★ వడ్డెర/బాల్య వివాహం జరిగి వెంటనే డైవర్సీ అయిన (25 సంవత్సరాల డిగ్రీ) అమ్మాయికి జాబ్ & ఉన్నత కుటుంబం నుండి వడ్డెర వరుడు కావలెను. సంప్ర. నెం: 95502 12606, 70132 78578
AJY_447154

★ కమ్మ/విడో/30/B.Tech/20 కోట్లు ప్రోపర్టీ కల్గి పిల్లలు లేని అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్థి, కుల, వయసు ప్రసక్తి లేదు) మీ ఫోటో, Details, Whatsapp లో Send చేయండి. Ph: 9030916673
AJV_440519

★ కాపు / విడో / 49y / 5'4"/ MBA / ప్రైవేట్ జాబ్ / చిన్న ఇల్లు కల ఆదర్శభావాలు కల ఉన్నత కుటుంబమునకు చెందిన వధువుకు మధ్య తరగతి వరుడు కావలెను. ఫోన్: 9705205253 AJH-039

★ FC / విడో / 60y / 5'3"/ M.Com / Govt. పెన్షనర్ / రెంట్స్ / కమర్షియల్ కాంప్లెక్స్ / 1L/PM / ఆదాయము కల ఒంటరి వధువుకు తోడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఫోన్: 9573380048
AJH-039

★ వైశ్య /55y / విడో / గోల్డ్ బిజినెస్ / సొంత ఇల్లు & రెంట్స్ / 1L/PM / వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 7330865089 AJH-039

★ కుల ఆస్తి ప్రసక్తి లేదు /58y / విడో / VRS పెన్షనర్ / సొంత ఇల్లు & రెంట్స్. ఏ బాదరాబంది లేని సాంప్రదాయ కుటుంబం వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు తోడు కావలెను.ఫోన్: 7093717220
AJH-039

కళ్యాణ వేదిక

★ మీ అమ్మాయికి / అబ్బాయికి పెళ్ళి సంబంధం కావాలా? గత 20 సం॥లుగా విశేష అనుభవంగల సంస్థ. Doctor, PG, Engg., Govt./Pvt. సంబంధాల కొరకు 9849072372, 0891-2739003. www.sweethomemarriage.com
AJV_440205

★ అన్ని కులాల అమ్మాయి మరియు అబ్బాయిలకు 20 నుండి 40 సం.లోపు డాక్టర్స్, ఇంజనీర్స్, Govt. Employee, NRI, బిజినెస్ మరియు వ్యవసాయం చేయు వారికి 1వ 2వ సంబంధములు చూడబడును. ఫోన్: 9959936450
AJH-039

★ కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్ / అన్ని కులముల వారికి డైవర్సీస్, విడోస్, విడోవర్స్, పెన్షనర్స్‌కు సంబంధములు త్వరగా కుదుర్చబడును. స్త్రీలకు ఫ్రీ రిజి॥ ఫోన్: 7416303057
AJH-039


★ శ్రీ గణేష్ మ్యారేజ్ బ్యూరో: అన్ని కులాల, అన్ని మతాల వారికి 1, 2వ, లేటు సంబంధాలు వెంటనే కుదుర్చబడును. ఫీజు మగవారికి 1000/-, ఆడవారికి ఫ్రీ. ఫోన్: 7660971900
AJH-039

★ Radha Marriage Bureau అన్ని కులాల వారికి సంబంధములు చూడబడును. రెండో వివాహము వారు కూడా సంప్రదించగలరు. Contact: 9121154653 / 9550834193, radhamarriagebureau2018@gmail.com
AJH-16110

గమనిక: ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

పర్వతనేని (కమ్మ) వివాహ వేదిక

పర్వతనేని రామబ్రహ్మం గారి ఆధ్వర్యములో 22 సం॥లుగా కమ్మవారి కోసం స్థాపించబడిన ఏకైక సంస్థ. సత్య అపార్ట్‌మెంట్, ఫార్చ్యూన్ మురళి రోడ్డు



(కాంధారి లైన్) విజయవాడ. ✆ 0866-6662544, 9849350056, 8977662544
e-mail: pmc.brahmam@yahoo.com
పర్వతనేని శ్రీకాంత్, షాప్ నెం 219, పద్మావతి ప్లాజా, కె.పి.హెచ్.బి. మెయిన్‌రోడ్డు, హైదరాబాద్ ✆ 40077535, 8886664567,
mail:pmc_kammamarriages@yahoo.com

వధువు కావలెను

కమ్మ- 26 6' MS $100K 40Cr, 30 6' MS $120K 40Cr, 26 5'10 MS $75K 25Cr, 32 5'7 MS 30Cr, 26 5'11 MS $85K 15Cr, 26 6'1 MS 15Cr

కమ్మ- 27 5'9 BS $100K 20Cr, 30 5'11 Ph.D., 20Cr, 29 5'11 MS $80K 20Cr, 29 5'11 ME $85K 15Cr, 30 5'8 MS $300K 10Cr, 31 5'10 MS 10Cr

కమ్మ- 27 5'10 MS $100K 20Cr, 28 6' MS $75K 8Cr, 30 6' MS $85 K10Cr, 30 5'8 MS $95K 10Cr, 31 5'11MS $100K 10Cr, 37 5'9 MCA 40Cr

కమ్మ- 25 5'10 MS $120K 5Cr, 29 5'10 MBA $175K 3Cr 29 5'8 MS $100K 5Cr 32 5'8 MS $120K 15Cr, 31 5'11 BSMBA $100K 12Cr

కమ్మ- 26 6'2 MS 24L 20Cr, 27 5'9 BE 7L 10Cr, 29 6'4 BS ISB 16L 5Cr, 30 5'10 BE 60Cr, 30 5'9 ME 8L 25Cr, 29 5'9 B.Arch 24L 20Cr

కమ్మ- 29 5'11 BE 36L 15Cr 26 6' BE 5L 3Cr 30 5'8 BE 5L 10Cr, 29 6' BE 6L 20Cr 29 6'2 MS 16L 25Cr 27 5'8 MS 10L 9Cr.

Business: 29 5'8 BE 80Cr 32 5'8 MS 40Cr, 31 5'9 MBA 30L 30Cr 30 6'3 BE 50Cr, 31 5'7 BE 15Cr 32 5'10 BEMS 100Cr 40 6' MS 100Cr.

Doctors: 25 5'11 MBBS 25Cr 31 5'10 PGGM 150Cr 32 5'8 MDGM 12L 50Cr 29 5'8 MS Ortho 20Cr 30 5'10 MDGM 25Cr 30 6' MSGS 4Cr

Divercee: 29 5'8 MDS 6L 3Cr 30 5'8 MBA 35Cr 37 6' MCA 10Cr, 40 5'5 BE 50Cr 35 6' BE 10Cr 35 5'10 MBA 30Cr 35 6'2 MD 50Cr.

వరుడు కావలెను

కమ్మ- 27 5'4 MS $100K 50Cr, 27 5'5 MS 20Cr 28 5'6 MS $70K 25Cr 28 5'8 MS 25Cr 28 5'7 MS $120K 8Cr 31 5'2 MS $85K 10Cr

కమ్మ- 26 5'5 MS 50Cr 25 5'6 MS $70K 10Cr 29 5'6 MS $85K 15Cr 27 5'2 BE $90K 10Cr 25 5'4 MS 8Cr 24 5'7 MS $70K 6Cr

కమ్మ-28 5'6 MS $125K 50Cr, 28 5'6 MS $70K 20Cr 28 5'3 MS $15Cr 27 5'7 MS 10Cr 27 5'3 MS $105K 10Cr 27 5'7 MS $70K 20Cr

కమ్మ- 24 5'6 BE 50Cr 26 5'4 MS 20Cr 27 5'6 BEMBA 5L 25Cr 26 5'6 BE 5L 10Cr 24 5'4 BE 8Cr 28 5'6 BE 10Cr 31 5'4 BE 11L 10Cr

కమ్మ- 27 5'4 BEMS 20Cr; 27 5'8 BE MBA 15Cr; 27 5'5 BEMBA 15Cr; 26 5'5 ME 4L 10Cr; 29 5'4 BE 10Cr; 29 5'6 BE 10Cr; 28 5'4 BE 4L 10Cr.

కమ్మ- 23 5'6 BEMBA 30Cr; 25 5'8 ME 10Cr; 27 5'6 MS 9L 20Cr; 28 5'7 MS 11L 8Cr; 25 5'4 MBA 4L 6Cr; 28 5'5 BEMBA 30Cr

కమ్మ- 27 5'8 M.Pharm 10Cr; 30 5'4 CA 6Cr; 27 5'2 MBA 7L 6Cr; 25 5'9 CA 7L 5Cr; 32 5'8 PG 30Cr; 27 5'1 PG 20Cr; 24 5'4 PG 15Cr

Doctors: 25 5'1 MS Gynic 12Cr; 24 5'5 MBBS 10Cr 28 5'6 MBBS 20Cr; 24 5'4 MBBS 3Cr 26 5'6 MD Anast 3Cr; 27 5'4 PG Opth 3Cr

Divorcee: 26 5'8 Ph.D., 150Cr; 28 5'4 MS $100K 12Cr; 26 5'5 MS $90K 2Cr; 30 5'4 MD Dermo 12L 8Cr; 30 5'6 MS $90K 8Cr.



ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ప్రకటనల కొరకు

మహబూబ్‌నగర్	9985411365	ఖమ్మం	9985401672	అనంతపురం	9985411165	గుంటూరు	9985411217	శ్రీకాకుళం	9985411066
నిజామాబాద్	9985411453	నల్గొండ	9985410384	కడప	9985411183	విజయవాడ	9985411614	విజయనగరం	9985411522
కరీంనగర్	9985411273	రంగారెడ్డి	9985410909	తిరుపతి	9985411423	తణుకు	9985411543		
ఆదిలాబాద్	9985411293	మెదక్	9985410904	నెల్లూరు	9985411013	కాకినాడ	9985411204		
వరంగల్	9985411172	కర్నూలు	9985411363	ఒంగోలు	9985411483	విశాఖపట్నం	9985411641		

మీ దగ్గరలోని ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయాలలో సంప్రదించండి


ప్రతి 4 లైన్ల ప్రకటనకు రూ.800/- (కంబైన్డ్) ప్రతి అదనపు లైన్‌కు రూ.130/- (GST అదనం)

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నం.76, రోడ్ నం.70, అశ్విని లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33. ఫోన్: 040-23558233/44/55/66. సెల్: 9985921380.



విహంగమా.. వెళ్లిపోకే!

తెరలు తెరలుగా నీటి హొయలు.. వాటిలో పచ్చగా కనువిందు చేసే కడప చెట్లు.. వాటికి పూసిన పువ్వుల్లా విదేశీ విహంగాలు.. పర్యాటకులను కట్టిపడేసే ఈ దృశ్యాలన్నీ నేలపట్టు సొంతం. వేల కిలోమీటర్ల నుంచి ఎగురుకుంటూ.. పెలికాన్, ఓపెన్ బిల్‌స్టార్క్స్, వైట్ ఐబీస్, స్పూన్ బిల్, నైట్‌హెరాన్, లిటిల్ కార్మోరెంట్స్, లిటిల్ ఈగ్రెట్స్ వంటి 22 రకాల పక్షులు నాలుగు నెలల కిందట ఇక్కడకు వచ్చాయి. సంతానోత్పత్తికి ఇక్కడ 6నెలలు ఉండి.. ఆపై పిల్లలతోసహా ఎగిరిపోతాయి. ఇంకో రెండు నెలలే ఉంటాయి. చూసొద్దాం పదండి నెల్లూరు జిల్లా దొరవారిసత్రానికి! - దొరవారిసత్రం



పర్యాటకం పరుగులు!

రూ.2307 కోట్ల పెట్టుబడులకు కంపెనీలు సిద్ధం

- అత్యధికంగా విశాఖ, విజయవాడపై ఆసక్తి..
- ప్రాజెక్టులు పూర్తయితే 10వేల మందికి ఉపాధి
- అధికారులు దృష్టి సారిస్తే మరిన్ని పెట్టుబడులు..
- కన్సల్టెంట్ల సేవలు అంతంతమాత్రమే

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు ఆకర్షించడంలో పర్యాటకశాఖ పరుగులు తీస్తోంది. అన్ని జిల్లాల్లోనూ పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ముందుకొస్తున్నాయి. పర్యాటకశాఖ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2306.9కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు సిద్ధం అయ్యాయి. గత రెండేళ్లల్లో వైజాగ్‌లో నిర్వహించిన సీఐఐ సమావేశంలో పర్యాటకశాఖ వివిధ కంపెనీలతో సుమారు రూ.14వేల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకుంది. ఇందులో భాగంగా రూ.2,306 కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ స్టేజ్‌కు రావడం ఇదే తొలిసారిగా పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రయివేటు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. భవిష్యత్‌లో ఈ రెండు జిల్లాల్లో స్టార్ హోటళ్లు ఆరు రానున్నాయి. విశాఖలో ఐదు కంపెనీలు రూ.872.4 కోట్లతో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు ముందుకు రాగా... అందులో నాలుగు ఫైవ్‌స్టార్ హోటళ్లు, ఒక త్రీస్టార్ హోటల్ ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో కలిపి రూ.1303.4 కోట్ల విలువైన పెట్టుబడులను వివిధ కంపెనీలు పెట్టనున్నాయి. మరోవైపు శ్రీకాకుళం జిల్లాలో ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణానికి కంపెనీలు ముందుకు వస్తున్నాయి. కళింగపట్నంలో రూ.200 కోట్లతో మహీంద్ర హాలీడేస్ అండ్ రిసార్ట్స్ అనే సంస్థ ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణానికి ముందుకు వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో చైతన్య గ్రూప్ అనే సంస్థ రూ.250 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు జలవనరుల శాఖ స్థలం అనుమతి కోసం... పర్యాటక శాఖ ఎదురు చూస్తోంది. చిత్తూరు జిల్లాలో రూ.200 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే రాష్ట్రంలో సుమారు ఐదువేల నుంచి 10వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పర్యాటక శాఖ అధికారులు భావిస్తున్నారు. సీఐఐలో చేసుకున్న ఒప్పందాల అమలుపై పర్యాటకశాఖ ఉన్నతాధికారులు ఆ కంపెనీలతో చర్చిస్తే మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశముందని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. ఈ సంప్రదింపులు జరపడానికి ప్రత్యేక కన్సల్టెంట్లను నియమించుకుని, లక్షల్లో జీతాలు చెల్లిస్తున్నారు కానీ... వారితో పూర్తిస్థాయిలో పనులు చేయించుకోవడం లేదు. వారినికార్యాలయాలకు పరిమితం చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని అంటున్నారు.

బడ్జెట్‌లో ఏముంటుంది?

జైట్లీ చివరి బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - న్యూఢిల్లీ)



బడ్జెట్ ప్రజాకర్షకంగా, అందరినీ మెప్పించేదిగా ఉండబోదని ఓ ఇంటర్వ్యూలో చెప్పిన ప్రధాని మోదీ- అదే సమయంలో నిమ్న వర్గాల అభ్యున్నతి, వ్యవసాయరంగానికి ఊతం మొదలైనవి విస్మరించలేమని కూడా వ్యాఖ్యానించారు. తద్వారా రాజకీయ అవసరాలను బడ్జెట్ ప్రతిబింబిస్తుందన్న సంకేతాలనూ ఇచ్చారు. ఏతావతా- ఈ బడ్జెట్ ఎన్నికల బడ్జెట్టేనన్నది సుస్పష్టం. వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ. ఆయనకిది ఆర్థికమంత్రిగా చివరిది. ఈ బడ్జెట్ నరేంద్ర మోదీ సర్కార్‌కు అత్యంత కీలకం. ఈ ఏడాది మధ్యలోనూ, చివరిలోనూ జరిగే 9 అసెంబ్లీ ఎన్నికలతోపాటు వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈ బడ్జెట్ ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ మధ్యే ముగిసిన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి తలబొప్పి కట్టింది. బీజేపీ అధికారంలో ఉన్న మూడు పెద్ద రాష్ట్రాలూ- రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ లలో ప్రభుత్వ వ్యతిరేకత బలంగా వీస్తోంది. ఇటీవల నిర్వహించిన లోక్‌నీతి-సీఎస్‌డీఎస్-ఐబీపీ సర్వేలోనూ దేశవ్యాప్తంగా బీజేపీ ఓట్ల వాటా 5 శాతం తగ్గినట్లు వెల్లడైంది. అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న బీజేపీకి సానుకూల వాతావరణం ఏర్పరచాలంటే కేంద్ర బడ్జెట్‌లో తాయిలాలు తప్పనిసరి. పెద్ద నోట్ల రద్దు, నగదు కొరత ఇప్పటికే బీజేపీ పట్ల ప్రజల్లో అసంతృప్తిని పెంచాయన్నది ఒక విశ్లేషణ. జీఎస్టీ దెబ్బ కూడా గట్టిగానే తగిలింది. వీటికి తోడు బ్యాంకింగ్ వ్యవస్థను దెబ్బతీసేలాంటి చర్యలు తీసుకుంటున్నారన్న అపవాదులు కూడా బీజేపీ ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఎఫ్‌డీఆర్ఐ బిల్లు వల్ల జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. వందలాది ఖాతాదారులు భయంతో తమ ఫిక్సెడ్ డిపాజిట్లను తీసేస్తున్నారు. పులి మీద పుట్రలా చమురు ధరలు పెరుగుతుండడం జైట్లీకి కొత్త సవాల్‌గా మారింది. చమురు ధర పది శాతం పెరిగితే వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం 25 బేసిస్ పాయింట్లు పెరుగుతుంది. ఆయిల్ కంపెనీలు మొత్తం భారాన్ని వినియోగదారుల మీదకి నెట్టేస్తే ఇక ధరలు చుక్కలనంటడం కాదు, ఇంకా పైపైకి పోతాయి.

> సామాన్యుడు కోరుకునేది నిజాయితీ.... తానెంత, ఏది పొందడానికి అర్హుడో దాన్ని మాత్రమే ఆశిస్తాడు. రాయితీలు, తాయిలాలు, ఉచితాలు కోరుకోడు. కోరుకుంటాడనుకోవడం మన భ్రమ. నేను సామాన్యుణ్ణి విశ్వసిస్తాను.. అతని లేక ఆమె ఆశల్ని గౌరవిస్తాను. వారి అవసరాలు, ఆకాంక్షలు, ఆశలు నెరవేర్చడమే మా ప్రభుత్వ కర్తవ్యం
>
> - నరేంద్ర మోదీ, ప్రధాని


ఈ నేపథ్యంలో జైట్లీ ఈ అంశాల మీద దృష్టి పెట్టే అవకాశం ఉంది.

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంపు: ప్రస్తుతం ఉన్న ఇన్‌కంటాక్స్ లిమిట్‌ను రూ 2,50,000 నుంచి రూ 3 లక్షలకు పెంచే అవకాశం ఉంది. 2014 నుంచి శ్లాబ్ రేట్లను మార్చకపోవడం వల్ల ఇపుడు అనివార్యమంటున్నారు.

80 -సీ కింద మినహాయింపులు: సెక్షన్ 80-సీ కింద కొన్ని రకాల పెట్టుబడులు, విరాళాలకు మినహాయింపు ఉంది. పీఎఫ్, పీపీఎఫ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, కిసాన్ వికాస పత్రాలు, ఈఎల్ఎస్ఎస్... మొదలైనవి. ప్రస్తుతం ఈ మినహాయింపు లక్షా యాభై వేలు కాగా, దాన్ని రూ 2 లక్షలకు పెంచే అవకాశం ఉంది.

నేషనల్ పెన్షన్ స్కీం కింద విత్‌డ్రాయల్స్: ఇప్పటి దాకా జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్) అంతగా ప్రజాదరణ పొందలేదు. కారణం- ఎన్‌పీఎస్‌లో ఉన్న సొమ్మును విత్‌డ్రా చేసుకునేటపుడు దానిపై పన్ను విధిస్తున్నారు. పీఎఫ్, పీపీఎఫ్ పథకాల మాదిరిగానే ఎన్‌పీఎస్ క్లోజ్ చేసేటపుడు ఆ సొమ్ముపై పన్ను విధించకుంటే ఈ పథకం ప్రజాదరణ పొందుతుందన్న అంశాన్ని జైట్లీ సానుకూలంగా పరిశీలిస్తున్నారని సమాచారం.

ఎన్‌పీఎస్ డిడక్షన్స్: ఆదాయపుపన్ను చట్టం సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద నేషనల్ పెన్షన్ స్కీంలో రూ 50 వేల దాకా డిడక్షన్స్ అదనంగా అనుమతిస్తున్నారు.. దీన్ని లక్ష రూపాయలకు పెంచాలన్నది ఓ డిమాండ్. తద్వారా ఆర్థిక మంత్రి కోరుకుంటున్న "అందరికీ పెన్షన్లొచ్చే సమాజం" సాకారమవుతుందంటున్నారు.



మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెంపు: వైద్య ఖర్చులపై రూ. 15 వేల వరకు పన్ను మినహాయింపు ఉంది. దాదాపు 15ఏళ్ల కిందటి ఈ పరిమితిని 50 వేలకు పెంచాలన్నది మరో డిమాండ్.

గృహరుణాలపై ఊరట: ఇప్పటిదాకా గృహరుణాలపై వడ్డీ మినహాయింపు పరిమితి రూ 2 లక్షలే. రియల్ ఎస్టేట్ ధరలు, ఇళ్ల ధరలు పెరగడంతో ఈ పరిమితిని రూ 3 లక్షల దాకా పెంచవచ్చన్నది ఓ అంచనా. దావోస్‌లో చేసిన ప్రసంగంలో మోదీ - 50 కోట్ల మందికి ఇళ్లను కట్టాలన్నది ధ్యేయమన్నారు.. నిమ్న, మధ్యాదాయ వర్గాలు భరించదగ్గ స్థాయిలో కట్టిస్తామని ఆయన గతంలో పలు సందర్భాల్లో చెప్పారు. ఈ దృష్ట్యా సొంత ఇంటి నిర్మాణం మరింత చవకగా, భరించదగ్గ వడ్డీ రేట్లతో బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఉండే అవకాశాలున్నాయి. ప్రస్తుతం కట్టిన ఇల్లు కొనడంతో పోలిస్తే కొత్తగా ఇల్లు నిర్మాణానికే ఎక్కువ వ్యయం అవుతోంది. కట్టిన ఇంటికి జీఎస్టీ లేకపోవడమే ఇందుకు కారణం. అందువల్ల కొత్త ఇల్లు నిర్మాణానికి సంబంధించి జీఎస్టీ రేట్లను తగ్గించేందుకు ఏ చర్యలు తీసుకోవాలన్న విషయంపై చర్చలు జరుగుతున్నాయి.

మళ్ళీ స్టాండర్డ్ డిడక్షన్: వేతన జీవులకు మరింతగా ఊరటనివ్వాలంటే స్టాండర్డ్ డిడక్షన్‌ను తిరిగి ప్రవేశపెట్టాలి. ఇది వేతనంలో 40 శాతం దాకా గానీ, అత్యధికంగా రూ 50,000 గానీ ఉండవచ్చు.

మళ్ళీ ఇన్‌ఫ్రా బాండ్స్: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్స్‌ను తిరిగి ప్రవేశపెట్టాలన్నది మరో విజ్ఞాపన. దీన్ని కూడా ఆర్థిక మంత్రి చురుగ్గా పరిశీలిస్తున్నారు. మళ్ళీ ప్రవేశపెడితే ఆ బాండ్లపై పెట్టే పెట్టుబడిలో రూ 50,000 దాకా మినహాయింపు లభిస్తుంది.

ఉపాధి కల్పన: 2014 ఎన్నికల ప్రచార సమయంలో మోదీ ఇచ్చిన పెద్ద హామీల్లో కోటి ఉద్యోగాల కల్పన ఒకటి. నేటికీ నెరవేరలేదు సరికదా, దేశంలో నిరుద్యోగుల సంఖ్య మరింత పెరుగుతూ వచ్చింది. అంతర్జాతీయ కార్మిక సమాఖ్య తాజా అంచనాల ప్రకారం దేశంలో నిరుద్యోగులు దాదాపు రెండు కోట్లు. మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా సహా అనేక ఉపాధి అవకాశాల పెంపు పథకాలు చాలా మందకొడిగా సాగుతున్నాయి. వాటికీ నిధుల కొరత పీడిస్తోంది. ఉపాధి కల్పనా రంగానికి సరిపడా నిధులు కేటాయించాల్సి ఉంది.

'సెట్స్' ఆన్‌లైన్‌లో జరిగేనా?

- ఏజెన్సీ ఖరారులో తీవ్ర జాప్యం
- ఏపీ ఆన్‌లైన్‌కు ఇస్తారో.. టెండర్లు పిలుస్తారో?
- ఉత్తర్వులు ఇవ్వకుంటే వాయిదా అనివార్యం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రవేశ పరీక్షలను (సెట్స్) ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తారా? అనే విషయమై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎంసెట్‌తో పాటు ఇతర సెట్స్ షెడ్యూల్‌ను ఈ నెల 8న విడుదల చేసిన ప్రభుత్వం.. ఇంతవరకు ఆన్‌లైన్ బాధ్యతలు చేపట్టే ఏజెన్సీని ఖరారు చేయకపోవడమే ఇందుకు కారణం. లక్షలాది మంది విద్యార్థులు రాసే 'సెట్స్' విషయంలో అసాధారణ జాప్యం ఎందుకన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గత ఏడాది రాష్ట్రంలో ఈ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. ఏపీ ఆన్‌లైన్-టీసీఎస్ సంస్థల సంయుక్తంగా ఈ బాధ్యతలు నిర్వహించాయి. ఈ ఏడాది మాత్రం ఇంతవరకు ఏజెన్సీని ఖరారు చేయలేదు. దీనిపై ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యా శాఖల మధ్య ఏకాభిప్రాయం లేనట్లు స్పష్టమవుతోంది. ఈసారి కూడా ఏపీ ఆన్‌లైన్‌కు సెట్స్ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని మండలి భావిస్తుండగా.. విద్యా శాఖ ఆలోచన భిన్నంగా ఉన్నట్లు సమాచారం. ఆన్‌లైన్ ఏజెన్సీని ఖరారు చేయకుండా సాగదీయడం వల్ల పరీక్షల నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. సెట్స్ నిర్వహించే విశ్వవిద్యాలయాలు ఆన్‌లైన్ ఏజెన్సీతో ఎంవోయూ చేసుకోవాలి. ఆన్‌లైన్ ఏజెన్సీ ఖరారు కాక, సెట్స్ కమిటీలు భేటీ కాలేకపోయాయి. నోటిఫికేషన్ ఇవ్వాలంటే.. దరఖాస్తులు ఎవరికి పంపాలి? ఫీజు ఎంత? తదితరాలపై స్పష్టత ఇవ్వాలి. గత ఏడాది ఏపీ ఆన్‌లైన్‌కి బాధ్యతలు అప్పగించిన సర్కారు ఈసారి ఏజెన్సీని మార్చదలచుకుంటే ముందుగా టెండర్లు ఆహ్వానించాలి. కానీ ఇంతవరకు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 19 నుంచి ఉమ్మడి ప్రవేశ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కీలకమైన ఎంసెట్ (ఇంజనీరింగ్) ఏప్రిల్ 22 నుంచి 25 వరకు జరగాలి. సత్వరమే ఏజెన్సీని ఖరారు చేయకుంటే పరీక్షలను షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో నిర్వహించడం సాధ్యమయ్యేలా లేదు. దీంతో పరీక్షలు వాయిదా వేయడం గానీ ఆఫ్‌లైన్‌లో నిర్వహించే పరిస్థితి రావచ్చని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

150 సీట్లకు నీళ్లొదిలారు

180 కోట్లు నిధులున్నా ఎంబీబీఎస్ సీట్లపై నిర్లక్ష్యం.. వైద్య విద్యార్థుల ఆశలు గల్లంతు

- 180 కోట్ల నిధులున్నా ముందుకు పడని అడుగు
- మీనమేషాలు లెక్కిస్తున్న ఏపీ ఎంఎస్ఐడీసీ
- అనంత, కడప, శ్రీకాకుళం కాలేజీలపై..
- వైద్య విద్యార్థుల ఆశలు గల్లంతు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చేతినిండా డబ్బులున్నాయి. వీటిని ఖర్చు చేసి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తే 150 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా ఇచ్చేందుకు భారత వైద్య మండలి సిద్ధంగా ఉంది. అయితే, ఈ పనులు చేసేందుకు ముందుకు వచ్చిన ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు రేపు.. మాపు అంటూ కాలం గడిపారు. అంతే! ఈ ఏడాదికి 'గడువు' ముగిసి.. ఆ 150 అదనపు సీట్లను ఏపీ కోల్పోయింది. ఈ సీట్లపై ఆశలు పెట్టుకున్న విద్యార్థుల కల కల్లయింది! విషయంలోకి వెళ్తే.. అనంతపురం మెడికల్ కాలేజీతో పాటు కడప, శ్రీకాకుళం రిమ్స్‌లలో 50 ఎంబీబీఎస్ సీట్లు చొప్పున పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం కడప రిమ్స్‌లో 150 సీట్లున్నాయి.. వాటిని 200కి, అనంతపురం, శ్రీకాకుళం కాలేజీల్లో 100 సీట్లున్నాయి... వీటిని 150కి పెంచాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం ఆయా కాలేజీలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రానికి పంపింది. వీటికి కేంద్రం సమ్మతించి, నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. అంతేకాదు.. కాలేజీకి రూ.36 కోట్లు చొప్పున 3 మెడికల్ కాలేజీలకు రూ.108 కోట్ల విడుదలకు పరిపాలనా అనుమతిచ్చింది. అదేవిధంగా. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.72 కోట్లకు పరిపాలనా అనుమతి ఇచ్చింది. కేంద్రం తొలి విడతగా రూ.22 కోట్లు విడుదల చేయగా.. దీనికి అనుబంధ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులు విడుదల చేసి 3 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆయా కాలేజీల్లో అదనపు మౌలిక వసతుల పనులు మాత్రం ప్రారంభం కాలేదు. పరీక్షల భవనాలతో పాటు, తరగతి గదులు, అనుబంధ ఆసుపత్రుల్లో పడకల పెంపు చేపట్టాలి. నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తీసుకుంటుంది. ఈ సొమ్మును ఉపయోగించి భవన నిర్మాణాలు, పడకలు, పరికరాలు కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఏపీ ఎంఎస్ఐడీసీకి ఉంది.

మీనమేషాలు లెక్కిస్తున్న ఎంఎస్ఐడీసీ..

150 ఎంబీబీఎస్ సీట్లు పెంపు విషయంలో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. డీఎంఈ అధికారులు తమకు వచ్చిన నిధులను ఏపీఎస్ఎంఐడీసీకి మూడు నెలల క్రితమే బదలాయించారు. కానీ, ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు దీనికి సంబంధించిన పనులు మాత్రం ప్రారంభించలేదు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు మూడు కాలేజీల్లో 150 ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించిన అన్ని పనులు పూర్తిచేసి, ఆ భవనాలను డీఎంఈ అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత డీఎంఈ అధికారులు మూడు కాలేజీల్లో 150 ఎంబీబీఎస్ సీట్లు పెంచాల్సిందిగా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కోరతారు. డీఎంఈ అధికారుల విన్నపం మేరకు ఎంసీఐ అధికారులు తనిఖీలకు వచ్చి, 150 సీట్లకు సంబంధించిన మౌలిక సదుపాయాలు ఉంటే, వెంటనే మూడు కాలేజీల్లో 50 చొప్పున ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు అనుమతి ఇస్తారు. ఇదంతా ప్రతి ఏటా జనవరి చివరి నాటికి చేయాల్సిన పని. కానీ ఇప్పటి వరకు దీనిలో ఒక్క శాతం పని కూడా ప్రారంభం కాలేదు. దీంతో మెడికల్ విద్యార్థులు ఈ ఏడాదికి 150 ఎంబీబీఎస్ సీట్లపై ఆశలు వదులుకోవాల్సిందే.

270 ప్రభుత్వ సీట్లు నేషనల్ పూల్‌లోకి

రాష్ట్రంలో 12 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1800 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది ఏపీని నేషనల్ పూల్‌లోకి కలిపారు. దీనివల్ల సుమారు 270 సీట్లు ఇతర రాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయించాలి. అంటే 270 మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకి వెళ్లి ఎంబీబీఎస్ చేయాలి. ఆరోగ్యశాఖ ముందుగా ప్రకటించిన విధంగా 3 కాలేజీల్లో 150 సీట్లు పెరిగితే 127 మంది మెరిట్ విద్యార్థులు ఇక్కడే చదువుకునే అవకాశం వచ్చేది. ఏపీఎంఎస్ఐడీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 150 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోవాల్సి వచ్చింది.



ఏయూ 'ఎంబీఏ'కి మహర్దశ!

బీ-స్కూళ్ల స్థాయిలో కోర్సు నిర్వహణ.. 'క్యాట్'లో ర్యాంకే ప్రవేశాలకు ప్రాతిపదిక

ఐఐఎంల తరహాలో శిక్షణ, మూల్యాంకనం.. మౌలిక సదుపాయాలకు రూసా నిధులు

విశాఖపట్నం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా ఎంబీఏ కోర్సును ప్రవేశపెట్టిన ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా అడుగులేస్తోంది. అత్యున్నత బిజినెస్ స్కూళ్ల స్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహించాలని నిర్ణయించింది. 'క్యాట్'లో వచ్చిన ర్యాంకు ఆధారంగానే ఇకపై ఈ కోర్సులో ప్రవేశాలు కల్పించనుంది. దీనికోసం మౌలిక వసతులు, ఫ్యాకల్టీని సమకూర్చుకునే యోచనలో ఉంది. అవసరమైన నిధులు రూసా పథకం నుంచి విడుదల చేసేందుకు కేంద్ర మానవ వనరుల మంత్విత్వశాఖ ముందుకొచ్చింది. 1957లో ఇక్కడ ఎంబీఏ ప్రవేశపెట్టిన తర్వాతే ఐఐఎంలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రవేశపెట్టాయి. చాలాకాలం వరకు ఏయూ అందించే ఎంబీఏ కోర్సుకు మంచి డిమాండ్ ఉండేది. అయితే కాలక్రమంలో జాతీయ స్థాయి బీ-స్కూళ్లతో పోటీ పడలేకపోయింది.

ఏపీ విద్యార్థులకు సగం సీట్లు

ఐఐఎంలతో పాటు బీ-స్కూళ్ల తరహాలో ప్రవేశాలకు క్యాట్ ర్యాంకులను ప్రాతిపదికగా తీసుకోనున్నారు. మొత్తం సీట్లలో సగం జాతీయస్థాయి విద్యార్థులకు, సగం సీట్లు క్యాట్ ర్యాంకు వచ్చిన ఏపీ విద్యార్థులకు ఇచ్చే యోచనలో ఉన్నారు. ఫీజు ఎంతనేది ఇంకా నిర్ణయించకపోయినా రూ.లక్షల్లో ఉండే అవకాశం ఉంది. రూసా నుంచి తొలి దశలో విడుదల కానున్న రూ.10కోట్లతో తరగతి గదులు, ఇతర వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఐఐఎంల తరహాలో బోర్డు కూడా ఉండాలని సమావేశంలో ప్రతిపాదించారు. మేనేజ్‌మెంట్ కోర్సు నిర్వహించాలంటే పరిశ్రమల నుంచి సహకారం తప్పనిసరిగా ఉండాలి. మేనేజ్‌మెంట్ బోర్డులో పరిశ్రమల ప్రతినిధులకు ప్రాతినిధ్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఐఐఎం విద్యార్థులకు మాదిరిగా శిక్షణ ఇవ్వాలని, మూల్యాంకనం చేపట్టాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఈ ప్రతిపాదనలు ఓ కొలిక్కి వస్తాయని, దీనిపై మరోసారి భేటీ కావాల్సి ఉందని మేనేజ్‌మెంట్ ఆచార్యుడొకరు తెలిపారు. కాగా, నాక్ గ్రేడింగ్‌లో 3.51 పాయింట్లకు మించి ర్యాంకింగ్ వచ్చిన కళాశాలల్లో కొత్త కోర్సుల ప్రారంభానికి రూసా నిధులు ఇవ్వనుందని ఏయూ ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు తెలిపారు. ఏయూలో మేనేజ్‌మెంట్ కోర్సుకు డిజైన్ చేస్తున్నామని, క్యాట్ ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న ఎంబీఏ కోర్సు కూడా కొనసాగుతుందని వీసీ వివరించారు.



ఆకాశానికి అరటి గెలలు!

అక్కడన్నీ అరటి గెలలు. ఆకాశం నుంచి వేలాడుతున్నట్టుగా.. తలకు తగిలేట్టుగా. ఒకటీ రెండూ కాదు.. వందల సంఖ్యలో!. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో కనిపించిన దృశ్యమిది. భీష్మ ఏకాదశి సందర్భంగా ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి ఆలయం ఎదురుగా పందిళ్లు వేసి... వాటికి అరటి గెలలు కట్టి మొక్కుతీర్చుకున్నారు. శనివారం ప్రారంభమైన ఈ ఉత్సవం రెండు రోజులు సాగుతుంది. అరటి గెలల ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివస్తున్నారు.

- టెక్కలి

'ఐఐఎం-వి'తో నూతనోత్సాహం

మూడేళ్ల క్రితం ఐఐఎం-వి తాత్కాలిక క్యాంపస్‌ను ఏయూలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఎదురు భవనంలో ఏర్పాటు చేశారు. ఇది వర్సిటీ పాలకులు, ఆచార్యుల్లో కొత్త ఉత్సాహం నింపింది. అదే సమయంలో దేశ వ్యాప్తంగా రూసా గుర్తించిన మొదటి పది విశ్వవిద్యాలయాల జాబితాలో ఏయూ చోటు సంపాదించింది. వీటిలో మేనేజ్‌మెంట్‌లో కొత్తకోర్సు ప్రవేశపెడితే మౌలిక వసతులకు నిధులిస్తామని కేంద్రం చెప్పడంతో వర్సిటీ పాలకులు అందుకు అవసరమైన సిలబస్, ఇతర అంశాలపై కసరత్తు చేశారు. కోర్సు డిజైనింగ్, సిలబస్ రూపకల్పన, వసతులు, ప్రవేశాల తీరుతెన్నులు వంటి అంశాలపై చర్చించేందుకు రూసా ఉన్నతాధికారి వెంకటేశ్‌కుమార్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం ఇటీవల ఏయూని సందర్శించి, అధికారులతో సమీక్ష నిర్వహించింది. జాతీయ స్థాయిలో ఇమేజ్ వచ్చేలా కోర్సు డిజైన్ చేయడంపై వీరు చర్చించి ముసాయిదా తయారు చేశారు.

మాకో 'మహాలక్ష్మి' కావాలి!

ఆడపిల్లలపై పెరుగుతున్న ఆశ.. గ్రామీణ ప్రాంతాల్లోనూ మార్పు



న్యూఢిల్లీ, జనవరి 27: ఆడపిల్ల అనగానే కడుపులో ఉండగానే ప్రాణం తీసేస్తుంటారు కొందరు. పురిట్లోనే ఉసురు పోసుకునేవారు మరికొందరు. పుట్టిన తర్వాత మూడో కంటికి తెలియకుండా చెత్తకుప్పలు, ముళ్ల పొదల్లో పడేసేవారు ఇంకొందరు. కానీ, రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎప్పటికైనా మార్పు తప్పదు. జాతీయ కుటుంబ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-4) డాటా చూస్తే అదే అనిపిస్తుంది. ఎందుకంటే..దేశంలోని 79శాతం మహిళలు(15- 49 ఏళ్ల వారు), 78 శాతం పురుషులు (15-54 వయసు వారు) కనీసం ఒక్క ఆడపిల్ల అయినా కావాలనుకుంటున్నారు. ఇది విద్యావంతుల్లో వచ్చిన మార్పు కాదు. ఎస్సీ, ఎస్టీలు, ముస్లింలు, గ్రామీణులు ఇలా అనేక వర్గాలకు చెందిన వారిలో కనిపించిన మార్పుగా సర్వే వెల్లడించింది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ 2005-2006లో నిర్వహించిన సర్వేలో 74 శాతం మహిళలు, 65 శాతం పురుషులు తమకు ఆడపిల్ల కావాలని కోరగా.. తాజాగా వారి సంఖ్య పెరగడం విశేషం.

పల్లెల్లో చాలా మార్పు!

కడుపులో ఉన్నది ఆడపిల్ల అనగానే గ్రామీణ ప్రాంతాల్లో ఆ ఇంట్లోని మహిళలే అయిష్టత ప్రదర్శిస్తారు. కొందరు మగాళ్లయితే రెండో కాపురం కూడా పెట్టేస్తారు. తాజా సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మార్పు కనిపిస్తోంది. నగర ప్రాంతాల్లోని 75 శాతం మహిళలు తమకు ఆడపిల్ల కావాలని కోరుకుంటుంటే..గ్రామాల్లో 81% మహిళలు తమ ఇంట్లో ఒక మహాలక్ష్మి ఉంటే బాగుంటుందని ఆశిస్తున్నారు. కనీసం ఇంటర్ వరకూ చదువుకున్న మహిళల్లో 72% మంది ఆడపిల్ల కావాలని కోరుకుంటే...నిరక్షరాస్యుల్లో 85% మంది ఆడ శిశువు కోసం పరితపిస్తుండటం విశేషం.

పట్టణాల్లోని 75% మంది మగవారు ఆడపిల్ల కావాలని ఆశిస్తుంటే గ్రామాల్లో ఇలా కోరుకునేవారు 80 శాతంగా ఉండటం విశేషం. ఈ విషయంలో చదువుకున్న మగాళ్లలో 72% మంది ఆడపిల్ల కావాలని అనుకుంటే...అస్సలు బడి మొహం ఎరుగని 83% మందిలో ఈ ఆశ ఉంది. మతాల వారీగా చూస్తే ఆడపిల్ల కావాలనుకుంటున్న వారిలో ముస్లింలలో 81%, బౌద్ధుల్లో 79%, ఇతర మతాల్లో 70 శాతం మంది ఉన్నారు. ఎస్సీల్లో 81%, ఎస్టీల్లో 81%, బీసీల్లో 80 శాతంగా ఉంది.




తగ్గని 'మగ' మోజు!

ఇక్కడో ఆసక్తికర అంశం ఏమిటంటే...ఆడపిల్ల కావాలనుకునే వారికంటే కాస్త ఎక్కువగానే ఇంట్లో మగసంతానం తప్పనిసరి అనే వారూ ఉన్నారు. దేశవ్యాప్తంగా 82 శాతం మహిళలు, 83 శాతం పురుషుల ఆలోచనలు ఈ దిశగానే ఉన్నాయి. 19 శాతం మంది అయితే ఒకరికన్నా ఎక్కువ మగపిల్లలు కావాలని కోరుకోగా, కేవలం 3.5 శాతం మంది మాత్రమే ఎక్కువ మంది ఆడపిల్లలు కావాలని ఆశించారట.

ఇల్లాలి చదువే ఇంటికి వెలుగు!

శిశు మరణాల్లో కీలక అంశాలను గుర్తించింది జాతీయ కుటుంబ సర్వే. విద్యావంతులైన మహిళలు, కుటుంబ ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉన్న ఇళ్లల్లో శిశు మరణాలు తక్కువగా నమోదయ్యాయి. ఒకప్పుడు ప్రతీ వెయ్యి మందిలో 79 మంది పిల్లలు చనిపోతుండగా...ఇప్పుడా సంఖ్య గణనీయంగా తగ్గిందని సర్వే గుర్తించింది. పుట్టిన పిల్లలకు సమయానికి వ్యాక్సిన్లు వేయించకపోవడం, పోషకాహారం ఇవ్వకపోవడం వల్ల శిశుమరణాలు ఇప్పటికీ నమోదవుతున్నాయి. బలమైన ఆహారం తీసుకోవాలనే శ్రద్ధ గర్భిణులు, పిల్లలకు పాలిచ్చే బాలింతల్లో పెరిగినట్లు సర్వే గుర్తించింది. గతంలో కంటే ఇప్పుడు వైద్యుల సలహాలు పాటించే వారి సంఖ్య కూడా పెరిగింది.



5.68 లక్షల కుటుంబాల సర్వే

విద్యావంతులైన మహిళలు ఉన్న కుటుంబాల్లో పిల్లలు ఎంతమంది కావాలనే దానిపై ఒక ప్లానింగ్ కనిపిస్తోంది. అలాగే పదేళ్లనాటి సర్వేతో పోల్చుకుంటే బాలికల్లో చదువుకుంటున్న వారి శాతం 55.1 నుంచి 68.4కి పెరిగింది. చదువుకున్న మహిళలైతే ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో సరిపెడుతుంటే.. నిరక్షరాస్యులైన మహిళలకు ముగ్గురు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటున్నారు. కిందటి జాతీయ కుటుంబ సర్వేలో ఒక లక్షా 9 వేల కుటుంబాలను పరిగణనలోకి తీసుకుంటే ఈసారి సర్వేలో 5,68,200 కుటుంబాలను సర్వే చేశారు. 8 లక్షల మందికిపైగా మహిళలతో మాట్లాడారు.



పోషకాహారానికి దూరంగా మహిళలు



ఒక క్రమ పద్ధతిలో పోషకాహారం తీసుకునే మహిళల సంఖ్య తగ్గిపోతోంది. 47 శాతం మహిళలు రోజూ కూరగాయలు, ఆకుకూరలను రోజువారీ ఆహారంలో తీసుకుంటుంటే... 38 శాతం మంది వారానికి ఒక్కసారే వీటిని తింటున్నారు. రోజూ పాలూ, మజ్జిగ తాగుతున్న వారిసంఖ్య 45 శాతంగా ఉంది. పప్పుధాన్యాలను ఆహారంలో తీసుకుంటున్న వారి సంఖ్య కూడా ఇలాగే ఉంది. విటమిన్స్, మినరల్స్ ఇచ్చే పండ్లను 54 శాతం మంది మహిళలు వారానికి ఒక్కసారి కూడా తీసుకోవడం లేదట. మహిళల్లో రక్తహీనత ఒకప్పుడు ఆందోళనకరంగా ఉండేది. పదేళ్లగా ఈ విషయంలో గణనీయమైన మార్పు వచ్చినట్లు సర్వే వెల్లడించింది. విద్యావంతుల్లో ఇది 56 శాతం తగ్గగా..నిరక్షరాస్యుల్లో ఈ శాతం 49గా ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు కూడా ఈ సమస్య తగ్గుముఖం పట్టడానికి ఒక కారణంగా కనిపిస్తోంది.

అమరవీరుల కోసం 30న అంతా మౌనం

- ఉదయం 10.58 నుంచి 11 గంటల దాకా రాకపోకలకు బ్రేక్.. నో హారన్
- ఎక్కడివారక్కడే నిశ్శబ్దం

అమరావతి , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం.. మనకోసం.. ప్రాణాలర్పించిన అమరవీరులు వారు. ఆ త్యాగధనులను స్మరించుకునేందుకు ఒక్క రెండు నిమిషాలు నువ్వూ నేను, అందరం మౌనం పాటిద్దాం.. ఆ రెండు నిమిషాలు ఎక్కడివాహనాలు అక్కడే నిలిపేద్దాం.. హారన్లు ఆపేద్దాం.. అని ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఈ అపూర్వఘట్టం ఈనెల 30న ఆవిష్కృతం కానుంది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఆ రోజు ఉదయం 10.58 గంటల నుంచి 11 గంటల దాకా.. అంటే 2 నిమిషాలపాటు రాష్ట్రంలోని వాహనాల రాకపోకలన్నీ నిలిపివేస్తారు. ఆ సమయంలో వాహనాల ఇంజిన్లు ఆపివేయడంతోపాటు హారన్లు కూడా మోగించరు. కార్యాలయాల్లో కార్యకలాపాలు ఆగిపోతాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు ప్రజలంతా ఆ 2 నిమిషాలు మౌనం పాటించాలని ప్రభుత్వం కోరింది.

16న ఆశాభోంస్లేకు 'యశ్‌చోప్రా' అవార్డు

హైదరాబాద్ సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నేపథ్య గాయని ఆశాభోంస్లేను 'యశ్‌చోప్రా నేషనల్ మెమోరియల్ అవార్డు' వరించింది. ఈ మేరకు శనివారం ముంబైలో సుబ్బిరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జ్యూరీ సమావేశంలో ఆశాభోంస్లేను యశ్‌చోప్రా నేషనల్ మెమోరియల్ అవార్డుకు ఎంపిక చేశారు. ముంబైలో ఫిబ్రవరి 16న అవార్డు ప్రదానోత్సవం జరుగుతుంది. మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, లతామంగేష్కర్, ఆశాభోంస్లేకు ఈ అవార్డు అందజేయనున్నారు.

రుతుక్రమంలో అశాస్త్రీయ విధానం

పాత వస్త్రాలు వాడుతున్నవారు 43%

- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వెల్లడి

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రుతుక్రమం సమయంలో మహిళలు తీసుకుంటున్న చర్యలపై జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదిక-4 ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది. 43శాతం మంది మహిళలు ఆ సమయంలో రక్షణకు పాత వస్త్రాలనే వాడుతున్నారట. 56 శాతం మంది శానిటరీ నాప్‌కిన్స్‌ను ఉపయోగిస్తున్నారు. విద్యావంతులైన వారు మాత్రమే ఈ విషయంలో తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆయా మతాల వారీగా చూస్తే 81 శాతం ముస్లిం మహిళలు, 67 శాతం హిందూ మహిళలు, 59 శాతం క్రైస్తవ మహిళలు ఆరోగ్యకరమైన విధానాలు పాటిస్తున్నారు. ఇంటికి అవసరమైన వస్తువుల కొనుగోలు, బంధువుల ఇంటికి వెళ్లే అంశంలో విద్యావంతులైన మహిళలు సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. బ్యాంకు ఖాతాల వినియోగంలోనూ టాప్‌లోనే ఉన్నారు. 36 శాతం మంది గ్రామీణ మహిళలు మొబైల్ ఫోన్లు వాడుతున్నారు. పట్టణాల్లో ఇది 54 శాతంగా ఉంది. ఫోన్లకు వచ్చే మెసేజ్‌లు చదవడంలో హిందూ, క్రైస్తవ మహిళలకంటే ముస్లిం మహిళలు వెనుకబడి ఉన్నారు.

సహనశీలురు!

కొన్ని పరిస్థితుల్లో భర్త కొట్టడాన్ని 82 శాతం మంది మహిళలు సమర్థించారట. ఇంటిని, పిల్లలను నిర్లక్ష్యం చేసినందుకు భర్త కొట్టాడని 70 శాతం మంది చెప్పగా, మరుదులను అగౌరవంగా చూశామని భర్త చేతిలో దెబ్బ తిన్నవారు 66 శాతం మంది. ఇక భర్తతో వాదించి తన్నులు తిన్నవారు 46 శాతంగా ఉన్నారు. భర్తను అవమానించి 44 శాతం మంది మహిళలు దెబ్బలు తిన్నారు. భర్తతో లైంగిక కార్యకలాపాలకు నిరాకరించి దాడులకు గురైనవారు 64 శాతంగా తేలింది. భర్తకు సుఖ వ్యాధులు ఉన్నాయనో? ఆసక్తి లేకపోవడం వల్లనో ఇబ్బంది పడిన మహిళలే ఈ విభాగంలో ఎక్కువగా ఉన్నారు. ఏపీలో 44 శాతం మంది మహిళలు భౌతికంగా, లైంగికంగా వేధింపులకు గురవుతున్నారు. ప్రతీ 20 మందిలో ఒక మహిళ గర్భవతిగా ఉన్నప్పుడు భౌతిక దాడులు ఎదుర్కొంటున్నారు. ఇలా దాడులు జరుగుతున్న సమయంలో ఇతరుల సాయం కోరుతున్న అబలలు 14 శాతం మంది అయితే మౌనంగా భరించే వారు 80 శాతం మంది.

ఏపీలో శిశు మరణాలు

రాష్ట్రంలో శిశు మరణాల శాతం ఎక్కువగా ఉంది. వెయ్యికి 35 మంది పుట్టిన ఏడాదిలోపే మృతి చెందుతున్నారు. ఐదేళ్లు దాటిన చిన్నారుల్లో వెయ్యి మందిలో 41 మంది మృత్యువాత పడుతున్నారు. ఆడపిల్లలు పుట్టిన మొదటి నెలలోనే ఎక్కువగా మృతి చెందుతున్నట్లు సర్వే ద్వారా బయటపడింది. పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో మరణాలు అధికంగా ఉంటున్నాయి.

కాబూల్‌లో మారణహోమం

అంబులెన్స్‌లో బాంబులు కూర్చి పేల్చివేత.. 95 మంది మృతి, 151 మందికి గాయాలు



కాబూల్‌లో అంబులెన్స్ పేలుడు సంభవించిన ప్రాంతం



పేలుడులో గాయపడ్డ చిన్నారి

కాబూల్, జనవరి 27: అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్ తాలిబన్ల దాడితో మరోసారి వణికిపోయింది. నగరంలోని ఇంటర్ కాంటినెంటల్ హోటల్ ముట్టడి ఘటన జరిగిన వారంలోపే, తాలిబన్లు మళ్లీ విరుచుకుపడ్డారు. ప్రాణ సంజీవని అయిన అంబులెన్స్‌లో ప్రాణాంతక పేలుడు పదార్థాలను అమర్చి, భారత రాయబార కార్యాలయం సమీపంలో పేల్చివేశారు. ఈ ఘటనలో 95 మంది మృతి చెందగా, 151 మంది గాయపడ్డారు. పిల్లలు, మహిళలు ఎక్కువగా చనిపోయారు. తాలిబన్లే తాజా దాడికి తెగబడ్డారు. భారత్ సహా విదేశీ రాయబార కార్యాలయాలు, సంస్థలు ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలోకి శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఓ అంబులెన్స్ దూసుకొచ్చింది. తాలిబన్లతో శాంతిచర్చలు జరుపుతున్న హై పీస్ కౌన్సెల్ కార్యాలయ భవనానికి దారితీసే మార్గంలోకి మళ్లింది. అక్కడున్న మొదటి చెక్‌పోస్టు దగ్గర ఆపినపుడు.. వాహనంలోని పేషెంట్‌ను అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళుతున్నానని, అక్కడి సిబ్బందికి అంబులెన్స్ డ్రైవర్ చెప్పాడు. రెండో చెక్‌పోస్టు దగ్గర మాత్రం సిబ్బందికి అనుమానం వచ్చింది. వారు అంబులెన్స్‌లో తనిఖీకి సిద్ధమవుతుండగానే.. వాహన డ్రైవర్ తనను తాను పేల్చేసుకొన్నాడు. ఆ ప్రాంతమంతా మంటలు, పొగ, దుమ్ము పైకి లేచాయి. పేలిన వాహన శకలాలు గాలిలోకి ఎగసిపడ్డాయి. పేలుడు ధాటికి రెండు కిలోమీటర్ల దూరంలోని భవనాలు సైతం కంపించాయి. పలు నివాసాల అద్దాలు పగిలిపోయాయి. 'పేలుడు శబ్దానికి మా షాపు ఉన్న భవనం పునాదులు కదిలిపోయాయి. అద్దాలన్నీ పగిలిపోయాయి' అని అమీనుల్లా అనే ప్రత్యక్ష సాక్షి తెలిపాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడినవారిని జమూరీయత్ ఆస్పత్రికి తరలించారు. వార్డుల్లో మంచాలు చాలకపోవడంతో, ఆ ఆస్పత్రి ప్రాంగణంలోనే వైద్యం అందించాల్సి వచ్చింది. కాగా, తమ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొనే తాజా దాడి జరిగినట్టు హై పీస్ కౌన్సెల్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాబూల్‌లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు దాడులు చేసే అవకాశం ఉన్నదని ఈ ఘటనకు కొన్ని గంటలముందే నిఘా వర్గాలు హెచ్చరించడం గమనార్హం.

భద్రతా సిబ్బందిపై వైమానిక దాడి

ఇరాక్‌లో అమెరికా దళాలు పొరపాటున చేసిన వైమానిక దాడిలో 8మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నిఘా విభాగం సీనియర్ అధికారి, అయిదుగురు పోలీసులు, ఓ మహిళ ఉన్నారు. అల్ బాగ్దాదీ నగర సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేపడుతున్న ఆపరేషన్‌కు సహకరించేందుకు వెళుతుండగా భద్రతా సిబ్బంది కాన్వాయ్‌పై ఈ దాడి జరిగింది. ఉగ్రవాదుల కమాండర్ కరీం అల్ సమర్‌మద్ హాజరవుతున్నాడన్న సమాచారంతో దాడికి ఆదేశించామని ఇరాక్ జాయింట్ ఆపరేషన్ల కమాండర్ తెలిపారు.

డోక్లాం వద్ద సైలెంట్ వార్

చైనాకు దీటుగా రెండు వైమానిక స్థావరాల్ని సిద్ధం చేసిన భారత్

- సుఖోయ్ విమానాల మోహరింపు
- రన్‌వే నిర్మించి- ఫైటర్ జెట్‌లను తరలించిన డ్రాగన్ దేశం
- యుద్ధమేఘాలు ఆవరించాయని పశ్చిమదేశాల మీడియా ఉపగ్రహ చిత్రాలు

డోక్లాం, సిక్కిం, జనవరి 27: ఒక్క నిప్పురవ్వ చాలు... భీకర యుద్ధానికి దారితీయడానికి! ఒక్క కవ్వింపు చర్య చాలు... యుద్ధవిమానాల గర్జనలకు! ఒక్క అంగుళం చొచ్చుకొచ్చినా చాలు...సమరనాదం వినిపించడానికి! భారత్-చైనాల మధ్య వివాదభూమి-- డోక్లాం వద్ద ఇపుడు నిశ్శబ్ద యుద్ధం జరుగుతోంది. ఉద్రిక్తల అంచున, ప్రజ్వలించడానికి సిద్ధంగా ఉందీ పీఠభూమి ప్రాంతం. కొద్దినెలలుగా చైనా ఈ ప్రాంతంలోని కొంత భూభాగాన్ని ఓ సైనిక స్థావరంగా మల్చేసింది. భారత భూభాగం నుంచి కేవలం 81 మీటర్ల దూరంలోనే చైనా స్థావరం ఉందంటే పరిస్థితి ఎంత తారస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఓ రన్‌వేను కొత్తగా నిర్మించి- అనేక యుద్ధవిమానాలను తరలించింది. హెలికాప్టర్ల శబ్దాలు అక్కడ సర్వసాధారణం . దాదాపు 600 మంది చైనా గార్డులు మెషీన్‌గన్లు, అత్యాధునిక ఆయుధాలు ధరించి కాపలా కాస్తుండగా- 10 కిలో మీటర్ల మేర ఓ రోడ్డును కూడా వేసేసింది. శరవేగంగా- రాత్రీ పగలూ కూడా పన్లు చేయిస్తోంది. చైనాకు సంబంధించినంత వరకూ లాసా గాంగ్‌గార్, షిగాట్సే పీస్ ఎర్‌పోర్టులు వ్యూహాత్మకంగా అత్యంతకీలకమైనవి. ఇవి రెండూ డోక్లాం పీఠభూమిలోనే ఉన్నాయి. లాసాలో 18 జే-10 రకం యుద్ధవిమానాలను, 11 జే-5 రకం యుద్ధవిమానాలను మోహరించింది. రెండు కేజే-500 రకం ముందస్తు హెచ్చరికల యుద్ధవిమానాల వ్యవస్థలను, హెచ్‌క్యూ-9 రకం దూరశ్రేణి క్షిపణి వ్యవస్థ తయారీ ఉపకరణాలను, సోర్ డ్రాగన్ మానవరహిత ఏరియల్ వెహికల్స్‌ను కూడా రంగంలోకి దింపింది.

ఇంత జరుగుతూంటే భారత్ ఏం చేస్తోంది?

అమెరికాకు చెందిన జియోపొలిటికల్ కంపెనీ స్ట్రాట్‌ఫోర్- తాజాగా డోక్లాంపై ఉపగ్రహ చిత్రాలను విడుదల చేసింది. రెండు వైపులా సాగుతున్న యుద్ధ సన్నాహాలను చాలా నిశితంగా ఫోటో తీసింది. వీటి ప్రకారం- చైనా దూకుడుకు ప్రతిగా- భారత్ కూడా రెండు వైమానిక స్థావరాలను సిద్ధం చేసేసింది. ఇవి: సిలిగురి దగ్గర్లోని బాగ్‌దోగ్రా, హసిమారా స్థావరాలు. వీటిలో బాగ్‌దోగ్రా వద్ద 30 సుఖోయ్ ఎంకె తరహా యుద్ధవిమానాలను మోహరించింది. భారత వాయుసేనలో అత్యాధునికమైనవీ యుద్ధవిమానాలు. బ్రహ్మోస్ క్షిపణిని కూడా ఇవి మోసుకుపోయి ప్రయోగించగలవు.. సూటిగా లక్ష్యాన్ని ఛేదించగలవు. ఇక హసిమారా స్థావరంలో మిగ్-27 యుద్ధవిమానాలను దింపింది. అంతేకాక- భూతల యుద్ధానికి సన్నద్ధం చేస్తూ సైనిక పటాలాలను క్రమేణా భారత్ కూడా దింపుతోంది. అంటే చైనా గనక ఏ దుస్సాహసానికి దిగినా క్షణాల మీద ప్రతిదాడులు చేయడానికి భారత్ తయారుగా ఉన్నట్లే. అయితే చైనా మోహరింపుతో పోలిస్తే భారత్ కాస్త నెమ్మదిగా కదులుతోందనే చెప్పాలి. డోక్లాం వద్ద ఉద్రిక్తతలు దాదాపు 72 రోజులు కొనసాగి- కిందటేడాది ఆగస్టులో శాంతి నెలకొల్పే ఒప్పందం కుదిరింది. కానీ చైనా ఆధిపత్య, ఆక్రమణ నైజం చల్లారలేదు. మళ్ళీ మొదలెట్టేసింది. రాజకీయ స్థాయిలో విమర్శలు, దౌత్యస్థాయిలో చర్చోపచర్చలు సాగుతూనే ఉన్నాయి. చైనా తన పన చేసుకుపోతూనే ఉంది. అందుకే భారత్ కూడా అలర్ట్ అయింది. పశ్చిమదేశాల కథనం ప్రకారం- పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది. వాస్తవాధీన రేఖ వెంబడి ఏ చిన్న గొడవ జరిగినా డోక్లాం వద్ద యుద్ధవిమానాల గర్జన మొదలైపోతుంది.



డోక్లాం వద్ద చైనా సైనికుల వాహనాలు (ఫైల్)

చైనాపై భారత్ కత్తి కట్టింది

- ఆరెస్సెస్ కోసమే అమెరికాతో కలిసింది
- కేరళ ముఖ్యమంత్రి విజయన్ వ్యాఖ్యలు
- చైనా గొప్ప శక్తిగా అవతరిస్తోందని ప్రశంస



కన్నూర్, జనవరి 27: డోక్లాం ప్రతిష్టంభన తర్వాత కూడా చైనాను కీర్తించడం మానలేదు సీపీఎం! ఇటీవల ఆ పార్టీ కేరళ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ చైనాకు మద్దతుగా వ్యాఖ్యలు చేయడమే కాక... భారత్ తీరును విమర్శిస్తూ వివాదానికి తెరలేపారు. ఇప్పుడు ముఖ్యమంత్రి పినరయి విజయన్ సైతం చైనా విధానాలను పొగడడంతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కన్నూర్‌లో శనివారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశం ఆయన విమర్శలకు వేదిక అయింది. చైనాకు వ్యతిరేకంగా పెద్ద రక్షణ కూటమిని ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రయత్నాల్లో భారత్ వ్యూహాత్మక భాగస్వామి అయిందని విజయన్ అన్నారు. ఇది ఆరెస్సెస్ ప్రయోజనాలకు అనుగుణంగా జరుగుతోందని ఆరోపించారు. ఆరెస్సెస్ లక్ష్యం చైనాకు వ్యతిరేకంగా అమెరికా, భారత్, ఇజ్రాయెల్ వంటి దేశాల మధ్య ఇరుసును నిర్మించడమేనని అన్నారు. చైనా ప్రపంచంలో ఒక పెద్ద శక్తిగా అవతరిస్తోందని కొనియాడారు. ఆర్థిక రంగంలో చైనా పెద్ద ముందుడుగు వేస్తోందని, ప్రపంచ ఆర్థిక వృద్ధిలో 30 శాతం వాటా ఆ దేశానిదేనని చెప్పారు. అంతేకాదు... నిర్దేశించుకున్న లక్ష్యాలను చైనా సాధించిందని అన్నారు. ఆ లక్ష్యాల్లో 6-7 శాతం జీడీపీని సాధించడం ఒకటని చెప్పారు. బీజేపీకి అవినీతి రికార్డు ఉందని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాగా, విజయన్ వ్యాఖ్యలను నిరసిస్తూ తిరువనంతపురంలో సచివాలయం వద్ద యువ మోర్చా కార్యకర్తలు ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.**



విశాఖపట్నంలోని సాగర్‌నగర్ మత్స్యకారులకు శనివారం ఆల్చ రొయ్యలు లభించాయి. ఒక్కోటి కిలో తూగుతాయి. వీటిని కిలో వేయి రూపాయల చొప్పున విక్రయిస్తారు. సముద్రంలో రాళ్లు ఎక్కువగా ఉండే ప్రాంతంలో నాచు మధ్య పెరుగుతాయి. వీటి పైన షెల్ ఆకుపచ్చగా ఉంటుంది. -సాగర్‌నగర్

గగనంలో ఘుమఘుమ..!

స్పైస్‌జెట్ విమానాల్లో అరకు కాఫీ

టూరిజం శాఖతో ఒప్పందం

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకొంటున్నాయి. ఇప్పటివరకు గిరిజనులు పండించిన అరకు కాఫీని ప్రమోట్ చేయడానికి ప్రధాన సదస్సులు, ~వ ఉత్సవాలను ఉపయోగించుకున్నారు. ఇప్పుడు నేరుగా ప్రైవేటు విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌తోనే ఒప్పందం చేసుకున్నారు. ఏపీ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు తిరిగే 36 స్పైస్ జెట్ విమానాల్లో ప్రతి ప్రయాణికునికి అరకు కాఫీని అందించే ఏర్పాటు చేశారు. ప్రతి స్పైస్ జెట్ విమానంలో డ్రా తీసి ప్రయాణికులకు ప్రతి రోజూ రెండు కూపన్లు అందజేస్తారు. వాటిని గెలుచుకున్నవారికి రాష్ట్రంలో ప్రధాన పర్యాటక ప్రాంతాలను పర్యాటక శాఖ చూపిస్తుంది. అరకు కాఫీకి బ్రాండ్ ఇమేజ్ పెంచడంతో పాటు, రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ఈ చర్యలు చేపట్టామని అరకు కాఫీని మార్కెటింగ్ చేస్తున్న గిరిజన సహకార సంఘం (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్ రవిప్రకాశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా, సోమవారం అరకు ఇన్‌స్టెంట్ కాఫీని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.



ఆవుల దొంగల హల్‌చల్

అనంతపురంలో అర్ధరాత్రి బీభత్సం

- ఆవులను ఎత్తుకెళ్లేందుకు యత్నం
- అడ్డుకొన్న పోలీసులపైకి రాళ్లవర్షం
- హైవేపై చేజింగ్.. పోలీస్ కాల్పులు
- బెంగళూరువైపు దూసుకెళ్లిన ముఠా



అనంతపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరంలో ఆవుల దొంగతనానికి ప్రయత్నించిన ఓ ముఠా, ఈ క్రమంలో పోలీసులతో హోరాహోరీ తలపడింది. తమను అడ్డుకోడానికి ప్రయత్నించిన పోలీసులపైకి రాళ్లవర్షం కురిపించింది. పోలీసు జీపును తమ వాహనంతో ఢీకొట్టి ధ్వంసం చేసింది. ఈ ముఠాను పట్టుకోడానికి పోలీసులు జరిపిన చేజింగులు, కాల్పులతో శుక్రవారం అర్ధరాత్రి ఈ నగరం ఉలిక్కిపడింది. పోలీసుల కథనం ప్రకారం, ఆవుల చోరీ ముఠా ఓ వాహనంలో అనంతపురం నగరంలోకి ప్రవేశించింది. ఈ ముఠాలో ఎనిమిదిమంది సభ్యులు ఉన్నారు. తాడిపత్రి బస్టాండ్‌లో రోడ్డుపై ఉన్న ఆవులను వాహనంలోకి వారు ఎక్కించడం మొదలు పెట్టారు. ఈ విషయం తెలుసుకొన్న నాలుగో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకొన్నారు. పోలీసులను చూడగానే వారు, తమ వాహనాన్ని వేగంగా ముందుకు దూకించారు. పోలీసులను గుద్దినంత పని చేసి, హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి ఎక్కేశారు. వారిని హైవేలో రెండు జీపుల్లో పోలీసులు వెంబడించారు. అది గమనించిన ముఠా సభ్యులు, వారిపైకి రాళ్లవర్షం కురిపించారు. తమ వాహనాన్ని వెనక్కి తిప్పి.. తమను వెంబడిస్తున్న ఓ పోలీసు జీపును బలంగా ఢీకొట్టారు. జీపులోంచి కిందకు దూకేసిన పోలీసులు.. అటుగా వచ్చిన ఖాళీ అంబులెన్స్‌లోకి ఎక్కి, తమ చేజింగు కొనసాగించారు. ఆ అంబులెన్స్‌ను కూడా ముఠా సభ్యులు గుద్దేసి, ధ్వంసం చేశారు. ఈ పరిస్థితుల్లో పోలీసు బృందానికి నాయకత్వం వహిస్తున్న ఎస్ఐ శేఖర్.. ముఠా ప్రయాణిస్తున్న వాహనం టైర్లకు గురిపెట్టి మూడు రౌండ్లు కాల్చారు. అయినా, బెదరని ఆ ముఠా అంతే వేగంతో తమ వాహనాన్ని బెంగుళూరు వైపునకు మళ్లించి పరారయింది. ఇది బిహార్ లేక యూపీ ముఠా పనికావచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

ట్రంప్‌తో ఎఫైర్ నిజం కాదు: నిక్కీ



వాషింగ్టన్, జనవరి 27: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, తనకు లైంగిక సంబంధాలను అంటగడుతూ చక్కర్లు కొడుతున్న వార్తాకథనాలను తీవ్రంగా నిరసించారు ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ. ఈ వార్తలు వినడానికే అసహ్యంగా, జుగుప్సాకరంగా ఉన్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ట్రంప్ వైట్ హౌస్‌లోనూ రాసలీలలు సాగిస్తున్నారని, ఓ మహిళతో ఆయనకు ఎఫైర్ ఉందని ఆయనపై ఓ సంచలనాత్మక పుస్తకం రాసిన రచయిత మైఖేల్ వోల్ఫ్ ఈ మధ్యే పేర్కొన్నాడు. ఆ మహిళ నిక్కీ హేలీయేనని వార్తలు గుప్పుమన్నాయి. "ఇది దారుణం.. నేను అధ్యక్షుడితో చర్చలు సాగించే సమయంలో ఒక్కదాన్నీ ఉండను.. చాలా మంది అక్కడ ఉంటారు. జీవితంలో విజయాలు సాధించిన మహిళలపై ఇలాంటి దాడులు సహజమే." అని హేలీ గట్టిగా తిప్పికొట్టారు.

వీన్‌స్టీన్ నన్నూ వేధించాడు: భారత సంతతి మహిళ

వాషింగ్టన్/న్యూయార్క్, జనవరి 27: ప్రముఖ హాలీవుడ్ నిర్మాత హార్వే వీన్‌స్టీన్ తననూ వేధించాడని భారత సంతతి మహిళ ఆరోపించింది. వీన్‌స్టీన్ వేధింపులపై ఇప్పటికే డజన్లకొద్దీ హాలీవుడ్ నటీమణులు ఆరోపించిన సంగతి తెలిసిందే. కాగా, 2013-2015 మధ్య వీన్‌స్టీన్‌కు పీఏగా పనిచేసిన భారత సంతతి మహిళ సందీప్ రెహల్ కూడా అతని వేధింపులకు గురయ్యానని వెల్లడించింది. వీన్‌స్టీన్ వేధింపులకు అంతు ఉండేది కాదని.. తనను అసభ్యంగా తాకేవాడని, అసభ్య పదజాలంతో మాట్లాడేవాడని చెప్పుకొచ్చింది. ఈ మేరకు సౌతర్న్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఆఫ్ న్యూయార్క్‌లో వీన్‌స్టీన్‌పై సందీప్ రెహల్ ఈ నెల 25న దావా వేసింది. ఆమె ఫిర్యాదుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం వీన్‌స్టీన్‌కు సమన్లు జారీ చేసింది.

21 నుంచి 'టెట్'

- 10 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్
- మార్చి 16న తుది ఫలితాలు
- విద్యార్థుల వినతి మేరకే షెడ్యూల్ సవరణ : గంటా

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)ను ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3 వరకూ నిర్వహించనున్నామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారమైతే ఫిబ్రవరి 5 నుంచి 15 వరకూ ఈ పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ, పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు మరింత సమయం కావాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుంచి విస్తృతంగా అభ్యర్థనలు వస్తుండటంతో టెట్ షెడ్యూల్‌ను మళ్లీ సవరించాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 4,46,833 మంది అభ్యర్థులు టెట్ పరీక్షకు దరఖాస్తు చేశారని గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో పేపర్-1(ఎస్‌జీటీ)కి 1,80,249 మంది, పేపర్-2(స్కూల్ అసిస్టెంట్)కి 2,12,794 మంది, పేపర్-3(భాషా పండిట్)కి 53,290 మంది ఉన్నట్లు వివరించారు. పరీక్షలు తాజా షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో జరుగుతాయని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

సవరించిన షెడ్యూల్

- మార్చి 3 వరకూ పని దినాల్లో హెల్ప్‌డెస్క్ సేవలు
- దరఖాస్తులు, ఇతర అంశాలపై ఫిబ్రవరి 17 వరకూ ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణ
- ఫిబ్రవరి 9 నుంచి అందుబాటులో ఆన్‌లైన్ మాక్ టెస్ట్‌లు
- ఫిబ్రవరి 10 నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడింగ్ చేసుకోవచ్చు
- ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3 వరకూ టెట్ (పేపర్-1, పేపర్- 2, పేపర్-3) పరీక్షలు
- సెషన్-1: ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు... సెషన్-2: మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు
- ప్రాథమిక 'కీ' మార్చి 4న ప్రకటన
- ప్రాథమిక 'కీ'పై మార్చి 4 నుంచి 9 వరకూ అభ్యంతరాల స్వీకరణ
- మార్చి 12న తుది కీ విడుదల
- మార్చి 16న తుది ఫలితాల ప్రకటన

వైద్య విద్యలో సమూల మార్పులు

సాగర్‌నగర్(విశాఖ), జనవరి 27: జాతీయ వైద్య విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువస్తున్నట్టు భారత ప్రభుత్వ వైద్య విద్యావిభాగం సహాయ డైరెక్టర్ జనరల్, నీట్ ప్రధాన అధికారి డాక్టర్ బీ శ్రీనివాస్ వెల్లడించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వార్షిక వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. వైద్య విద్యలో థియరీ కంటే క్లినికల్ శిక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా భవిష్యత్తులో సిలబస్‌ను మార్పు చేయనున్నట్టు వెల్లడించారు. ఎంసీఐ స్థానంలో జాతీయ వైద్య మండలి(నేషనల్ మెడికల్ కౌన్సిల్) ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలను వివరించారు.

ఆర్టీసీకి తగ్గిన నష్టాలు

- రాష్ట్రంలో 15 డిపోలకు లాభాలు
- విజయవాడ-1 డిపో ఆదాయంలో ఫస్ట్

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ ఆర్టీసీ) నష్టాల కష్టాలను అధిగమిస్తోంది. డిసెంబరు-2016 వరకు రూ.663.15 కోట్లు నష్టాల్లో ఉన్న ఈ సంస్థ డిసెంబరు-2017కు నష్టాన్ని రూ.350.16 కోట్లకు తగ్గించగలిగింది. ఏపీఎస్ ఆర్టీసీకి 2016 డిసెంబరు నెలలో రూ.77.19 కోట్ల నష్టం రాగా, డిసెంబరు-2017లో రూ.67.29 కోట్లకు తగ్గించగలిగారు. ఒక్క డిసెంబరు నెలలో కార్పొరేషన్ బస్సులకు రూ.60.42 కోట్లు నష్టమొస్తే, ప్రైవేట్ అద్దె బస్సుల ద్వారా రూ.6.86 కోట్లు నష్టాలు వచ్చాయి. బస్సును ఒక కిలోమీటర్ నడిపితే వచ్చే ఆదాయ వ్యయాలకు సంబంధించి ఈపీకే(ఎర్నింగ్ పర్ కిలోమీటర్)ను లెక్కించారు. 2016 డిసెంబరులో ఈపీకే రూ.527 నష్టంలో ఉండగా, దాన్ని 2017 డిసెంబరుకు రూ.297కు తగ్గించగలిగారు. ఆదాయాల్లో విజయవాడ-1 డిపో మొదటి స్థానంలో ఉంది. డిసెంబరు 2017 వరకు ఈ డిపో రూ.12.37 కోట్ల ఆదాయాన్ని గడించింది. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం డిపో రూ.6.19 కోట్లతో రెండో ర్యాంక్, కాకినాడ రూ.5.72 కోట్లతో మూడో ర్యాంక్, విజయవాడ-ఏఎన్‌జీఆర్ రూ.3.70 కోట్లతో నాలుగో ర్యాంక్, రాజమండ్రి డిపో రూ.3.41 కోట్లతో ఐదో ర్యాంక్‌లో ఉన్నాయి. ఆ తర్వాత స్థానంలో వరుసగా కనిగిరి, కర్నూలు, కడప, తిరుమల ఇలా 15 డిపోలు ఆదాయాలు గడిస్తుండగా మిగిలిన డిపోలు నష్టాల్లో నడుస్తున్నాయి.

నిరుటి మేటి పదంగా ఆధార్

జైపూర్, జనవరి 27: ఆధార్...ఇప్పుడు మన దేశంలో అందరికీ అవసరమైన కార్డు. నిత్య జీవితంలో ఆధార్ కార్డు దాదాపు అన్ని వర్గాలనూ ప్రభావితం చేస్తోంది. అయితే ఈ ఆధార్‌ను హిందీ పదంగా గుర్తించి దాన్ని గత ఏడాది మేటి పదంగా ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు ప్రకటించాయి. ఇక్కడ జరుగుతున్న జైపూర్ లిటరరీ ఫెస్టివల్‌లో పాత్రికేయుడు సౌరభ్ ద్వివేదీ శనివారం ఈ విషయం తెలిపారు. 'మిత్రోం', 'నోట్‌బందీ', 'గోరక్షక్' వంటి పదాలను కూడా పరిశీలించినప్పటికీ 'ఆధార్'పైనే చర్చలు, వివాదాలు నడుస్తున్నందున అది గత ఏడాది మేటి పదంగా నిలిచిందన్నారు.



ఆర్కే RK

కొత్తపలుకు

పవనూ.. పాతికేళ్లు!

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాజకీయ పార్టీని ఎందుకు ప్రారంభించారా? అన్న అనుమానాలు ఆయన తెలంగాణ పర్యటన తర్వాత మరింత బలపడ్డాయి. 2019 ఎన్నికలలో రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పోటీ చేస్తామని ప్రకటించిన పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి పదవి చేపట్టడానికి అవసరమైన అనుభవం తనకు లేదనీ, ఆ పదవి నిర్వహణ కష్టంతో కూడుకున్నదనీ చెప్పడం ద్వారా అభిమానుల ఆశలపై నీళ్లు చల్లారు. ఇప్పుడు తెలంగాణ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రశంసించడం ద్వారా ప్రస్తుతానికి తెలంగాణలో జనసేన అవసరం లేదని స్వయంగా చెప్పుకొన్నారు. కరీంనగర్, ఖమ్మం జిల్లాలలో ఆయన ప్రసంగాలు విన్నవారికి ఆయనలోని అయోమయం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ప్రత్యామ్నాయ రాజకీయాలు ఉండాలని కోరుకుంటున్నవారు కూడా పవన్ కల్యాణ్ తీరు చూసి నిరాశ చెందారు. ఎన్నికలలో అద్భుతాలు సృష్టిస్తానని తాను చెప్పడం లేదని కూడా ఆయన చెప్పుకొచ్చారు. తన సిద్ధాంతాలు ఏమిటో చెప్పే ప్రయత్నం చేశారు గానీ వాటిని అర్థమయ్యేలా వివరించలేక పోయారు. తాను అనుకుంటున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి పాతికేళ్లు పడుతుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంటే అధికారం లేకుండా పాతికేళ్లపాటు రాజకీయం చేస్తూ ఉంటారన్న మాట! ఇప్పుడున్న రాజకీయాలకు ఈ ఆలోచనా విధానం తగినదేనా అంటే కాదనే చెప్పాలి. రాజకీయ పార్టీల అంతిమ లక్ష్యం అధికారం సాధించడమే! అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్న పార్టీలకే ప్రజలు ఓట్లు వేస్తారు. కార్యకర్తలు అండగా నిలుస్తారు. అధికారం దక్కుతుందన్న నమ్మకం లేకపోయినా సిద్ధాంత బలంపై ఆధారపడి పనిచేసే కమ్యూనిస్టు పార్టీలు కూడా ఇటీవలి కాలంలో బలహీనపడుతున్నాయి. కమ్యూనిస్టు పార్టీలలో సుదీర్ఘకాలం పనిచేసిన నాయకులు కూడా నిరాశానిస్పృహలతో పార్టీలు మారుతున్నారు. ఈ నేపథ్యంలో స్పష్టమైన లక్ష్యం లేకుండా రాజకీయ పార్టీ ప్రారంభించిన వారెవ్వరికీ మనుగడ ఉండదు. పవన్ కల్యాణ్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. తనది సరికొత్త రాజకీయ ఆలోచనా విధానమనీ, అధికారంలో ఉన్న పార్టీలతో ఘర్షణపడటం తన విధానం కాదనీ ఆయన చెబుతుంటారు. ఇందులో ఆక్షేపించవలసింది ఏమీ లేదు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడాన్ని ఆహ్వానించవలసిందే! ఇదే లక్ష్యం అయ్యే పక్షంలో అందుకు రాజకీయ పార్టీ అవసరం

అటు ఆంధ్రప్రదేశ్– ఇటు తెలంగాణలో పవన్ కల్యాణ్ ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశాలకు హాజరైన వారిలో 30 ఏళ్లు దాటినవాళ్లు పెద్దగా కనబడరు. అంటే కేవలం అభిమానులే కార్యకర్తలుగా మారారన్న మాట! పవన్ కల్యాణ్ నటించిన 'అజ్ఞాతవాసి' అంత ఘోరంగా దెబ్బతిందంటే సినిమా బాగా లేనప్పుడు అభిమానులు కూడా ఏమీ చేయలేరనే కదా! అలాంటిది రాజకీయ పార్టీలను అభిమానులు విజయ తీరాలకు ఎలా చేర్చగలరు?

లేదు. లోక్‌సత్తా తరహా వేదికను ఏర్పాటు చేస్తే సరిపోతుంది. పవన్ కల్యాణ్‌కు అసంఖ్యాకంగా అభిమానులు ఉన్నారు. రాజకీయాలలో రాణించాలంటే అభిమానుల బలం సరిపోదు. సమాజంలో వివిధ వర్గాల ఆదరణ లభించాలి. అటు ఆంధ్రప్రదేశ్– ఇటు తెలంగాణలో పవన్ కల్యాణ్ ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశాలకు హాజరైన వారిలో 30 ఏళ్లు దాటినవాళ్లు పెద్దగా కనబడరు. అంటే కేవలం అభిమానులే కార్యకర్తలుగా మారారన్న మాట! తమ అభిమాన నటుడు నటించిన సినిమాను విజయవంతం చేయడంలో అభిమానుల పాత్ర అతి స్వల్పం. పవన్ కల్యాణ్ నటించిన అజ్ఞాతవాసి అంత ఘోరంగా దెబ్బతిందంటే సినిమా బాగా లేనప్పుడు అభిమానులు కూడా ఏమీ చేయలేరనే కదా! అలాంటిది రాజకీయ పార్టీలను అభిమానులు విజయ తీరాలకు ఎలా చేర్చగలరు? కొన్ని నెలల క్రితం వరకు పవన్ కల్యాణ్ ప్రారంభించిన జనసేన పార్టీ పట్ల రాజకీయ వర్గాలలో కొన్ని అంచనాలు ఉండేవి. ఆంధ్రప్రదేశ్– తెలంగాణలో ఆయన పర్యటన తర్వాత జనసేన పార్టీని సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం లేదన్న అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ వల్ల రెండు రాష్ట్రాలలోనూ అధికార పార్టీలకు లాభమే తప్ప నష్టం లేదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పొగిడినందుకు కాంగ్రెస్ పార్టీ పవన్ కల్యాణ్‌పై విరుచుకుపడింది. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ఆయనపై ఎప్పటి నుంచో విమర్శలు చేస్తోంది. అధికారపక్షాలకు మేలు చేయడానికే పవన్ కల్యాణ్ జనసేనను ప్రారంభించారన్న విమర్శలను అప్పుడే మూటగట్టుకున్నారు. ఎన్నికల బరిలో ప్రత్యర్థులు ఎంత ఎక్కువగా ఉంటే అధికారపక్షాలకు అంత మంచిది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోతాయి కనుక! తెలంగాణలో అధికారం కోసం తహతహలాడుతున్న కాంగ్రెస్‌పార్టీ, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోతాయన్న ఆందోళనతోనే పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేసుకుంది. ఏపీలో కూడా ఇదే పరిస్థితి! అయితే పవన్ కల్యాణ్ ప్రసంగాలు విన్నవారికి ఆయనలో డొల్లతనం పాలు ఎక్కువ అన్న అభిప్రాయం కలుగుతోంది. ఆశయం ఎంత గొప్పదైనా కావచ్చు. దాన్ని సాధించడానికి ఎంచుకునే మార్గం, గడువు కూడా అంతే ముఖ్యం. తాను ఆవేశంతో నిర్ణయాలు తీసుకోననీ, ఆలోచించే నిర్ణయాలు తీసుకుంటాననీ పవన్ కల్యాణ్ చెబుతుంటారు గానీ గత అనుభవాలను పరిశీలిస్తే అలా అనిపించదు. చిరంజీవి చిన్న కుమార్తె శ్రీజ వివాహం కాగానే, కొత్త జంట వ్యక్తంచేసిన భయాందోళనలకు సమాధానంగా పవన్ కల్యాణ్ తన రివాల్వర్‌ను జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి పోలీసులకు అప్పగించారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో ఉన్న కుళ్లును చూసి ఆవేదన కలుగుతోందని అన్నారు. ప్రజల కష్టాలు చూసి చలించిపోతున్నానని, వాటి పరిష్కారానికి 'కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్'ను ఏర్పాటుచేస్తున్నానని చెప్పి దానికి తన వంతు విరాళంగా కోటి రూపాయలను ప్రకటించారు. సేవా కార్యక్రమాలు చేయడానికి రాజకీయ నాయకులు కావలసిన అవసరం లేదని కూడా చెప్పుకొచ్చారు. 40 రోజుల్లో 'కామన్‌మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్' పనిచేయడం ప్రారంభిస్తుందంటూ, సహాయం కావలసిన వాళ్లు ఫలానా ఫోన్ నంబర్లకు ఫోన్ చేయవచ్చునని కూడా పవన్ కల్యాణ్ అప్పట్లో ప్రకటించారు. తనవద్ద పనిచేస్తున్న ఉద్యోగుల జీతాల కోసం దాచిన కోటీ 32 లక్షల రూపాయల నుంచి కోటి రూపాయలను విరాళంగా ఇస్తున్నానని వివరించారు. ఆ సందర్భంగా జీఎస్ కన్‌స్ట్రక్షన్ అధినేత సుధాకర్‌రావు పది లక్షల రూపాయలను, రాంరెడ్డి అనే అభిమాని లక్ష రూపాయలను ఆ ఫోర్స్‌కు విరాళంగా ప్రకటించారు. సీన్ కట్ చేస్తే ఇప్పుడు ఆ 'కామన్‌మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్' ఏమైందో తెలియదు. ప్రకటించిన విరాళాలతో ఏమి చేశారో తెలియదు. పవన్ కల్యాణ్ ఆవేశంతో నిర్ణయాలు తీసుకుంటారనీ, ఆచరణ విషయం వచ్చేసరికి వెనకడుగు వేస్తారనీ చెప్పడానికి ఈ ఉదంతం చాలు. అయితే సమాజంలో చోటు చేసుకుంటున్న అన్యాయాలు, అక్రమాల పట్ల ఆయన తరచుగా అంతర్మథనం చెందుతుంటారన్నది నిజం. అలా అంతర్మథనం చెందినప్పుడు వచ్చే ఆలోచనలే 'కామన్‌మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్' వంటివి. వర్తమాన రాజకీయాల పట్ల కూడా పవన్ కల్యాణ్‌కు కొన్ని అభిప్రాయాలు ఉండి ఉంటాయి. ఆ కారణంగానే రాజకీయాలను మార్చాలన్న ఆలోచన చేసి జనసేన పార్టీని ప్రారంభించి ఉంటారు. అయితే ఆయన ఆలోచనలకు తగ్గట్టుగా స్పందించే పరిస్థితి సమాజంలో లేదన్న విషయం పాపం పవన్ కల్యాణ్‌కు తెలియదు. సినిమాలలో నటించేవారు వాస్తవికతకు దూరంగా ఉంటారు. సినిమాలలో చూపించినట్టుగా గంటల వ్యవధిలోనే చెడుపై యుద్ధం చేసి గెలవవచ్చని అనుకుంటుంటారు. ఈ కారణంగానే సినీ రంగానికి చెందిన పలువురు రాజకీయాలలోకి వచ్చి ఏదో చేయాలని ఉబలాటపడుతుంటారు. రాజకీయ అనుభవం లేకపోవడం, సాధ్యాసాధ్యాలను ఆకళింపు చేసుకోకపోవడం వల్ల ఆ తర్వాత బొక్కబోర్లా పడుతుంటారు. ఒకప్పటి సూపర్‌స్టార్ కృష్ణ కూడా రాజకీయాలలో ఫ్లాప్ అయ్యారు. చిరంజీవి విషయం తెలిసిందే! ఇప్పుడు తమ్ముడు పవన్ కల్యాణ్ వంతు వచ్చింది. వాస్తవానికి ఆంధ్రాతో పోల్చుకుంటే తెలంగాణలో పవన్ కల్యాణ్‌కు అభిమానులు తక్కువ. ఆయనకు అంతో ఇంతో బలం ఉందంటే అది ఆంధ్రప్రదేశ్‌లోనే! అలాంటప్పుడు తెలంగాణలో మాట్లాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం సహజం. ఈ మర్మం తెలియని పవన్ కల్యాణ్ తెలంగాణ రాష్ట్రం పసిబిడ్డ అనీ, దాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికై ప్రభుత్వానికి సహకరించాలని అంటూ 'జై తెలంగాణ' నినాదాన్ని 'వందేమాతరం'తో పోల్చారు. దీనిపై ఆంధ్రా ప్రాంతంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్ర విభజన వల్ల దిక్కులేని రాష్ట్రంగా అవతరించిన ఆంధ్రప్రదేశ్‌ను కాదని, మిగులు బడ్జెట్ కలిగి ఉన్న తెలంగాణ పట్ల సానుభూతి ప్రకటించడం ఏమిటన్న విమర్శలు వచ్చాయి. తెలంగాణకు హైదరాబాద్ ఉంది. ఆదాయం ఉంది. ఏపీకి ఏమి ఉంది? ఆదాయం లేదు. రాజధాని కూడా లేదు. అనాథలా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను కాదని తెలంగాణ పట్ల మమకారం ప్రదర్శిస్తున్నారంటే పవన్ కల్యాణ్ ఆర్థిక ప్రయోజనాలన్నీ హైదరాబాద్‌తో ముడిపడి ఉండటమే కారణమని విమర్శించినవాళ్లు కూడా లేకపోలేదు. రాజకీయ నాయకులు ఆచితూచి మాట్లాడుతుంటారు. పవన్ కల్యాణ్ రాజకీయ నాయకుడు కాదు కనుక మనసులో ఏమనిపిస్తే అదే చెబుతుంటారు. ఆయన అసలు సిసలైన రాజకీయ నాయకుడై ఉంటే లక్ష్యం చేరుకోవడం కోసం పాతికేళ్లపాటు తనతో ప్రయాణించడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపును ఇవ్వరు. పాతికేళ్ల తర్వాత ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు? పాతికేళ్ల తర్వాత అద్భుతాలు చూపిస్తామంటే ప్రజలు అంతకాలం వేచి ఉంటారా? ప్రజలకు సహనం తక్కువ. ఇప్పుడు నీకు ఓటు వేస్తే ఏమి చేస్తావో చెప్పు అంటారు. పాతికేళ్లు గడిచేసరికి పవన్ కల్యాణ్ 70 ఏళ్లకు చేరుకుంటారు. ఇటీవలే పవన్‌కు జన్మించిన మార్క్ శంకర్ పవనోవిచ్ పాతికేళ్లకు చేరుకుంటారు. అంటే పాతికేళ్ల తర్వాత జనసేనపార్టీ సారథ్యాన్ని మార్క్ శంకర్ పవనోవిచ్ చేపడతారా? రాజకీయాలలో ఇలాంటి ప్రకటనలు హాస్యాస్పదంగా ఉంటాయి. జనసేన పార్టీ మరో కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ కాకూడదని కోరుకుందాం. పవన్ కల్యాణ్ వంటివారు వర్తమాన రాజకీయాలలో ఇమడలేరని స్పష్టమవుతోంది. కనుక ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజకీయ పార్టీ కాకుండా ప్రత్యామ్నాయ వేదికను ఆయన నిర్మించడం మంచిది. దానివల్ల ఎంతో కొంత మందికి ఎంతో కొంత ప్రయోజనం చేకూరుతుంది.

పవన్ కల్యాణ్ రాజకీయ నాయకుడు కాదు కనుక మనసులో ఏమనిపిస్తే అదే చెబుతుంటారు. ఆయన అసలు సిసలైన రాజకీయ నాయకుడై ఉంటే లక్ష్యం చేరుకోవడం కోసం పాతికేళ్లపాటు తనతో ప్రయాణించడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపును ఇవ్వరు. పాతికేళ్ల తర్వాత ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు? పాతికేళ్ల తర్వాత అద్భుతాలు చూపిస్తామంటే ప్రజలు అంతకాలం వేచి ఉంటారా? పాతికేళ్లు గడిచేసరికి పవన్ కల్యాణ్ 70 ఏళ్లకు చేరుకుంటారు. ఇటీవలే పవన్‌కు జన్మించిన మార్క్ శంకర్ పవనోవిచ్ పాతికేళ్లకు చేరుకుంటారు. అంటే పాతికేళ్ల తర్వాత జనసేన పార్టీ సారథ్యాన్ని మార్క్ శంకర్ పవనోవిచ్ చేపడతారా?



అదృష్టం పట్టింది!

ఈ విషయం అలా ఉంచితే, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును అదృష్టం 'వెంటాడుతోంది'! వచ్చే ఎన్నికల తర్వాత కూడా ఆయన అధికారాన్ని పదిలం చేయడం కోసం తెలంగాణలో అనేక వర్గాలు పోటీ పడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడానికై అనేక శక్తులు ఆరాటపడుతున్నాయి. ఈ పరిణామంతో కాలం కలిసి వస్తే అధికారం అందుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడానికే పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయోగించారని కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే విమర్శిస్తున్నారు. జనసేన పార్టీ కాకుండా మరో నాలుగైదు పార్టీలు పురుడుపోసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే పురుడుపోసుకున్న పార్టీలు ఎక్కడున్నాయో తెలియదు. అధికార తెలంగాణ రాష్ట్ర సమితికి వ్యతిరేకంగా ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్– బీజేపీ మోహరించి ఉన్నాయి. ఎన్నికల నాటికి ఎవరో ఒకరితో చేయి కలిపే అవకాశం రాకపోతుందా అని తెలుగుదేశం పార్టీ ఎదురుచూస్తోంది. కాంగ్రెస్– బీజేపీతో జత కట్టడం ఇష్టంలేని సీపీఎం, పలు ప్రజా సంఘాలను కలుపుకొని ఎన్నికలలో పోటీకి సిద్ధపడుతోంది. రాజకీయ జేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ ఇప్పుడు రాజకీయ పార్టీ ప్రారంభించాలని ఆరాటపడుతున్నారు. తాము కూడా ఒక పార్టీని ప్రారంభిస్తున్నట్టు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్ రెండు రోజుల క్రితం ప్రకటించారు. చెరుకు సుధాకర్ వంటివారు కొందరు కలిసి 'ఇంటి పార్టీ' అని ఒకపార్టీని ప్రకటించుకున్నారు. తెలంగాణ ప్రజలు ఇన్ని రాజకీయ పార్టీలను భరించగలరా? అసలు రాజకీయ పార్టీ అంటే ఏమిటి? అందులోని సాధక బాధకాలు ఏమిటి? వంటి అంశాలపై కనీస అవగాహన లేకుండా రాజకీయ పార్టీలను ప్రకటించడం వల్ల అభాసుపాలు కావడం మినహా మరేమీ ఉండదు. రాజకీయ జేఏసీ ఛైర్మన్‌గా కోదండరామ్‌కు గుర్తింపు ఉంది. తెలంగాణ సాధనలో ఆయన కృషి కూడా ఉందని ప్రజలకు ఆయన పట్ల ఎంతో కొంత సానుభూతి ఉంది. ఎక్కడికి వెళ్లినా పది మంది పలకరిస్తారు. అంత మాత్రాన రాజకీయ పార్టీని ప్రారంభించి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఢీకొట్టగలనని ఆయన భావిస్తే అది అవగాహనారాహిత్యమే అవుతుంది. రాజకీయాలలో ఆరితేరిన కేసీఆర్ కూడా ఉద్యమ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమితిని ఇక నడపలేనని ఒకానొక సమయంలో చేతులెత్తేశారు. నాయకులు, కార్యకర్తల బలం పుష్కలంగా ఉండటంతో పాటు తెలంగాణ కావాలన్న ఆకాంక్ష ప్రజలలో బలంగా ఉండటంతో ఆయన తన పార్టీని బతికించుకోగలిగారు. ఇప్పుడు తెలంగాణలో రాజకీయ పార్టీలను ప్రారంభించాలనుకుంటున్న వ్యక్తులు తప్ప వారి పక్కన ఉన్నవారెవ్వరినీ తెలంగాణ ప్రజలు గుర్తించలేని స్థితి ఉంది. కోదండరామ్ వెంట ఉన్నది ఎవరో ఎంత మందికి తెలుసు? చంద్రకుమార్ ఎవరో ఎంత మందికి తెలుసు? ఈ పరిణామాలన్నీ సహజంగానే కేసీఆర్‌కు ఆనందాన్నే కలిగిస్తాయి. అదే సమయంలో కాంగ్రెస్‌ను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. రాజకీయ పార్టీ ప్రకటించకుండా కోదండరామ్‌ను నిలువరించడానికి కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో తాము అధికారంలోకి వచ్చే అవకాశాన్ని కోదండరామ్ ఎక్కడ దెబ్బతీస్తారోనని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. మొత్తానికి తెలంగాణ మాగాణం ఔత్సాహిక రాజకీయ నాయకులకు ప్రయోగశాల కాబోతున్నదన్న మాట! అయినా ఎవరు చేయాల్సిన పని వారు చేయాలి గానీ అన్నీ మేమే చేస్తామనుకోవడం భ్రమే అవుతుంది. బురద పూసుకునేవాడు ఉన్నప్పుడు కడిగేవాడి అవసరం ఉంటుంది. బురదను కడగాల్సినవాళ్లు కూడా నేనే బురద పూసుకుని నేనే కడుక్కుంటానని అంటే ఎలా? అయినా ప్రజలు తెలివైనవాళ్లు. ఓటును వృథా చేసుకోరు. ఏయే పార్టీల మధ్య పోరు కేంద్రీకృతమవుతుందో గమనించి అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు. ఉదాహరణకు నంద్యాల ఉప ఎన్నికనే తీసుకుందాం! అక్కడ నామినేషన్లు దాఖలు చేసేనాటికి కాంగ్రెస్ బలం ఆరు శాతానికి పైగా ఉంది. పోలింగ్ సమీపించే నాటికి అది 2.8 శాతానికి తగ్గిపోయింది. పోలింగ్ రోజున అది పాయింట్ ఎనిమిది శాతానికి మాత్రమే పరిమితమైంది. తెలుగుదేశం– వైసీపీ మధ్య పోరు కేంద్రీకృతమైనందున ఓటర్లు కూడా అలాగే విడిపోయారు. కాంగ్రెస్‌కు వేద్దామనుకున్నవాళ్లు కూడా మనసు మార్చుకున్నారు. ఇప్పుడు తెలంగాణలో ప్రారంభం అవుతాయనుకుంటున్న పార్టీల పరిస్థితి కూడా ఇంతకంటే భిన్నంగా ఉంటుందని చెప్పలేం. అయితే ఒక్కో పార్టీ ఒక్కో నియోజకవర్గంలో వందో రెండొందలో ఓట్లు చీల్చినా అది తమకు నష్టమేనన్నది కాంగ్రెస్ నాయకుల బాధ! అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ అదృష్టవంతుడు అని అంటున్నది. ఎన్నికల బరిలో ఎంత మంది ప్రత్యర్థులు ఉంటే అంత మంచిదని ఆయన కోరుకోవడం సహజమే కదా! చూద్దాం ఎవరి ప్రతాపం ఎంతో?

ప్రజలు తెలివైనవాళ్లు. ఓటును వృథా చేసుకోరు. ఏయే పార్టీల మధ్య పోరు కేంద్రీకృతమవుతుందో గమనించి అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు. నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం– వైసీపీ మధ్య పోరు కేంద్రీకృతమైనందున ఓటర్లు కూడా అలాగే విడిపోయారు. కాంగ్రెస్‌కు వేద్దామనుకున్నవాళ్లు కూడా మనసు మార్చుకున్నారు. ఇప్పుడు తెలంగాణలో ప్రారంభం అవుతాయనుకుంటున్న పార్టీల పరిస్థితి కూడా ఇంతకంటే భిన్నంగా ఉంటుందని చెప్పలేం. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ అదృష్టవంతుడు అని అంటున్నది. ఎన్నికల బరిలో ఎంతమంది ప్రత్యర్థులు ఉంటే అంత మంచిదని ఆయన కోరుకోవడం సహజమే కదా!

'ఎన్నికల పద్మాలు'!

ఇప్పుడు 'పద్మ' అవార్డుల వ్యవహారం చూద్దాం. తెలుగు రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందా? అవార్డులు– రివార్డుల విషయంలో కూడా ఎన్నికల ప్రయోజనాలే చూస్తోందా? 69వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' అవార్డుల తీరు చూశాక ఈ అనుమానాలు కలుగకమానవు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పంపిన జాబితాను కేంద్ర ప్రభుత్వం కనీసం పరిశీలించిన దాఖలాలు కూడా లేవు. తెలంగాణ ప్రభుత్వం 25 మంది పేర్లను 'పద్మ' అవార్డుల కోసం సిఫారసు చేయగా, ఒక్కరంటే ఒక్కరికి కూడా జాబితాలో చోటుదక్కలేదు. దీన్నిబట్టి ఈ ఏడాది 'పద్మ' అవార్డులు పొందే అర్హత తెలుగువారికి లేదనుకోవాలా? లేక రాష్ట్ర ప్రభుత్వాలు అనర్హులతో కూడిన జాబితాలను పంపాయని భావించాలా? ఏపీ నుంచి క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్ ఒక్కరికే అవార్డు ఇచ్చారు. త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో మాత్రం పలువురికి 'పద్మ' అవార్డులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్– తెలంగాణలో మరో ఏడాది వరకు ఎన్నికలు లేనందున, వచ్చే ఏడాది చూద్దాం అనుకున్నారేమో తెలియదు. దక్షిణాదిన పాగా వేయాలని తహతహలాడుతున్న భారతీయ జనతా పార్టీ.. కేరళ, తమిళనాడు, కర్ణాటకలలో మాత్రం పలువురికి 'పద్మ' అవార్డులు ప్రకటించింది. దక్షిణాదిలో భాగమైన తెలుగు రాష్ట్రాలను మాత్రం పట్టించుకోలేదు. అదేమని ప్రశ్నించే సాహసాన్ని కూడా చేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ మిత్రపక్షంగా ఉన్నందున అక్కడెవరూ నోరు తెరిచి ప్రశ్నించరన్న ధీమాతో కేంద్ర పెద్దలు ఉండి ఉంటారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కూడా పరోక్షంగా మిత్రత్వం నడుపుతున్నందున 'పద్మ' అవార్డులను ఇవ్వకపోయినా ఫర్వాలేదని కమలనాథులు భావించి ఉంటారు. ఈ విషయమై ప్రభుత్వపరంగా నిరసన వ్యక్తంచేయక పోయినా, అధికార పార్టీ ఎంపీ వినోద్‌కుమార్ మాత్రం నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. గతంలో 'పద్మ' అవార్డుల ఎంపికకు ఉన్నత ప్రమాణాలు పాటించేవారు. కాలక్రమంలో పైరవీలు చేసుకున్నవారికే అవార్డులు రావడం మొదలైంది. దీంతో అనర్హులు కూడా 'పద్మ' అవార్డుల జాబితాలో చోటు దక్కించుకుంటున్నారు. ఎన్‌టీఆర్, ఏఎన్నార్‌లకు ఏ మాత్రం తీసిపోని మహానటుడు ఎస్.వి.రంగారావుకు ఆ రోజుల్లో కూడా అన్యాయం జరిగింది. బతికున్నవారిలో అత్యంత సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణకు కూడా ఇంతవరకు 'పద్మ' అవార్డు దక్కలేదు. ఆయన తర్వాత సినీ రంగ ప్రవేశంచేసిన జూనియర్లకు 'పద్మ' అవార్డులు దక్కడాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? రాజకీయ ప్రాపకం ఉన్నవారికే ఈ అవార్డులు దక్కుతాయన్న భావం వ్యాపించింది. 'పద్మ' అవార్డుల విషయంలో తనకు అన్యాయం జరిగిందని కైకాల సత్యనారాయణ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేసినా పట్టించుకున్న వారు లేరు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా తమ రాష్ట్రం నుంచి ఎవరెవరికి 'పద్మ' అవార్డులు ఇవ్వాలో సిఫారసు చేస్తూ జాబితాలు పంపుతాయి. ఈ జాబితాలో చోటు దక్కించుకోవడం నుంచి అవార్డు పొందేవరకు పైరవీలు సాగుతుంటాయి. ప్రతిభ ఆధారంగా అప్పుడప్పుడు అవార్డులు దక్కుతుంటాయి. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారికి, జీవితకాలం కృషిచేసిన వారికి ఈ అవార్డులు ఇస్తుండేవారు. ఇప్పుడు అలా కాదు. పట్టుమని పాతికేళ్లు లేనివారికి కూడా 'పద్మ' అవార్డులు ఇస్తున్నారు. దీంతో ఈ అవార్డుల విలువ కూడా తగ్గుతూ వస్తోంది. రాష్ట్ర విభజనకు ముందు మన రాష్ట్రం నుంచి 'పద్మ' అవార్డులు పొందిన వారిలో కొన్ని పేర్లు చూసి జనం ముక్కున వేలేసుకున్నారు. ఇలాంటివారికి కూడా 'పద్మ' అవార్డులు ఇస్తారా? అని ప్రశ్నించుకున్నారు. ఈ ఏడాది కిడాంబి శ్రీకాంత్ మినహా తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కరిని కూడా ఈ అవార్డు వరించలేదంటే తెలుగువారిలో అర్హులు లేరా? లేక పైరవీలు చేసుకునే శక్తిసామర్థ్యాలు వారికి లేవా? అన్న సందేహం కలగకుండా ఎందుకుంటుంది? కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితా చూసిన వారందరికీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే జాబితా రూపొందించారన్న అనుమానం కలగకుండా ఉంటుందా? ఈ అనుమానాన్ని నివృత్తి చేయవలసింది భారతీయ జనతా పార్టీ నాయకులే! ■

ఎన్‌టీఆర్, ఏఎన్నార్‌లకు ఏ మాత్రం తీసిపోని మహానటుడు ఎస్.వి.రంగారావుకు ఆ రోజుల్లో కూడా అన్యాయం జరిగింది. బతికున్నవారిలో అత్యంత సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణకు కూడా ఇంతవరకు 'పద్మ' అవార్డు దక్కలేదు. ఆయన తర్వాత సినీ రంగ ప్రవేశంచేసిన జూనియర్లకు 'పద్మ' అవార్డులు దక్కడాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితా చూసిన వారందరికీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే జాబితా రూపొందించారన్న అనుమానం కలగకుండా ఉంటుందా?

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

భరత ఖండంబు చక్కని పాడియావు!



'నేను భారతదేశం మీద యుద్ధానికి వెళ్తున్నా. ఆశీర్వదించండి. అక్కణ్నుంచి మీకేం తేవాలో ఆదేశించండి" అడిగాడట గ్రీకు వీరుడు అలెగ్జాండర్.. తన గురువు అరిస్టాటిల్‌ను! "గుప్పెడంత భారతదేశపు మట్టి.. గుక్కెడన్ని గంగా జలాలు... గుప్త విద్య బోధించే గురువర్యుడు.. గురు గ్రంథాలు రామాయణ, మహా భారతాలు. వీటిని నా కోసం తీసుకు రా" అన్నాడట తత్వవేత్త అరిస్టాటిల్!

భారతదేశమంటే గంగ, గానం, గీత, గోవు, గ్రంథం! భారత్ అంటే బతుకు బంధం.. అనిర్వచనీయ అందం!

కనుమకు వచ్చిన కొత్తల్లుడికి కూడా ఇంతోటి గౌరవం దక్కుతుందా? బ్రాండు మనది కాదు; ఇమేజ్ మనకు రాదు; ఫ్యాక్టరీ ఎప్పుడు ఎత్తేస్తాడో తెలియదు; లాభంలో వాటా లేదు; పైగా తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ అంటూ పన్నుల్లో రాయితీలు! ఇంతోటి దానికి మనకు దక్కే మహా ప్రతిఫలం...మన యువతకు ఉద్యోగం! అదే మహా ప్రసాదం!

మన జన్మభూమి పుణ్య భూమి, యోగ భూమి, యాగ భూమి, వేద భూమి, తపో భూమి, జ్ఞాన భూమి... ఇది విలువలే వలువలుగా బతికే కోట్లాది కష్ట జీవులకు నెలవైన కర్మభూమి.. ధర్మ భూమి.. మర్మ భూమి!

ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు ఇండియా అంటే ఇన్వెస్ట్‌మెంట్.. భారత్ అంటే బిజినెస్... మనుషుల్ని పక్కనబెట్టండి.. మన దేశం వందకోట్ల మంది వినియోగదార్లున్న మహా మార్కెట్! మన పాలకులు దావోస్ వేదికగా ప్రపంచానికి ఇచ్చిన సందేశం వినలేదా!

"మా దగ్గర సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయి. యువ మానవ వనరులు బోలెడన్ని ఉన్నాయి. వాడకం మీ ఇష్టం. సొమ్ములతో రండి.. సోకు చేసుకుని పొండి. మా వాళ్లకో ముష్టి ఉద్యోగం పారేస్తే చాలు. మీ కోసమే వాడికి రెడీగా ఇంగ్లిషు కూడా నేర్పించి ఉంచాం!" ఇదీ కదా, ఇదే కదా మనాళ్లు ఇస్తున్న సందేశం.

మనకన్నా చాలా పెద్ద దేశం అమెరికా! వాడు 'తయారీ'ని మానుకుని, మాన్యుఫాక్చరింగ్ ఫ్యాక్టరీలను మ్యూజియాలుగా మార్చి చాలా కాలమైంది. కారణం.. కాలుష్య భయం. విలువైన వనరులన్నీ ఖర్చైపోతాయన్న ముందుచూపు. గల్ఫ్‌కు దీటుగా అమెరికాలో చమురు నిల్వలున్నాయి. కానీ వాడు ఔన్సు కూడా బయటకు తీయడు. గల్ఫ్ ఇసుకలో తివిరి తైలాన్ని పిండి, గ్యాలన్ల కొద్దీ భూగర్భంలో దాచుకుంటాడు. రష్యా మనకన్నా పెద్దదేశం. కానీ సైబీరియా ఏరియాను ఇంతవరకు టచ్ చేయలేదు. కారణం వనరుల్ని దాచుకోవాలన్న స్పృహ!

'అమెరికాకు ఒకసారి వెళితే మళ్లీ రాబుద్ధి కాదు. ఎంత పరిశుభ్రత!' అంటుంటారు. అవును; హోటల్‌సూట్ నీట్‌గానే ఉంటుంది. ఎందుకంటే అక్కడేమీ తయారు కాదు. మరి మనమేం చేస్తున్నాం. భారత్‌ను ఇతర దేశాల అవసరాలు తీర్చే కర్మాగారంగా మారుస్తున్నాం. వాడు అవసరమైనది తీసుకుని మిగిలింది పారేసే డంప్ యార్డుగా ఇండియాను తీర్చిదిద్దుతున్నాం. ఈ చెత్తంతా ఏం చేసుకునేది అంటారా? స్వచ్ఛభారత్ నిర్వహించండి!

ఒక టీషర్టు తయారీకి 2,700 లీటర్ల నీరు కావాలి. జీన్స్ ప్యాంటుకి 10 వేల లీటర్లు, కారు తయారీకి లక్షా యాభైవేల లీటర్లు. కిలో బియ్యం తయారీకి అక్షరాలా ఐదు వేల లీటర్ల నీరు కావాలి. ఒక స్మార్ట్ ఫోన్ తయారీకి 13 వేల లీటర్ల నీరు కావాలి. ఒక జత బూట్ల తయారీకి 14 వేల లీటర్ల నీరు కావాలి. మిగతా సరకుల సంగతి మీరే ఊహించుకోండి!

అవన్నీ ఇచ్చి, వస్తువులను చేసిచ్చి, వాటిని మళ్లీ మనమే అమెరికన్ బ్రాండ్ ఎక్స్‌పోర్టు క్వాలిటీ ధరలకు కొనుక్కుని.. అప్పనంగా లాభం ముళ్లె మూటగట్టిచ్చి.. సాగనంపుతున్నాం. ఎంత మర్యాద! ఎంత ఔదార్యం! కనుమకు వచ్చిన కొత్తల్లుడికి కూడా ఇంతోటి గౌరవం దక్కుతుందా? బ్రాండు మనది కాదు; ఇమేజ్ మనకు రాదు; ఫ్యాక్టరీ ఎప్పుడు ఎత్తేస్తాడో తెలియదు; లాభంలో వాటా లేదు; పైగా తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ అంటూ పన్నుల్లో రాయితీలు! ఇంతోటి దానికి మనకు దక్కే మహా ప్రతిఫలం... మన యువతకు ఉద్యోగం! అదే మహా ప్రసాదం!

ఇలాగైతే మన దేశం వట్టిబోయిన ఆవులా మారిపోదా? మన నీళ్లన్నీ అయిపోవా? దానికేముంది? 20 రూపాయలు పెట్టి లీటరు కిన్లే వాటర్ బాటిల్ కొనుక్కోండి. అదీ దొరక్కపోతే ఫ్రిజ్‌లో మురగబెట్టిన పెప్సీయో, కోకో తప్పకుండా ఉంటాయి. ఫ్యాక్టరీ పెట్టి మీకు ఉద్యోగమిచ్చి, డబ్బులు ఇస్తున్నది ఎందుకనుకుంటున్నారు? ఫ్యాక్టరీలతో దేశమంతా కాలుష్యం.. దాని వెంటే కేన్సర్లు! అయినా ఏం బాధపడొద్దు! పాపం.. పెట్టుబడిదారులు. ఏ దొంగదారిలోనో ఎంతో కష్టపడి, డబ్బులు కొట్టుకొచ్చి, మన కోసమే మందుల ఫ్యాక్టరీలు పెట్టి కేన్సర్లకు మందులు కూడా తయారు చేస్తున్నారు. రోగ భూమిగా మారిన యోగ భూమిని కాపాడుతున్నారు. పది రూపాయల మందును లక్ష రూపాయలకు కొనుక్కుని, ప్రాణం పోయే దాకా నరాల్లోకి ఎక్కించుకుని తరించండి.. లేదా అంతరించండి!!

మన పత్తిని ఇంగ్లండ్ తీసుకెళ్లి, బట్టలుగా కట్టగట్టి తెచ్చి, మళ్లీ మనకే అమ్మకానికి పెడితే, నిరసించి విదేశీ వస్తు బహిష్కారం అని తగులబెట్టిన గాంధీగారి వారసులం మనం... 70 ఏళ్లలో ఎంత అభివృద్ధి సాధించాం. "ఇప్పుడు భారత్‌లో రెడ్ టేపిజం లేదు... రెడ్ కార్పెటే" అంటూ... మన భూమి తల్లి దాచుకున్నవన్నీ దోచుకొమ్మంటూ ఆహ్వానిస్తున్నాం. అదీ గాంధీగారి కళ్లద్దాల అడ్వర్‌టైజ్‌మెంట్ సాక్షిగా!! మన నేలను ఇచ్చి, మన వనరులను ఇచ్చి, మన మనుషులను ఇచ్చి, తయారైన వస్తువుల్ని మనమే కొనుక్కుని, మంచి లాభాలు వారికి అందించి... కాలుష్యం, రోగాలు మనం ఉంచేసుకుని.. ఎంత త్యాగ శీలురం మనం. ఒక చెంప మీద కొడితే మరో చెంప చూపించాలన్న గాంధీ సూక్తికి ఇంతకు మించిన ఆచరణ ఏముంటుంది?!

అసలు అభివృద్ధికి నిర్వచనం ఏమిటి? డబ్బు సంపాదనేనా? ఇంత డబ్బు లేకున్నా, ఇంతకు ముందు ఇంతకంటే సంతోషంగా బతకలేదా? అయినా మన ఘనతను, చరితను మరిచి విదేశీ కంపెనీలను తెచ్చి పెట్టుకుంటే ఇండియా బ్రాండ్ క్రియేట్ అయ్యేదెప్పుడు? మేడిన్ ఇండియా అయినా, మేకిన్ ఇండియా అయినా... మీగడ వారికి మజ్జిగ మనకు మిగులుతుందన్న మాట నిజమే! విషయం వాళ్లకు, విషం మనకు దక్కుతున్నదన్న ఆందోళన సహజమే! బాసులుగా ఉండాల్సిన వాళ్లం దాసులుగా మారుతున్నామన్న విచారమూ సబబే. మార్కెట్ ఓరియెంటెడ్ చదువులతో మన పిల్లలు సృజనాత్మకతను కోల్పోయి మర బొమ్మలుగా మారతారన్న తర్కమూ కరెక్టే. చదువులో అరవై మార్కులు వచ్చిన తెలివైనవాడు 20 మార్కులు పొందిన వ్యాపారి దగ్గర ఉద్యోగం చేస్తాడట. మనాళ్ల తెలివితేటలతో టెక్నాలజీని కనుగొని, మన వనరులతో వస్తువును ఉత్పత్తి చేసి, మన దేశంలోనే అమ్మేసి లాభాలను కొట్టేసేవాడు తెలివైనవాడా? మనమా? ఉద్యోగమూ ఒకరకం బానిసత్వమేనట! విదేశీ పెట్టుబడుల సెజ్‌లలో నిజంగానే, ఏ రూల్సూ వర్తించని బానిస ఉద్యోగాలు సాగుతున్నాయ్. విదేశీ భావజాలాలకు, వస్తు– సౌకర్య భోగ లాలసతకు, వ్యాపార వినియోగతత్వానికి లొంగిపోయినప్పుడే మనం బానిసలుగా మారిపోయాం. మనం బానిసలుగా ఉండడమే కదా ప్రపంచానికైనా, పాలకులకైనా కావాల్సింది?!

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియ బట్టి!!
–చిలకమర్తి లక్ష్మీ నరసింహం

■ కృ.తి.

kruthi1972@gmail.com

భీమవరంలో జనకవనం

వర్తమాన సామాజిక సమస్యలపై ఫిబ్రవరి 4, ఆదివారం నాడు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కొత్తబస్టాండ్ దగ్గర గల క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో, రాష్ట్ర స్థాయి జనకవనం నిర్వహించబడుతున్నది.ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ జనకవనంలో రాష్ట్ర వ్యాప్తంగా కవులు, సాహిత్యాభిమానులు పాల్గొంటున్నారు. ఫిబ్రవరిలో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని సాహిత్య రంగంలో ప్రజా కవులను ప్రోత్సహించడం కోసం మహాసభల ఆహ్వానసంఘం ఈ కార్యక్రమాన్ని తలపెట్టింది.

పూర్తిరోజు జరిగే ఈ కార్యక్రమంలో తెలకపల్లి రవి, విరపు బాలసుబ్రహ్మణ్యం, రెంటాల శ్రీ వెంకటేశ్వర రావు, లంకా వెంకటేశ్వర్లు, వి. ఉమామహేశ్వర రావు, గిడ్డి సుబ్బారావు, వొరప్రసాద్, శిఖామణి, ప్రసాదమూర్తి, బి.వి.వి. ప్రసాద్, దాట్ల దేవదానం రాజు, జంధ్యాల రఘుబాబు, కెంగార మోహన్, నేతల ప్రతాప్ కుమార్, నాగాస్త్ర, భగ్వాన్, అద్దేపల్లి ప్రభు, ఎస్.ఆర్. పృథ్వి, జోశ్యుల కృష్ణబాబు, గనారా, సత్యాజీ తదితర కవులు, సాహిత్యవేత్తలు పాల్గొంటారు. ఈ జనకవనంలో చదివిన కవితలతో సంకలనం కూడా ప్రచురించాలని ఆహ్వాన సంఘం నిర్ణయించింది. భోజన వసతి సౌకర్యాలు ఉంటాయి. ఈ జనకవనంలో పాల్గొనవలసిందిగా కవులకు విజ్ఞప్తి చేస్తూ, తమ పేర్లను చైతన్య ప్రసాద్ (9849651451), నాగాస్త్ర (7013939600) నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవలసిందిగా కోరుతున్నాం.

–చైతన్యప్రసాద్
ఆహ్వానసంఘం, జనకవనం



శ్రీరాముడు పుట్టిన ఏడాది

- విళంబి 'శ్రీరామనవమి' ఎంతో ప్రత్యేకం
- 1958 తర్వాత మళ్లీ ఇప్పుడు

భద్రాచలం, జనవరి 27: శ్రీరామనవమినాడు సీతారామ కల్యాణాన్ని వీక్షిస్తే అశ్వమేధ యాగ ఫలం దక్కుతుందని బ్రహ్మపురాణం చెబుతోంది! అందునా.. ఆ రామచంద్రుడు జన్మించిన విళంబి నామ సంవత్సరంలో జరిగే కల్యాణాన్ని తిలకిస్తే విశేష ఫలం లభిస్తుందని ప్రతీతి. చివరిగా 1958లో విళంబి నామ సంవత్సరం వచ్చింది. రామ భక్తులకు మళ్లీ ఈ ఏడాది ఆ ప్రత్యేక వేడుకను చూసే అవకాశం వచ్చింది. మార్చి 26న నిర్వహించబోయే సీతారామ కల్యాణాన్ని వీక్షించే భక్తులకు విశేష ఫలితం లభిస్తుందని భద్రాచల ఆలయ పండితులు తెలిపారు. శ్రీమద్రామాయణ పారాయణ పూర్తయిన అనంతరం స్వామికి ప్రతి పుష్యమి నాడూ పట్టాభిషేకం నిర్వహిస్తూ ఉంటారు.

అలాగే ఏడాదికోసారి మహా పట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు. 12 ఏళ్లకోసారి పుష్కర పట్టాభిషేకం.. 24 ఏళ్లకోసారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు. 60 ఏళ్లకోసారి ప్రభవనామ సంవత్సరంలో నిర్వహించే మహాసామ్రాజ్య పట్టాభిషేకాన్ని తిలకిస్తే ఎంత ఫలితం ఉంటుందో అంతటి ఫలితం.. విళంబి నామ సంవత్సరంలో నిర్వహించే కల్యాణాన్ని తిలకించడం వలన వస్తుందని పండితులు పేర్కొంటున్నారు.

మహా సామ్రాజ్య పట్టాభిషేకంతో సాటి

ప్రభవనామ సంవత్సరంలో వచ్చే మహాసామ్రాజ్య పట్టాభిషేకం ఎంత విశేషమైనదో.. విళంబిలో వచ్చే శ్రీరామనవమీ అంతే ప్రత్యేకమైనది.

- ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు, దేవస్థానం సంస్కృత పండితులు

ఆ ఏడాదే అర్చకుడినయ్యా!

గత విళంబి నామ సంవత్సరం 1958లో వచ్చింది. అదే సంవత్సరంలో నేను అర్చక బాధ్యతల్లో చేరా. అప్పుడు ప్రసార మాధ్యమాలు లేవు. ఇప్పుడు విస్తృత ప్రచారం చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది.

- కోటి రామకృష్ణమాచార్యులు, భద్రాద్రి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు

40 నదులతో మహా సంగమం

- నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని వెల్లడి

నెల్లిమర్ల, జనవరి 27: రాష్ట్రంలోని 40 నదులను, ఉపనదులను అనుసంధానం చేసి రాష్ట్రమంతా పుష్కలంగా సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో మహా సంగమం పేరిట ప్రణాళిక రూపొందించినట్టు నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వెల్లడించారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం సారిపల్లి వద్ద జరుగుతున్న తారక రామ రిజర్వాయర్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... నదుల అనుసంధానం ద్వారా సాగునీటి వనరులను పెంచుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని వివరించారు. పోలవరం ప్రాజెక్టు 2019 నాటికి పూర్తి అవుతుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వెయ్యి కోట్ల రూపాయలతో వంశధార, నాగావళి రెండో దశ పనులు ప్రారంభమయ్యాయని, ఏప్రిల్ నాటికి పూర్తవుతాయన్నారు.



ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి దేవినేని

హామీలు నెరవేర్చే వరకూ..
ఉద్యమం



ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఆంధ్రుల హక్కు

- ఈ బడ్జెట్‌లోనైనా ఏపీకి న్యాయం చేయాలి
- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ డిమాండ్
- ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ'

విశాఖపట్నం, విజయవాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్రం తక్షణం నెరవేర్చాలని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. విభజన హామీలను అమలు చేయాలని కోరేందుకు 'ఉత్తరాంధ్ర చర్చా వేదిక' ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆయనతో పాటు పలువురు విశాఖ నుంచి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ బయలుదేరారు. ఈ సందర్భంగా స్టేషన్ వద్ద విలేకరులతో కొణతాల మాట్లాడుతూ... 48 గంటలపాటు రైలులో దీక్ష కొనసాగించిన అనంతరం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి న్యాయం చేయాల్సిందిగా కోరతామని చెప్పారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఆంధ్రుల హక్కు అని పేర్కొన్నారు. విభజన హామీలను నెరవేర్చే వరకూ తమ ఉద్యమం ఆగదన్నారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెటే ఎన్డీయే ప్రభుత్వానికి పూరిస్థాయి చివరి బడ్జెట్ కానున్నందున... రాష్ట్రానికి నిధులు కేటాయించాలంటే ఈ బడ్జెట్‌లోనే సాధ్యమవుతుందన్నారు. ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పిన కేంద్రం... ఇప్పుడు దానినీ పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని కేంద్రమే ప్రకటించిందని, ఖర్చు వంద శాతం తామే భరిస్తామని చెప్పి, ఇప్పుడు పునరావాసం గురించి తమకు తెలియదనడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖకు రైల్వేజోన్ అంశాన్ని చట్టంలో పొందుపర్చారని, అయితే సబ్ కమిటీ రిపోర్ట్ అందుకు విరుద్ధంగా ఉందనే వార్తలు రావడం దురదృష్టకరమని కొణతాల అన్నారు. కేంద్రంపై మరోసారి ఒత్తిడి చేసేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, లోక్‌సత్తా నేతలు కొణతాల దీక్షకు సంఘీభావాన్ని ప్రకటించారు.

రక్తంతో సంతకాలు

విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని కోరుతూ తయారుచేసిన వినతిపత్రాలపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింగరావు సహా పలువురు కార్యకర్తలు రక్తంతో సంతకాలు చేశారు. ఈ ప్రతులను ప్రధానికి అందించాలని కోరుతూ కొణతాలకు వాటిని అందజేశారు.

వైసీపీ ఎంపీల రాజీనామాలేవీ?: కళా

అమలాపురం(ఆంధ్రజ్యోతి), జనవరి 27: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం తమ పార్టీ ఎంపీలతో రాజీనామా చేయిస్తానని చెప్పిన జగన్ ఇప్పుడు వెనకడుగు వేస్తున్నారని మంత్రి కిమిడి కళా వెంకట్రావు విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం మూలపాలెంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పీఠమే లక్ష్యంగా ఓదార్పుయాత్రలు, పాదయాత్రలు చేస్తున్న జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.



బైబిల్ మిషన్ మహోత్సవాలకు హాజరైన భక్త జనం

శాంతికి బైబిల్ మిషన్ ఉత్సవాలు: కొల్లు

పెదకాకాని, జనవరి 27: ప్రపంచ శాంతికి బైబిల్ మిషన్ మహోత్సవాలు దోహదపడతాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున వర్సిటీ ఎదుట శనివారం అట్టహాసంగా ప్రారంభమైన బైబిల్ మిషన్ 80వ మహోత్సవాలలో ఆయన ప్రసంగిస్తూ పెదకాకానిలో స్థాపించిన బైబిల్ మిషన్ శాఖోపశాఖలుగా వృద్ధి చెంది నేడు ప్రపంచ వ్యాప్తంగా అతి పెద్దసంస్థగా మారిందన్నారు. మహోత్సవాల ప్రారంభం రోజున ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఆదిశంకరుని బోధనలు అనుసరణీయం

- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

పెందుర్తి, జనవరి 27: ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపు చూస్తున్నాయంటే అందుకు ఆదిశంకరుల అద్వైతభాష్యమే మూలమని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఉద్ఘాటించారు. నాలుగు రోజులుగా సాగుతున్న పీఠం వార్షిక వేడుకలు శనివారం ముగిశాయి. రుత్వికులు వేద మంత్రోచ్ఛారణలతో పీఠాధిపతి చేతులమీదుగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వరూపానందేంద్ర ప్రసంగిస్తూ ఆధ్యాత్మిక విద్య, వేదాలు, సంస్కృతీ, సంప్రదాయాలు ప్రపంచానికి తెలియజేసిన జగద్గురువు ఆదిశంకరాచార్యులన్నారు. హైందవ ధర్మ పరిరక్షణ శ్వాస, ధ్యాసగా జీవనం కొనసాగిస్తానన్నారు. మోక్ష సన్యాసియోగాన్ని అక్షరరూపంగా మలిచిన పొగరు సన్యాసిరాజును స్వరూపానందేంద్ర సత్కరించారు.

ఆపదలో ఉన్నోళ్లకు రక్తం ఇస్తాం: తొగాడియా

విజయవాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు అత్యవసర సమయాలలో రక్తం అందుబాటులో ఉండే విధంగా ఒక కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఆ సంస్థ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా చెప్పారు. విజయవాడలోని ఐఎంఎ హాలులో శనివారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో వైద్యులతో ఆయన సమావేశమయ్యారు. రక్త సేకరణ విషయంలో ఇంకా వెనుకబడి ఉన్నామని చెప్పారు. రక్తదాతలను మరింత మందిని ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునేలా చైతన్య పరచాల్సి ఉందన్నారు. 24 గంటలూ అవసరమైన మేరకు ఆయా గ్రూపు రక్తాన్ని అందుబాటులో ఉంచే విధంగా ఒక వ్యవస్థ రూపొందాలని, ఈ దిశగా వీహెచ్‌పీ చేపట్టిన పనులను తొగాడియా వివరించారు.

చంద్రబాబు నిత్యకృషీవలుడు

- ఆయనకున్న టెక్నాలజీ ఎవరి వద్దాలేదు
- ప్రత్యేక హోదా ముగిసిపోయిన అధ్యాయం
- దానిఆధారంగా రాజకీయ పొత్తు కుదరదు
- బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు వ్యాఖ్యలు

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి చంద్రబాబు నిత్యకృషీవలుడు. ఆయనకున్న టెక్నాలజీ ప్రపంచంలో ఎవరి వద్దా ఉండదు. కేంద్రంనుంచి ఎన్ని నిధులు వచ్చినా, ఇంకా రావాలని ప్రయత్నం చేస్తూనే ఉంటారు. పోలవరం ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ఏమి చేసింది? నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ ప్రాజెక్టులో భాగంగా రెండు కాలువలు తవ్వారు. అవి కూడా అంతంతమాత్రమే. ఒక కాలువ పనులు 40 శాతం, రెండో కాలువ పనులు 60 శాతమే చేశారు. చంద్రబాబు మాత్రం సోమవారం, పోలవరం అంటూ నిత్యం పాకులాడుతూనే ఉన్నారు" అని బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీ కూడా పోలవరం పూర్తి చేయాలనే లక్ష్యంతోనే ఉన్నారని తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కేంద్రం అందిస్తున్న సహకారం వల్లే సీఎం చంద్రబాబు ఖాళీలేకుండా పనిచేస్తున్నారు. కానీ ప్రధాని బొమ్మను మాత్రం ఎక్కడా ప్రదర్శించడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ బీసీల్లోని చిన్నకులానికి చెందిన వ్యక్తి కాబట్టే అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు విమర్శిస్తున్నారంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్‌పై పరోక్షంగా మండిపడ్డారు. "ఉండవల్లి ఖాళీ చక్రవర్తి. విభజన సమయంలో ఆయనతోపాటు తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు ఎంపీలు ఉన్నారు. ఏం చేశారు? ఉండవల్లి నాకు గురువు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో ఆయన ఇచ్చిన ప్రసంగాలవల్లే చదువుకునే రోజుల్లోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను. ఆ రోజుల్లో ఆయన కాంగ్రెస్‌ను తెగతిట్టారు. ఇందిరమ్మను దూషించారు. కానీ, ఆ తర్వాత అదే పార్టీలో ఉండవల్లి చేరి, రెండుసార్లు ఎంపీగా పనిచేశారు. ఇందిర కుటుంబసభ్యుల ప్రసంగాలను అనువదించారు. ఆయనకు ఇప్పుడు అవినీతికి, అభివృద్ధికి తేడా తెలియడంలేదు. అవినీతివల్లే ఒక్కో రాష్ట్రం నుంచి కాంగ్రెస్ వైదొలగిపోతుండగా, బీజేపీ పెరుగుతోంది' అని పేర్కొన్నారు. మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు జీఎస్టీనీ వ్యతిరేకించినమాట నిజమేనన్నారు. "జీఎస్టీవల్ల అదనపు ఆదాయం వస్తుంది. అప్పటికే అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్‌కు మరింత అదనపు ఆదాయం వస్తే, మరింత అవినీతి జరుగుతుందనే కారణంతోనే ఆయన నాడు వ్యతిరేకించారు' అని చెప్పారు.



మిత్రధర్మాన్ని పాటిస్తున్నాం

- పురందేశ్వరి

విజయవాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ తన మిత్రధర్మాన్ని పాటిస్తూనే ఉందని బీజేపీ నేత పురందేశ్వరి స్పష్టం చేశారు. టీడీపీ, బీజేపీ కలిసి ఉండాలా, లేదా అనేది రెండు పార్టీలు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. బీజేపీ మిత్రధర్మం పాటించట్లేదనడం సరికాదని ఆమె పేర్కొన్నారు. విజయవాడలోని పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో శనివారం ఆమె ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర పథకాలకు పేరుమార్చి టీడీపీ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నారని ఆమె విమర్శించారు. పంచాయతీలకు కేంద్రం నుంచి నేరుగా నిధులు వస్తున్నాయన్నారు.

కరెంట్ అఫైర్స్

గణతంత్ర అతిథులు ఆసియాన్ నేతలు



రాష్ట్రీయం

జ్యూరిచ్, ఆంధ్రప్రదేశ్ సిస్టర్ స్టేట్ ఒప్పందం



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జనవరి 22న జ్యూరిచ్, ఆంధ్రప్రదేశ్ మధ్య సిస్టర్ స్టేట్ ఒప్పందం కుదిరింది. దీన్ని అనుసరించి పర్యావరణ సాంకేతికత, జీవశాస్త్రాలు, పట్టణప్రాంత అభివృద్ధి రంగాల్లో జ్యూరిచ్, ఆంధ్రప్రదేశ్ పరస్పరం సహకరించుకుంటాయి. సిస్టర్ స్టేట్ ఒప్పందం ప్రధాన ఉద్దేశం.. వినూత్న సాంకేతికతను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడమే. ఏదైనా దేశంలోని ఓ రాష్ట్రం లేదా ప్రావిన్స్ వినూత్నమైన ఆలోచనలు, సాంకేతికతతో ముందుకెళుతుంటే దాన్ని వేరే దేశంలోని రాష్ట్రం అందిపుచ్చుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుంది. గతంలో చైనా, అమెరికా, జపాన్, సింగపూర్‌లతోనూ ఆంధ్రప్రదేశ్ ఈ తరహా ఒప్పందం చేసుకుంది.

నాగోబా జాతర

తెలంగాణ గిరిజన జాతరల్లో ముఖ్యమైన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా జాతర జనవరి 16న అర్ధరాత్రి వైభవంగా ప్రారంభమైంది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా మహాపూజలు నిర్వహించిన అనంతరం జాతరను ఆరంభించారు. ఈ జాతర జనవరి 20న ముగిసింది.

ఆర్థిక రంగం

7.4 శాతం వృద్ధి - ఐఎంఎఫ్ అంచనా

భారత్ ఆర్థిక వృద్ధిరేటు ఈ ఏడాది 7.4 శాతానికి చేరుకోగలదని, చైనా జీడీపీ మాత్రం 6.8 శాతానికి పరిమితం కావచ్చని ఐఎంఎఫ్ అంచనా వేస్తోంది. వచ్చే ఏడాదిలో భారత్ జీడీపీ వృద్ధి 7.8 శాతానికి ఎగబాకవచ్చని డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్ (డబ్ల్యుఇఒ) అప్‌డేటెడ్ రిపోర్టులో ఐఎంఎఫ్ అంచనా వేసింది.

దావోస్‌లో డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సు



స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం' (డబ్ల్యూఈఎఫ్) 48వ వార్షిక సదస్సు జనవరి 23-26 మధ్య జరిగింది. 'ముక్కలైన ప్రపంచంలో ఉమ్మడి భవిష్యత్తు నిర్మాణం' అనేది ఈ సదస్సు ప్రధాన ఎజెండా. జనవరి 23న ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంతో అధికారిక కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ సదస్సుకు ప్రపంచ దేశాల నుంచి మూడు వేల మందికి పైగా నేతలు, ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ నుంచి 130 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. 1997లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ అనంతరం దావోస్ సదస్సుకు హాజరైన మొదటి భారత ప్రధాని మోదీనే. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు కూడా పాల్గొన్నారు.

సమ్మిళిత వృద్ధిలో భారత్‌కు 62వ స్థానం

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసిన సమ్మిళిత వృద్ధి సూచీలో వర్ధమాన దేశాలకు సంబంధించి భారత్ 62వ స్థానంలో నిలిచింది. చైనా 26, పాకిస్తాన్ 47వ స్థానాల్లో ఉన్నాయి. వర్ధమాన దేశాల్లో లిథువేనియా అగ్రస్థానంలో, హంగరీ, అజర్‌బైజాన్, లాత్వియా, పోలండ్ తరవాతి స్థానాలను దక్కించుకున్నాయి. శ్రీలంక (40), బంగ్లాదేశ్ (34), నేపాల్ (22వ ర్యాంకు) భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. సంపన్న దేశాల సమ్మిళిత వృద్ధి సూచీలో నార్వే టాప్‌లో ఉండగా, ఐర్లాండ్, లగ్జెంబర్గ్, స్విట్జర్లాండ్, డెన్మార్క్ టాప్ 5లో ఉన్నాయి. గతేడాది 79 వర్ధమాన దేశాల జాబితాలో భారత్ 60వ స్థానంలో నిల్చింది. సమ్మిళిత వృద్ధి సూచీలో మొత్తం 130 దేశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

వార్తల్లో వ్యక్తులు

నూతన సీఈసీగా రావత్



కేంద్ర ఎన్నికల సంఘానికి నూతన ప్రధాన కమిషనర్ (సీఈసీ)గా అచల్‌కుమార్ స్థానంలో ఓంప్రకాశ్ రావత్ జనవరి 23న బాధ్యతలు స్వీకరించారు. అచల్‌కుమార్ పదవీ విరమణతో ముగ్గురు సభ్యుల ఎన్నికల సంఘంలో ఓ స్థానం ఖాళీ అవుతుంది. ఇందులో కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అశోక్ లావాసాను కొత్త ఎన్నికల కమిషనర్‌గా నియమించారు. సునీల్ అరోరా మరో కమిషనర్. రావత్ పదవీ కాలం ఈ ఏడాది డిసెంబరుతో ముగుస్తుంది. అనంతరం అరోరా సీఈసీ అవుతారు.

ఎన్ఎస్‌జీ డీజీగా సుదీప్ లఖ్టాకియా

అత్యంత ప్రముఖుల వ్యక్తిగత భద్రత బాధ్యతలు చేపట్టే నేషనల్ సెక్యూరిటీ గార్డు (ఎన్ఎస్‌జీ) డైరెక్టర్ జనరల్ (డీజీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సుదీప్ లఖ్టాకియా నియమితులయ్యారు. ఈయన నియామకాన్ని ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన ఉన్న క్యాబినెట్ నియామకాల కమిటీ జనవరి 19న ఆమోదించింది. 1984 బ్యాచ్ తెలంగాణ క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన లఖ్టాకియా ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ స్పెషల్ డీజీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 'బ్లాక్ క్యాట్స్'గా పిలిచే ఎన్ఎస్‌జీ గుర్‌గావ్‌లోని మనేసర్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది.

మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఆనందీ బెన్

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి ఆనందీ బెన్ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా జనవరి 19న నియమితులయ్యారు. ప్రస్తుతం గుజరాత్ గవర్నర్ ఓం ప్రకాష్ కోహ్లీ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో ఆనందీ బెన్ బాధ్యతలు స్వీకరించారు.

అమెరికా విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా మనీషా సింగ్



భారత సంతతికి చెందిన ప్రముఖ అమెరికా న్యాయవాది మనీషా సింగ్ అమెరికా విదేశాంగ శాఖలోని ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాల సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ జనవరి 20న ఆమెతో ప్రమాణం చేయించారు. ఈ పదవిలోకి వచ్చిన తొలి మహిళగా ఆమె అరుదైన గౌరవం దక్కించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో పుట్టిన మనీషా, అమెరికా విదేశాంగ శాఖలో అత్యున్నత స్థాయి భారత సంతతి అధికారి.

ప్రతిభావంతులను ఆకర్షించడంలో 81వ స్థానం

ప్రతిభావంతులను ఆకర్షించడంలో గతేడాది 92వ స్థానంలో ఉన్న భారత్ ఈసారి 81వ స్థానానికి ఎగబాకింది. ఈ వివరాలను డబ్ల్యూఈఎఫ్ ప్రకటించింది. ఇందులో స్విట్జర్లాండ్ మరోసారి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సింగపూర్, అమెరికా ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

1 శాతం సంపన్నుల దగ్గరే 73 శాతం సంపద

గతేడాది జరిగిన మొత్తం సంపద సృష్టిలో 73 శాతం సొమ్మంతా ఒక్క శాతం సంపన్నుల దగ్గరే పోగుపడింది. అదే సమయంలో దేశ జనాభాలో దాదాపు సగభాగమైన 67 కోట్ల మంది పైగా పేదల సంపద కేవలం ఒకే ఒక్క శాతం పెరిగింది. అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆక్స్‌ఫామ్ 2017కి సంబంధించి నిర్వహించిన సర్వేలో భారత్‌లో కుబేరుల సంపద రూ.20.9 లక్షల కోట్లకు పైగా పెరిగినట్లు వెల్లడైంది. ఆక్స్‌ఫామ్ గతేడాది నిర్వహించిన సర్వేలో 2016లో దేశీయంగా మొత్తం సంపదలో 58 శాతం వాటా ఒక్క శాతం సంపన్నుల వద్దే ఉన్నట్లు వెల్లడైంది. గతేడాది భారత్‌లో కొత్తగా 17 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. దీంతో వీరి సంఖ్య 101కి చేరింది.

క్రీడలు

పీబీఎల్ విజేత హైదరాబాద్

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) మూడో సీజన్‌లో హైదరాబాద్ హంటర్స్ విజేతగా నిలిచింది. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 14న సాగిన ఫైనల్లో హంటర్స్, బెంగళూరు బ్లాస్టర్స్‌ను ఓడించింది.

అంధుల ప్రపంచకప్ విజేత భారత్



అంధుల ప్రపంచకప్ క్రికెట్ టోర్నమెంట్‌ను భారత్ గెలుచుకుంది. షార్జాలో జరిగిన ఫైనల్లో పాకిస్తాన్‌పై విజయం సాధించి వరుసగా రెండోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్లకు చెందిన అజయ్ కుమార్ రెడ్డి భారత జట్టుకు కెప్టెన్‌గా ఉన్నారు.

అవార్డులు

పద్మ పురస్కారాలు



69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లోని 85 మందికి కేంద్ర ప్రభుత్వం జనవరి 25న పద్మ పురస్కారాలను ప్రకటించింది. ఇందులో ముగ్గురికి పద్మ విభూషణ్, తొమ్మిది మందికి పద్మ భూషణ్, 73 మందికి పద్మశ్రీ అవార్డులు లభించాయి. 14 మంది మహిళలకు, ప్రవాస భారతీయులు సహా విదేశాల్లో ఉంటున్న 16 మందికి, మరణానంతరం ముగ్గురికి ఈ పురస్కారాలు దక్కాయి. వివరాలు..

- ***పద్మ విభూషణ్:*** ఇళయరాజా (సంగీతం), ఘులామ్ ముస్తఫా ఖాన్ (సంగీతం), పరమేశ్వరన్ (సాహిత్యం)
- ***పద్మ భూషణ్:*** పంకజ్ అడ్వాణీ (క్రీడారంగం), ఫిలిపోస్ మార్ క్రిసోస్టామ్ (ఆధ్యాత్మికం), మహేందర్ సింగ్ ధోని (క్రీడారంగం), అలెగ్జాండర్ కదకిన్ (ప్రజాసంబంధాలు (విదేశీయుడు; మరణానంతరం), రామచంద్రన్ నాగస్వామి (పురావస్తు), వేద్ ప్రకాశ్‌నందా (సాహిత్యం, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా), లక్ష్మణ్‌పాయ్ (పెయింటింగ్), అరవింద్ పారిక్ (సంగీతం), శారదా సిన్హా(సంగీతం).
- ***పద్మశ్రీ:*** అరవింద్ గుప్తా (సాహిత్యం, విద్య విభాగం), లక్ష్మీకుట్టి (మెడిసిన్), భజ్జు శ్యామ్ (కళారంగం), కిదాంబి శ్రీకాంత్ (ఆంధ్రప్రదేశ్ - బ్యాడ్మింటన్), రాజగోపాలన్ వాసుదేవన్ (సైన్స్ అండ్ ఇన్నోవేషన్), మురళీకాంత్ పటేకర్ (క్రీడారంగం) తదితరులు.

జ్యోతి ప్రకాశ్‌కు అశోక చక్ర




ఉగ్రవాదుల తూటాలకు ఎదురొడ్డి ముగ్గురు టెర్రరిస్టులను మట్టుబెట్టి, అమరుడైన వాయుసేన జవాన్.. జ్యోతిప్రకాశ్ నిరాలాకు భారత ప్రభుత్వం 'అశోక చక్ర' పురస్కారాన్ని ప్రకటించింది. అలాగే మేజర్ విజయంత్ బిష్త్‌కు కీర్తి చక్ర ప్రకటించింది. కెప్టెన్ రోహిత్ శుక్లా, కెప్టెన్ అభినవ్ శుక్లా, కెప్టెన్ ప్రదీప్ శౌరి ఆర్య, హవిల్దార్ ముబారక్ అలీ, హవిల్దార్ రవీంద్ర థాపా, లాన్స్‌నాయక్ నరేందర్ సింగ్, నాయక్ బధేర్ హుస్సేన్, సార్జెంట్ ఖైర్నార్ మిలింద్ కిశోర్ (మరణానంతరం) సహా 14 మందికి శౌర్య చక్ర పురస్కారాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

సుశీల్‌కుమార్‌కు శౌర్య పతకం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అందించే పోలీసు శౌర్య పతకం (పీఎంజీ) బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశీల్‌కుమార్ పాండేను వరించింది. 24వ బెటాలియన్‌కు చెందిన సుశీల్‌కుమార్ 2014లో చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించారు. 2014 ఏప్రిల్ 23న కాంకేర్ జిల్లాలో జరిగే ఓ మేళాకు మావోయిస్టులు వస్తున్నారనే సమాచారంతో బీఎస్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో ఎస్పైగా ఉన్న సుశీల్‌కుమార్ ప్రాణాలకు తెగించి ఓ మావోయిస్టును పట్టుకున్నాడు.

బబ్లూకు అత్యుత్తమ పౌరపురస్కారం



2016 ఆగస్టులో మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలోని మైహర్ భారీ వర్షాలకు కూలిపోతున్న భవనం నుంచి ఇద్దరు చిన్నారులను కాపాడిన బబ్లు మార్టిన్(40)కు కేంద్ర హోంశాఖ అత్యుత్తమ పౌర పురస్కారమైన సర్వోత్తమ జీవన రక్షా పతకాన్ని (మరణానంతరం) ప్రకటించింది. అదేవిధంగా పవిత్ర అమరనాథ్ యాత్రలో 2017, జూలై 10న మంచులింగ దర్శనం కోసం వెళ్తున్న భక్తుల బస్సుపై ఉగ్రదాడి జరిగిన సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించి, 52 మందిని కాపాడిన ఆ బస్సు డ్రైవర్ షేక్ సలీం గఫూర్‌కు 'ఉత్తమ జీవన రక్షా పతకం' ప్రకటించారు.


షారుక్ ఖాన్‌కు క్రిస్టల్ అవార్డు



వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో షారుక్ ఖాన్ జనవరి 23న క్రిస్టల్ అవార్డు అందుకున్నారు. షారుక్‌ఖాన్ తన మీర్ ఫౌండేషన్ ద్వారా బాలలు, మహిళల కోసం కృషికిగాను ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. హాలీవుడ్ నటి కేట్ బ్లాంచెట్, సంగీతకారుడు ఎల్టన్ జాన్ కూడా ఈ అవార్డు అందుకున్నారు.

అంతర్జాతీయం

అమెరికా షట్‌డౌన్



అమెరికా ప్రభుత్వ వ్యవస్థ స్తంభించిపోయింది. బడ్జెట్ నిధుల విడుదలకు ఎగువ సభ సెనేట్ అంగీకరించకపోవడంతో ప్రభుత్వం దగ్గర ఖర్చు పెట్టుకోవడానికి డబ్బుల్లేవు. జనవరి 19 అర్ధరాత్రి నుంచి అత్యవసరం తప్ప మిగతా సర్వీసులన్నీ నిలిపేశారు. అమెరికాకు తల్లిదండ్రులతోపాటు అక్రమంగా వలస వచ్చిన చిన్నారులకు డ్రీమర్స్ పేరుతో పని చేసుకొనేందుకు ఒబామా కల్పించిన వెసులుబాటును ట్రంప్ సర్కారు తొలగించే ప్రయత్నం చేస్తోంది. దానికి నిరసనగానే బడ్జెట్‌ను విపక్షం స్తంభింపజేసింది. అయితే జనవరి 22న డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక నిధుల బిల్లుపై సంతకం చేయడంతో ఈ షట్‌డౌన్ ముగిసింది. గత పాతికేళ్లలో ప్రభుత్వ వ్యవస్థను చట్టసభలు స్తంభింపజేయడం ఇది నాలుగోసారి. గతంలో 1995 నవంబరులో ఐదు రోజులపాటు, 1995-96లో నెల రోజులపాటు, 2013 అక్టోబరులో 16 రోజుల పాటు షట్‌డౌన్ కొనసాగింది.

ఆస్ట్రేలియా గ్రూప్‌లో భారత్‌కు చోటు

క్షిపణి సాంకేతికత నియంత్రణ కూటమి (ఎంటీసీఆర్), వాసెనార్ గ్రూప్‌లలో స్థానం దక్కించుకున్న భారత్‌కు జనవరి 19న జీవ, రసాయనిక ఆయుధాల నియంత్రణ సంస్థ అయిన ఆస్ట్రేలియా గ్రూప్‌లోనూ చోటు దక్కింది. జీవ, రసాయనిక ఆయుధాలను అభివృద్ధి చేసుకోకుండా.. వీటి తయారీకి అవసరమైన పరికరాలు, ముడిపదార్థాలు, సాంకేతిక వ్యాప్తిని వ్యతిరేకించే దేశాలను సమన్వయం చేసే, సామరస్యపూర్వక ఎగుమతుల నియంత్రణను పర్యవేక్షించే స్వచ్ఛంద సంస్థగా ఆస్ట్రేలియా గ్రూప్ (ఏజీ) పనిచేస్తోంది. 2016లో ఎంటీసీఆర్‌లో, గతేడాది వాసెనార్ గ్రూప్‌లో భారత్ సభ్యత్వం పొందింది.

క్లోనింగ్‌తో కోతులను సృష్టించిన చైనా

చైనా శాస్త్రవేత్తలు క్లోనింగ్ విధానంలో రెండు కోతులను సృష్టించారు. వీటికి ఝూంగ్ ఝూంగ్, హువా హువా అని పేరుపెట్టారు. 1996లో డాలీ గొర్రెను సృష్టించిన పద్ధతిలోనే చైనా పరిశోధకులు ఈ కోతులను సృష్టించారు. ఈ ప్రయోగంతో మానవ క్లోనింగ్‌కు దారులు సులువయ్యాయి.



రామచంద్రారెడ్డి ఉప్పుల

జాతీయం

69వ గణతంత్ర వేడుకలు



దేశవ్యాప్తంగా జనవరి 26న 69వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసారి వేడుకలకు ఆసియాన్ కూటమికి చెందిన 10 మంది దేశాధినేతలను అతిథులుగా హాజరయ్యారు.

స్మార్ట్ సిటీస్‌గా మరో 9 నగరాలు

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ జనవరి 19న స్మార్ట్ సిటీస్ ప్రాజెక్ట్‌లోకి మరో 9 నగరాలను చేర్చింది. అవి.. బరేలీ, మొరాదాబాద్, సహరన్‌పూర్ (ఉత్తరప్రదేశ్), ఈరోడ్ (తమిళనాడు), బీహార్‌షరీఫ్ (బీహార్), సిల్వాసా (దాద్రానగర్ హవేలీ), కవరత్తి (లక్షద్వీప్), ఇటానగర్ (అరుణాచల్‌ప్రదేశ్), డయ్యూ (డామన్ డయ్యూ). వీటితో కలిపి ఈ ప్రాజెక్ట్‌లో చేర్చిన నగరాల సంఖ్య 99కి చేరింది.

భారత్ - ఆసియాన్ సదస్సు



భారత్ - ఆసియాన్ సదస్సు జనవరి 25, 26 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగింది. భారత్ - ఆసియాన్ దేశాల మధ్య సంబంధాలు ప్రారంభమై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్మారక స్టాంపులు విడుదల చేసి సదస్సును ప్రారంభించారు. ఇందులో ఢిల్లీ డిక్లరేషన్ పేరిట ఒక ప్రకటనను విడుదల చేశారు. అంతర్జాతీయ చట్టాలకు లోబడి దక్షిణ చైనా సముద్ర ఒప్పందాన్ని అమలుచేయాలని తీర్మానించారు. ప్రధాని మోదీ ఆసియాన్ దేశాధినేతలతో సముద్ర తీర రక్షణ, అనుసంధానత, వాణిజ్యం తదితరాలపై చర్చలు జరిపారు.


జాబ్ కార్నర్

వ్యవసాయ విద్యార్థులకు ఆహ్వానం

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీ కోసం ఉద్దేశించిన అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ (ఏఆర్ఎస్) - 2017 ఎగ్జామ్‌కు అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏఎస్ఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దాంతోపాటు వ్యవసాయ వర్సిటీల్లో లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా కెరీర్ ప్రారంభించడానికి అర్హతగా నిలిచే నెట్ - 2018కు కూడా ఏఎస్ఆర్‌బీ దరఖాస్తులు కోరుతోంది. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించిన వివరాలను చూద్దాం..

అగ్రికల్చరల్ సైంటిస్టులు

- మొత్తం ఖాళీలు: **195**
- విభాగాల వారీగా ఖాళీలు: అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ - 6, అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ-6, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ - 18, ప్లాంట్ బయో కెమిస్ట్రీ - 9, ప్లాంట్ పాథాలజీ - 8, ప్లాంట్ ఫిజియాలజీ - 3, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్ - 4, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ - 6, అగ్రికల్చరల్ కెమికల్స్ - 5, ఆగ్రో ఫారెస్ట్రీ - 4, ఆగ్రోనమీ - 8, సాయిల్ సైన్సెస్ - 10, అగ్రికల్చరల్ ఎకనామిక్స్ - 16, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ - 6, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ - 9, ఫామ్ మెషినరీ అండ్ పవర్ - 9, కంప్యూటర్ అప్లికేషన్ అండ్ టీ - 22, లాండ్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ - 8, బయోఇన్ఫర్మాటిక్స్ - 11, అగ్రికల్చరల్ స్ట్రక్చర్ అండ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ - 12 తదితరాలు.
- ***వయసు:*** జనవరి 1 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. 45 ఏళ్లు మించని ఐకార్ సంస్థ ఉద్యోగులు, 35 ఏళ్లలోపున్న రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ***అర్హత:*** జూన్ 24 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. పీహెచ్‌డీ/ ఎంఫిల్ చేసిన అభ్యరులకు ప్రాధాన్యం. విదేశీ యూనివర్సిటీల నుంచి పీజీ చేసిన వారు సంబంధిత యూనివర్సిటీ కమిషన్ / విభాగం / భారత ప్రభుత్వ గుర్తింపు పత్రాన్ని విధిగా జతచేయాలి.



ఏఆర్ఎస్ 2017 పరీక్ష వివరాలు

- ఈ పరీక్ష ద్వారా ఎంపికైన వారికి ఐకార్‌లో శాస్త్రవేత్తగా కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది.
- ఇందులో మూడు దశలు ఉంటాయి. అవి.. ప్రిలిమినరీ, మెయిన్స్, వైవా. ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు 150 మార్కులు, మెయిన్స్‌కు 240 మార్కులు, వైవాకు 60 మార్కులు కేటాయించారు.
- ***ప్రిలిమినరీ ఎగ్జామినేషన్:*** ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో ప్రశ్నలు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్ట్ నుంచి ఈ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత పీజీ స్థాయిలో ఉంటుంది. ప్రశ్నపత్రాన్ని హిందీ, ఇంగ్లీషు మాధ్యమాల్లో రూపొందిస్తారు. నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 1/3వ వంతు మార్కు కోత విధిస్తారు.
- ప్రిలిమినరీ అనేది అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు. ప్రిలిమినరీ నుంచి కేటగిరీల వారీగా 1:15 నిష్పత్తిలో మెయిన్స్‌కు అనుమతిస్తారు. ఈ క్రమంలో మెయిన్స్‌కు అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులు కనీసం 45 శాతం, ఓబీసీలు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 35 శాతం మార్కులు సాధించాలి.
- ***మెయిన్స్ ఎగ్జామ్:*** ఈ పరీక్షను డిస్క్రిప్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. ఇందులో ఏ, బీ, సీ అనే మూడు భాగాలు ఉంటాయి.
- పార్టు - ఏలో 40 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 2 మార్కులు. అభ్యర్థులు ఈ ప్రశ్నలకు క్లుప్తంగా అంటే పది పదాలకు మించకుండా సమాధానాలు రాయాలి.
- పార్టు - బీలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి 5 మార్కులు. వీటికి ఒకటి / రెండు పేరాల్లో సమాధానాలు రాయాలి.
- పార్టు - సీలో 6 వ్యాసరూప ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి 10 మార్కులు.
సమాధానాలను హిందీ / ఇంగ్లీషు మాధ్యమాల్లో మాత్రమే రాయాలి. దస్తూరి సరిగా లేనిపక్షంలో మార్కుల కోత ఉంటుంది.
- మెయిన్స్‌లో నిర్దేశించిన అర్హత పొందిన అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో వైవాకు పిలుస్తారు.
- ***వైవా:*** ఇందులో బోర్డు సభ్యులు సంబంధిత విభాగంలో అభ్యర్థికి ఉన్న అవగాహనను పరీక్షిస్తారు. మారుతున్న శాస్త్ర సాంకేతిక అవసరాలకు అనుగుణంగా అభ్యర్థి తన సామర్థ్యాలను ఎలా మెరుగుపరుచుకుంటున్నాడో పరిశీలిస్తారు.
- ఎంపికైన అభ్యర్థులకు నిర్ణీత కాలవ్యవధితో కూడిన ఇంటెన్సివ్ కోర్సు స్టడీ, శిక్షణ ఉంటాయి. ఈ దశను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి నియామకం ఖరారు చేస్తారు. పోస్టింగ్ తీసుకున్న నాటి నుంచి కనీసం నాలుగేళ్లపాటు కౌన్సిల్‌లోనే పనిచేస్తామని శిక్షణ సమయంలోనే బాండ్ సమర్పించాల్సి ఉంటుంది.
- ***దరఖాస్తు ఫీజు:*** రూ.500 (ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగులకు ఫీజు మినహాయింపు)
- ఏఆర్ఎస్ పరీక్షకు హాజరు విషయంలో పరిమితులు ఉన్నాయి. ఈక్రమంలో జనరల్ అభ్యర్థులు ఆరు సార్లు, ఓబీసీ అభ్యర్థులు/దివ్యాంగులు తొమ్మిది సార్లు ఈ పరీక్షకు హాజరు కావచ్చు. ఎస్సీ/ ఎస్టీలకు ఎటువంటి పరిమితి లేదు.

నెట్ 2018 వివరాలు

- ఈ పరీక్ష ద్వారా ఎంపికైన వారికి వ్యవసాయ వర్సిటీల్లో లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెరీర్ ప్రారంభించేందుకు కావల్సిన అర్హత లభిస్తుంది.
- ***వయసు:*** జనవరి 1 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి.
- ***అర్హత:*** జూన్ 24 నాటికి సంబంధిత విభాగంలో పీజీ.
- ***పరీక్ష వివరాలు:*** ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో ఒక్క పేపర్ మాత్రమే ఉంటుంది. అభ్యర్థి ఎంచుకొన్న విభాగం నుంచి 150 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి ఒక మార్కు. అంటే మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం 2 గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులు 50 శాతం, ఓబీసీలు 45 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 40 శాతం సాధించాల్సి ఉంటుంది.
- నెగెటివ్ మార్కులు ఉన్నాయి. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కు కోత విధిస్తారు.
- ఏఆర్ఎస్ మాదిరిగా ఈ పరీక్షకు హాజరు విషయంలో ఎటువంటి పరిమితులు లేవు. ఆసక్తి మేరకు ఎన్ని సార్లైనా ఈ పరీక్ష రాయవచ్చు.
- ***దరఖాస్తు ఫీజు:*** జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఓబీసీలకు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు రూ.250
- అభ్యర్థులు ఏఆర్ఎస్, నెట్ ఎగ్జామ్స్ రెండూ రాసే వీలుంది. అప్పుడు జనరల్ అభ్యర్థులు రూ.1500, ఓబీసీలు రూ.1000, ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు రూ.250 చెల్లించాలి.

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 6
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 2
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం: హైదరాబాద్
- వెబ్‌సైట్: www.asrb.org.in

ఆంధ్రజ్యోతి 7

నవ్య

కుటుంబ కదంబం

ఆదివారం • 28 జనవరి 2018

సండే సెలబ్రిటీ

'అమ్మ' జన్మనిచ్చింది.
చిత్రపరిశ్రమలో తనకు తానుగా 'నేను' అని నిలబడగల ధైర్యాన్నిచ్చింది.
ఆ ధైర్యమే నటుడిగా ఈ రోజు ఇంత పేరు తీసుకొచ్చింది.
'అమ్మాయి' పుట్టగానే తండ్రిగా బాధ్యతను తెచ్చింది.
కొత్తగా 'మామగారు' అనే హోదాను ఇచ్చింది!
'అమ్మ.. నేను... మా అమ్మాయి' - చియాన్ విక్రమ్ జీవితకథలో కొన్ని ముఖ్యమైన మజిలీలు!
ఆదివారం 'నవ్య' పాఠకుల కోసం ప్రత్యేకం....



అమ్మ.. నేను.. మా అమ్మాయి!

◆ **అమ్మాయికి పెళ్లి చేసి అత్తారింటికి పంపించడం ప్రతి తండ్రికి ఓ బాధ్యత, గౌరవం. ఇటీవలే మీకు ఆ బాధ్యత తీరినట్లుంది...**

★ (చిరునవ్వుతో...) నేనింకా మా అమ్మాయి అక్షితను చిన్నపిల్ల అనే అనుకుంటున్నా! పుట్టీపుట్టగానే ఈ చేతుల్తో ఎత్తుకుని, గుండెల మీద నడిపించి, కళ్లల్లో పెట్టుకుని పెంచుకున్న పాప. అప్పుడే అంత పెద్దదయిందా? అనిపిస్తుంటుంది. బహుశా... ప్రతి ఆడపిల్ల తండ్రి ఫీలింగూ ఈ విధంగానే ఉంటుందేమో. పెళ్లితో ప్రతి అమ్మాయికి కొత్త బంధాలు, బాంధవ్యాలు ఏర్పడతాయి. సరికొత్త జీవితం మొదలవుతుంది. అక్షిత ఇప్పుడు ఆ ఆనందాల్లో మునిగితేలుతోంది. తండ్రిగా నేను కోరుకునేది తన సంతోషమే కదా!

◆ **అక్షితది ప్రేమ వివాహం. అమ్మాయి ప్రేమ సంగతి మీకు ఎప్పుడు తెలిసింది? తను చెప్పగానే ఒప్పేసుకున్నారా?**

★ మా అల్లుడు మనూ రంజిత్, అమ్మాయి... చిన్నప్పటి నుంచి ఒకరికొకరు తెలుసు. పదో తరగతిలో ఉన్నప్పుడు ఒకరోజు మనూని మా ఇంటికి తీసుకొచ్చి 'డాడ్.. హీ ఈజ్ మై ఫ్రెండ్' అని పరిచయం చేసింది. స్నేహితులుగా మొదలైన వాళ్ల ప్రయాణం కొన్ని రోజులకు ప్రేమగా మారింది. వాళ్ల స్నేహం ప్రేమగా మారుతుందని నాకూ ముందునుంచీ అర్థమవుతూనే ఉంది. అందుకే తను చెప్పినప్పుడు నేనేమీ ఆశ్చర్యపోలేదు. తెలిసిన అబ్బాయి.. మా అమ్మాయి ఇష్టపడ్డ సంబంధం.. ఇంకేం ఆలోచించకుండా, సంతోషంగా పెళ్లి చేశా.

◆ **ఎంత సంతోషం ఉన్నప్పటికీ... అమ్మాయిని అత్తారింటికి పంపించేటప్పుడు కొంచెం బాధ కూడా ఉంటుందేమోగా..!**

★ నో! నాకు ఎలాంటి బాధా లేదు. ఎందుకంటే... మనూ చాలా మంచోడు. నేను అమ్మాయిని అత్తారింటికి పంపిస్తున్నానని అనుకోలేదు. అతనే మా ఇంటికి వస్తున్నాడని ఫీలయ్యా. అక్షితను అల్లుడు ఎంతగా ప్రేమిస్తున్నాడనేది పక్కన పెడితే... మనూ ఈజ్ వెరీ స్వీట్ అండ్ రెస్పాన్సిబుల్ పర్సన్. హిజ్ ఫ్యామిలీ ఆల్సో వెరీ స్వీట్. మా అమ్మాయికి అటువంటి కుటుంబం లభించడం అదృష్టంగా భావిస్తున్నా.

◆ **రాజకీయ నేపథ్యమున్న కుటుంబంతో వియ్యం అందుకున్నారు. ఈ బంధుత్వం మీ సినీ ప్రయాణంపై ప్రభావం చూపుతుందనుకుంటున్నారా!**

★ లేదు. తమిళనాట సీనియర్ రాజకీయవేత్త కరుణానిధిగారి కుటుంబానికి, మా అల్లుడిగారి కుటుంబానికి దగ్గరి బంధుత్వం ఉంది. అయితే... మనూ కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ, వాళ్ళు క్రియాశీలక రాజకీయాల్లో లేరు. ఇంకొక ముఖ్యమైన విషయం... మా అమ్మాయిది పెద్దల అనుమతితో జరిగిన ప్రేమ వివాహం. కాబట్టి.. నా సినిమా ప్రయాణంపై ఎటువంటి ప్రభావం ఉండదు. అందువల్ల, నాకు పెద్ద బాధ లేదు. నేను రాజకీయాల్లోకి వచ్చి, ఏదైనా పార్టీలో చేరి, పబ్లిగ్గా ఒక పార్టీలో ఉంటున్నానని చెప్పినప్పుడు మాత్రమే నా సినిమా ప్రయాణంపై ప్రభావం ఉంటుంది. నేను పార్టీ పెట్టి లేదా ఏదొక పార్టీలో చేరి రాజకీయ లక్ష్యంతో ముందుకు వెళ్లేంత వరకూ ఏ సమస్యా ఉండదు.

ఫ్యామిలీ ఆల్బమ్


◆ **తెల్ల గడ్డంతో కనిపిస్తున్నారు! మామగారైన తర్వాత వచ్చిన మార్పా?**

★ (నవ్వుతూ..) నా వయసు గుర్తు చేస్తున్నారా? నో ప్రాబ్లమ్! స్టైల్‌గా ఉంది కదా! తెర మీద కూడా ఈ విధంగా కనిపించడానికి ఎటువంటి సమస్యా లేదు. గౌతమ్‌మీనన్ దర్శకత్వంలో నటిస్తున్న 'ధ్రువ నక్షత్రం'లో సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో నటిస్తున్నా. వయసుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వను. కథకు అవసరమైతే... కాలేజ్ కుర్రాడిగానూ, ముసలోడిగానూ కన్పిస్తా!

◆ **'మహావీర్ కర్ణ'లో కర్ణుడిగా విక్రమ్ ఎలా కనిపించబోతున్నారు?**

★ వెయిట్ చేయండి! ఈ ఇయర్ ఎండ్... నవంబర్ లేదా డిసెంబర్‌లో ఆ సినిమా చిత్రీకరణ మొదలవుతుంది. పాత్ర కోసం రెడీ కావడానికి నాలుగైదు నెలలు టైమ్ తీసుకుంటాను. అప్పుడు చూడండి... కర్ణుడిగా విక్రమ్‌ను!

◆ **అంటే... పాత్ర కోసం బరువు పెరుగుతున్నారా?**

★ ఐ డోన్ట్ నో! నేను రెడీ అయిన తర్వాత మీకు తెలుస్తుంది. దిస్ ఈజ్ గోయింగ్ టు బి మై లైఫ్ టైమ్ ఫిల్మ్. ఒక్కొక్క టైమ్‌లో ఇదే మన లైఫ్ టైమ్ సినిమా అనుకుంటాం కదా! 'శివపుత్రుడు', తర్వాత 'అపరిచితుడు', ఆ తర్వాత 'ఐ' అవకాశాలు వచ్చినప్పుడు ఎలా అనుకున్నానో... ఇప్పుడు 'మహావీర్ కర్ణ' విషయంలోనూ అలానే అనుకుంటున్నా. ఐయామ్ ష్యూర్... ఇంకా బోల్డన్ని లైఫ్ టైమ్ ఫిల్మ్స్ ఉంటాయి. కర్ణుడు అంటే సిక్స్‌ప్యాక్ బాడీ ఉండాలి. మంచి కండలు తిరిగిన దేహం ఉండాలి... అది కాదు. ఇప్పుడు నేను శాంతాక్లాజ్ వేషం వేస్తే.. సిక్స్‌ప్యాక్‌తో కనిపిస్తే బాగుంటుందా? లేదు కదా! అలాగే, 'మహావీర్ కర్ణ'లో నన్ను చూడగానే కర్ణుడిగా అనిపించేలా ఉంటా.

◆ **'ఇంకొక్కడు' ఇంటర్వ్యూ సమయంలో మీరు చెప్పారు... 'ఇంకొక నాలుగైదు సంవత్సరాలు నా బాడీని కష్టపెట్టాలనుకోవడం లేదు. ఫిజికల్ స్ట్రెయిన్ లేని సినిమాలు చేస్తా' అని. ఇప్పుడీ సినిమా కోసం, కర్ణుడి పాత్ర కోసం బాడీని కష్టపెట్టక తప్పదేమో!?**

★ (గట్టిగా నవ్వుతూ...) నేనూ అదే ఆలోచించా. నా అసిస్టెంట్ కూడా సినిమాకు సంతకం చేయగానే అవే మాటలు గుర్తు చేశారు. 'కన్నా! కర్ణ సినిమా కదా! ఇదే లాస్ట్' అన్నాను. 'ఆ మాట ఆ సినిమా అయిపోయాక చెప్పండి. కర్ణ తర్వాత మళ్లీ ఇలాంటి అవకాశం వస్తే... ఇదే లాస్ట్' అంటారన్నాడు. ఇప్పుడు నేను అంత కష్టపడకపోతే ఈ సినిమా చేయకూడదు. కర్ణుడు అంటే ఎలా ఉండాలి? చూస్తే.. 'వావ్! ఆయనే కర్ణ' అనుకోవాలి. అందుకోసం కష్టపడక తప్పదు. ఆ కష్టం నాకిష్టమే.

◆ **దర్శకుడు విమల్ కథ చెప్పడానికి ఫోన్ చేస్తే.. మీ కథలో కొత్తదనం ఏముంది? ఆల్రెడీ ఎన్టీఆర్‌గారు, శివాజీ గణేశన్‌గారు కర్ణుడిగా చేశారని అన్నారట!**

★ నిజమే. కర్ణ కాల్పనిక చిత్రం కాదు. పౌరాణిక చిత్రం. కర్ణుడి కథ అందరికీ తెలుసు. కానీ ముంబై నుంచి దర్శకనిర్మాతలు నిరవధికంగా ఫోన్లు చేశారు. అయినా నేను స్పందించలేదు. చివరికి పట్టు వదలని విక్రమార్కుడి తరహాలో ప్రయత్నించి, విమల్ చెన్నై వచ్చి కలిశారు. 'ఎన్టీఆర్‌గారు, శివాజీగారు చేశారు. కొత్తగా మీరేం చేస్తారు' అని నాకున్న డౌట్స్ అన్నీ అడిగా. అప్పుడతను 'ఇదొక హిందీ సినిమా. మనం ఇలా చేద్దాం' అని ప్లాన్ చెప్పాడు. ఆ క్లారిటీ నచ్చింది. ఫస్ట్ మీటింగ్‌లోనే ఓకే చెప్పేశా. వచ్చే నెలాఖరున సినిమా గురించి పూర్తి వివరాలు ప్రకటిస్తారు. అవి విని ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతారు. ఎందుకంటే ఆస్కార్ రేంజ్‌లో ఉంటుందీ సినిమా. ఒక్క మాటలో చెప్పాలంటే 'కర్ణ' తప్పకుండా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుంది.



◆ **రూ. 300 కోట్ల బడ్జెట్‌తో తీస్తామని చెబుతున్నారు. బిజినెస్ పరమైన ప్రణాళికలను నిర్మాతలు మీతో పంచుకున్నారా?**

★ ఇది ప్యాన్ ఇండియా ఫిల్మ్. వరల్డ్ ఫిల్మ్. 37 భాషల్లో విడుదల చేయాలనుకుంటున్నాం. కేవలం బిజినెస్ కోసం మాత్రమే... అన్ని భాషల్లో విడుదల చేయడం లేదు. అంతమంది ప్రేక్షకులూ చూడాలనుకునే చిత్రమిది. 'టెన్ కమాండ్‌మెంట్స్', 'బెన్‌హర్' సినిమాలు ప్రపంచంలోని అన్ని భాషల ప్రేక్షకుల్నీ ఎలా ఆకర్షించాయో... కర్ణుడి కథ కూడా అంతమందినీ ఆకట్టుకుంటుంది. రూ. 300 కోట్లు ఖర్చుపెట్టగల సామర్థ్యం నిర్మాతలకు ఉందని ఖర్చు చేయడం లేదు. కథకు అంత ఖర్చు అవసరం.

◆ **మేకప్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?**

★ మేకప్ కోసం ఆస్ట్రేలియాలో ఒక గ్రూప్ ఉంది. వాళ్ళే కావాలని చెప్పా. ఇక్కడ చేయరని కాదు... అక్కడి వాళ్లు చేస్తే మరింత రియలిస్టిక్‌గా ఉంటుంది. సంగీత దర్శకుడు, ఛాయాగ్రాహకుడు, ఇతర సాంకేతిక నిపుణుల విషయంలో వేరే ఛాయిస్, ఆప్షన్‌లు ఉండవచ్చు. కానీ, మేకప్ విషయంలో మాత్రం వాళ్ళే కావాలని చెప్పా. మా దర్శక నిర్మాతలూ సరేనన్నారు. ది బెస్ట్ టీమ్‌ని సెలక్ట్ చేశారు.


అల్లుడు, కూతురుతో...

◆ **'కర్ణ' కోసం ఎక్కువ రోజులు పనిచేయాల్సి ఉంటుందేమో?**

★ నిజమే. అందుకే ఈ సినిమా చేసిన తర్వాత తప్పక బ్రేక్ తీసుకోవాలని అనుకుంటున్నా.

◆ **దర్శకత్వం చేసే ఆలోచన ఉందా?**

★ ప్రతి నటుడు, నటి దర్శకత్వం చేయొచ్చు. దర్శకుడు కావొచ్చు. ప్రతి సినిమాకి మేము సహాయ దర్శకులుగా పని చేస్తాం. నటీనటులందరూ తాము చేసే ప్రతి సన్నివేశం మీద శ్రద్ధ వహిస్తుంటారు. నాకు దర్శకత్వం ఎలా చేయాలో తెలుసు. కానీ, చెయ్యను. నా వరకూ దర్శకత్వం అనేది పెద్ద పని.

◆ **మీ లైఫ్ గురించి, మీరు చేసిన పాత్రలు, వాటికి చేసిన హోమ్‌వర్క్ గురించి పుస్తకం రాసే ఆలోచన ఏమైనా ఉందా?**

★ ఇద్దరు వ్యక్తులు నా లైఫ్ మీద ఒక సినిమా చేయమని అడిగారు. ఐదుగురు పుస్తకం రాయమని చెప్పారు. నా స్ట్రగుల్స్ గురించి, అసలు నేను ఇండస్ట్రీలోకి ఎలా వచ్చాను? అనే అంశాల గురించి! నా జర్నీ, యాక్సిడెంట్, తర్వాత సినిమాలు... వాళ్లకు ఇంట్రెస్టింగ్‌గా అనిపించాయి. నా స్నేహితులూ పుస్తకం రాయమని చెబుతున్నారు. కమర్షియల్ సినిమాకు కావలిసినంత కథ, అన్ని ట్విస్టులు నా జీవితంలో ఉన్నాయి. నా వైఫ్ ఎప్పుడూ చెబుతుంది... 'నువ్వు మర్చిపోతూ ఉంటావ్. త్వరగా పుస్తకం రాయడం స్టార్ట్ చెయ్' అని. తను అన్నదీ నిజమే. ఎందుకంటే... కొంతకాలం తర్వాత మనం కొన్ని విషయాలు మర్చిపోతుంటాం కదా! నేను బాగా రాస్తా కూడా. ఏదో పుస్తకాల్లో రాసినట్టు రాయను. నాకు ఆ భాష రాదు. కొంచెం కామెడీగా, సహజత్వానికి దగ్గరగా రాస్తా.

◆ **మీ అబ్బాయి ధ్రువ్‌తో మీ స్ట్రగుల్స్, ఎర్లీ డేస్ గురించి డిస్కస్ చేస్తారా?**

★ వాడికి చాలా వరకూ తెలుసు. ఒకసారి నేను ఎర్లీ స్టేజెస్‌లో ఉన్న ఇంటికి తీసుకువెళ్లి చూపించా. చాలా రోజులు ఇక్కడే ఉన్నానని చెప్పా. 'అయ్యో... ఇక్కడున్నావా?' అన్నాడు. 'యస్...' అన్నాను. సినిమాల గురించీ తనతో డిస్కస్ చేస్తుంటా. నేను మా పిల్లలను స్టార్ కిడ్స్‌లా పెంచలేదు. స్కూల్‌లో పిల్లలకు, స్నేహితులకు ధ్రువ్ 'నేను విక్రమ్ కుమారుణ్ణి' అని చెప్పకూడదు. అమ్మాయి కూడా అంతే. మా పిల్లల్ని అందరితో పాటే స్కూల్ బస్‌లో పంపించాను. వాళ్ళ స్నేహితులకు నేనొక నార్మల్ అంకుల్... అంతే.

◆ **స్ట్రగుల్స్‌లో మీరు ఫైట్ చేయడానికి అంత ఇన్స్పిరేషన్ ఎక్కణ్ణుంచి వచ్చింది?**

★ మదర్ నుంచి! అమ్మే నా ఇన్స్పిరేషన్. షీ ఈజ్ వెరీ పాజిటివ్ పర్సన్. అవకాశాల కోసం తిరిగే సమయంలో, కొత్తల్లో ఎవరైనా ఏదైనా మాట అంటే బాధపడేవాణ్ణి. ఇంటికొచ్చి అమ్మతో చెబితే.... 'అవునా! ఓకే. ఇంతకంటే మంచి అవకాశం వస్తుందిలే. డోంట్ వర్రీ' అని ధైర్యం చెప్పేది. ఓపికగా ఎదురుచూసే గుణం అమ్మ నుంచే అలవడింది. ఎప్పుడూ 'డ్రీమ్ బిగ్ అండ్ అచీవ్ ఇట్' అనేది. షీ ఈజ్ మై డ్రైవింగ్ ఫోర్స్.

మీరు చాలా డిఫరెంట్ సినిమాలు చేశారు. అయితే.. ఇతర హీరోల సినిమాలు చూసినప్పుడు 'నేను ఈ సినిమా చేసుంటే బావుండేది. నాకు ఈ సినిమా ఛాన్స్ ఎందుకు రాలేదు' అని ఎప్పుడైనా అనుకున్నారా?

మన ప్లేటులో ఏముందో? అదే మనది. వేరేవాళ్ల ప్లేటులోది మనకి ఎందుకు? ఎప్పుడూ అలా ఆలోచించలేదు. ఒకవేళ... ఇప్పుడు నాకు ఒక అవకాశం వచ్చింది. కథ లేదా అందులో పాత్ర నచ్చలేదు. మరేవో కారణాల వల్ల వద్దనుకున్నాను. అలాంటప్పుడు, ఆ కథతో మరొక హీరో సినిమా చేసి పెద్ద హిట్ అయినా నేను ఫీల్ కాను. 'ఓకే. ఆయన అలా నటించారు. నేను చేస్తే ఎలా చేసుండేవాణ్ణి!' అని ఆలోచిస్తా. అంతే తప్ప 'అయ్యో... నేనో మంచి సినిమా మిస్సయ్యానే' అని బాధపడను. అంతెందుకు.. ఇదిగో.. త్వరలో తెలుగులో విడుదలవుతోన్న 'స్కెచ్'లో నా నటన చూసిన వారంతా 'వేరే హీరో ఈ సినిమా చేసుంటే ఎలా ఉండేదో? కానీ... మీరు మాత్రం ఆ పాత్రను చాలా డిఫరెంట్‌గా చేశారు' అన్నారు. మీరు చెయ్యడం వల్లనే... సినిమా కొత్తగా ఉందన్నారు. ఇలాంటి మాటలు వింటున్నప్పుడు ఆనందంగా ఉంటుంది.

మీ ఫ్యాషన్ ఐకాన్ ఎవరు? స్టైల్స్ విషయంలో ఎలా అప్‌డేట్ అవుతుంటారు?

ఐ లైక్ టు డ్రెస్ వెల్. సినిమాలో క్యారెక్టర్, క్యారెక్టరైజేషన్‌కి తగ్గట్టు డ్రెస్సింగ్ ఉండాలనుకుంటా. ప్రత్యేకించి ఫ్యాషన్ ఐకాన్ అంటూ ఎవరూ లేరు. రెగ్యులర్ ట్రెండ్స్ అబ్జర్వ్ చేస్తా. ఒక్కోసారి విలేజ్ రోల్స్, డల్ రోల్స్ చేసినప్పుడు ఫ్యాషన్‌గా కనిపించడానికి ఏం ఉండదు. ఆ పాత్రకు తగ్గట్టు కనిపిస్తానంతే. 'ఇంకొక్కడు'లో 'లవ్' క్యారెక్టర్ డ్రెస్సింగ్, స్టైలింగ్‌కి మంచి పేరొచ్చింది. దానికి కారణం మా అబ్బాయే. స్టైలింగ్, వాకింగ్ స్టైల్, మేనరిజమ్ దగ్గర్నుంచి ప్రతిదీ ధ్రువ్ దగ్గరుండి చూసుకున్నాడు. నాకు సలహాలు ఇచ్చాడు. ఆ క్యారెక్టర్ వరకూ మా అబ్బాయే ఫ్యాషన్ గురు.

• సత్య పులగం

బ్యూటీ కేర్

నలభైల్లో నాజూగ్గా...

నలభై ఏళ్లు దాటిన తర్వాత ఆడవాళ్లు చర్మ సౌందర్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. అవేమిటంటే...

* నలభైల తర్వాత చర్మం నల్లబడుతుంది. అందుకే ఫౌండేషన్ వేసుకునే ముందు బాగా నీళ్లు తాగితే చర్మం కాంతివంతంగా ఉంటుంది.
* పీచ్ లేదా పింక్ బ్లష్ వాడడం వల్ల చర్మం మరింత కాంతులీనుతుంది. బుగ్గలు సహజ సౌందర్యంతో ఆకర్షణీయంగా కనబడతాయి.
* చర్మం మృదువుగా ఉండడానికి మన్నికైన మాయిశ్చరైజర్ వాడాలి.
* ఎరుపు, కాషాయం, పసుపు వంటి వార్మ్ కలర్స్ స్కిన్ టోన్‌ను సమతుల్యంగా ఉండేట్టు చేస్తాయి.
* ఐ షాడోలు కూడా వార్మ్ టోన్‌లో ఉండాలి. 'న్యూట్రల్ టోన్డ్ ఐ కలర్స్' కళ్లకు అందం తెస్తాయి.
* మస్కారాతో పాటు కాటుక లేదా జెల్ ఐలైనర్ వాడితే కళ్లకు సాఫ్ట్ లుక్ వస్తుంది.
* వయసుపెరిగే కొద్దీ పెదాలు పలుచగా అయి తరచూ పొడారిపోతుంటాయి. లిప్ లైనర్ వాడితే పెదాలు మెరుస్తూ ఆకర్షణీయంగా కనబడతాయి.
* స్కిన్ టోన్‌ను బట్టి లైట్ లేదా బ్రైట్ లిప్‌స్టిక్ కలర్స్‌ను వాడితే బాగుంటుంది.



వంటింటి చిట్కాలు

చలిలో జలుబు రాకుండా...

శీతాకాలం చలి ఇంకా వదలలేదు. దానికి తోడు వాతావరణ కాలుష్యం. ఈ రెండింటి వల్ల చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా అందరూ జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చలి వల్ల జలుబు, ఛాతీ, ఊపిరితిత్తుల బాధలు ఎక్కువవుతున్నాయి. వీటి నుంచి బయటపడటానికి కొన్ని వంటింటి చిట్కాలు ఉన్నాయి. అవి...

* మైదాపిండితో చేసిన బ్రెడ్, బిస్కట్లు లాంటివి తినకుండా ఉంటే మంచిది.
* ప్రోసెస్డ్ ఫుడ్స్, చీజ్, నిలువ పచ్చళ్లకు దూరం ఉండాలి.
* రాత్రివేళల్లో చల్లని పదార్థాలు తినొద్దు.
* ఉదజనీకృత ఫ్యాట్స్‌ను అదీ గుండె సంబంధిత సమస్యలున్న వాళ్లు అసలే తినకూడదు.
* ఖాళీ కడుపుతోనో లేదా లైట్‌గా ఆహారం తీసుకున్నప్పుడో పిప్పర్‌మెంట్ ఆయిల్‌తో ఆవిరిపట్టుకుంటే మంచిది.
* గోరువెచ్చగా ఉండే ఫ్లూయిడ్లు తీసుకుంటే శరీరానికి ఎంతో సాంత్వనగా ఉంటుంది. వేడి ద్రవపదార్థాలు తీసుకోవడం వల్ల ఊపిరితిత్తుల్లో చేరిన నెమ్ము కరుగుతుంది.
* వెల్లుల్లి లేదా అల్లం వేసి తయారుచేసిన కాయగూరల సూప్‌ను వేడిగా తాగితే మంచిది. దీని వల్ల ఊపిరితిత్తుల్లోని శ్లేష్మం తగ్గుతుంది.
* ఆర్గానిక్ బెల్లం, అల్లం రసం చుక్కలు, కచ్చాపచ్చాగా చేసిన నల్ల మిరియాల పొడి, పిప్పలి (లాంగ్ పెప్పర్) వేడి నీళ్లల్లో వేసి తాగితే ఊపిరితిత్తులకు మంచిది.
* పసుపులో ఉండే కుర్క్యుమిన్ ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది. తాజా పసుపు వేళ్ల నుంచి తీసిన రసాన్ని వేడి సూప్స్‌లో కలుపుకుని తాగితే మంచిది.
* ఉల్లిపాయరసంలో కొద్దిగా నిమ్మరసం కలిపి తాగినా లేదా పచ్చి ఉల్లిపాయమీద నిమ్మరసం పిండుకుని తిన్నా ఊపిరితిత్తుల్లో చేరిన శ్లేష్మం కరిగిపోతుంది.
* ఒక కప్పు వేడినీళ్లల్లో టేబుల్‌స్పూన్ యాపిల్ సిడార్ వెనిగర్ కలిపి తాగితే కూడా నెమ్ము పోతుంది.
* కృత్రిమమైన, రసాయన ఆరోమా స్ప్రేలను ఇంట్లో పెట్టొద్దు.



పేరెంటచ్

నాణాన్ని రెండు వైపులా చూపించాలి

కొంత మంది పిల్లలు తమకు తెలిసిందే నూటికి నూరు శాతం కరెక్ట్ అని వాదిస్తుంటారు. అవతలి వాళ్లు చెప్పింది అసలే వినరు. మా టీచర్ చెప్పిందనో, మా డాడీ చెప్పాడనో ఆ మాటకింక తిరుగులేదంటూ అరచి అరచి మాట్లాడుతుంటారు. అందులో వాళ్ల తప్పేమీ లేదు. అలా చెప్పిన వాళ్లు ఆ విషయానికి ఉన్న ఒకే ఒక్క కోణాన్ని చెప్పి వదిలేయడమే అందుకు కారణం. తలిదండ్రుల పట్ల, టీచర్ల పట్ల వారికి ఉన్న గురి వల్ల పిల్లలు వారు చెప్పిందే సమస్తం అనుకుంటారు. కానీ, నిప్పు వంటకు ఉపయోగపడటం ఎంత నిజమో వికటించినప్పుడు అది నిలువునా కాల్చేయడమూ అంతే నిజం. కుంభవృష్టి వల్ల, బీడు నేల పచ్చబడటం ఎంత నిజమో, ఊళ్లు మునిగిపోవడం కూడా అంతే నిజం.

అలాంటప్పుడు ఒకటి చెప్పి మరొకటి చెప్పకపోతే ఏమవుతుంది? పిల్లలు ఆ చెప్పిన ఆ ఒక్కదాన్నే పట్టుకు వేళ్లాడుతుంటారు. ఈ పాక్షిక అవగాహన అలాగే కొనసాగితే మును ముందు వాళ్లు పెద్ద పిడివాదులుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఆ చెప్పిన వాళ్లు ఏదో పొరపాటున చెప్పారనుకోవడానికి కూడా వీల్లేదు. ఎందుకలా? అంటే పిల్లలకు నెగెటివ్ విషయాలు ఎందుకని, పాజిటివ్ విషయాలే చెప్పామని చెబుతారు. పైకి చూస్తే ఇది బాగానే ఉందనిపిస్తుంది. కానీ దానికి విరుద్ధంగా ఉన్న నిజాలు వారికి ఎలా తెలియాలి? అయినా, చెప్పకుండా వదిలేసినంత మాత్రాన ఆ నెగెటివ్ నిజాలు శాశ్వతంగా కనుమరుగైపోవు కదా! నాణానికి ఒక వైపునే చూడడగలిగే జ్ఞానం సంపూర్ణత్వాన్ని ఇవ్వదు కదా! ఎప్పటికైనా తీపి విషయాలతో పాటు, చేదు నిజాలు కూడా తెలియాల్సిందే! సగం చెప్పి వదిలేయడం వల్ల పిల్లలు ఒక్కోసారి నలుగురిలో నవ్వులపాలయ్యే పరిస్థితి ఎదురుకావచ్చు. అది వారిని తీవ్రమైన ఆత్మన్యూనతా భావానికి కూడా గురిచేస్తుంది. అందుకే కొంత కష్టమే అనిపించినా ఒక అంశానికి సంబంధించిన వివిధ కోణాలూ వివరించడమే మేలు.




బాలకృష్ణ, సాయిధరమ్‌తేజ్

'ఇంటిలిజెంట్' యువతకు నచ్చుతుంది

- బాలకృష్ణ

"పరిశ్రమ గర్వించదగ్గ దర్శకుడు వినాయక్. ఆయనతో 'చెన్నకేశవరెడ్డి' సినిమా చేశాను. ఆర్టిస్టు నుంచి నటన ఎలా రాబట్టుకోవాలో బాగా తెలిసిన దర్శకుడు. మన ఇద్దరి కాంబినేషన్‌లో మళ్లీ సినిమా ఎప్పుడని ఆయన్ని అడుగుతూ ఉంటాను. వినాయక్ తెరకెక్కించిన 'ఇంటిలిజెంట్' పెద్ద హిట్ కావాలి. మెగా, నందమూరి అభిమానులకు, యువతకు కూడా నచ్చే సినిమా అవుతుంది" అని నందమూరి బాలకృష్ణ అన్నారు. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వినాయక్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన 'ఇంటిలిజెంట్' టీజర్‌ను నందమూరి బాలకృష్ణ శనివారం విడుదల చేశారు. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ తన సొంత బ్యానర్‌లాంటిదని చెప్పారు. నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ "జనవరిలో 'జై సింహా' రూపంలో బాలకృష్ణగారు నాకు మంచి ఎనర్జీ ఇచ్చారు. 'ఇంటిలిజెంట్' చిత్రం టీజర్ ఆయన చేతుల మీదుగా విడుదల కావడం చాలా ఆనందంగా ఉంది. పెద్ద సెన్సేషనల్ హిట్ కొట్టినట్టు భావిస్తున్నాను" అని తెలిపారు. వినాయక్ మాట్లాడుతూ "బాలయ్య చెప్పిన మాటలు విని మా యూనిట్ మొత్తం ఆనందోద్వేగంతో ఉంది" అని చెప్పారు. కొత్తవారిని ప్రోత్సహించడంలో బాలయ్య ముందుంటారనే విషయం మరోసారి ప్రూవ్ అయిందని సాయిధరమ్‌తేజ్ అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: సి.వి.రావు, పత్సా నాగరాజు.


ఎన్టీఆర్

చిన్నదో వైపు... పెద్దదో వైపు!?


అను


పూజ

'చిన్నదో వైపు... పెద్దదో వైపు... చిందేసి చెంగుమంటే పెరగదా ఊపు' అంటూ 'బృందావనం'లో ఇద్దరు ముద్దుగుమ్మలతో ఎన్టీఆర్ చిందేశారు. ఇద్దరు కథానాయికలతో చిందేయడం ఎన్టీఆర్‌కి కొత్తేమీ కాదు. 'బృందావనం'కి ముందు... తర్వాత... కొన్ని సినిమాలు చేశారు. ఇప్పుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో హీరోగా నటించనున్న సినిమాలోనూ ఎన్టీఆర్ సరసన ఇద్దరు కథానాయికలు నటించనున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారమ్. ఇద్దరిలో ఒక కథానాయికగా అనూ ఇమ్మాన్యుయేల్ పేరు ఎప్పట్నుంచో వినిపిస్తోంది. ఇలియానా, సమంతలు త్రివిక్రమ్ దర్శకత్వంతో రెండేసి సినిమాలు చేశారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో 'అజ్ఞాతవాసి' చేసిన అనూ ఇమ్మాన్యుయేల్, ఎన్టీఆర్ సినిమా చేసే అవకాశాలను తోసిపుచ్చలేం! తాజాగా ఈ సినిమాలో కథానాయికగా 'దువ్వాడ జగన్నాథమ్' ఫేమ్ పూజా హెగ్డే పేరు వినిపిస్తోంది. ఇద్దరిలో చిత్రీకరణ మొదలయ్యే సమయానికి ఎవరుంటారో? ఎవరు బయటకు వెళతారో? ఇద్దరూ ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ చివర దశలో ఉందట! మార్చిలో చిత్రీకరణ మొదలవుతుందని టాక్. ఈలోపు ఎన్టీఆర్ పాత్రకు అనుగుణంగా బరువు తగ్గనున్నారు. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించనున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త.

వయసు తగ్గుతోంది.. ఎనర్జీ పెరుగుతోంది

- వి.వి.వినాయక్


వంశీ, వినాయక్, రవితేజ, సీరత్ కపూర్, రాశీఖన్నా, నల్లమలుపు బుజ్జి, విక్రమ్

"సినిమా సినిమాకు రవితేజ వయసు తగ్గుతోంది. ఎనర్జీ పెరుగుతోంది. 'విక్రమార్కుడు' సినిమా చూసి ప్రేక్షకులు ఎలా ఫీలయ్యారో.. ఈ సినిమా చూశాక అలాగే ఫీలవుతారు. రవితేజ కెరీర్‌లో ఇదొక మంచి సినిమా అవుతుంది" అని వి.వి.వినాయక్ అన్నారు. రవితేజ కథానాయకుడిగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. రాశీఖన్నా, సీరత్ కపూర్ నాయికలు. విక్రమ్ సిరికొండ దర్శకుడు. నల్లమలుపు బుజ్జి, వల్లభనేని వంశీ నిర్మాతలు. శనివారం ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. జామ్8 సంగీతం అందించిన ఆడియో సీడీలను వి.వి.వినాయక్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "బుజ్జి, వంశీ నా సొంత నిర్మాతలు. వాళ్లు నిర్మించిన ఈ సినిమా నాకు చాలా స్పెషల్. విక్రమ్ నాతో కలిసి పనిచేశాడు. రెండు రీళ్లు సినిమా చూపించాడు. డైరెక్షన్ అదిరిపోయింది. సినిమా సూపర్‌హిట్ అవుతుందని అప్పుడే అర్థమైంది" అని అన్నారు. రవితేజ మాట్లాడుతూ "వక్కంతం వంశీ ఇచ్చిన కథను విక్రమ్ స్టైల్‌కు మార్చుకుని అనుకున్న దానికన్నా బాగా తీశాడు. అతని వర్కింగ్ స్టైల్ చూశాక పరిశ్రమకు మరో మంచి దర్శకుడు వచ్చాడనిపించింది. ఈ సినిమా సక్సెస్ క్రెడిట్ 100 శాతం దర్శకుడికే దక్కుతుంది. జామ్8 అద్భుతమైన బాణీలిచ్చారు. పాటలన్నీ నాకు నచ్చాయి. సినిమా పెద్ద హిట్టై నిర్మాతలకు లాభాలు రావాలని కోరుకుంటున్నా" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "బుజ్జిగారితో పన్నెండేళ్ల అనుబంధం నాది. ఆయన వల్లే ఈ ప్రాజెక్ట్ కుదిరింది. తొలి సినిమాకు రవిలాంటి హీరో దొరకడం నా అదృష్టం. ఆయన ఎనర్జీ నాలో మరింత స్ఫూర్తిని నింపింది. నా లైఫ్‌లో ఇదొక అద్భుతం. టైటిల్‌లో ఎంత పవర్ ఉందో సినిమాలోనూ అంతే పవర్ ఉంటుంది" అని అన్నారు. "రవితేజతో 'కృష్ణ' సినిమా చెయ్యాలి. అప్పుడు కుదర్లేదు. పదేళ్ల తర్వాత చక్కని కథతో ఈ సినిమా కుదిరింది. ఫిబ్రవరి 2న సినిమా విడుదల చేస్తున్నాం" అని వల్లభనేని వంశీ చెప్పారు. హరీశ్ శంకర్, వక్కంతం వంశీ, ఛోటా కె. నాయుడు, జెమినీ కిరణ్, రాశీఖన్నా, సీరత్ కపూర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆశా భోస్లేకు టీఎస్సార్ యశ్‌చోప్రా పురస్కారం

నేపథ్య గాయని, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత, పద్మవిభూషన్ ఆశా భోస్లేను 2017 సంవత్సరానికి గానూ 'టి. సుబ్బరామిరెడ్డి (టీఎస్సార్) ఫౌండేషన్' ఇస్తున్న నేషనల్ యశ్‌చోప్రా మెమోరియల్ పురస్కారంతో సత్కరిస్తున్నట్లు శనివారం ప్రకటించారు. ముంబయ్‌లో వచ్చే నెల 16న ఈ సత్కార వేడుక జరగనుంది. మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావుతో పాటు లతా మంగేష్కర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ హిందీ దర్శక, నిర్మాత యశ్‌చోప్రా మరణానంతరం ఆయన పేరు మీద 2013 నుంచి టీఎస్సార్ ఫౌండేషన్ ఈ అవార్డును సినీ ప్రముఖులకు అందజేస్తున్నారు.


టి. సుబ్బిరామిరెడ్డి, యశ్‌చోప్రా, ఆశాభోస్లే

అమితాబ్ బచ్చన్, షారూఖ్ ఖాన్, శ్రీదేవి, జయప్రద తదితరులు ముంబయ్‌లో జరగనున్న వేడుకకు హాజరుకానున్నారు.

ఆ ట్విస్టే కారణం

- అశోక్


రవీందర్, అశోక్

"హీరోహీరోయిన్ అనే తేడా లేకుండా మంచి కథ ఉంటే ఆదరించడానికి మేమున్నాం అని తెలుగు ప్రేక్షకులు మరోసారి నిరూపించారు. 'భాగమతి'లో భయమనేది ఒక ఫ్యాక్టర్ మాత్రమే. సెకండాఫ్‌లో ట్విస్ట్‌కు ఆడియెన్స్ నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ఆనందంగా ఉంది. అనుష్క, యు.వి సంస్థ ఈ కథను అంగీకరించడానికి ఆ ట్విస్టే కారణం" అని దర్శకుడు అశోక్ అన్నారు. అనుష్క కీలక పాత్రలో ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'భాగమతి'. యు.వి.క్రియేషన్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "అనుష్క నటనతోపాటు 'భాగమతి' బంగ్లా సినిమాకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. అనుష్క కళ్లతో ఇచ్చిన చిన్న చిన్న ఎక్స్‌ప్రెషన్ గురించి కూడా ప్రేక్షకులు మాట్లాడుతున్నారు. కథకు తగ్గ టెక్నీషియన్లు కుదరడమే మా విజయానికి కారణం" అని అన్నారు. "రెగ్యులర్ సినిమాలకు సెట్ వెయ్యడానికి పెద్ద కష్టపడాల్సిన అవసరం లేదు. ఇలాంటి సినిమాలకు పని చెయ్యడం ఒక టాస్క్ అనే చెప్పాలి. ఈ సినిమాకు పనిచెయ్యడం సవాల్‌గా అనిపించింది" అని ఆర్ట్ డైరెక్టర్ రవీంద్ర తెలిపారు.

పెద్దారెడ్డి మంచితనం


మౌర్యాని

సతీశ్‌రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ కీలక పాత్రధారులుగా వి.జె.రెడ్డి రూపొందిస్తున్న చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. సి.హెచ్.రఘునాథరెడ్డి నిర్మాత. గురురాజ్ సంగీతం అందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో పాటల్ని విడుదల చేశారు. సీనియర్ దర్శకుడు సాగర్ సీడీలను ఆవిష్కరించారు. రేలంగి నరసింహరావు తొలి సీడీని స్వీకరించారు. దర్శకుడు మాట్లాడుతూ "నెల్లూరు నుంచీ ఖమ్మం జిల్లా సీతారాంపురం గ్రామానికి వలస వచ్చిన ఓ వ్యక్తి కథ ఇది. మంచితనానికి మారుపేరైనా అతని జీవితంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి అన్నది ఆసక్తికరం. వినోదం, విషాదం అన్నీ సమపాళ్లల్లో ఉన్న చిత్రమిది. గురురాజ్ చక్కని బాణీలందించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని అన్నారు. 28 రోజుల్లో సినిమా పూర్తయిందని కథానాయకుడు సతీశ్‌రెడ్డి చెప్పారు.

'బంగారి బాలరాజు' గ్లిట్టర్స్


రాఘవ్, సురేందర్ రెడ్డి, కోటేంద్ర

నంది క్రియేషన్స్ పతాకంపై రాఘవ్, కర్ణాణ కత్రీన్ కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'బంగారి బాల రాజు'. కోటేంద్ర దుద్యాల దర్శకుడు. కె.ఎం.డి రఫీ, రెడ్డం రాఘవేంద్ర రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రం గ్లిట్టర్స్‌ను దర్శకుడు సురేందర్‌రెడ్డి విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "చక్కని ప్రేమకథతో రూపొందిన చిత్రమి ది. ఫిబ్రవరి 14న ట్రైలర్‌ను విడుదల చేసి, మార్చిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని తెలిపారు.

'శీలవతి' షకీలా



షకీల ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'శీలవతి'. సాయిరాం దాసరి దర్శకత్వంలో రాఘవ. ఎం. గణేశ్, వీరు బాసింశెట్టి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. షకీలా నటిస్తున్న 250వ చిత్రమిది. ఇటీవల ఫస్ట్‌లుక్‌ను ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. "కేరళాలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్ ఇది" దర్శకుడు అని తెలిపారు. ఏప్రిల్‌లో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అహో.. ఆలపాటి!



▸ రంగస్థలంపై శ్రీకృష్ణదేవరాయలుగా అలరించిన తెనాలి ఎమ్మెల్యే

ఆయనో శాసన సభ్యుడు.. నిత్యం ప్రజా జీవనంలో తనమునకలై ఉండే రాజకీయవేత్త.. ఎప్పుడూ తెల్లని ఖద్దరు దుస్తులతో కనిపించే ఆయన.. హఠాత్తుగా శ్రీకృష్ణదేవరాయలు అవతారమెత్తారు. గుంటూరు జిల్లా తెనాలిలో జరుగుతున్న తెలుగు సాహిత్య మహోత్సవాలు ఇందుకు వేదిక కాగా, విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలుగా అలరించిన కళాకారుడు తెనాలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కావడం విశేషం. శనివారం జరిగిన భువన విజయం నాటకంలో ఆయన శ్రీకృష్ణదేవరాయలు పాత్రలో ఒదిగిపోయారు. రంగస్థలంపై నటించడం ఇదే తొలిసారి కావటంతో ఆయన చిత్రాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. దేవరాయలు పాత్రలో నటించడం తనకు కొత్త అనుభూతినిచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

-తెనాలి



కిలిమంజారోపై తెలుగు 'పూదోట'

గుంటూరు జిల్లా ముప్పాళ్ల మండలం తురకపాలేనికి చెందిన పూదోట నీలిమ శుక్రవారం సాయంత్రం దక్షిణాఫ్రికాలో అత్యంత ఎత్తైన మౌంట్ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి రికార్డు సృష్టించింది. ఈ పర్వతం ఎత్తు 5 వేల 895 మీటర్లు. ఎవరెస్టుతో పాటు లేలడాక్‌లోని మౌంట్‌స్టాక్ కాంగ్రీ పర్వతం, నేపాల్‌లోని మీరాపీక్, కశ్మీర్‌లోని 24 ఎవర్ లాంగెస్ట్ పర్వతాలను అధిరోహించిన చరిత్ర ఆమె సొంతం. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరెస్టు పర్వతం ఎక్కిన మొట్టమొదటి మహిళ కూడా పూదోట నీలిమ కావడం విశేషం. తొలిసారి ఎవరెస్టు పర్వతాన్ని ఎక్కేటప్పుడు నేపాల్‌లో భూకంపం సంభవించడంతో మధ్యలోనే తిరిగొచ్చేసినా, పట్టుదలగా మరోసారి తన అభిలాష నెరవేర్చుకుంది. నీలిమ కిలిమంజారో పర్వతం అధిరోహించడంపై తల్లిదండ్రులు పూదోట శౌరయ్య, పాపతోపాటు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-ముప్పాళ్ల(గుంటూరు జిల్లా)

కర్ణాటకలోకి కశ్మీర్ ఉగ్రవాదులు!

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోకి నలుగురు కశ్మీర్ ఉగ్రవాదులు ప్రవేశించారంటూ కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించడంతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. బెంగళూరుతో పాటు పలుచోట్ల విధ్వంసం సృష్టించేందుకు కుట్ర జరుగుతోందని సమాచారం అందడంతో రాత్రి గస్తీని ముమ్మరం చేశారు. రాజధానిలోని అన్ని కీలక ప్రాంతాల వద్ద నిఘా పెంచారు. దేవనహళ్లిలోని అంతర్జాతీయ విమానాశ్రయం, సిటీ రైల్వేస్టేషన్‌ల వద్ద భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. అనుమానితులు కనిపిస్తే సమాచారం అందించాలని డీజీపీ నీలమణిరాజు కోరారు. అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. హోంమంత్రి ఆర్.రామలింగారెడ్డి సచివాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

రైతుల కన్నీరు తుడిచేవారికే మద్దతు

▸ ప్రజా రాజకీయమే తెలుసు!.. ఓట్ల రాజకీయాలు తెలియవు

▸ 2019లో యువత సత్తా చాటుతాం

▸ హంద్రీనీవాపై ప్రత్యేక నివేదిక కోరుతా

▸ అనంతపురంలో పవన్ కల్యాణ్

అనంతపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'నాకు ఓట్ల రాజకీయాలు తెలియవు. నాకు తెలిసిందల్లా ప్రజారాజకీయాలు మాత్రమే. నేను ఇక్కడికి వచ్చింది జనసేన పార్టీకి ఓట్లు వేయాలని అడగడానికి కాదు. మీకు ఇష్టముంటే గెలిపించండి.. లేకుంటే ఓడించండి. గెలుపోటములు నాకు కొత్త కాదు. 2019 ఎన్నికల్లో రైతుల కన్నీరు తుడిచే వారికే నా మద్దతు' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. శనివారం 'చలోరే చలోరే చల్'లో భాగంగా ఆయన అనంతపురం జిల్లాలో పర్యటించారు. అనంతపురంలోని గుత్తిరోడ్డులో జనసేన పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలోను, కేటీఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన 'అనంత కరువు - పరిష్కార మార్గాల అధ్యయనం'పై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. అనంతపురం జిల్లాను దత్తత తీసుకున్నానని, అందుకే పరిస్థితులను అధ్యయనం చేయడానికి వచ్చానని అన్నారు. ఇక్కడి సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తానని అన్నారు. తన ప్రాణం ఉన్నంత వరకు అనంత అభివృద్ధికి పాటుపడతానని స్పష్టం చేశారు. కరువును పారదోలేందుకు రైతులు, జలనిపుణులు, అధికారులను ప్రధాని వద్దకు తీసుకెళుతానన్నారు. అనంతపురం జిల్లాలో జన్మించిన సత్యసాయి, ఎక్కడో జన్మించిన ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ తనకు స్ఫూర్తి అని పవన్ కల్యాణ్ తెలిపారు. ఎన్టీఆర్ ప్రారంభించిన హంద్రీనీవా ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై.. ప్రభుత్వాలు రాజు, ఏడు చేపల కథలు చెబుతున్నాయని విమర్శించారు.



బారికేడ్లు దాటి.. వేదికపైకి ఎగిరి..!

జనసేన కార్యాలయానికి భూమిపూజ ముగిసింది. అక్క డ ఏర్పాటు చేసిన సభావేదికపై పవన్ కల్యాణ్ ప్రసంగం చివరి దశకు చేరింది. అదే సమయంలో ఓ అభిమాని తన చుట్టూ ఉన్న పోలీసు భద్రతావలయాన్ని దాటుకుని ముందుకు ఉరికాడు. బారికేడ్లపైకి ఎగిరాడు. అదే ఊపుతో పవన్ ఉన్న వేదికపైకి దూసుకెళ్లాడు. హఠాత్తుగా పవన్‌కల్యాణ్‌ను తన బిగి కౌగిలిలో 'అన్నా..' అంటూ బంధించాడు. పవన్ కూడా తన అభిమానిని అదే స్థాయిలో కౌగలించుకున్నాడు. అభిమాని సెల్‌ఫోన్‌తో తానే స్వయంగా సెల్ఫీ తీసి ఇచ్చారు.



పార్టీ కార్యాలయం భూమి పూజలో పాల్గొన్న పవన్



సౌదీలోని తబూక్‌లో భారీగా మంచు కురవడంతో పెరిగిన పర్యాటకుల సందడి

సౌదీలో మంచు!

▸ పారిస్‌లో వరదలు!

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, పారిస్, జనవరి 27: సూర్య ప్రతాపంతో తల్లడిల్లే సౌదీ అరేబియాలో ఇప్పుడు చలి వణికిస్తోంది. కొన్ని పర్వత ప్రాంతాల్లో మంచు కూడా కురుస్తోంది. దీంతో గొర్రెల కాపరులుగా పని చేసే తెలుగువారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిరోసిన్ స్టౌలతో చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. మంచు కురుస్తున్న ప్రాంతాల్లోని రహదారులపై భద్రతా దళాలు వాహనాల రాకపోకలను నిషేధించాయి. తబూక్ ప్రాంతం లో భారీగా మంచు కురవడంతో పర్యాటకుల సందడి పెరిగింది. మరోవైపు పారిస్ నగరం వరదలతో అతలాకుతలమవుతోంది. సేన్ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. శనివారం నది ప్రవాహం 5.7 మీటర్లకు చేరుకోవడంతో హై అలర్ట్ ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సోమవారానికి వరద మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు చెబుతున్నారు.

ఏ కేసైనా ఐదేళ్లలో పరిష్కారం!

▸ సుప్రీం నిర్ణయాన్ని పాటిస్తున్నాం: జస్టిస్ నాగార్జునరెడ్డి

నర్సీపట్నం, జనవరి 27: కోర్టు దృష్టికి వచ్చిన ఎలాంటి కేసైనా.. ఐదేళ్లలోపే పరిష్కరించాలని సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని అన్ని కోర్టుల్లోనూ పాటిస్తున్నట్టు ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి వెల్లడించారు. శనివారం విశాఖ జిల్లా నర్సీపట్నంలో నూతన కోర్టు భవనాల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం, జరిగిన సభలో మాట్లాడుతూ.. దాదాపు 20 ఏళ్ల కిందటి కేసులు ఇప్పటికీ పలు న్యాయస్థానాల్లో నడుస్తున్నాయని, వీటిపై దృష్టిసారించిన సుప్రీంకోర్టు వివిధ రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులతో చర్చించి, ఎలాంటి కేసునైనా ఐదేళ్లకు మించి పెండింగ్‌లో ఉంచరాదని నిర్ణయం తీసుకుందన్నారు. ఆ మేరకు గత ఏడాది కాలంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయస్థానాలు ముమ్మర చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఉమ్మడి హైకోర్టు పరిధిలో 12% ఉన్న పెండింగ్ కేసుల సంఖ్య గడిచిన 11 నెలల్లో 6 శాతానికి తగ్గిందన్నారు. న్యాయవాదులు, న్యాయాధికారులు సహకరించడం వల్లనే పరిష్కారం వేగవంతమైందని చెప్పారు.

గాంధీ విగ్రహాన్ని కూల్చేసిన రోణంకి తండ్రి

పలాస, జనవరి 27: ఇంటికి అడ్డుగా ఉందని ఏకంగా మహాత్మాగాంధీ విగ్రహాన్నే తొలగించేందుకు ఇటీవలే ఐఏఎస్‌కు ఎంపికైన రోణంకి గోపాలకృష్ణ కుటుంబం ప్రయత్నించింది. దీంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పారసాంబలో గ్రామకంఠం ఉన్న భూమిని చదును చేసి 2015లో మహాత్మాగాంధీ విగ్రహాన్ని నెలకొల్పారు. అయితే సర్వే నెంబరు 176/5లో ఉన్న ఈ భూమిలో మూడుసెంట్లు తనకు కేటాయించారని రోణంకి గోపాలకృష్ణ సోదరుడు కోదండరావు వాదన. రోణంకి గోపాలకృష్ణ తండ్రి అప్పారావు, ఆయన కుటుంబీకులు శనివారం గాంధీ విగ్రహం తొలగించే క్రమంలో టైల్స్ ధ్వంసం చేశారు. విగ్రహాన్ని తొలగిస్తుండగా గ్రామస్థులు అడ్డుకుని ఘర్షణకు దిగారు.



గాంధీజి విగ్రహాన్ని తొలగిస్తున్న రోణంకి అప్పారావు

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కాశీబుగ్గ సీఐ అశోక్ కుమార్ తన సిబ్బందితో వచ్చి ఇరువర్గాలను శాంతింపజేశారు.

బతుకు 'ఆన్‌లైన్'పాలు!



'సెల్‌ఫోన్‌లో స్ర్కీన్ లాక్ పెట్టా.. ప్యాటర్న్ లాక్‌ని ఎవరూ ఛేదించలేరు.. ఫింగర్ ప్రింట్ స్కానర్ ఉంది.. నా వేలిముద్ర ఉంటే తప్ప ఫోన్ ఓపెన్ కాదు'.. అనుకుంటున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త! మీరనుకుంటున్న భద్రతా ప్రమాణాలు నిజమైన రక్షణలు కావు. మీ డేటాను గోప్యంగా ఉంచలేవు!! ఇంటర్‌నెట్‌కు అనుసంధానమైన ఏ స్మార్ట్‌ఫోన్‌లోనూ.. డేటా భద్రం కాదు!! ఒక్క మాటలో చెప్పాలంటే.. మన జేబులో ఉన్న మొబైల్‌ఫోనే మనపై గూఢచారిలా పనిచేసి, మన ప్రతి కదలికనూ వాణిజ్య విపణిలో పెడుతుంది. ఈ అంశాలపై నెటిజన్లను చైతన్య పరిచేందుకు.. భారత్, అమెరికా, కెనడాతోపాటు.. 47 యూరోపియన్ దేశాలు జనవరి 28ని 'డేటా ప్రైవసీ డే'గా పాటిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో.. ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

▸ మన జేబులోని సెల్‌ఫోనే గూఢచారి

▸ సెన్సర్లే సమాచార సేకర్తలు

▸ స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియాతో భద్రం

▸ వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు పెట్టొద్దు

▸ స్ర్కీన్‌లాక్‌లు, ఫింగర్ ప్రింట్ సెన్సర్లు..

▸ సమాచార తస్కరణను ఆపలేవు

▸ హెచ్చరిస్తున్న నిపుణులు

(నేడు డేటా ప్రైవసీ డే)

సరదాగా స్నేహితులతో టూరెళ్తే ఎప్పటికప్పుడు ట్విటర్‌లో అప్‌డేట్లు పెట్టేస్తాం. ఫేస్‌బుక్‌లో రాసేస్తాం. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసేస్తాం. కొందరైతే పడగ్గదికే పరిమితం కావాల్సిన ముద్దుముచ్చట్లనూ ఫోన్లలో బంధిస్తున్నారు. మరికొందరు.. పాస్‌వర్డ్‌లను కూడా ఫోన్‌లోనే నోట్‌ప్యాడ్ వంటి యాప్‌లోనో సేవ్ చేసుకుంటారు. అయితే.. డెస్క్‌టాప్‌కి ఫోన్ భిన్న మనే విషయాన్ని గుర్తెరగాలి. కంప్యూటర్‌లో సోషల్‌మీడియా లోంచి లాగ్‌అవుట్ అవుతాం.. కానీ.. మొబైల్‌లో నిరంతరం సైన్ ఇన్‌లోనే ఉంటాం. దీని వెనుక పొంచి ఉండే ప్రమాదాల గురించి తెలిస్తే ఆన్‌లైన్‌ను అంత తేలిగ్గా తీసుకోం. మనకు తెలియకుండానే.. మన ఫోన్లోని డేటా థర్డ్ పార్టీ యాప్‌కు వెళ్లిపోతుంది. ఇంకా ప్రమాదమేమంటే.. ఆ యాప్‌లలో ఉండే లోపాల (వల్నెరబిలిటీస్)ను ఆసరాగా చేసుకుని, హ్యాకర్లు మన ఫోన్లోకి సులభంగా దూరిపోయే ప్రమాదముంది. మనం డౌన్‌లోడ్ చేసుకునే యాప్‌లలో దాదాపు 80-90 శాతం అప్లికేషన్లు ఫొటోలు, వీడియోల యాక్సెస్ కోరతాయి.

సెన్సర్ల నుంచే సేకరణ..

స్మార్ట్‌ఫోన్‌ను చెవి దగ్గర పెట్టుకుని మాట్లాడుతున్నప్పుడు స్ర్కీన్ ఆటోమేటిగ్గా ఆఫ్ అయిపోతుంది. ఫోన్‌లో ఉండే ప్రాగ్జిమిటీ సెన్సర్ ఆ పని చేస్తుంటుంది. అలాగే.. గైరోస్కోప్, లైట్ సెన్సర్, హ్యుమిడిటీ, ప్రెజర్, టెంపరేచర్, మన అడుగులను లెక్కపెట్టేవి.. ఇలా ఎన్నో రకాల సెన్సర్లు, రకరకాల యాప్‌లు మన ఫోన్లలో ఉన్నాయి. నిజానికి ఇవన్నీ మనకు మనకు ఎంతగానో ఉపయోగపడే అసిస్టెంట్ల లాంటివి. అదే సమయంలో.. ఈ సెన్సర్లు సేకరించే సమాచారం ఆన్‌లైన్‌లో యాడ్ కంపెనీలకు చేరిపోతుందని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. మన కదలికలు, గూగుల్‌లో మన అన్వేషణ (సెర్చ్) ఆధారంగా వాణిజ్య ప్రకటనలు వస్తుంటాయి. కొన్ని యాప్స్ మాత్రం ఇంతకు మించి మన వ్యక్తిగత వివరాలను సేకరించే ప్రయత్నం చేస్తాయి. ఉదాహరణకు.. మన ఫోన్‌లో ఉండే యాక్సిలరోమీటర్, గైరోస్కోప్(మనం ఫోన్‌లో ఫొటోలు చూసేటప్పుడు ఫోన్ ఎటు తిప్పితే ఫొటో అటు తిరిగేది ఈ సెన్సర్ వల్లనే) వంటివాటి సమాచారాన్ని ఏ యాప్ అయినా యాక్సెస్ చేయగలదు. మనం స్ర్కీన్ మీద నంబర్ లాక్ పెడితే.. ఆ నంబర్లను ప్రెస్ చేసేటప్పుడు మనకు తెలియకుండానే ఫోన్ ఒకింత అటూ ఇటూ వంగుతుంది. ఆ కదలికల ఆధారంగా ఫోన్‌పై ఏ భాగంలో మనం ట్యాప్ చేశామో ఆ యాప్‌లు గుర్తించగలవు. గైరోస్కోప్‌తో పాస్‌వర్డ్‌ని గుర్తించవచ్చని నిరూపించేందుకు ఇద్దరు శాస్త్రజ్ఞులు 'టచ్‌లాగర్' అనే యాప్‌ను రూపొందించారు. 2011లో శాన్‌ఫ్రాన్సిస్కోలో హెచ్‌టీసీ ఫోన్లలో ఈ యాప్ 70 శాతం కచ్చితత్వంతో పాస్‌వర్డ్ ఏమిటో చెప్పగలిగింది. ఆ తర్వాత వచ్చిన మరో యాప్ ఏకంగా 99.5 శాతం కచ్చితత్వంతో కీస్ట్రోక్స్‌ను గుర్తించగలిగింది. గూగుల్ ఇటీవలే అలాంటి 20 యాప్‌లను ప్లేస్టోర్ నుంచి తొలగించింది. అందుకే ప్లేస్టోర్ నుంచి కాక.. వేరే వెబ్‌సైట్ల నుంచి ఏ యాప్‌నూ ఇన్‌స్టాల్ చేసుకోవద్దని డేటా సెక్యూరిటీ నిపుణులు సూచిస్తున్నారు.

-సెంట్రల్ డెస్క్, హైదరాబాద్-ఆంధ్రజ్యోతి

డేటా రక్షణకు జాగ్రత్తలు

- థర్డ్‌పార్టీ యాప్‌ల జోలికి వెళ్లొద్దు. 'అన్‌నోన్ సోర్సెస్ (అనామక సైట్ల)'కు చెందిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దు.
- వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను ఫోన్‌లో భద్రపరచొద్దు. పాస్‌వర్డ్‌లను ఫోన్‌లో సేవ్ చేయొద్దు. గూగుల్ డ్రైవ్, గూగుల్ ఫొటోస్, ఇతర క్లౌడ్ ప్లాట్‌ఫాంలలో దాచుకుంటే కొంతవరకూ పర్వాలేదు.
- తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలను క్లిక్ చేయొద్దు. ఆ లింకులు మీ ఫోన్‌లో ట్రోజన్లను దూర్చి మీ సమాచారాన్ని హ్యాకర్‌కి చేరవేస్తాయి.
- అందమైన ఫొటోలు వాట్సాప్‌లో వస్తే వెంటనే క్లిక్ చేయకండి. స్టెగనోగ్రఫీ ద్వారా మీ ఫోన్లోకి మాల్‌వేర్/ట్రోజన్లను పంపడం చాలా సులభం.
- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయొద్దు. అవసరమైనప్పుడు బ్రౌజర్ ద్వారా ఆ వెబ్‌సైట్ ఓపెన్ చేసి.. పని పూర్తయ్యాక లాగాఫ్ అవ్వాలి.
- ఎక్కడపడితే అక్కడ ఫ్రీ వైఫైకి కనెక్ట్ కావద్దు. ఉచితవైఫైని హ్యాకర్లు యాక్సెస్ చేస్తుంటే.. నెట్‌వర్క్ టూల్స్ ద్వారా మీ ఫోన్/ల్యాప్‌టాప్‌లో దూరిపోతారు. ఫోన్‌లో యాంటీవైరస్ ఉంటే.. ఇలాంటి దాడులను అడ్డుకుంటుంది.
- మీ ఫోన్‌ని ఇతరులెవరికీ ఇవ్వొద్దు. ఎంత తెలిసినవారైనా.. ఆ పని చేయకండి. మీ ఫోన్లోకి ట్రోజన్‌ను చొరబెడితే.. మీ గుట్టంతా వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది. మీ ప్రతి కదలికను వారు పసిగట్టగలరు. ప్యాటర్న్ లాక్, పాస్‌వర్డ్ ఉన్నా.. కంప్యూటర్‌లోని కొన్ని టూల్స్ (ఆండ్రాయిడ్ ఎస్‌డీకే రీసెట్టర్స్) ద్వారా.. వాటిని ఛేదించవచ్చు.
- కంప్యూటర్ల విషయానికి వస్తే.. ఇంటర్‌నెట్ సెక్యూరిటీ ఉన్న యాంటీవైరస్ తప్పనిసరిగా వాడాలి. ఇలాంటి యాంటీవైరస్‌లు మార్కెట్లో 300 నుంచి 1000 రూపాయలలోపు లభ్యమవుతాయి. ఒక్కసారి ఆలోచించండి.. వైరస్‌ల బారి నుంచి, హ్యాకర్ల బారి నుంచి మన కంప్యూటర్‌ను కాపాడుకోవడానికి రోజుకు రూ. 1-3 ఖర్చు చేయలేమా?



శునకంపై మమకారం!

▸ కర్మకాండలకు భారీగా ఏర్పాట్లు



రమణకుమార్

తాను పెంచుకుంటున్న శునకం మరణిస్తే దానికి కర్మకాండలు నిర్వహిస్తూ తన మమకారాన్ని చాటుకుంటున్నాడో జంతు ప్రేమికుడు. కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన పెద్ది రమణకుమార్ 2001 నుంచి కుక్కల్ని పెంచుతున్నారు. తొలుత బ్రౌని అనే పమేరియన్‌ను పెంచగా దానికి 2005లో సోనీ పుట్టింది. 2012లో మరణించిన బ్రౌనీకి కర్మకాండలు చేసి బంధువులు, స్థానికులకు భోజనాలు పెట్టారు. ఈనెల 20న సోనీ మృతిచెందడంతో దానికి పుట్టిన పిల్ల(బుడ్డి)తో కర్మకాండలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగ 28న పెదకర్మ చేస్తున్నట్టుగా ముద్రించిన కార్డులు 500మందికి పంపారు. దీనికోసం రమణ ఇంటివద్ద భారీ టెంట్లు వేశారు. వెజ్, నాన్‌వెజ్ వంటకాలతో భోజనాలు సిద్ధం చేస్తున్నామని, వీఐపీలను సైతం ఆహ్వానించినట్టు రమణ తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, గుడివాడ (రాజేంద్రనగర్)


తిరుమలలో విరాళాల సేకరణ

▸ రష్యన్లకు విజిలెన్స్ అధికారుల కౌన్సెలింగ్

తిరుమల, జనవరి 27: నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో విరాళాలు సేకరిస్తున్న ఏడుగురు విదేశీయులను విజిలెన్స్ అధికారులు శనివారం అదుపులోకి తీసుకొన్నారు. కొంతమంది విరాళాలు సేకరిస్తున్నారనే సమాచారంతో మూడో సెక్టార్ విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. రష్యాకు చెందిన ఏడుగురు ఇస్కాన్ భక్తులను అదుపులోకి తీసుకుని విరాళాలు ఎందుకు సేకరిస్తున్నారని ప్రశ్నించారు. తాము ఉచితంగా ఆధ్యాత్మిక అంశాలతో కూడిన పుస్తకాలను వితరణ చేస్తున్నామని, మరిన్ని పుస్తకాలను ప్రచురించాలనే ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. తిరుమలలో విరాళాలు సేకరించకూడదనే నిబంధన ఉన్నట్టు తమకు తెలియదన్నారు. దీంతో వారు వసూలు చేసిన రూ.వెయ్యి నగదును హుండీలో వేయించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

తిరుపతి, జనవరి27: తిరుపతి కేంద్రంగా దొంగనోట్లను చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఓ న్యాయవాది సహ మరొకరిని అరెస్టు చేసి రూ.4.97 లక్షల దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ డివిజనల్ ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు... కడప జిల్లా రాజంపేట మండలం ముద్రపల్లెకు చెందిన రామచంద్రారావు తిరుపతిలో ఉంటూ స్థానిక కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఈయన దొంగనోట్లను చలామణీ చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఈస్ట్ సీఐ శివప్రసాద్, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, షేక్షావలి స్థానిక రాయలచెరువు రోడ్డులోని పళని థియేటర్‌వద్ద రామచంద్రరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న రూ.17,500ల దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక చెన్నారెడ్డి కాలనీలోని అతని ఇంటిలో ఉంచిన రూ.4.80 లక్షల దొంగనోట్లతో పాటు అసలు నోట్లు రూ.1.28 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇతడికి దొంగనోట్లను సరఫరా చేస్తున్న కడప జిల్లా రాజంపేట మండలం నూనివారిపల్లెకు చెందిన నాగహరిప్రకాష్ రెడ్డిని అదుపులోకి తీసుకుని, అతనివద్ద ఉన్న అసలైన నోట్లు రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా... కేరళకు చెందిన రామన్, అనంతపురం జిల్లా కదిరికి చెందిన గంగాధర్ ప్రధాన నిందితులని తేలింది.



అవకాశాలకు అనుగుణంగా సిలబస్!

▸ ఇంజనీరింగ్ విద్యకు ఇదే ప్రధానం

▸ ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ సహస్రబుదే వెల్లడి

భీమవరం, జనవరి 27: ఇంజనీరింగ్ విద్యలో పారిశ్రామిక అవసరాలు, అవకాశాలకు అనుగుణంగా సిలబస్ ఉండాలని అప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డీ సహస్రబుదే అన్నారు. సిలబస్‌ను మార్చుకునే వెసులుబాటు ఉందని, అలా కాని పక్షంలో ఏఐసీటీఈ రూపొందించిన కరిక్యులమ్‌ను వినియోగించుకోవచ్చునని సూచించారు. దీనికి ఏఐసీటీఈ వద్ద 800 రకాల కోర్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఇన్నోవేషన్ డే నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సహస్రబుదే 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సాంకేతిక విద్యారంగంలో ఉపాధి అవకాశాలకు అనుగుణంగా సిలబస్ మార్చుకోవాలని సూచించారు. గత రెండు, మూడేళ్లలో ఎన్నో మార్పులు సంభవించాయని, టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో దీనికి అనుగుణంగా సిలబస్ కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి పెట్టిందన్నారు. కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ కూడా పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా కరిక్యులమ్ అవసరమని భావించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారన్నారు. దీనికి ఏఐసీటీఈ సహకారం అందిస్తుందన్నారు. దేశంలో 7.50 లక్షల మంది సాంకేతిక అంశాలను బోధించే ఉపాధ్యాయులున్నారని, వారికి శిక్షణ, కరిక్యులమ్ పట్ల అవగాహన, మాడ్యూల్స్‌పై టీచింగ్ వంటి బోధనా విధానాలపై వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయి శిక్షణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అనంతరం, కళాశాల ఆవరణలో జరిగిన సభలో విద్యార్థులను ఉద్దేశించి సహస్రబుదే మాట్లాడుతూ.. ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందని, శాటిలైట్ రంగంలో గణనీయమైన ప్రగతి కనిపిస్తోందన్నారు. అన్నా యూనివర్సిటీ, ముంబై, పుణే, కాన్పూర్, ఐఐటీలకు చెందిన విద్యార్థులు స్వయంగా శాటిలైట్‌ను తయారు చేయడం టెక్నాలజీకి అద్దం పడుతోందన్నారు.

మైదాన్
MYDAN
విజయవాడ • ఆదివారం 28 జనవరి 2018

కోట్లు కొల్లగొట్టేశారు




బెన్ స్టోక్స్
మనీష్ పాండే
లోకేశ్ రాహుల్

- మళ్లీ టాప్ లేపిన బెన్ స్టోక్స్
- 12.5 కోట్లకు రాయల్స్ కొనుగోలు
- రాహుల్, మనీష్‌లకు చెరో 11 కోట్లు
- వేలంలో భారత క్రికెటర్ల హవా
- దేశవాళీ కుర్రాళ్లకు జాక్‌పాట్
- గేల్, విజయ్, ఫాల్క్‌నర్ అన్‌సోల్డ్
- ఆల్‌రౌండర్లు, స్పిన్నర్లు, కీపర్లకు డిమాండ్

పదేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించి.. అనామకులను హీరోలను చేసి.. ఎక్కడో దాగున్న ప్రతిభను వెలికి తీసి.. కుర్రాళ్లను కోటీశ్వరులను చేసిన ఐపీఎల్ పదకొండో సీజన్ మరికొందరు ప్రతిభావంతులపై కనక వర్షం కురిపించింది..! రెండు రోజుల వేలంలో భాగంగా తొలి రోజే చాలా మంది క్రికెటర్లను కోటీశ్వరులను చేసింది! బెంగళూరులో శనివారం మొదలైన ఐపీఎల్ వేలంలో స్టార్ ప్లేయర్లతో పాటు దేశవాళీ కుర్రాళ్లు తళుక్కున మెరిశారు..! గతేడాది నోట్ల వేటలో టాప్ స్కోరర్‌గా నిలిచిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఈ సారి 12.5 కోట్లతో మరోసారి అగ్రస్థానం దక్కించుకున్నా.. భారత ఆటగాళ్ల కోసం కూడా ఫ్రాంచైజీలు ఎగబడ్డాయి..! లోకేశ్ రాహుల్, మనీష్ పాండే చెరో 11 కోట్లతో భారత్ తరఫున అత్యధిక మొత్తం దక్కించుకున్నారు..! అఫ్ఘాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ అనూహ్యంగా 9 కోట్లు అందుకున్నాడు..! అన్‌క్యాప్డ్ ఆటగాళ్లూ దిమ్మతిరిగే మొత్తం సొంతం చేసుకున్నారు..! క్రునాల్ పాండ్యా 8.8 కోట్లు కొల్లగొడితే.. యువ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ 6.2 కోట్లు అందుకు న్నాడు..! అలాగే, దేశవాళీల్లో మెప్పించిన ప్లేయర్లకు.. అండర్-19 వరల్డ్ కప్‌లో అదరగొడుతున్న కుర్రాళ్లకు ఫ్రాంచైజీలు పెద్ద మొత్తం ముట్టచెప్పాయి..! కానీ, ఐపీఎల్ అనగానే సుడిగాలి ఇన్నింగ్‌లతో గుర్తుకొచ్చే క్రిస్ గేల్‌ను తొలి రోజు ఎవరూ కొనుక్కోకపోవడం షాకిచ్చింది..!

బెంగళూరు: ఊహించినట్టే ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఈ సీజన్ ఐపీఎల్ వేలంలో మళ్లీ టాప్ లేపాడు. గతేడాది కంటే ధర తగ్గినా తొలి రోజు జరిగిన వేలంలో స్టోక్స్ అత్యధిక మొత్తం దక్కించుకున్నాడు. రెండేళ్ల నిషేధం తర్వాత పునరాగమనం చేసిన రాజస్థాన్ రాయల్స్ బెన్‌ను 12.5 కోట్లకు కొనుగోలు చేసింది. ఆఫ్‌ఫీల్డ్ వివాదాలతో ఇంగ్లండ్ జట్టులో స్టోక్స్‌పై వేటు పడ్డా.. అతని ఆట కోసం ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. 2 కోట్ల ప్రారంభ ధరతో వచ్చిన స్టోక్స్ కోసం తొలుత పంజాబ్, చెన్నై తలపడ్డాయి. మధ్యలో 6.8 కోట్లకు కోల్‌కతా రేసులో రావడంతో చెన్నై తప్పుకొంది. ఆపై, 11.5 కోట్ల తర్వాత కోల్‌కతా కూడా వైదొలిగింది. పంజాబ్ 12 కోట్లకు అతణ్ణి సొంతం చేసుకుందని అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా రాజస్థాన్ మరో యాభై లక్షలు ఎక్కువ పోసి స్టోక్స్‌ను దక్కించుకుంది. స్టోక్స్ గత సీజన్‌లో రికార్డు స్థాయిలో 14.5 కోట్లు (పుణె) పలికిన సంగతి తెలిసిందే. మరో రోజు వేలం ఉన్నప్పటికీ స్టార్ ప్లేయర్లు అయిపోవడంతో స్టోక్స్‌ను అధిగమించడం కష్టమే. కాగా, స్టోక్స్ మళ్లీ మెరిసినా ఓవరాల్‌గా వేలంలో భారత ప్లేయర్ల ఆధిపత్యం సాగింది. టీమిండియా ఓపెనర్ లోకేశ్ రాహుల్, మిడిలార్డర్ ప్లేయర్ మనీష్ పాండే చెరో 11 కోట్లు అందుకున్నారు. రాహుల్‌ను పంజాబ్, పాండేను హైదరాబాద్ సొంతం చేసుకు న్నాయి. ఈ వేలంలో ఫ్రాంచై జీలు చాకచ క్యంగా వ్యవహరించాయి. టీమిండియాలో కీలక సభ్యులుగా ఉన్న వారితో పాటు దేశవాళీ ప్రతిభావంతులను కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డాయి. ఇందులో భాగంగా రాహుల్, మనీష్‌లకు మంచి డిమాండ్ ఏర్పడింది. రాహుల్ గత సీజన్ వరకూ బెంగళూరుకు, మనీష్ కోల్‌కతాకు ప్రాతినిథ్యం వహించారు. అంత పెద్దమొత్తం ఇచ్చి వీరిని రిటైన్ చేసుకునేందుకు ఆ ఫ్రాంచైజీలు ముందుకు రాలేదు. ఇక, అఫ్ఘానిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ధర అమాంతం పెరిగింది. గతేడాది నాలుగు కోట్లు పలికిన రషీద్‌కు సన్‌రైజర్స్ ఈ సారి 9 కోట్లు ముట్టచెప్పి ఆర్‌టీఎమ్ కింద కొనుగోలు చేసింది. విదేశీ ప్లేయర్లలో క్రిస్ లిన్‌కు 9.6 కోట్లకు, స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ 9.4 కోట్లు చెల్లించి కోల్‌కతా సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ కోసం ఆర్‌సీబీ 7.4 కోట్లు ఇచ్చింది. అలాగే, డ్వేన్ బ్రావోను చెన్నై ఆర్‌టీఎమ్ ఉపయోగించి 6.4 కోట్లకు కొనుక్కుంది. అతని సహచరుడు కీరన్ పొలార్డ్‌ను 5.4 కోట్లకు ముంబై ఆర్‌టీఎమ్‌తో ఎంచుకుంది. ఇక, పంజాబ్‌తో పోటీపడి మరీ సన్‌రైజర్స్ తమ ఓపెనర్ శిఖర్ ధవన్‌ను 5.2 కోట్లకు రిటైన్ చేసుకుంది. అలాగే, కేన్ విలియమ్సన్‌ను కూడా 3 కోట్లకు నిలుపుకుంది. కాగా, డుప్లెసిస్‌ను చెన్నై 1.6 కోట్లకే కారు చౌకగా రిటైన్ చేసుకోగా.. రాజస్థాన్ నాలుగు కోట్లు చెల్లించి ఆర్‌టీ ఎమ్ ద్వారా అజింక్యా రహానెను తిరిగి జట్టులోకి తెచ్చుకుంది.


వేలానికి హాజరైన ప్రీతి జింతా

వేలం విశేషాలు..

- తొలి రోజు వేలంలో హైదరాబాద్ అత్యధికంగా 14 మంది ఆటగాళ్లను ఎంచుకుంది. అందులో ఇద్దరిని ఆర్‌టీఎమ్ ద్వారా తీసుకుంది.
- ముంబై కేవలం ఆరుగురినే కొనుగోలు చేసింది. అందులో రెండు ఆర్‌టీఎమ్‌లను ఉపయోగించింది.
- చెన్నై జట్టు శనివారం ఎనిమిది మంది ఎంచుకోగా.. అందరూ 30 ఏళ్లు పైబడిన వాళ్లే కావడం గమనార్హం.
- వేలంలో అందుబాటులో ఉన్న 16 ఆర్‌టీఎమ్‌లను అన్ని జట్లూ తొలిరోజే వాడుకున్నాయి.
- తొలి రోజు 109 మంది ఆటగాళ్లు వేలానికి వచ్చారు. 78 మంది అమ్ముడైై, 31 మంది మిగిలారు.
- నిబంధనల ప్రకారం ఒక జట్టు కనిష్ఠంగా 18 మందిని, గరిష్ఠంగా 25 మందిని తీసుకోవచ్చు. అందుకు 80 కోట్ల రూపాయలకు అనుమతిస్తారు.

ప్రస్తుతం ఏ జట్టులో ఎంత మంది? వారి ఖజానాలో మిగిలిన మొత్తం ?

బెంగళూరు	14	15.85 కోట్లు
హైదరాబాద్	16	7.95 కోట్లు
కోల్‌కతా	12	7.6 కోట్లు
పంజాబ్	10	21.9 కోట్లు
చెన్నై	11	17 కోట్లు
ఢిల్లీ	15	12.3 కోట్లు
రాజస్థాన్	9	23.5 కోట్లు
ముంబై	9	15.8 కోట్లు

క్రునాల్ పైపైకి.. జొఫ్రా అనూహ్యంగా..

అన్‌క్యాప్డ్ కేటగిరీలో ముంబై యువ ఆల్‌రౌండర్ క్రునాల్ పాండ్యా భారీగా పలికాడు. ఆర్‌టీఎమ్ కింద అతనికి 8.8 కోట్లు ముట్టజెప్పి ముంబై మళ్లీ దక్కించుకుంది. క్రునాల్ గతేడాది ముంబై తరఫున 2 కోట్లు మాత్రమే పలికాడు. ఈసారి అతని కోసం తొలుత ఆర్‌సీబీ, రాజస్థాన్ తీవ్రంగా పోటీ పడ్డాయి. తర్వాత అనూహ్యంగా హైదరాబాద్ రేసులోకొచ్చింది. ఆర్‌సీబీ 8.8 కోట్లు ఇచ్చేందుకు ముందుకురాగా.. ముంబై అతణ్ణి వదులుకునేందుకు ఇష్టపడలేదు. అలాగే, అన్‌క్యాప్డ్ విదేశీ ప్లేయర్ల కోటాలో వెస్టిండీస్‌కు చెందిన యువ ఆల్‌రౌండర్ జొఫ్రా ఆర్చర్‌కు కూడా ఊహించని రేటు వచ్చింది. పంజాబ్, హైదరాబాద్‌తో పోటీ పడి మరీ రాజస్థాన్ ఏకంగా 7.2 కోట్లకు అతడినిని కొనుక్కుంది. విండీస్ అండర్-19 జట్టుకు ఆడిన 22 ఏళ్ల జొఫ్రా బిగ్‌బాష్ లీగ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. హోబర్ట్ హరికేన్స్ తరఫున 11 మ్యాచ్‌ల్లోనే 16 వికెట్లు తీశాడు. అలాగే, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లోనూ మెప్పించాడు. మంచి పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన జొఫ్రా ఇప్పటిదాకా 37 టీ-20ల్లో 44 వికెట్లు పడగొట్టాడు. ఇక, ఆస్ట్రేలియాకు చెందిన దేశవాళీ ఆల్‌రౌండర్ డారీ షార్ట్‌ను అనూహ్యంగా రాజస్థాన్ 4 కోట్లకు కొనుక్కుంది.

అ'ధర'గొట్టింది వీరే..

ఆటగాడు	ధర (కోట్లలో)	జట్టు
బెన్ స్టోక్స్	12.5	రాజస్థాన్
లోకేశ్ రాహుల్	11	పంజాబ్
మనీష్ పాండే	11	హైదరాబాద్
క్రిస్ లిన్	9.6	కోల్‌కతా
మిచెల్ స్టార్క్	9.4	కోల్‌కతా
మాక్స్‌వెల్	9	ఢిల్లీ
రషీద్ ఖాన్	9	హైదరాబాద్
క్రునాల్ పాండ్యా	8.8	ముంబై
సంజూ శాంసన్	8	రాజస్థాన్
కేదార్ జాదవ్	7.8	చెన్నై
అశ్విన్	7.6	పంజాబ్
దినేశ్ కార్తీక్	7.4	కోల్‌కతా
క్రిస్ వోక్స్	7.4	బెంగళూరు
జొఫ్రా ఆర్చర్	7.2	రాజస్థాన్

భారత ప్లేయర్లు అటూ.. ఇటూ..

టీమిండియా ప్లేయర్ల కోసం ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. ఈ సారి చాలా మంది ఆటగాళ్లు జట్లను మారారు. కేదార్ జాదవ్.. ధోనీ అండ్ కోలో చేరాడు. అతణ్ణి చెన్నై 7.8 కోట్లకు దక్కించుకుంది. కరుణ్ నాయర్‌ను పంజాబ్ 5.6 కోట్లకు కొనుక్కుంది. అయితే, అశ్విన్‌ను చెన్నై తిరిగి జట్టులోకి తీసుకోలేదు. అశ్విన్ ఈ సారి 7.6 కోట్లకు పంజాబ్ తరఫున ఆడను న్నాడు. ఫాస్ట్ బౌలర్ ఉమేష్ యాదవ్ 4.2 కోట్లకు బెంగళూరు సొంతమయ్యాడు. ఇక, టీ-20 స్పెషలిస్ట్, కీపర్ సంజూ శాంసన్ కూడా పెద్ద మొత్తం అందుకున్నాడు. రాజస్థాన్ అతణ్ణి 8 కోట్లకు కొనుక్కోగా, రాబిన్ ఊతప్పను కోల్‌కతా 6.4 కోట్లకు రిటైన్ చేసుకుంది. సీనియర్ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ కోసం కోల్‌కతా 7.4 కోట్లు చెల్లించింది. వృద్ధిమాన్ సాహను హైదరాబాద్ 5 కోట్లకు కొనుక్కుంది. యువ కీపర్ ఇషాన్ కిషన్‌కు ముంబై ఏకంగా 6.2 కోట్లు చెల్లించగా.. వెటరన్ పార్థివ్ పటేల్, నమన్ ఓఝా అమ్ముడవలేదు. ఈ వేలం ఆదివారంతో ముగియనుంది. కాగా, చాన్నాళ్లుగా ముంబైకి ఆడుతున్న అంబటి రాయుడు ఈ సారి 2.2 కోట్లకు చెన్నైకి ఎంపికయ్యాడు.


లెగ్గీల కోసం పరుగులు..

లెగ్ స్పిన్నర్లకు కూడా మంచి డిమాండ్ వచ్చింది. భారత యువ లెగ్గీ యజ్వేంద్ర చాహల్‌ను ఆరు కోట్లకు బెంగళూరు ఆర్‌టీఎమ్ ద్వారా అట్టిపెట్టుకోగా.. కుల్దీప్ యాదవ్‌ను కూడా కోల్‌కతా 5.8 కోట్లకు ఆర్‌టీఎమ్ కార్డుతో నిలబెట్టుకుంది. ఇక, చెన్నైకి ఎంపికైన కర్ణ్‌శర్మ ఐదు కోట్లు పలికాడు. యువ ఆటగాడు రాహుల్ తెవాటియాను ఢిల్లీ 3 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, న్యూజిలాండ్‌కు చెందిన నెంబర్ వన్ బౌలర్, లెగ్గి ఇష్ సోధి అమ్ముడకపోవడం విశేషం.



గేల్‌ను వద్దన్నారు

తొలి రోజు వేలంలో అందరినీ షాక్‌కు గురిచేసిన విషయం వెస్టిండీస్ విధ్వంసకర వీరుడు క్రిస్ గేల్ అమ్ముడవకపోవడం. 16 మంది ప్రధాన ప్లేయర్ల జాబితాలో రెండు కోట్ల ప్రారంభ ధరతో ఉన్న గేల్ వేలానికి వచ్చినప్పుడు ఏ ఒక్క ఫ్రాంచైజీ కూడా ముందుకు రాలేదు. గత సీజన్ వరకూ బెంగళూరుకు ఆడిన గేల్‌ను ఆ జట్టు వదులుకుంది. దాంతో, అతను వేలంలోకి రాగా ఎవ్వరూ పట్టించుకోలేదు. గత టోర్నీలో గేల్‌తో పాటు ఆర్‌సీబీ తీవ్రంగా నిరాశ పరిచింది. కానీ, అంతకుముందు సీజన్లలో ప్రతీసారి గేల్ విధ్వంసం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మరి, ఆదివారం నాటి వేలంలో అతణ్ణి ఎవరైనా కొనుక్కుంటారో లేదో చూడాలి. ఇక, గేల్‌తో పాటు ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ జో రూట్, భారత ఓపెనర్ మురళీ విజయ్, సౌతాఫ్రికా వెటరన్ హషీమ్ ఆమ్లా, ఇషాంత్ శర్మ, టీ-20 నెంబర్ వన్ బౌలర్ ఇష్ సోధి అన్‌సోల్డ్‌గా మిగిలారు.



కుర్రాళ్లపై కనక వర్షం

భారత జట్టుకు ఎంపిక కాకపోయినా.. దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్న క్రికెటర్లకు, వర్ధమాన ఆటగాళ్లపై ఈ సీజన్‌లో కనక వర్షం కురిసింది. గత ఐపీఎల్‌లో మెప్పించిన వారికి భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రతిభ ఉన్న కుర్రాళ్లను ఎంచుకునేందుకు ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. గత సీజన్‌లో హైదరాబాద్ తరఫున రాణించిన ఆల్‌రౌండర్ దీపక్ హుడాను ఆ జట్టు 3.6 కోట్లకు రిటైన్ చేసుకుంది. అలాగే, కోల్‌కతాకు ఆడిన సూర్యకుమార్‌ను ముంబై 3.2 కోట్లకు ఎంచుకోగా.. పుణె తరఫున చెలరేగి ఆడిన రాహుల్ త్రిపాఠి కోసం రాజస్థాన్ 3.4 కోట్లు చెల్లించింది. త్రిపాఠి గత సీజన్‌లో పది లక్షలకే పుణెకు ఆడడం విశేషం.

ఇక, అండర్-19 వరల్డ్ కప్‌లో సత్తా చాటుతున్న ఆటగాళ్లు కూడా వేలంలో మెరిశారు. యువ ఆల్‌రౌండర్ కమలేష్ నగర్‌కోటి కోసం కోల్‌కతా, హైదరాబాద్ తీవ్రంగా పోటీ పడగా.. నైట్ రైడర్స్ ఏకంగా 3.2 కోట్లు కుమ్మరించింది. బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్ (1.8 కోట్లు)ను కూడా ఆ జట్టే ఎంచుకుంది అండర్-19 కెప్టెన్ పృథ్వీ షాను ముంబైతో పోటీ పడి ఢిల్లీ 1.2 కోట్లకు దక్కించుకుంది. గత టోర్నీలో ముంబై తరఫున చెలరేగిన నితీష్ రాణాను కోల్‌కతా 3.4 కోట్లకు కొనుక్కుంది. యువ బౌలర్లు సిద్దార్థ్ కౌల్ (3.8 కోట్లు), రాజస్థాన్‌కు చెందిన ఖలీల్ అహ్మద్ (3 కోట్లు)తో పాటు బాసిల్ థంపి (95 లక్షలు) హైదరాబాద్ సొంతమయ్యారు. నవ్‌దీప్ సైనీ (3 కోట్లు, బెంగళూరు), అంకిత్ సింగ్ (3 కోట్లు, పంజాబ్), మయాంక్ అగర్వాల్ (1 కోటి, పంజాబ్) కూడా మెరవగా.. రంజీ సీజన్‌లో విదర్భ విజయంలో కీలక పాత్ర పోషించిన పేసర్ రజనీష్ గుర్బానీపై ఫ్రాంచైజీలు ఆసక్తి చూపకపోవడం గమనార్హం.

వెటరన్లకు నిరాశ

భారత వెటరన్ ప్లేయర్లు హర్భజన్, గౌతమ్ గంభీర్, యువరాజ్ సింగ్‌లకు ధర విషయంలో నిరాశే ఎదురైంది. ఈ ముగ్గురు చాలా తక్కువ మొత్తం పలికారు. భజ్జీని చెన్నై, యువీని పంజాబ్ వారి ప్రారంభ ధర 2 కోట్లకు కొనుగోలు చేశాయి. గంభీర్‌ను 2.8 కోట్లకు ఢిల్లీ ఎంచుకుంది. అంత తక్కువ ధర పలికినా కూడా గౌతీని కోల్‌కతాను ఆర్‌టీఎమ్ ద్వారా రిటైన్ చేసుకునేందుకు ఇష్టపడలేదు.

ఆస్ట్రేలియా x ఇంగ్లండ్
ఐదోవన్డే
ఉ. 8.50 నుంచి
సోనీ-ఈఎస్‌పీఎన్


న్యూజిలాండ్ x పాకిస్తాన్
మూడో టీ-20
ఉ. 11.30 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్1 లో...



ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల ఫైనల్
ఫెడరర్ x సిలిచ్ (మధ్యాహ్నం 2 గం.)
మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్ (ఉదయం10.30 గం.)
సోనీ సిక్స్‌లో...

భారత్‌తోనే టెస్ట్ 'గద'

సౌతాఫ్రికాతో మూడో, చివరి టెస్ట్‌లో ఘన విజయం సాధించిన భారత్.. ఐసీసీ టెస్ట్‌చాంపియన్‌షిప్ గదను నిలబెట్టుకుంది. అంతేకాదు.. రూ. 63.5 లక్షల నగదు బహుమతి కూడా గెలుచుకోనుంది. వాండరర్స్ టెస్ట్ గెలుపు దరిమిలా కటాఫ్ తేదీ ఏప్రిల్ 3 నాటికి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారత్‌ను సౌతాఫ్రికా అధిగమించే అవకాశం లేదు.



మూడోరోజు అత్యంత ప్రమాదకరంగా మారిన వాండరర్స్ పిచ్‌పై నాలుగోరోజు అంత సీన్ కనిపించలేదు.. బంతి కూడా అనూహ్యంగా బౌన్స్ కాలేదు.. దీనికి తగ్గట్టుగానే తొలి సెషన్‌లో భారత బౌలర్లు ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయారు.. ఓ వైపు ఎల్గర్, ఆమ్లా క్రీజులో పాతుకు పోయారు.. లక్ష్యం తక్కువే కావడంతో ఇక భారత్‌కు వైట్‌వాష్ తప్పదేమో అని అంతా భావించాల్సిన పరిస్థితి నెలకొంది.. అటు టీ విరామానికి కూడా ప్రొటీస్ 136/3తో పటిష్టంగానే కనిపించింది. కానీ భారత పేస్ చతుష్టయం మాత్రం పట్టు వదల్లేదు.. ఆఖరి రెండు సెషన్లలో ఆటను పూర్తిగా తమ వైపునకు తిప్పుకొంటూ ఆతిథ్య ఆటగాళ్లను ఓ ఆటాడుకున్నారు. ముఖ్యంగా షమి నిప్పులు చెరిగే బంతులకు వారి దగ్గర సమాధానం లేకుండా పోయింది. ఓ వైపు ఎల్గర్ క్రీజులో నిలదొక్కుకున్నా ఏమీ చేయలేని పరిస్థితి.. 20 పరుగుల తేడాతో చివరి ఐదు వికెట్లను కోల్పోవడంతో మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ ఓ అద్భుత విజయంతో ముగించగలిగింది.

ఆఖరి పంచ్ మనదే..

- చివరి టెస్టులో భారత్ అద్భుత విజయం
- షమికి ఐదు వికెట్లు
- ఎల్గర్ ఒంటరి పోరు వృథా
- 2-1తో సిరీస్ దక్షిణాఫ్రికా కైవసం

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో వరుసగా రెండు ఓటములతో ఇంటా.. బయటా విమర్శలు. దీంతో జట్టు కూర్పును పకడ్బందీగా మార్చుకుని బరిలోకి దిగిన టీమిండియా అనుకున్న ఫలితాన్ని సాధించింది. షమి (5/28) విజృంభణకు తోడు బుమ్రా, ఇషాంత్ చెరో రెండు వికెట్లతో సహకారం అందించగా మరో రోజు మిగిలి ఉండగానే భారత్ 63 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ ఇప్పటికే కోల్పోయినా 2-1తో వైట్‌వాష్‌ను తప్పించుకోగలిగింది. 241 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆతిథ్య దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 73.3 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఎల్గర్ (240 బంతుల్లో 9 ఫోర్లు ఓ సిక్స్‌తో 86 నాటౌట్), ఆమ్లా (140 బంతుల్లో 5 ఫోర్లతో 52) మినహా అంతా విఫలమయ్యారు. భారత బౌలర్ల జోరుకు ఎనిమిది మంది ఆటగాళ్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మైదానం చిత్తడిగా మారడంతో ఆట అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ భువనేశ్వర్.. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ ఫిలాండర్‌లకు దక్కాయి.

ఆమ్లా, ఎల్గర్ విసిగించారు..: 17/1 ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు తమ రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఎన్ని రకాలుగా ఇబ్బందిపెట్టినా వీరిద్దరు క్రీజులో కుదురుకునేందుకే ప్రాధాన్యం ఇచ్చారు. ఆరంభంలో బుమ్రా షార్ట్ పిచ్ బంతులకు ఎల్గర్ కాస్త ఇబ్బంది పడినట్టు కనిపించాడు. అయితే ఆ తర్వాత పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపించిన ఎల్గర్‌తో పాటు ఆమ్లా కూడా మెరుగ్గా ఆడడంతో తొలి సెషన్‌ను వికెట్ పడకుండా ముగించారు. ఒక్కసారి కూడా వీరిని విడదీసే అవకాశాన్ని భారత బౌలర్లు చేజిక్కించుకోలేకపోయారు.


షమి (5/28)

విరామం తర్వాత కూడా అడపాదడపా బౌండరీలు బాదుతూ నెమ్మదిగా పరుగులు సాధించారు. బుమ్రా, ఇషాంత్ బౌన్సర్లతో ఇబ్బందిపెట్టినా ఎల్గర్ ఓపిగ్గా ఆడుతూ 153 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. అటు ఆమ్లా ఎక్కువగా ఆఫ్ సైడ్ వస్తూ పరుగులు తీసేందుకు ప్రయత్నించాడు. అతను 134 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. అయితే భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించిన ఈ జోడీని ఇషాంత్ విడదీశాడు. 53వ ఓవర్‌లో ఆమ్లా ఇచ్చిన క్యాచ్‌ను షార్ట్ మిడ్ వికెట్‌లో హార్ధిక్ పాండ్యా అద్భుత రీతిలో పట్టేయడంతో రెండో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత మరో మూడు ఓవర్లలోనే డివిల్లీర్స్ (6)ను బుమ్రా బోల్తా కొట్టించడంతో ఈ సెషన్‌లో భారత్ రెండు వికెట్లతో ఫర్వాలేదనిపించింది.

చెలరేగిన షమి: ఆఖరి సెషన్‌లో ఆరంభం నుంచే భారత బౌలర్లు కట్టుదిట్టమైన బంతులు వేయడంతో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు విలవిల్లాడారు. ఇషాంత్ తక్కువ ఎత్తులో వేసిన బంతి బ్యాట్‌కు ప్యాడ్‌కు మధ్య నుంచి వెళ్లి వికెట్లను గిరాటేయడంతో డుప్లెసిస్ (2) వెనుదిరిగాడు. రెండు ఓవర్ల అనంతరం డికాక్‌ను బుమ్రా ఎల్బీ చేయడంతో జట్టు 145 పరుగులకు ఐదు వికెట్లను కోల్పోయింది. అప్పటికింకా విజయానికి 96 పరుగులు చేయాల్సి ఉంది. ఈ దశలో భారత బౌలర్లు ఒక్కసారిగా గేరు మార్చి టెయిలెండర్ల పనిపట్టారు. ముందుగా షమి 68వ ఓవర్‌లో విరుచుకుపడి ఫిలాండర్ (10), పెహ్లుక్వాయో (0)లను అవుట్ చేయగా ఆ తర్వాత ఓవర్‌లోనే భువనేశ్వర్ బౌలింగ్‌లో రబాడ స్లిప్‌లో పుజారాకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. వెంటనే షమి.. మోర్కెల్ పనిపట్టాడు. ఓ వైపు వికెట్ల పతనం కొనసాగుతుండడంతో ఎల్గర్ ప్రేక్షకపాత్ర వహించాల్సి వచ్చింది. 73వ ఓవర్‌లో ఎల్గర్ ఓ సిక్స్ బాదినా ఆ తర్వాతి ఓవర్‌లోనే షమి దక్షిణాఫ్రికా చివరి వికెట్‌ను కూడా తీయడంతో భారత్ అద్భుత విజయాన్ని దక్కించుకుంది.

పార్థివ్ స్థానంలో దినేశ్ కార్తీక్: కుడి చేతి చూపుడు వేలికి గాయం కారణంగా చివరి సెషన్‌లో కీపర్ పార్థివ్ పటేల్ బరిలోకి దిగలేదు. దీంతో అతడి స్థానంలో సబ్‌స్టిట్యూట్ దినేశ్ కార్తీక్ కీపింగ్ చేశాడు. ఐసీసీ నూతన నిబంధనల ప్రకారం సబ్‌స్టిట్యూట్ ఆటగాడు కీపింగ్ చేసే అవకాశం ఉంది.


సిరీస్ ట్రోఫీతో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 187; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:194; భారత్ రెండో ఇన్నింగ్స్: 247; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) షమి 4; ఎల్గర్ (నాటౌట్) 86; ఆమ్లా (సి) పాండ్యా (బి) ఇషాంత్ 52; డివిల్లీర్స్ (సి) రహానె (బి) బుమ్రా 6; డుప్లెసిస్ (బి) ఇషాంత్ 2; డికాక్ (ఎల్బీ) బుమ్రా 0; ఫిలాండర్ (బి) షమి 10; పెహ్లుక్వాయో (బి) షమి 0; రబాడ (సి) పుజార (బి) భువనేశ్వర్ 0; మోర్కెల్ (బి) షమి 0; ఎంగిడి (సబ్‌స్టిట్యూట్) దినేశ్ కార్తీక్ (బి) షమి 4; **ఎక్స్‌ట్రాలు 13; మొత్తం: 73.3 ఓవర్లలో 177 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-5, 2-124, 3-131 4-144, 5-145, 6-157, 7-157, 8-160, 9-161, 10-177. **బౌలింగ్:** భువనేశ్వర్ 18-4-39-1; షమి 12.3-2-28-5; బుమ్రా 21-3-57-2; ఇషాంత్ 16-3-31-2; పాండ్యా 6-1-15-0.

ఫైనల్లో సైనా

జకర్తా: సైనా నెహ్వాల్ ఇండోనేసియా మాస్టర్స్ సిరీస్ మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రవేశించింది. శనివారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో సైనా 21-19, 21-19తో మాజీ ప్రపంచ చాంపియన్ ఇంటనాన్ రచనోక్‌ను చిత్తుచేసింది. క్వార్టర్స్‌లో సింధును ఓడించి ఉత్సాహంలో సెమీస్ పోరుకు సిద్ధమైన సైనా.. థాయ్‌లాండ్ స్టార్ రచనోక్‌పైనా అంతే దీటుగా విజృంభించింది. రచనోక్‌పై గెలుపొందడం సైనాకిది ఎనిమిదోసారి కావడం విశేషం. గతంలో ఆమె చేతిలో ఐదుసార్లు ఓడింది. ఆదివారం జరిగే ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ థాయ్ జూ యింగ్‌తో సైనా తలపడనుంది. ఇక పురుషుల డబుల్స్‌లో సంచలన ఆటతీరుతో సెమీస్‌చేరిన భారత జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి - చిరాగ్ శెట్టి పోరాటానికి తెర పడింది.

ముక్కోణపు సిరీస్ విజేత శ్రీలంక


ఢాకా: ముక్కోణపు సిరీస్ టైటిల్‌ను శ్రీలంక కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో (డే/నైట్) బంగ్లాదేశ్‌పై లంక 79 పరుగులతో విజయం సాధించింది. తొలుత లంక.. నిర్ణీత 50 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో బంగ్లా 41.1 ఓవర్లలో 142 రన్స్‌కే కుప్పకూలింది.

హాకీ ఫైనల్లో భారత్

హామిల్టన్ (న్యూజిలాండ్): నాలుగు దేశాల హాకీ టోర్నీ రెండో అంచెలో దుమ్మురేపుతున్న భారత్.. వరుసగా మూడో విజయంతో ఫైనల్ చేరింది. చివరి లీగ్ మ్యాచ్‌లో జపాన్‌పై 4-2తో గెలిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో రెడ్‌లయన్స్ బెల్జియంతో టీమిండియా తలపడనుంది.

క్రీడా కేంద్రంగా అమరావతి

ఒలింపిక్స్ నిర్వహణకు సదుపాయాలు: చంద్రబాబు



అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక టోర్నీల నిర్వహణకు అమరావతిని సిద్ధం చేస్తామని, ఒలింపిక్స్ వంటి క్రీడల నిర్వహణకు తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. ఉమ్మడి ఏపీలో ఆఫ్రో-ఆసియా క్రీడలను నిర్వహించామని, ఆ అనుభవంతో అమరావతిని అత్యుత్తమ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. కృష్ణాజిల్లా మూలపాడులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో 6 క్రీడా అకాడమీలు, 4 జలక్రీడల అకాడమీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ క్రీడా వికాస కేంద్రాలను నిర్మించినట్టు చెప్పారు. ఇవికాకుండా 6 వేల గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి బాలబాలికలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. 71 లక్షల మంది చిన్నారులు జన్మభూమి క్రీడల్లో పాల్గొన్నారని, ఇది ప్రపంచ రికార్డని సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీలు కేశినేని నాని, గోకరాజు గంగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, టోర్నమెంట్ ప్రారంభం సందర్భంగా మొదట జాతీయ పతాకాన్ని, ఆ తర్వాత సివిల్ సర్వీసెస్ పతాకాన్ని, అనంతరం శాప్ పతాకాన్ని సీఎం ఎగురవేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, జాతీయ జెండాకు కట్టిన తాడు గట్టిగా బిగిసిపోవడంతో సీఎం ఎంతసేపు లాగినా ముడి వీడలేదు. దీంతో జాతీయ జెండాను విడిచి, సివిల్ సర్వీసెస్, శాప్ పతాకాలను ఎగుర వేశారు. అనంతరం అధికారులు గట్టిగా బిగిసిపోయిన ముడిని విప్పి, జాతీయ జెండాను ఎగురువేశారు.

ఆహా...ఏం ఫైనల్ అది.. ఇద్దరు మేటి క్రీడాకారిణుల అసలు సిసలు సత్తాకు అద్దం పట్టింది. ప్రతి పాయింట్‌కూ వీరోచిత పోరాటంతో ఈ మ్యాచ్ మహిళల గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో చిరస్థాయిగా నిలుస్తుంది. అటు సిమోనా హలెప్, ఇటు కరోలిన్ వోజ్నియాకి.. తొలి గ్రాండ్‌స్లామ్‌కోసం సర్వశక్తులూ ఒడ్డారు. కిక్కిరిసిన రాడ్ లేవర్ ఎరీనాలో అభిమానులను దాదాపు మూడుగంటలపాటు రోమాలు నిక్కబొడుచుకొనే ఆటతో కట్టిపడేశారు. తీవ్రవేడి, ఉక్కపోత పరీక్ష పెట్టిన వేళ ఆఖరి పాయింట్ దాకా ఉత్కంఠగా సాగిన తుది పోరులో చివరకు వోజ్నియాకి విజేతగా నిలిచింది. కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ దక్కిన వేళ ఆమె బోరున విలపించింది.ఆస్ట్రేలియన్ ఓపెన్ కిరీటంతోపాటు నెంబర్‌వన్ ర్యాంక్‌నూ సొంతం చేసుకుంది.




విజయానంతరం ప్రియుడు డేవిడ్‌తో..

ఈ క్షణంకోసం ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నా. ఎట్టకేలకు నా కల సాకారమైంది. -వోజ్నియాకి

గర్వంగా ఉంది : సెరెనా

తన చిరకాల స్నేహితురాలు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచినందుకు గర్వంగా ఉందని మాజీ చాంపియన్ సెరెనా విలియమ్స్ ట్వీట్ చేసింది. 'మ్యాచ్ సాగినంతసేపు ఉత్కంఠకు లోనయ్యా. అయితే వోజ్నియాకి కొత్త చాంపియన్‌గా నిలవడంతో పాటు నంబర్ వన్ ర్యాంక్ సొంతం చేసుకోవడం గర్వంగా ఉంది' అని సెరెనా ట్విట్టర్‌లో పేర్కొంది.

ఓడినందుకు విచారంగానే ఉంది. కానీ వోజ్నియాకి నాకంటే ఉత్తమంగా ఆడింది. -హలెప్

ప్రైజ్‌మనీ
విజేత - రూ. 20.62 కోట్లు
రన్నరప్ - రూ. 10.31 కోట్లు



ఎన్నాళ్లో వేచిన విజయం

- ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత వోజ్నియాకి
- టైటిల్‌తోపాటు టాప్ ర్యాంక్ సొంతం
- పోరాడి ఓడిన హలెప్

మెల్‌బోర్న్: ఎన్నాళ్ల ఎదురుచూపులు.. ఏకంగా 43 మ్యాచ్‌ల నుంచి ఊరిస్తోంది. ఎట్టకేలకు కరోలిన్ సిగన చేరింది. డెన్మార్క్‌కు చెందిన వోజ్నియాకి కెరీర్‌లో మొదటి గ్రాండ్‌స్లామ్ చేజిక్కించుకుంది..శనివారం హోరాహోరీగా జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో 7-6 (2), 3-6, 6-4 స్కోరుతో హలెప్ (రుమేనియా)పై విజయంతో చాంపియన్‌గా ఆవిర్భవించింది.. ఈ గెలుపు 27 ఏళ్ల వోజ్నియాకిని సోమవారం ప్రకటించే డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో అగ్రభాగాన నిలపనుంది. 2010లో నంబర్ వన్ కిరీటం దక్కించుకున్న ఆమె..ఆరేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ దానిని దక్కించుకోనుంది. అత్యుత్తమ టెన్నిస్ క్రీడాకారిణిగా ప్రముఖుల ప్రశంసలు అందుకున్న కరోలిన్ నేటి వరకూ ఒక్క గ్రాండ్‌స్లామ్ కూడా గెలుచుకోలేకపోవడం గమనార్హం. 2009, 2014 యూఎస్ ఓపెన్ ఫైనల్ చేరినా రెండు సార్లూ నిరాశే ఎదురైంది. మరోవైపు వోజ్నియాకి మాదిరే అసమాన ప్రతిభ కలిగిన నంబర్ వన్ సిమోనాకు కూడా గ్రాండ్‌స్లామ్ అందని ద్రాక్షే అయింది. ఆమె కూడా ఈసారి ఎలాగైనా టైటిల్ ఒడిసి పట్టాలన్న పట్టుదలతో ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో దిగింది. గత రెండు పోటీల్లో మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని టైటిల్ ఫైట్‌కు వచ్చింది. కానీ తుది మెట్టుపై బోల్తా పడింది.


హలెప్

తీవ్ర వేడి, ఉక్కపోత..: మెల్‌బోర్న్ పార్క్‌లో స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7.30కు మ్యాచ్ ప్రారంభమైంది. అప్పటికీ ఒకటే వేడి, ఆపై ఉక్కపోత. ఇలాంటి పరిస్థితుల్లో ఫైనల్ మొదలైనా..నిలకడగా తొలి సర్వీస్ చేసిన వోజ్నియాకి 3-0 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. గత రెండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఒక్క సెట్టూ నెగ్గని ఆమె..5-3తో మరింత ఆధిక్యం ప్రదర్శించిన దశలో హలెప్ దూకుడు ప్రదర్శించి సెట్‌ను టైబ్రేకర్‌కు మళ్లించింది. టైబ్రేకర్‌లో 4-1తో ముందంజ వేసిన కరోలిన్ ఆపై మినీ బ్రేక్‌లో రెండు పటిష్ఠ సర్వీస్‌లతో 7-2తో మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. తొలిసెట్ గెలుపుతో రెండోసెట్‌లో వోజ్నియాకి ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపించింది. 1-1తో సెట్ సమమైన దశలో హలెప్ నాలుగు బ్రేక్ పాయింట్లు కాచుకోవాల్సి వచ్చింది. ఈ దశలో సిమోనా వేడిమితో తీవ్రంగా అలసిపోవడంతో ఐస్ టవల్‌తో ఆమెకు మర్దన చేయాల్సి వచ్చింది. అనంతరం పుంజుకున్న హలెప్ 4-3తో ఆపై 5-3, చివరకు 6-3తో సెట్‌ను దక్కించుకుంది.

హీట్ పాలసీ అమలు..: తీవ్రవేడి ఇద్దరు ప్లేయర్ల శక్తినీ హరించి వేయడంతో నిర్వాహకులు 'హీట్ పాలసీ'ని అమలు చేశారు. దాంతో మూడో సెట్‌కు ముందు 10 నిమిషాల విరామం ఇచ్చారు. క్రీడాకారిణుల సామర్థ్యానికి పరీక్షగా నిలిచిన మూడోసెట్ అభిమానులకు పసందైన ఆటను పంచింది. హలెప్ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసిన వోజ్నియాకి 4-3తో ఆధిక్యంలో దూసుకుపోయింది. ఆ దశలో కరోలిన్ మోకాలి గాయం తిరగబెట్టి చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. సెట్ తిరిగి మొదలయ్యాక ఆ ఛాయలేవీ కనపడనీయకుండా తదుపరి మూడు గేమ్‌ల్లో ఆమె అద్భుతంగా ఆడింది. ఇక నిలవాలంటే సర్వీస్ నిలబెట్టుకోవాల్సిన దశలో హలెప్ తప్పిదం చేయడంతో మ్యాచ్ వోజ్నియాకి సొంతమైంది. అంతే..ఒక్కసారిగా మైదానంలో కూలపడిన కరోలిన్ భోరున విలపించింది. మ్యాచ్‌లో రెండు ఏస్‌లు సంధించిన వోజ్నియాకి ఆరు డబుల్‌ఫాల్ట్‌లు, 28 అనవసర తప్పిదాలు చేసింది. 25 విన్నర్లు కొట్టిన కరోలిన్ మొత్తం 110 పాయింట్లు సాధించింది. ఇక ఆరు ఏస్‌లు సంధించిన హలెప్ 40 విన్నర్లతో దూకుడు ప్రదర్శించింది. కేవలం ఒకే డబుల్‌ఫాల్ట్ చేసిన ఆమె..47 అనవసర తప్పిదాలకు పాల్పడింది. మొత్తం 108 పాయింట్లు కైవసం చేసుకుంది.

పవిక్ జోడీకి డబుల్స్ టైటిల్: ఆలీవర్ మరాచ్ (ఆస్ట్రియా)-మేట్ పవిక్ (క్రొయేషియా) జోడీ పురుషుల డబుల్స్ విజేతగా నిలిచింది. ఫైనల్లో ఆలీవర్ ద్వయం 6-4, 6-4తో కొలంబియా జోడీ జువాన్ సెబాస్టియన్- రాబర్ట్ ఫరాపై నెగ్గింది.